# కిష్కింధాకాండ




హనుమంతుడు శ్రీరామచంద్రుని స్తుతించుట

రచయిత : ఆచి శ్రీనివాసాచార్య ఎం.ఏ.

# శ్రీరామాయణానుభవము :- "కిష్కింధాకాండ"

## భాగ్యనగర్ :- (చతుర్థ) కుసుమము



"మీరిద్దరు రాజర్షులా? దేవతలా?
అమరసమానులు; అరవిందలోచనులు
సూర్యచంద్రులవలె స్వేచ్ఛగా సంచరిస్తున్నారు"
-రామలక్ష్మణులతో హనుమ'

రచయిత :-

**ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఎ.**

02

శ్రీ రామాయనమః

**శ్రీరామాయణానుభవం - కిష్కింధాకాండ**

శ్రీరామాయణ చతుర్ధ కుసుమము (భాగ్యనగరము)

రచయిత : **ఆచి. శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

వెల : **45 రూ.లు**

ప్రచురణకర్తలు
**శ్రీరామ దూత సేవాశ్రమము**
19-100/బి కోదండరామనగర్
దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాద్.

ప్రచురణ తేది : **శ్రీ వ్యయ కార్తీకము**

రచయిత విలాసము
**ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**
11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,
సరూర్‌నగర్, హైద్రాబాద్-500 035.
ఫోన్: 24053137


ప్రతులకు:

1. **శ్రీరామదూత సేవాశ్రమము**
   కోదండరామనగర్,
   దిల్‌సుఖ్‌నగర్,
   హైద్రాబాద్.

2. **ఆచి. శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**
   11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,
   రోడ్ నెం.5, సరూర్‌నగర్,
   హైద్రాబాద్ - 500 035. ఫోన్: 24053137

ముద్రణ కార్యాలయము:
**ఆర్. వి. ప్రింటర్స్, ఆర్.టి.సి. × రోడ్స్, హైద్రాబాద్.**

# అంకితము



శ్రీ రాయపుర (ఏదులాబాద్) నివాసులు

శ్రీ గరుడాళ్వార్ సమేత

## శ్రీ గోదా రంగనాథ దివ్య దంపతుల

శ్రీ చరణ సరోజముల సన్నిధిలో

అంకితము

"సమస్త జననీం వందే । చైతన్యస్తన్యదాయినీం ।
రాయపూర్ రంగనాథస్య । కరుణామివ రూపిణీం"

శ్రీ రామాయ నమః



ప్రచురణము

# శ్రీ రామ దూత సేవాశ్రమము

19-100/బి, కోదండరామ నగర్,

దిల్‌సుఖ్‌నగర్, హైద్రాబాద్.



అస్మత్ గ్రంధాచార్యులు

"వేదాంత విద్వాన్", "ఉభయ వేదాంత విద్వాన్", వేదాంత రత్న, "వేదాంత శిరోమణీ"

శ్రీ ఉ.వే. శ్రీమాన్ కందాళై (చిక్కుడు గాయల)

# రంగాచార్య స్వామివారు

(నిజామాబాద్ - చక్రం కోవెలలో శ్రీ భాష్య భగవద్విషయాలను
ప్రవచనం చేస్తున్న సందర్భంగా)

శ్రీ రామాయ నమః



**రచయిత : ఆచి శ్రీనివాసాచార్య, ఎం.ఏ.**

11-5-29/9, శ్రీ వేంకటేశ్వర కాలని,
రోడ్ నెం.5, సరూర్‌నగర్,
హైద్రాబాద్ - 500 035.

# విషయసూచిక


1. విజ్ఞాపనము
2. మంగళాశాసనములు
   - I. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామివారు
   - II. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగరామానుజ జీయర్ స్వామివారు
   - III. శ్రీ ఉ.వే.ప్ర. కందాళై రామానుజాచార్య స్వామి వారు "ఆచార్య కిష్కింధ"
   - IV. శ్రీ ఉ.వే.ప్ర. శిరిశినగళ్ వేంకటాచార్యస్వామివారు "అభినందన చందనము"
   - V. ఆచార్య ఫణీంద్ర :- "అభినందనాభి వందనములు"

1. కిష్కింధాకాండ
2. పంపావిరహ వేదన
3. హనుమ ఆచార్య లక్షణాలు
4. సుగ్రీవ సమాగమము
5. సుగ్రీవ సఖ్యము
6. సౌమిత్రి సౌశీల్యము
7. వాలి సుగ్రీవ వైరము
8. వాలి పరాక్రమము
9. వాలి, సుగ్రీవ సమరము
10. సప్త జనాశ్రమము
11. సుగ్రీవుని సింహగర్జన
12. తారా హితోక్తి
13. వాలి వధ
14. వాలి ఆక్షేపాలు
15. శ్రీరాముని సమాధానాలు
16. తారా విలాపము
17. హనుమ సాంత్వనము
18. వాలి అంతిమ సందేశము
19. సుగ్రీవ విషాదము
20. రామా! నీవుసాటిలేని వాడివి
21. వాలి అంత్యక్రియలు
22. సుగ్రీవ పట్టాభిషేకము
23. వర్షకాల జీవనము
24. హనుమ నివేదనము
25. రామభద్రుని వేదన
26. శేషాంశుని ఆవేశము
27. సుగ్రీవ భీతి
28. తార సమాధానము
29. సుగ్రీవుని క్షమాయాచనము
30. దిశానిర్దేశము
31. భూగోళ విజ్ఞానము
32. అవధి సమాప్తి
33. స్వయం ప్రభాబిలము
34. వానర సమాలోచనము
35. సంపాతి
36. సముద్ర తరణ సంరంభము
37. హనుమ విజృంభణము

శ్రీ రామాయ నమః

శ్రీసీతారామచంద్ర పరబ్రహ్మణే నమః

# విజ్ఞాపనము

"పలికెడిది రామ కథయట । పలికించెడి వాడు రామభద్రుండట। నే పలికిన భవహరమగునట । పలికెద వేరొండు గాథ। పలుకగానేలా?" శ్రీరామచంద్ర ప్రభువు దయాహృదయుడు. ఆయన కృప అపారమైనది. నిర్హేతుకమైనది, అమోఘమైనది కూడ.

బాల్యంలో రెండేండ్ల దాకా మాటలే రాలేదట. మాటలు వచ్చాక విద్యార్జనలో అనేకములైన మలుపులు, ఉద్యోగ నిర్వహణలో అనేకములైన మార్పులు కలిగాయి.

ఈ విధంగా నా జీవితంలో మలిగిన మలుపులకు, కలిగిన మార్పులకు నేనెంత మాత్రము కారణముకాదు. ఇవి నేననుకొన్నవి కావు. అనుకొన్నప్పుడు కలిగినవి కావు. జగన్నాటక సూత్రధారి నా జీవన నాటక రంగంలో తనకు తాను అనుగ్రహించినవి. అందుకే అవి నేను అనుకొన్నవి కాకున్నా, వాటి ఫలితము మాత్రము నా స్వప్న ఫలమే.

నా జీవిత శకటాన్ని ఇహపరాలనే రెండు పట్టాలపైన ఆది నుండి నిరంతరంగా నిరపాయంగా నడుపుతున్న నేత - ఆ సకల జగన్నేతయే.

ప్రప్రథమంగా మా వంశంలో "శ్రీమద్రామాయణ ప్రవచన" ఫలాలతో తమ జీవన క్షేత్రాన్ని పండించుకొన్న "భక్త హాలికులు" పరమ భాగవతోత్తములు, పండిత ప్రకాండులు, మాపితామహులు "శ్రీమత్కూడలి రాఘవాచార్య స్వామివారు".

రామశబ్దంతోనే మాటలను నేర్చుకొని, తమ జీవన సర్వస్వాన్ని "రామ" నామ మాధుర్యంతో రసమయం కావించుకొని, "రామాయణ ప్రవచనామృతంతో "వాల్మీకి" విశిష్ట స్థానాన్ని అందుకొన్న విద్వతవతంసులు, "ఉపన్యాసకేసరులు", మా పితృదేవులు శ్రీమదాచి వేంకట నరసింహాచార్య (ఆవునూరు) స్వామివారు.

ఆ మహామహులిద్దరి ఆశల, ఆశయాల, ఆశీస్సుల ఫలితంగానే బాల్యం నుండి నా హృదయ కేదారంలో "రామభక్తి" బీజము అంకురించి, పల్లవించి, కుసుమించింది. తత్ఫలితంగా "శ్రీరామాయణానుభవము"లో నా ప్రయాణము "బాలకాండ"తో ప్రారంభమై "అయోధ్య"ను "అరణ్యము"ను దాటి ఇప్పుడు "కిష్కింధ"కు చేరుకొంది. "కిష్కింధ కాండ" అద్భుతమైనది, అనిర్వచనీయమైనది. ఈ కాండ ఆరంభంలో "తమనే అనుమానించి, ఆశ్రయించిన దీనజీవుడైన సుగ్రీవుని అక్కున జేర్చుకొని, అభయమిచ్చి ఆదుకొన్నాడు నిర్హేతుక కృపాకూపారుడైన శ్రీరామచంద్ర ప్రభువు. ఫలితంగా సుగ్రీవునికి భార్యామణి రుమా రమణితో పాటు, రాజ్యరమణి కూడ స్వంతమయ్యాయి".

అలాగే నా పట్ల కూడ శ్రీరామచంద్రస్వామి "కిష్కింధా కాండ" రచనారంభం లోనే అద్భుతమైన కరుణామృతాన్ని కురిపించాడు.

"శ్రీరామదూత సేవాశ్రమము" (దిల్‌సుఖ్‌నగర్) వ్యవస్థాపకాధ్యక్షులు, గురువుగారు శ్రీమాన్ అనంతపద్మనాభ యాదగిరాచార్య స్వామివారు మా మిత్రులు, వారి బావగారైన శ్రీమాన్ కిళాంబి నరసింహాచార్య స్వామి వారితో కలసి అనుకోకుండా మా ఇంటికి వేంచేశారు. శ్రీమాన్ యాదగిరాచార్యస్వామివారు నా "శ్రీరామాయణానుభవ" వ్యాసంగాన్ని అవలోకించి, ఈ "కిష్కింధాకాండ" ముద్రణభారాన్ని తమ ఆశ్రమానికి అప్పగించుమని ఆదేశించారు. ఆశ్చర్యం కలిగింది నాకు! నోటమాటే రాలేదు! ఎంతటి దయా సముద్రుడు రామభద్రుడు! తాను తన "రామదూతాశ్రమ" అధ్యక్షుల హృదయంలో ముందుగానే ప్రవేశించి, వారిని మా ఇంటికి తీసికవచ్చి, తానే వారి నోట ఈ అపూర్వ వరాన్ని ప్రసాదించాడు మహోదారుడు, రాజాధిరాజయిన శ్రీరామచంద్ర ప్రభువు. శ్రీమాన్ యాదగిరాచార్య స్వామివారికి వారి ద్వారా శ్రీరామభద్రునికి వారి మహౌదార్యానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతాంజలిని సమర్పించుకొంటున్నాను.

ఈ సందర్భంగా "శ్రీరామదూత సేవాశ్రమం" వారి కొన్ని అద్భుతాదర్శ కార్యక్రమాలను ప్రస్తావించాలను కొంటున్నాను.

ఈ ఆశ్రమం వారి ఆరాధ్య దేవత "ఆండాళమ్మ" ఆ తల్లి వీరి పూర్వులైన అప్పల దేశికుల వెంట "శ్రీవిల్లిబుత్తూరు" నుండి తరలి వచ్చి హైద్రాబాద్‌కు అతి సమీపంలో ఉన్న "రాయపురం" అనే మారుపేరుగల "ఏదులాబాద్"లో గరుడాళ్వార్, శ్రీరంగమన్నార్ ప్రభువుతో సహా కొలువుదీరి ఉంది.

"సమస్త జననీం వందే । చైతన్యస్తన్య దాయినీం।
రాయపూర్ రంగనాథస్య । కరుణామివ రూపిణీం"

ఆ తల్లి జాతి, కుల, మత వ్యవస్థలకు అతీతంగా సకల జగన్మాతగా అవతరించింది. అర్ధరాత్రి ఒక గాజుల వారింటికి "అప్పల దేశికుల ఆడబిడ్డన"ని చెప్పుకొని వెళ్లి రెండు చేతుల నిండా గాజులను వేయించుకొంది. నాటి నుండి నేటి వరకు ఆ ఆచారాన్ని ఆగకుండా కొనసాగించుకొంటున్న కరుణారూపిణి ఆ తల్లి.

"ఐయముం, పిచ్చైయుం, ఆందనైయుం కైకాట్టి" అని ఆ తల్లి ఆనతిచ్చిన ప్రకారము "శ్రీరామదూత సేవాశ్రమము" కోదండరామ నగర్ వారు అన్నార్థులకు అన్న ప్రసాదాన్ని, విద్యార్థులకు ఉపకార వేతనాలను, పారితోషికాలను, రోగార్తులకు సముచిత వైద్య సహాయాన్ని సాగిస్తున్నారు.

పేద బ్రాహ్మణ బాలురకు ఉచితోపనయన శిబిరాలను, నిరుపేదలైన తండ్రులకు వారి పుత్రికల పరిణయం కొరకు మంగళ సూత్రాలను, వస్త్రాలను, ధనాన్ని అందిస్తున్నారు.

జీర్ణ దేవాలయోద్ధరణ, అర్చక భృతి మొదలైన ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఆశ్రమం వారు ఇప్పటికి 108 "మాస రామ యాగాలను" నిర్వహించారు. "20వ మాస మహాలక్ష్మీయాగాన్ని" ప్రస్తుతము చేపట్టారు.

ధర్మప్రచారం కొరకు "ధార్మిక దివ్య గ్రంధ ప్రచురణ" కార్యక్రమాన్ని చేపట్టారు. ఇంతవరకు "వేదశంగోలము", "నిర్ణయ సింధువు" మొదలైన గ్రంధాలను ప్రచురించారు.

ఇదుగో ఇప్పుడు ఈ "కిష్కింధాకాండ"ను నేను అడుగకుండానే మహౌదార్యంతో ముద్రించడానికి ముందుకు వచ్చారు.

**ఆ ఆశ్రమం వారి ఆరాధ్య దేవత అయిన "ఆండాళమ్మ తల్లి దివ్య శ్రీచరణ సన్నిధికే" అత్యంత భక్తితో "కిష్కింధాకాండ" అనే ఈ దివ్య పరిమళ పుష్పాన్ని అంకితంగా సమర్పించుకొంటున్నాను.**

ఈ అంకితము వెంట మరొక కారణము కూడ ఉంది. "రహస్య గ్రంధ కాలక్షేపాల" ద్వారా ఆధ్యాత్మిక ప్రపంచంలో అడుగులు వేయడాన్ని నాకు నేర్పిన వారు మా నాన్నగారు శ్రీమదాచి వేంకట నరసింహాచార్య (ఆవునూరు) స్వామివారైతే, అలా అడుగులను వేయడం నేర్చుకొన్న నాకు అత్యంత కృపాభిమానాలతో తమ చేయూత నిచ్చి నా ఆధ్యాత్మిక మార్గంలో "శ్రీభాష్య", "భగవద్విషయ" దివ్య శాస్త్ర గ్రంధ ప్రకాశంతో మరింత ముందుకు నన్ను నడిపించిన జ్ఞాన భాస్కరులు, "వేదాంత విద్వాన్" 'ఉభయ వేదాంత విద్వాన్' 'వేదాంత రత్న' (వై.వా.) శ్రీమాన్ కందాడై (చిక్కుడు గాయల) రంగాచార్య స్వామివారు. మహోదారులు కృపామాత్ర ప్రసన్నాచార్యులు మా గ్రంధాచార్యులైన మా చిక్కుడు గాయల రంగాచార్యస్వామి వారి శ్రీ చరణ సన్నిధిలో అనేకానేక దాసో2హములను ఈ సందర్భంగా సమర్పించు కొంటున్నాను.

మా స్వామివారు శ్రీ గోదారంగనాధుల ప్రీత్యర్థం తమ యావజ్జీవితాన్ని "కొరాయి ఉత్సవాల నిర్వహణకు", అనేకాద్భుత దివ్యాలంకరణల కొరకు అంకితం కావించారు. వారి అభిమతము శ్రీ గోదారంగనాధుల దివ్యార్చనమే.

**ఏదులాబాద్‌లోని గరుడాళ్వార్, శ్రీరంగనాధ సమేతురాలైన గోదాదేవి దివ్యశ్రీ పాద సన్నిధిలో ఈ (కిష్కింధాకాండ) రామాయణ దివ్య కుసుమాన్ని అంకితంగా సమర్పించడం ద్వారా మా గ్రంధాచార్యులైన శ్రీమాన్ చిక్కుడు గాయల రంగాచార్య స్వామివారి మనోభీష్టాన్ని కూడ నెరవేర్చి కృతకృత్యుడనవుతున్నాను.**

ఇక నా "శ్రీరామాయణానుభవాన్ని" ఆది నుండి తమ అమోఘ మంగళాశాసనాలతో ప్రభావవంతం కావిస్తున్న ప్రాతఃస్మరణీయ పాదారవిందులు, "ఉభయవేదాంతాచార్య" పీఠాధ్యక్షులు శ్రీ మత్పరమహంస పరివ్రాజకాచార్యులు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి వారు, ఈ కిష్కింధాకాండకు కూడ తమ మహత్తర మంగళాశాసనాలను కృప జేశారు. వారి శ్రీచరణ సన్నిధిలో అనేకానేక దాసో2హములు.

అలాగే విఖ్యాత విద్వాంసులు, ప్రవచన శిరోమణులు వై.వా. శ్రీ భాష్యం అప్పళాచార్య స్వామి వారి "సహస్రచంద్ర దర్శనోత్సవం"లో, "శ్రీ వైష్ణవ సంగోష్ఠిలోను" దూరదర్శనాన్ని ప్రసాదించి, ప్రత్యక్ష సంభాషణాదులేవి లేకున్నా, తమ నిడుదవోలు కారు ప్రయాణంలో ఫోన్ ద్వారా "శ్రీరామాయణానుభవాన్ని" గురించి ఆలకించి, ఈ "కిష్కింధాకాండ"ను ప్రత్యక్షంగా కటాక్షించి తమ మహత్తర మంగళాశాసనాలతో పాటు, "భగవద్విషయ" శ్రీ కోశాలను కూడ అమూల్యంగా అనుగ్రహించిన మహోదారులు, "శ్రీరామానుజ పీఠాధ్యక్షులు శ్రీమత్పరమ హంస పరివ్రాజకాచార్యులు, "శ్రీశ్రీశ్రీ త్రిదండి రంగ రామానుజ జీయర్ (కాకినాడ) స్వామివారి" దివ్యచరణ సన్నిధిలో పరశ్శత ప్రణామాలు.

"అష్టాదశ పురాణ" ప్రవచన పారీణులు, ఉభయ వేదాంత విద్వత్తల్లజులు, "శ్రీ ఉ.వే. ప్ర. శ్రీమాన్ మహా విద్వాన్ కందాడై రామానుజాచార్య స్వామివారు "ఆచార్య కిష్కింధ" ద్వారా ఈ 'కిష్కింధాకాండ' లోని అనేక అంశాలకు చక్కటి వెలుగు నందించారు.

అంతేకాక ఇలాంటి వ్యాఖ్యలనే "శ్రీరామాయణానుభవం" లోని "సుందర", "యుద్ధ" "ఉత్తర కాండల"కు, "శ్రీమద్భాగవతంలోని" ద్వాదశ స్కంధాలకు (వీర రాఘవీయాన్ని అనుసరించి), శ్రీమన్మహా భారతంలోని" అష్టాదశ పర్వాలకు (నీలకంఠీయానుసారంగా) అందించుమని మిత్ర శిరోమణులు కందాడై స్వామివారు ఆదేశించారు. వారి ఆత్మీయతకు హార్దికానేక ప్రణామాలు.

ఉభయవేదాంత విద్వదవతంసులైన శ్రీమదాచి వేంకటనృసింహాచార్య స్వామి వారు, శ్రీమాన్ చిక్కుడు గాయల రంగాచార్య స్వామి వారు "ఉభయ వేదాంతాచార్యులు" శ్రీమాన్ శిరిశినహళ్ కృష్ణమాచార్య (శతావధాని) స్వామివారు మా గ్రంధాచార్యవర్యులు.

"ప్రణతో2స్మి మునిత్రయం" అన్నట్లు "మా మహనీయ గ్రంధాచార్య త్రయ" సన్నిధిలో సతీర్థులై, ఉభయ వేదాంతాలను సాకల్యంగా అధికరించి, యావదాంధ్ర ప్రదేశంలో వేలాది శ్రోతలను తమ మహోపన్యాసాలతో తన్మయులను కావిస్తూ, తమ ఆచార్యత్వంతో ఆశ్రితులను తరింప జేస్తున్న శ్రీ ఉ.వే. ప్ర. శిరిశినగళ్ వేంకటాచార్య స్వామి వారి "హార్దికాభినందన చందనానికి అనేక నమోవాకములు.

"వేదః ప్రాచేతసాదాసీత్ । సాక్షాత్ రామాయణాత్మనా" అన్నట్లు వేదమే శ్రీమద్రామాయణంగా అవతరించింది. వేదంలోని మంత్రాలు శ్రీరామాయణంలోని కథా

విశేషాలను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ప్రతిపాదించేవే. ఈ "కిష్కింధాకాండ"లో ఆయా సందర్భాలకు అనువైన ఋగ్యజు స్సామాధర్వణ వేదమంత్రాలను ఆత్మీయతాబంధంతో అందించిన విద్వన్మిత్రులు శ్రీమాన్ రాఘవన్‌స్వామి గారికి కృతజ్ఞతాంజలులు.

తన "అభినందనాభివందనము"తో నా "రామాయణానుభవము" గురించి తన హృదయానందమును వెలువరించిన చి. ఆచార్య ఫణీంద్రకు హార్దికానేక మంగళాశాసనములు.

ఈ గ్రంథ ముద్రణకు ముఖ్యకారకులైన "శ్రీరామ దూత" సేవాశ్రమము వారికి మరొకసారి కృతజ్ఞతాంజలులను సమర్పించుకొంటున్నాను. వారు ఇలాగే ఇంకా అనేక ధార్మిక కార్యక్రమాలలో పాల్గొనడానికి వీలుగా వారికి ఆయురారోగ్య ఐశ్వర్యాలను ఇతోధికంగా అనుగ్రహించాలని శ్రీ సీతారామచంద్ర ప్రభువును మనసారా వేడుకొంటున్నాను.

అలాగే ఈ కిష్కింధాకాండను ఇంత అందంగా, నిర్దుష్టంగా ముద్రించి ఇచ్చిన మిత్రులు శ్రీనివాసరావు గారికి కృతజ్ఞతలు.

సుధీవిధేయుడు

**ఆచి శ్రీనివాసాచార్య**

**ఈ గ్రంథ ముద్రణకు తోడ్పడిన శ్రీరామదూత సేవాశ్రమ సభ్యులు**

1. శ్రీ ఉ.వే.శ్రీమాన్ దైవజ్ఞ పరిచార్య
   టి.పి. యాదగిరి స్వామిగారు - గురువుగారు
2. శ్రీ ఉ.వే. శ్రీమాన్ డా॥ కిళాంబి నరసింహాచార్యులు గారు
3. శ్రీ ఉ.వే. మరంగంటి కులశేఖరాచార్యులు
4. శ్రీమతి & శ్రీ తిమ్మారెడ్డి నివేదితగారు
5. శ్రీమతి శ్రీ ఇందిరా శ్రీనివాసులుగారు
6. శ్రీమతి, శ్రీ సునీత, సుదర్శన్ గారు
7. శ్రీ డి. బాబుగారు
8. శ్రీ డి. పద్మారావుగారు
9. శ్రీ టి. నరసింహారెడ్డి గారు
10. శ్రీ ఇ.వి. పాపిరెడ్డి గారు
11. శ్రీ పి. సత్యనారాయణ గారు
12. శ్రీ ఎస్.వి. రెడ్డి గారు
13. బ్ర శ్రీ ఎస్.వి.వి. చిన్న వెంకట సుబ్రహ్మణ్య శర్మ గారు శ్రీమతి శర్మద గారు
14. శ్రీ సత్తి రెడ్డిగారు,
15. శ్రీ డి. సదాశివరెడ్డి గారు
16. శ్రీ ఓమ్ రెడ్డిగారు
17. శ్రీ ఏ. జంగారెడ్డి గారు
18. శ్రీ వై. జంగారెడ్డి గారు
19. శ్రీ ప్రవీణ్ కుమార్ గారు
20. శ్రీ పార్షవర్ధన్ గారు
21. శ్రీ ఇ. సత్యనారాయణ గారు
22. శ్రీ అశోక్ గారు
23. శ్రీ ఎన్. రంగారెడ్డి గారు

SRIMANNARAYANA RAMANUJA YATHIBHYO NAMAHA

Tridandi Chinna Srimannarayana
Ramanuja Jeeyar Swamy

JEEYAR EDUCATIONAL TRUST
SITANAGARAM 522 501
GUNTUR DISTRICT A.P.
(✆) (08645) 272929, 272353

శ్రీమతే రామానుజాయ నమః

ప్రియ శ్రీమన్! శ్రీనివాసాచార్యులుగారూ! 30-10-06

శ్రీమతే నారాయణాయ నమః

అనేక మంగళాశాసనములు.

మీరు పంపిన కిష్కింధాకాండ అందినది. సంతోషము. ఒక్కొక్క కాండ ఒక్కొక్క తీరున ఆచార్య వైభవాన్ని చవిచూపుతూ వుంటుంది. ఎవరెంత బలశాలురైనా, బుద్ధిశాలు రయినా, కాక తపశ్శాలురయినా, ఆచార్య కటాక్షం ముఖ్యం. భగవంతుడు ఎవరెవరిని ఎలా కృప చూసినా వారికి ఆచార్యానుగ్రహం లేనిది అటు భగవంతుని ప్రయత్నమూ యిటు చేతనుని ప్రయత్నమూ ఫలవంతం కాదు. బాలకాండలో ప్రథమంగా శ్రీరామచంద్రుడే విశ్వామిత్రు నాశ్రయించాడు. ఆచార్యాశ్రయణం ఆ శ్రీరామునికి కల్యాణాంతమూ అనుగ్రహించడం జరిగింది. అయోధ్యాకాండను అధ్యయనం చేస్తే వశిష్ఠుడు, అరణ్యకాండలో శబరి నిష్ఠ వెనుక ఆచార్యానుగ్రహం పుష్కలంగా కనిపిస్తుంది. కిష్కింధాకాండలో సుగ్రీవుడు తానెంత బలశాలి అయినా, బుద్ధి పాటవం కలవాడయినా, ఆచార్య శిక్షణ లేని ఆ కొఱత కనిపిస్తూనే వున్నది. తన అన్న అయిన వాలిని హతమార్చేందుకు రామునితో చెలిమి చేస్తానన్నాడు సుగ్రీవుడు. రామునికి స్వాగతం చెప్పే సమయంలో రామునితో సమానంగా కూర్చున్నాడు తాను – సుగ్రీవుడు. ఆ మహానుభావుని "నాకు సాయం చేయవచ్చిన దేవు"డనుకోకపోవడం అలా వుంచి తానొక అధికారిలా మాట్లాడాడు. అయితే సుగ్రీవుని సంస్కారంలో ఆచార్యుని స్పర్శలేదు అంతవరకు. రామానుజునే అవమానించాడు మర్యాదకైనా ఆసనం చూపక. అందుకే రామచంద్రుడు అతనికి కొంచెం బుద్ధి చెప్పాలని ఆలోచించి – "మేమున్నాం కద! వెళ్ళి ధైర్యంగా యుద్ధం చెయ్యవోయ్" అన్నాడు. ఇంత శక్తి అంతా తనదే అన్నట్లు వాలి మీదకు సుగ్రీవుడు యుద్ధానికి వెళ్ళడము, చావుదెబ్బ తిని తిరిగి రావడము జరిగాయి. "అయ్యో! రామచంద్రా! యేమిటిది? అని మొత్తుకున్నాడు సుగ్రీవుడు. "మీ అన్నకూ నీకూ తేడా తెలియడం లేదయ్యా" అన్నాడు రాముడు. అప్పటికీ సుగ్రీవుడు "ఓహో! యిరువురం వానరులమే కదా! పాపం యీ రామునికి తేడా తెలియలేదేమీ అనుకున్నాడు. ఆచార్యానుగ్రహం లేకపోవడం వల్లా, అంతేకాక ఆచార్య విషయంలో ఆదరణ లేక అపచార పడి వున్నందు వల్లాను "దోషం యిరువురిలో సమాన"మని అర్థం కాలేదు. తరువాత రాముడు లక్ష్మణుని చేత సుగ్రీవునకు అవసరమయిన సంస్కారాలు చేయించాడు. తాను చేసిన దోషమునకు ప్రాయశ్చిత్తము పూర్తియినది. అదే ఆచార్యానుగ్రహం. అది లభించగానే భగవానుడే రాముడే సుగ్రీవుని యొక్క విరోధిని సంహరింప చేశాడు తను సహకరించి, ఇలా ఆచార్యానుగ్రహ వైభవాన్ని కిష్కింధాకాండ సాకల్యంగ వివరించింది.

మీరు అనేక పర్యాయములు శ్రీరామాయణ పారాయణము చేసి తదనుభవజనిత రామాయణ రస స్ఫూర్తిని ఉన్మస్తకముగా అనుభవించి ఆ యానందము లోపల యిమడక యీ గ్రంథ రూపముగ లోకానికి అందించారు.

గతంలో మీరిలాగే మీ రామాయణానుభవాలను అందించారు. అట్లే మీ అనుభవంతో కూడిన యీ గ్రంథం కూడా భక్తులకు ఉపయోగపడగలదని మేము భావిస్తూ మీకు అనేక మంగళాశాసనములు చేస్తున్నాము.

శ్రీ రామాయ నమః


# శ్రీ రామానుజ పీఠము

(రిజిస్టర్ ట్రస్ట్ 54/2004)
4-61-18/1/1, ఫ్లాట్ నెం. 14,
లాసన్స్ బే కాలని
విశాఖపట్టణము - 530 017.




భగవద్రామానుజులు


వ్యవస్థాపకులు
పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగ రామానుజ
జీయర్ స్వామివారు


తేది : 30.10.2006

శ్రీ ఉ.వే. శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామివారికి

స్వరూపానురూపమైన మంగళాశాసనములు.

రామాయణమొక రత్నాకరము. ఆర్తి, నైపుణ్యము ఉండవలయునే కాని రత్నములు లభించుటకు కొఱత ఉండదు.

ఆయా వ్యక్తుల మానసిక పరిపక్వతలోని తరతమ భేదాలకు, దేశకాల పరిస్థితులకు అనుగుణంగా అందరి హృదయాలను రంజింప చేయగల ఏకైక కావ్యము........ శ్రీమద్రామాయణము.

పరమపురుషుడి కల్యాణ గుణములను తాననుభవించి, సంతృప్తి చెందక "తుష్యన్తిచ రమన్తిచ" అన్నట్లుగా పదిమంది చేత దానిని అనుభవింపచేసే ప్రక్రియకి విలక్షణ మార్గదర్శకుడు వాల్మీకి మహర్షి.

అటు తరువాత ఎన్నో ఎన్నెన్నో వ్యాఖ్యాన రూపమైన 'అనుభవాలు' వెలువడినాయి. ఇప్పుడు వెలువడుతున్న ఈ 'రామాయణానుభవం' కూడ వెనుకటి అనుభవాలకు ఏ మాత్రము తీసిపోదని గ్రంథాన్ని స్పృశించిన వెంటనే అర్థమైపోతుంది. అనుభవించి, అందించిన వారి వైలక్షణ్యాన్ని చెప్పకనే చెప్తుంది.

'కిష్కింధ' శబ్ద వ్యుత్పత్తిని వివరించడంతో ప్రారంభమైన 'ఈ' రామాయణ విభాగపు అనుభవం ఇంకెన్ని రత్నాలు లభిస్తాయో అని గ్రంథాన్ని ఆసాంతం చదివించి తీరుతుంది.

సంప్రదాయాన్ని అతిక్రమించకుండా, ప్రామాణికతకు లోటు రానీయకుండా లభిస్తున్న గ్రంథాల సంఖ్య తగ్గు ముఖం పడుతున్న రోజులలో ఈ గ్రంథ ఆవిష్కరణ ఒక పెద్ద ఆశ్వాసన.

కథాగమనానికి లోటు రానీయకుండ, అలా అని దానికే అతుకుకొని పోకుండా, వ్యాఖ్యాన విశేషాలను విడిచిపోట్టకుండా, అలా అని చర్వితచర్వణ మనిపించకుండ, తత్త్వ హిత పురుషార్థ స్వరూపాలను వివరించడానికి ప్రధాన కథా బాగాన్నే స్వీకరిస్తూ, అలా అని అనుషంగిక గాథలను నిర్లక్ష్యం చేయకుండ సాగిన ఈ గ్రంథము చాల చక్కగ నున్నది. ముముక్షువులందరకు ఉపాదేయమనడంలో సందేహం లేదు.

రామాయణంలో సుందరకాండకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఆ ప్రత్యేకత దానికి లభించడానికి ఆధారభూతమైన విషయాలున్న కిష్కింధకాండను వివరించడానికి మీరు పడిన శ్రమ సఫలమవాలనీ, మీ 'అనుభవాన్ని' పాఠకులందరూ కూడ అనుభవించాలనీ, పరిత్రాణాయ సాధూనాం...' అంటూ తన దివ్య మంగళ విగ్రహ స్వరూప స్వభావములను, కల్యాణగుణములను అనుభవించాలనే ఆశతో క్షణమొక యుగంగా గడిపే సాధుపురుషుల కొరకే తానవతరిస్తూ ఉంటానని చెప్పుకున్న శ్రియఃపతి ఈ మీ 'అనుభవానికి' మిక్కిలి సంతసించాలనీ మంగళాశాసనం చేస్తూ.........

(శ్రీరంగ రామానుజ జీయర్)

శ్రీమతే రామానుజాయ నమః

శ్రీ సీతారామచంద్రపరమాత్మనే నమః

అస్మద్గురుభ్యో నమః

**డా॥ కందాడై రామానుజాచార్య స్వామి**
రిటైర్డ్ ప్రిన్సిపల్
శ్రీ వేంకటేశ్వర వేదాంతవర్ధినీ కళాశాల,
సీతారాంబాగ్

# "ఆచార్య కిష్కింధా"

కిష్కింధా కాండను ఉ.వే.ప్ర. శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామి వారు దీన జన మానసావాసములలోని అజ్ఞానాన్ని అంతరింపజేయ సమకట్టి అనుగ్రహించి యున్నారు.

"కిష్కింధా" ప్రాశస్త్యమును చెప్పుచూ మొదట "శబ్దకల్పద్రుమ"కారుని వ్యుత్పత్తి "కిం, కిం, దధాతి" అని వివరించి, "కిం" శబ్దానికి "అనిర్వచనీయమైన ఆనందమని, లేదా ఆశ్చర్యమని" అర్థాన్ని తెలిపి, "ఆ ఆనందము లేక ఆశ్చర్యము అతిశయించినప్పుడు, ఆ "అతిశయాన్ని" రెండవ "కిం" శబ్దము తెలుపునని, ఈ రెండు "కిం" శబ్దాలు "అత్యద్భుతము"ను తెలుపునని "కిష్కింధా" శబ్దానికి అర్థాన్ని వివరించారు.

అట్టి అద్భుతములు ఈ కాండలో చాల ఉన్ననూ, అసలైన అద్భుతములు "ఆచార్య లక్షణములు"గా ఆచార్యుల వారు ఉపదేశించుట స్వామి వారి ఆచార్య ప్రావణ్యమును, ఆచార్య కృత్యముపై వారి అధ్యవసాయమును తెలుపుచున్నది.

శ్రీమద్రామాయణములో మొదటి మూడు కాండలు "ద్వయమంత్రము" లోని ఉత్తర వాక్యమును వ్యాఖ్యానించుచున్నవని సంప్రదాయజ్ఞుల నిర్వాహము. వాటిలో "బాలకాండ" "శ్రీమత్పదార్థము"ను, "అయోధ్యాకాండ", "నారాయణ" శబ్దార్థమును, "అరణ్యకాండ" లోని మునిజన కైంకర్యము "చతుర్థీ విభక్త్యర్థమును", "ఖరాది వధ" "నమః" శబ్దార్థమును వివరించినాయి.

ఇక "కిష్కింధాకాండ" ముఖ్యోద్దేశ్యము "ఆచార్య ముఖేన చేతనునికి స్వవిషయమున భక్త్యుత్పాదనము చేయదలచి, ఉత్తమాచార్యుని అన్వేషించి లభించుట" అని, కిష్కింధా కాండ ఉత్తమాచార్య స్వరూపమును చేతనులకు ప్రతిపాదించుచున్నదని ఆచార్య నిర్వాహము.

కావున "కిష్కింధా" "కిం కిం దధాతి" అను వ్యుత్పత్తిని బట్టి అత్యద్భుతము లైనవి ఆచార్య లక్షణములేనని స్వామివారి నిర్వాహము సందర్భానుగుణముగా, సర్వజన హృదయ రంజకముగా నున్నది.

ఇక ఈ విషయమును ఈ కాండ మొత్తములో ఏయే సంఘటనలు ఏయే అంశములను సూచించుచున్నవో చక్కగా స్వామి వారు ప్రతిపాదించినారు. అందులోను మొదటి సర్గలోని పంపావర్ణనమును వాల్మీకి భగవానుడు సుమారు రెండు వందల శ్లోకములలో కొంచెము అటు, ఇటుగా కావించినాడు.

ఈ సర్గలో, పర్వతములు, పర్వత శిఖరములు, వృక్షములు వృక్ష శాఖలు, మీనములు, పక్షిరుతములు, లేళ్లు ఇత్యాది ప్రాకృతిక వర్ణనను వాల్మీకి చాల విపులముగా వర్ణించి యున్నాడు. ఇది కేవలము ప్రకృతి సౌందర్య పిపాసకు నిదర్శనమని చెప్ప వచ్చును. ఆ దృష్టి కలవారికి దీనిలో ఆచార్య నిర్వాహము అసంగతముగా తోచవచ్చును.

ప్రకృతి స్వరూపమే "భోగ్యతా బుద్ధి జనని" అని అయితే పరమాత్మను ఆశ్రయింప జేయు ఆచార్యులు లభించిననాడు ప్రకృతే పరమాత్మను, పరమాత్మ కల్యాణ గుణములను ఉద్బోధించునని ఆచార్యనిర్వాహము. అందుచే గోవిందరాజీయములోని వ్యాఖ్యాన విశేషములకు, తమ బుద్ధి విశేషములను జోడించి పాఠకులకు కిష్కింధా స్వారస్యమును హృదయమున హత్తుకొనునట్లు ఆచార్యుల వారు వివరించుచున్నారు.

ప్రాకృతిక వర్ణనలో

వృక్షములనగా ఆచార్యులు; శిఖరములనగా శిష్యులు

పుష్పములు = కర్మజ్ఞాన భక్తులు; ఫలము = ముక్తి అనుభవము

పక్షులు = జ్ఞానులు; షట్పదములు = షడంగ వేదాధ్యాయులు

పికములు = భక్తులు; వాయువు = భగవంతుడు.

సంసక్త శిఖరాగ్రములు = పరస్పరానురక్త భాగవతోత్తములు

"ఇట్లు వివరించి, ఇంత చక్కగా ఇంతమంది ముక్తులతో కలసి, ఆనందానుభవములో నుండగా, ఒక్క సీత (బద్ధజీవి) లంక (శరీరము)లో అశోకవనము (సంసారము)లో నాకు దూరముగా బాధపడుచున్నదే" అనియే శ్రీరాముని (భగవంతుని) వాత్సల్య ప్రయుక్త విచారముగా వ్యాఖ్యానము, అందరికి రామాయణ వేద స్వరూపమును అవగతము చేయించుటకు ఆచార్యులవారి లోని తహతహను తేటతెల్లము చేయుచున్నది.

భగవంతునికి, జీవునికి వియోగము కలగినప్పుడు భగవంతుని వేదన సముద్రము, జీవుని వేదన గోష్పదము అని ఆచార్యుల వారి నిర్వాహము చాల మంది సంసారులకు "నా భక్తే గొప్ప" అను వారికి కనువిప్పు.

ఇక "హనుమ - శ్రీరామ" సమాగమములో హనుమంతుని వాక్యములకు, హనుమంతుని శ్లాఘించుచు శ్రీరామచంద్రుడు "నాన్యగ్వేదవినీతస్య" అని పలికిన వాక్యములకు ఆచార్య పరముగా సమన్వయము చేసి, హనుమంతుని ప్రశ్నలో, ఆచార్య లక్షణములను, "ఆచార్యోవేద సంపన్నః" అను లక్షణ వాక్యముతో సమన్వయమును గావించినారు. "కిష్కింధా కాండలో ప్రధానము "హనుమల్లాభమేనని", ఆచార్య లాభము జీవునికే కాక స్వామికి కూడ అత్యాశ్చర్యమును ("కింకిం"ను) కలిగించునదే అని, తానెన్నో అవతారములెత్తినను సాధించలేని "జీవుని ప్రాప్తిని" ఆచార్యుడు అలవోకగా సాధించి పెట్టునని" ఆచార్యుల వారి వివరణ వారి ఆచార్య నిష్ఠకు పరమోదాహరణము.

"సుగ్రీవ మైత్రి", "వాలివధ", "సీతాన్వేషణ ప్రయత్నము" అంతయు హనుమదాచార్య త్వము వలననే జరిగినదని ఆచార్యుల వారు వివరించుట వారి సూక్ష్మ దృష్టికి, తత్వ నిశ్చయ క్షమతకు గీటురాయి.

స్వామి వారికి "కిష్కింధ"లో లభించినవి అన్ని అనర్ఘరత్నాలే. వారు చెప్పిన వన్ని వివరించిన మాకు మరొక గ్రంధమగునను భీతిచే, ఇక వివరణను ఆపి, మిగిలిన "సుందర" "యుద్ధ", "ఉత్తర" కాండలు, ఇదే రీతిలో "శ్రీమద్భాగవతము" లోని ద్వాదశ స్కంధములను "వీరరాఘవీయ" వ్యాఖ్యకు శ్రీమన్మహాభారతము" లోని పద్దెనిమిది పర్వాలను "నీలకంఠీయ" వివరణకు ఇట్టి వ్యాఖ్యనే అందజేసి చేతనులను కృతార్థులను చేయ వేడుచున్నాను.

ఇట్లు
భాగవత విధేయుడు
**డా. కందాడై రామానుజాచార్య**

న్యూనాగోల్
హైద్రాబాద్

"ఉభయ వేదాంత విద్వాన్"
"మహామధురోపన్యాసక"
**శిరిశినహాళ్ వేంకటాచార్య స్వామి**
నిజామాబాద్.

# అంతర్దర్శనానికి అభినందన చందనం

రామాయణం అంతా విని రామునికి సీతమ్మ ఏమవుతుంది? అన్నాడట ఎవరో ఒకాయన.

ఆ సామెత వినడానికి విడ్డూరంగా ఉన్నా అందులో శ్రోతకున్న జిజ్ఞాసను మనం కాదనలేం.

సీతమ్మ శ్రీరాముని భార్య, శ్రీరాముడు సీతమ్మ భర్త, వారిద్దరి దాంపత్య గాథనే శ్రీరామయణం.

ఆ మాత్రం తెలిస్తే రామాయణమంతా తెలిసినట్టేనా? అలా అయితే అదే కథను మాటిమాటికి చెప్పుకోవడం దేనికి? మరోసారి వినడం దేనికి?

ఇన్ని యుగాలుగా ఇన్ని తరాలుగా సీతారాముల కథను ఇంత ఆప్యాయంగా చెప్పుకుంటున్నామంటే అందులో మనకు తెలియకుండా 'మనది' అనేది ఏదో వుండాలి.

మనది కాని దాన్ని దేన్నీ మనం అంతగా ప్రేమించం, ఆత్మీయంగా భావించం కూడ.

ఆ సీతారాముల కథకు మనకూ ఉన్న ఆ బంధం ఏమిటి? అనుబంధం ఏలాంటిది? అది మనకు తెలియాలి.

అది తెలుపాలనే తపనతోనే శ్రీమాన్ ఉభయవేదాంత విద్వాన్ ఆచి శ్రీనివాసాచార్య స్వామివారు శ్రీరామాయణాన్ని అక్షర అక్షరంగా విప్పి చూచారు. శబ్ద శబ్దంగా చెవిపెట్టి విన్నారు. దాని అంతరాంతరాల్లోకి వెళ్ళి అందినంత అర్థాన్ని మూటగట్టి మోసుకొచ్చారు, మన ముందు రాశిగా పోసిపెట్టారు.

అది వారి "శ్రీరామాయణ అనుభవం". దానిని అక్షర రమ్యంగా మన కళ్ళ ముందుంచారు.

శ్రీరామాయణం అంటే మన కథే, మనిషి కథ. మన కష్టాలు – కార్పణ్యాలు, మన త్యాగాలు – భోగాలు అన్నీ అందులో వున్నాయి.

"రామాదివత్ వర్తవ్యం – నతు రావణాదివత్" సీతా రాముల్లా జీవించాలి. రావణాదుల్లా రాక్షసులు కాగూడదు మనుషులు" అని చెప్పడానికే వాల్మీకి మహర్షి శ్రీరామాయణాన్ని మనకందించాడని చెప్పిన వాళ్ళు లేకపోలేదు.

కాని మట్టిలో పుట్టి మట్టిలో కలిసిపోయే మనిషి కథ మాత్రమే కాదది. ఆ మనిషి శరీరంలో మనుగడ సాగిస్తున్న జీవుని వెత అది. ఆ జీవుని గుండెలో గూడు కట్టుకున్న దేవుని ప్రధ అది. సీతారాములుగా అవతరించిన ఆత్మ పరమాత్మల అనుబంధ రూపమది" అంటారు శ్రీమాన్ 'ఆచి' వారు.

మన ఆధ్యాత్మిక జీవనానికి అద్దం వంటిది శ్రీ రామాయణం అని భావించి అందులో ప్రతిబింబించే మన జీవితాన్ని, జీవతత్వాన్ని దర్శింప చేస్తారు "శ్రీరామాయణానుభవం" లో.

ముఖ్యంగా కిష్కింధా కాండను వారు విప్పి చెప్పిన తీరు ఎంతో అందంగా ఉంది.

ముందుగా కథ చెప్పడం, ఆ తరువాత ఆ కథలోని సంభాషణలను సన్నివేశాలను విశ్లేషించి వాని వెనుక దాగియున్న ఆధ్యాత్మికతత్వాన్ని ఆవిష్కరించడంలో వారు చూపిన ప్రతిభ పాఠకుల మనసులను అట్టే పట్టేస్తుంది.

కథాకథనాన్ని ఉత్సాహంగా, ఉద్వేగంగా రసవత్తరంగా నడిపిస్తూ వుంటే వాల్మీకి స్వయంగా రామాయణాన్ని తెలుగులో చెప్పినట్లే అనిపిస్తుంది.

వారి కలం కథా శరీరాన్ని సున్నితంగా స్పృశిస్తూనే దాని కడుపులో పెరిగిన ఆత్మ సౌందర్యాన్ని ఆపరేషన్ చేసి వెలికి తీస్తుంది. దాని అందానికి ముగ్ధులమై ఆనందంతో కేరింతలు కొట్టే సమయంలోనే మన మనసును మరో సన్నివేశంలోకి నెట్టేస్తుంది.

వాల్మీకి మహర్షి అజ్ఞులు, విజ్ఞులు, ప్రాజ్ఞులు అనే మూడు వర్గాలను దృష్టిలో పెట్టుకొని శ్రీరామాయణాన్ని రచించాడంటారు పెద్దలు.

అజ్ఞుల కోసం కథ చెప్పడం, విజ్ఞుల కోసం వివిధ ధర్మాలను వివరించడం, ప్రాజ్ఞుల కోసం బ్రహ్మతత్వాన్ని సాక్షాత్కరింప జేయడం ఇది వాల్మీకి రామాయణ రచనా ప్రణాళిక.

కథను, ధర్మాలను అందరికి తెలిసేట్టు చేసి ఆత్మ తత్వాన్ని మాత్రం అన్వేషించే వారికే అందేట్టు చేశాడు వాల్మీకి భగవానుడు.

మన ఆచిస్వామివారు కూడ వాల్మీకి బాటలోనే నడుస్తూ కమ్మగా కథ చెప్పారు. విశేష ధర్మాలను సశాస్త్రీయంగా యుక్తి యుక్తంగా చర్చించి నిర్ణయించారు. పూర్వాచార్యుల శ్రీ సూక్తులతో తమ భావాలకు రంగులు దిద్దారు.

ముఖ్యంగా 'వాలి వధ' సందర్భంలో జరిపిన ధర్మాధర్మాల చర్చ వారి పాండితీ ప్రతిభను ప్రబలంగా చాటింది.

ఇక ప్రాజ్ఞులుగా వారు దర్శించి ప్రదర్శించిన బ్రహ్మతత్వం వారిలోని ఋషిత్వాన్ని ఎత్తి చూపింది.

తనలోనే, తనతోనే ఉండవలసిన జీవాత్మ తనకు దూరమైతే ఆ జీవుని గూర్చి పరమాత్మ ఎంతగా తపిస్తాడో పంపా సరోవర పరిసరాల్లో వెతికి చూపించారు.

భగవదనుగ్రహం పొందిన ఆచార్యున్ని ఆశ్రయిస్తే ఆశ్రితునికి కలిగే శ్రేయస్సేమిటో శ్రీరామ సుగ్రీవ మైత్రిని సాక్ష్యంగా చూపారు.

భగవదనుగ్రహమున్నా, భాగవత అనుగ్రహం లేకపోతే జరిగే ప్రమాదమేమిటో వాలి ద్వారా సుగ్రీవునికి జరిగిన "దేహశుద్ధి" ని ఉదాహరించారు.

'తారా విలాపం'లో 'వాలి వధ' సందర్భంగా వాలి చేసిన 'నిందాస్తుతి'లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పరమాత్మ వైభవం ప్రకటింపబడిన విధానాన్ని వివరించి చూపారు.

ఆచార్యానుగ్రహం పొంది 'భగవతోబలేన' 'భగవతోవీర్యేణ' అని పరమాత్మ మీద సంపూర్ణ విశ్వాసంతో ముందుకు సాగినవానికి జీవితంలో అంతటా విజయమే కాని పరాజయం ఉండబోదని సుగ్రీవ విజయంలో స్పష్ట పరిచారు.

సదాచార్య సంపత్తిని హనుమలో ఆవిష్కరించి చూపారు.

ఇలా రామాయణ కథలో, సన్నివేశాల్లో, ఋతువర్ణనలో, పాత్రల సంభాషణలో అంతర్దర్శనం చేసి ఆధ్యాత్మిక తత్వాన్ని ఆవిష్కరించడం ఒక ఎత్తైతే, రామాయణంలో పేర్కొన్న స్థలనామాల్లో, వ్యక్తుల నామాల్లో దాగిన తత్వాన్ని వెలికి దీసి ఆధ్యాత్మిక వాతావరణం సృష్టించడం మరొక ఎత్తు.

వాలి, సుగ్రీవుడు, తార, ఋష్యమూకము, మతంగుడు ఇలా నామాన్ని తెలిపే ఏ శబ్దమైనా సరే దాని వ్యుత్పత్తిని వివరించి కథార్థంతో కలిపి, తద్వారా పరమార్థాన్ని ప్రకటించడంలో వారు చేసిన కృషి అత్యంత ప్రశంసనీయం.

అసలు 'కిష్కింధ' అనే శబ్దంలోనే అద్భుతముందట. ఆ కిష్కింధాకాండలోని అద్భుతాలన్నిటిని మన కళ్ళకు కట్టినట్టు చూపించిన వారి రచనాశైలి పరమాద్భుతం.

పనిలో పనిగా కిష్కింధాకాండలో వాల్మీకి సంతరించిన కవితా సౌందర్యాన్ని గూడ మనకు రుచి చూపి వారి సాహితీ పిపాసను చాటుకున్నారు.

తమకున్న అపార శాస్త్ర వైదుష్యాన్ని, సంప్రదాయ పరిజ్ఞానాన్ని 'పణంగా' పెట్టి శ్రీరామాయణంలోని వాల్మీకి అంతరంగాన్ని అంది పుచ్చుకోవడంలో శ్రీమాన్ ఉభయ వేదాంత విద్వాన్ ఆచి శ్రీనివాసాచార్యులు గారు చూపిన ప్రతిభను గూర్చి ఎంత చెప్పినా తక్కువే మరి.

శ్రీరామాయణంలో వారు చేస్తున్న ఈ అంతర్దర్శన అనుభవాలను సంపూర్ణంగా లోకానికి అందించగలిగే శక్తియుక్తులను, ఆయురారోగ్యములను ఆశ్రితవత్సలుడైన శ్రీరామచంద్రుడు వారికి కృప జేయాలని ప్రార్థిస్తూ అభినందిస్తున్నాం.

సుధీవిధేయుడు

**శిరిశినహాళ్ వేంకటాచార్య,**

**నిజామాబాదు.**

**ఆచార్య ఫణీంద్ర కవి**
102, శ్రీనివాస ఆర్కేడ్, మారుతీనగర్ ఈస్ట్,
హైదరాబాదు - 500 040.
ఫోన్: 27133328

# అభినందనాభివందనము

"శ్రీరామానుజీయ శ్రీ వైష్ణవ సిద్ధాంత ప్రచార పరాయణులు" - "శ్రీ భాష్య, భగవద్విషయ వేత్తలు" - శ్రీమాన్ ఆచి శ్రీనివాసాచార్యులు (పెద్ద మామయ్య) గారికి నమః

శ్రీమంతము, మోక్షదమై
మీ మానస మృదుల వేది మీద కలుగు
'శ్రీ రామాయణానుభవము'ను
కోమల భాషాగుణముల కూర్చితి రనఘా!

రాముని యెడ యెడతెగని రక్తి, భక్తి -
శాస్త్ర సారార్థ విజ్ఞాన శక్తి, యుక్తి -
ఘన సుపండిత, పామరాకర్షకోక్తి
కలిగి, యిడితి "రామాయణ" గ్రంథ పంక్తి!

మామా! మీ మధురాంధ్ర దివ్య సువచోమందాకినీ వ్యాఖ్యతో
రామానంద రసాబ్ధి డోలికలలో రంగ ప్రవేశంబునై
శ్రీమద్రామ కథా విశేష విషయాశేషాద్భుతాదర్శలీ
లా మాధుర్య విహారినై బడసి తుల్లంబందు కైవల్యమున్!

అభినందన పూర్వకాభివందనాలతో

**ఆచార్య ఫణీంద్ర**

# ఉపయుక్త గ్రంథావళి


1. "శ్రీమద్రామాయణము" - శ్రీవాల్మీకి విరచితము- "వ్యాఖ్యాన చతుష్టయ విశిష్టము"
2. "తనిశ్లోకి" - శ్రీపెరియవాచ్చాన్పిళ్లై గారు
3. "రామాయణ రత్నాకరము" - శ్రీ తె.కం. గోపాలాచార్య స్వామివారు.
4. "శ్రీరామాయణ తత్వదీపిక" - శ్రీ భాష్యం అప్పళాచార్య స్వామివారు.
5. "రామాయణ కల్పవృక్షము" - శ్రీ విశ్వనాథగారు
6. "మంథర రామాయణము" - శ్రీ వావికొలను సుబ్బారావు గారు
7. "అంతరార్థ రామాయణము" - శ్రీ వేదుల సూర్యనారాయణ శాస్త్రిగారు
8. "రామాయణము" - శ్రీ ఉషశ్రీ గారు
9. "శ్రీ వాల్మీకి రామాయణ దర్శనము" - శ్రీ పాండురంగ అఠావలెగారు.
10. "శ్రీమద్రామాయణము-విశ్వశ్రేయము" - డా. మల్లాది గోపాల కృష్ణ శర్మ గారు.
11. "హనుమన్నాటకము".

శ్రీ రామాయ నమః

# కిష్కింధాకాండ

శ్రీరామచంద్రస్వామితో కలసి సీతాదేవి వివాహానంతరము అయోధ్యా నగరంలో పన్నెండు సంవత్సరాలు మానుష భోగాలన్ని అనుభవించింది. రావణాసురుని ఆదరణీయ అతిథిగా, బ్రాహ్మణోత్తమునిగా భావించిన సీతాదేవి మామగారింట తాను అనుభవించిన సౌఖ్యమయ జీవితాన్ని

**"ఉషిత్వా, ద్వాదశ సమా। ఇక్ష్వాకూణాం నివేశనే।**
**భుంజానా మానుషాన్ భోగాన్। సర్వకామ సమృద్ధినీ"**

అని అతనికి తెలియజేసింది.

కైక కోరుకొన్న వరాల కారణమో, సురుల పన్నాగ ఫలితమో, నెపమేదైతేనేమి - సురుల మొరలు విని, అసురుల ఆగడాలను మానిపించడానికి, ఋషుల శరణాగతిని స్వీకరించి సాధువుల సంత్రాణానికి, దుర్మార్గులైన రాక్షసులను దునుమాడడానికి శ్రియః పతి అయిన శ్రీరాముడు అరణ్యంలోకి అడుగిడాడు. శ్రీదేవి అవతార స్వరూపిణి అయిన సీతాదేవి స్వామి యొక్క అవతార ప్రయోజనం నెరవేరడానికి తాను నిర్వహింపవలసిన పురుషకార బాధ్యతను నిర్వర్తించడానికి స్వామి తనను రావద్దని వారించినా వినకుండా స్వయంగా అరణ్యానికి స్వామిని అనుసరించి వెళ్లింది.

అరణ్యానికి వచ్చాక సీతారాములు సంసారులందరికంటె అధికంగా సంసార బాధలను అనుభవించారు. నీచుడైన మారీచుడు మాయాలేడి రూపంలో సీతాదేవికి "మృగతృష్ణ" ను కల్పించి, శరీరాత్మల వంటి సీతారాములను వేరు చేయడానికి, కారణమయ్యాడు. దుర్మార్గమే రూపుదాల్చిన దశకంఠుడు తల్లి వంటి సీతాదేవిని దయారహితంగా, అమానుషంగా అపహరించాడు. సాధుజనుల సంరక్షణ కొరకు ఆ విధంగా నిత్యానపాయిని అయిన సీతాదేవి రావణాపహృత అయి శ్రీరామచంద్ర స్వామికి దూరమైంది.

సీతారాముల విరహవేదన పరమాత్మను సమీపింపజాలని జీవుని వేదనను, జీవునికి దూరంగా ఉన్న పరమాత్మ బాధను తెలియజేస్తుంది.

దూరమైన జీవాత్మ పరమాత్మను స్వయంగా చేరుకోలేడు. పరమాత్మ స్వయంగా జీవాత్మను పరిగ్రహించజాలడు. జీవుని చేరదీసి అతని ఆవేదనను స్వామికి స్వయంగా నివేదించి, ఆ ఇద్దరిని ఒక దగ్గరికి చేర్చేవాడు. మహోపకారకుడు (ఘటకుడు) ఆచార్యుడే కదా!. ఆచార్యుడు తన ప్రయత్నాన్ని ఆరంభించడానికి ముందుండే జీవపరమాత్మల

(సీతారాముల) విరహవేదనతో "కిష్కింధాకాండ" ఆరంభమవుతున్నది. ఈ కాండకు "కిష్కింధాకాండ" అని పేరు. "కిష్కింధ" అనే శబ్దార్థంలోనే అద్భుతముంది. "కిష్కింధా" శబ్దానికి 'శబ్దకల్పద్రుమ' కారుడు ఒక చక్కని వ్యుత్పత్తిని తెలిపాడు.

**"కిం కిందధాతి ఇతి కిష్కింధా". "పారస్కరాదిత్వాత్ పూర్వస్య "కిమస్య" 'మ' లోపః - సత్వం షత్వంచ నిపాతనాత్"; "దధాతి" ఇతి"ధా"**

అనేది ఒక వ్యాకరణ సూత్రము.

ఈ సూత్రం ద్వారా పారస్కరాదిత్వము వలన మొదటి "కిం" లోని మకారానికి లోపమేర్పడి (కి) తర్వాత నిపాతనత్వము వలన "ష" త్వమేర్పడి (కిష్) ఆ తరువాత 'కిం' కు "ధా" కలిసి "కిష్కింధా" శబ్దమేర్పడుతుంది.

ఏదో ఒక క్రొత్త దానిని, అనిర్వచనీయమైన దానిని తెలుపడానికి "కిం" పదాన్ని వాడుతారు. ఆ అనిర్వచనీయత్వము మరింత అధికమైతే "కిం? కిం?" అంటారు. అటువంటి అనిర్వచనీయమైన అద్భుతాన్ని కలిగించేది (దధాతి) కనుక "కిష్కింధా" అని ఈ కాండకు పేరు కలిగింది.

జీవునికి అనాది నుండి అవిద్యా సంబంధ కారణంగా అనేక శరీరాలు కలుగు తున్నాయి. ఆ అవిద్యా ప్రాబల్యము వలన ఆయనకు ప్రకృతి (విషయ) ఆనుకూల్యము, పరమాత్మ పట్ల ప్రబల ప్రాతికూల్యము ఏర్పడుతూ ఉంటాయి. అంత గొప్ప సీతాదేవికి కూడ, నిత్యానపాయినికికూడ ఆ క్షణంలో ప్రకృతి విషయ ప్రాబల్యము వలన "బంగారు లేడి" పట్ల ప్రావణ్యము కలిగింది. అప్రాప్తమైన ఆ వ్యామోహమే ఆమెను ప్రాప్తుడైన పరమాత్మకు దూరం కావించింది.

జీవునికి అనాదిగా ఉంటున్న భగవద్వైముఖ్యము, ప్రకృతి ప్రాముఖ్యము పరమాత్మ యొక్క నిర్హేతుక కృప వలననే నివారింపబడుతాయి. ఫలితంగా ఆ భగవంతునిపట్ల "అద్వేషము", "ఆభిముఖ్యము"లనే బీజాలు జీవుని మనఃకేదారంలో వేయపడుతాయి. అలాగా జీవుని మనములో బీజప్రాయంగా కలిగిన "భగవదద్వేష, ఆభిముఖ్యాలనే" భావాలను స్పష్టంగా అంకురింపజేసి, పల్లవింపజేసి, పుష్పింప జేసి, ఫలింపజేసేవాడు "ఆకారత్రయ" సంపన్నుడైన ఆచార్యుడే కదా!

**"ఆకారత్రయ సంపద"** అనగా **"తదేక శేషత్వము, తదేకశరణత్వము, తదేక భోగ్యత్వములు".** "భగవంతునికొక్కనికే దాస్యము చేయుట, అతనినే శరణు (ఆశ్రయోపాయాన్ని) వేడుట, అతని భోగానికే (ఆనందానికే) ఉపయోగపడుట" అనేవి ఆకారత్రయములు అనబడుతాయి. ఈ మూడు లక్షణాలు పతివ్రత అయిన ఒక స్త్రీకి

స్వంత లక్షణాలు. పతివ్రత అయిన స్త్రీ పతి యొక్క పరమాదరానికి పాత్రురాలు అయినట్లే "ఆకారత్రయ" సంపన్నుడైన ఆచార్యుడు భగవంతునికి అత్యంతప్రియుడు అవుతాడు. ఆ భగవత్ప్రేమే ఆచార్యునికి "ఘటకత్వ" శక్తిని కలిగిస్తుంది. **"ఘటకత్వము"** అనగా **"దీనుడైన జీవుని సర్వస్వామితో చేర్చగల్గుట"**. అటువంటి అద్భుతమైన ఆచార్య సంబంధాన్ని అశక్తుడైన జీవుడు అవిద్యా పంకనిమగ్నత వలన తనంతట తాను కోరుకోజాలడు. సాధించుకోజాలడు. వాస్తవానికి "ఆచార్య సంబంధము" అనే అపూర్వ లాభము మలీమసమనస్కుడైన తనకు కలుగుతుందని జీవుడు కలలో కూడ ఊహించుకోజాలడు. **"ఆచార్య లాభమ్ భగవానాలే"** అని జగదాచార్యుల శ్రీసూక్తి. ఆచార్యుడు భగవత్ప్రసాదము వలన లభిస్తాడు. అదుగో అటువంటి అపూర్వమైన, అత్యద్భుతమైన ఆచార్య సంబంధాన్ని 'కింకిం" శబ్దాలు సూచిస్తాయి. దానిని "దధాతి" కలిగించేది "కిష్కింధ".

ఇంతవరకు "అరణ్యకాండ"లో "మాతంగమునులనే" ఆచార్యుల మహావైభవము "శబరి" ద్వారా స్పష్టంగా ప్రదర్శించబడింది. "మతంగవనం" లో మాతంగమునుల దినచర్యా ప్రభావమును, వారి ద్వారా అక్కడ సంభవించిన అత్యద్భుత సంఘటనలను శబరి శ్రీరామ లక్ష్మణుల కనులముందు అచ్చుపడేలా ఆవిష్కరించింది. అంతేకాదు తన ఆచార్యుల కటాక్షంతో సహజంగానే స్వయంగానే తాను "స్వాచార్యుల శ్రీపాదాలను" చేరుకొంటానని "పాదమూలం గమిష్యామి, యానహం పర్యచారిషమ్' అని సుదృఢంగా పలికి, రామాజ్ఞతో తన ప్రాకృత శరీరాన్ని యోగాగ్నిలో వదలి, దివ్య శరీరముతో దివ్య లోకాలకు వెళ్లిపోయింది.

అదుగో! అటువంటి మహా మహిమాన్వితుడైన ఆచార్యుని ప్రసాదాన్ని జీవాత్మ అయిన సీతాదేవికి అందించాలనుకొన్నాడు అఖిలాత్ముడైన శ్రీరామచంద్రస్వామి ఈ కిష్కింధకాండలో.

ఈ కాండలో శ్రీరామలక్ష్మణులను మొట్టమొదట సేవించుకొన్న వాడు ఆచార్య హనుమ. రామ లక్ష్మణులను పరమాత్మ స్వరూపులుగా తక్షణమే గుర్తించిన వాడు హనుమ. వారిని ఆయన కలసింది కూడ "ఆచార్య కార్య నిర్వహణ" కొరకే. అనగా వాలి భయకంపితుడైన సుగ్రీవునికి శ్రియః పతి అయిన శ్రీరామునికి మధ్య సఖ్యాన్ని సాధించడం కొరకే. ఆ విధంగా హనుమ "ఆచార్య కృత్యం"తో ఆరంభమవుతున్న "కిష్కింధాకాండ" ఆయన "సముద్ర తరణ" సంసిద్ధతతో అంతమవుతుంది. అంతేకాదు రామసుగ్రీవ సమాగమాన్ని సాధించడం ద్వారా హనుమ **"స్వాచార్యుడైన సూర్య భగవానునికి"** అత్యంత ప్రియపాత్రుడయ్యాడు.

ఈ కాండలో ఆచార్య లక్షణాలు వ్యాఖ్యానింపబడి, అవి పూర్తిగా గల హనుమ స్వరూపము ఆవిష్కరింపబడుతుంది. అటువంటి హనుమనే సుగ్రీవ ప్రేరణతో శ్రీరామభద్రుడు తన దూతగా వరించి, అతనికి తన గుర్తుగా "అంగుళీయకాన్ని" ఇచ్చి సీతాన్వేషణ కార్యంలో ఆ హనుమను నియోగించటం కిష్కింధకాండలో ప్రధానమైన వేదాంతపరమైన కథా విషయ విభాగము. ఇక "వాలి వధ" మొదలైన విషయాలు కథాపరంగా ప్రధానములే కావచ్చు. కాని "తత్వహిత" దృష్టితో చూచినప్పుడు అవి "ఆనుషంగికములు" మాత్రమే. ఈ విధంగా "కింకిం" (ఏమేమో) అని చెప్పదగిన అపూర్వములు అయిన "ఆచార్య లక్షణాలను", వాటిని సమగ్రంగా కలిగిన హనుమ (ఆచార్య) స్వరూపాన్ని, శ్రీరామ పరమాత్మ యొక్క అమేయ పరాక్రమ మహిమను, "స్వయం తీర్ణః - పరాన్ తారయతి" అన్నట్లు తాను తరించి (దాటి), అన్యులచే తరింపజేసే ఆంజనేయుని (ఆచార్యుని) (సంసార) సముద్రతరణ దీక్షను అద్భుతంగా వివరిస్తుండే "కిష్కింధా కాండ"లోనికి దీనులము, జీవులము అయిన మనము ఆర్తితో అడుగిడుదామా!

---

శ్రీమద్రామాయణంలోని మొదటి మూడు కాండలు "ద్వయమంత్రం" లోని రెండవ వాక్యాన్ని తెలిపాయి.

ఇంతవరకు శ్రీరామాయణంలో బాలకాండలో "సీతాకల్యాణం" వలన "సీతా విశిష్టుడైన శ్రీరామచంద్రుని స్వరూపాన్ని" **"శ్రీమతే"** శబ్దం వివరిస్తున్నది. అయోధ్య కాండలో శ్రీరామభద్రుని అనంత కల్యాణ గుణగణ వర్ణన ద్వారా **"నారాయణ"** శబ్దము సూచింపబడుతున్నది.

అరణ్యకాండలో "పంచవటీ" ప్రవేశం వరకు మునిజనుల ఆతిథ్యము, వారి కైంకర్యాలను "ఆయ" అనే చతుర్థీ విభక్తి వివరిస్తుంది. అనంతరము ఖరాది సకల రాక్షస సంహారము వలన "అహంకార నిరసన" రూపమైన **"నమః"** శబ్దార్థము సూచింప బడింది. "మారీచవధ" నుండి చేతనోజ్జీవన (సీతాన్వేషణ) ప్రయత్నము ప్రారంభమైంది.

ఇక ద్వయ మంత్రంలోని పూర్వ వాక్యము "శరణాగతి సూచకము" కదా! జీవులకు "భగవచ్ఛరణాగతి" సదాచార్య సంస్కారము మూలంగా కలుగుతుంది.

ఈ కిష్కింధకాండ - ఆచార్యుని ద్వారా చేతనుల మనస్సులలో భక్తిని కల్గించడం కొరకు "జీవ (సీతా) విరహ దుఃఖం, ఆచార్య అన్వేషణములతో ఆరంభమై, ఆచార్యుని (హనుమ) లాభము, అతనిని శ్రీరాముడు (పరమాత్మ) తన దూతగా వరించి, అతనిని సీతాదేవి (జీవుని) సన్నిధికి పంపించడం వరకు సాగిపోతుంది.

"ఇతిశం"

# పంపా విరహవేదన

శ్రీరామ లక్ష్మణులు పంపా సరోవరంలోని పశ్చిమ దిశ నుండి తూర్పు తీరం వైపు పయనించ సాగారు.

(1) పంపా సరస్సులోని రమణీయ పద్మాలు రామునికి ప్రసన్నంగా దర్శనమిచ్చాయి. అయితే అవి సీతాదేవి వదనాన్ని గుర్తుకు తేగానే రాముడు దుఃఖించాడు.

ప్రకృతిలో పారవశ్యాన్ని కల్గించే కలువలు, కమలాలు, చంద్రుడు, చేపలు సాధారణ జనులకు మోదాన్ని, విరహజనులకు ఖేదాన్ని కలిగిస్తాయి.

తామరపూలు బురుదనుండి పుట్టుతాయి. లోతైన నీటిలో నిలుస్తాయి. అయినా ఆ నీటి పదను, ఆ బురద తామర రేకులను, పూలను అంటుకోవు. అంతేకాదు అవి ఆ తామరలు తాము విచ్చుకోవడానికి సూర్యునివైపు తలెత్తి చూడడానికి ఉపకరిస్తాయి.

అలాగే అగాధమైన సంసారంలో సంభవించిన సత్పురుషులు, ఆ సంసార పంకిలములో మునిగిపోరు. అంతేకాదు అందులో ఉంటూనే ఆ సంసార విముక్తి కొరకు పరమాత్మ వైపు అభిముఖులవుతారు. పరమాత్మ అటువంటి సజ్జనులను సముద్ధరించడం గురించే ఆలోచిస్తుంటాడు.

తనకు దూరమై, తన గురించే ఆర్తితో అనవతరము దీనంగా పరితపించే సీతాదేవి వదన పద్మము ఆ వన పద్మాల కారణంగా శ్రీరాముని మనోమందిరములో మెరసింది.

(2) ఆ నదిలోని నల్లని కలువలు అతనికి అగుపించాయి. శ్రీరామునికి అవి సీతాదేవి నల్లని, చల్లని కనులను స్ఫురింప జేశాయి.

నల్ల కలువలు రాత్రులలో చంద్రుని చల్లని కరస్పర్శతో వికసిస్తాయి. దివారాత్రాలు సంసారులకు, సంయములకు వేర్వేరు అనుభవాలను కల్గిస్తాయి. పగలు ప్రపంచ విషయాలకు సంకేతము. పగలు వలె ప్రకాశించే ప్రాపంచిక విషయాలలో సంసారులు అధికాసక్తిని కలిగి ఉంటారు. సంయములు వాటి పట్ల నిరపేక్షతో నిరాసక్తులుగా నిద్ర పోయే వారి వలె ఉంటారు.

భగవద్విషయము సంసారులకు చీకటి రాత్రి వంటిది. అందులో వారు అనాసక్తులయి నిద్రించినవారి వలె ఉంటారు. కాని ఆ భగవద్విషయమే సత్పురుషులకు పట్టపగలు వలె "దివీవచక్షురాతతం" అన్నట్లు ప్రకాశిస్తు ఉంటుంది. "జాగ్రవాంసః సమింధతే" అన్నట్లు ఆ భగద్విషయంలో సజ్జనులు సతతము జాగరూకులుగా (మేల్కొని) ఉంటారు.

కాబట్టి రాత్రిలో వికసించే కలువలు భగవద్విషయ ప్రవణులైన ప్రపన్నులకు సంకేతము. వారి వికాసానికి చల్లని కిరణములు గల చంద్రుని వలె చల్లని చూపులు గల ఆచార్యుల ప్రబోధము అవసరము. అందువలన కలువల వంటి కన్నులు గల సీతాదేవిని ఉద్ధరించడానికి ఆచార్య చంద్రుని అవసరాన్ని రాముడు గుర్తించాడు.

(3) పంపానదీ జలాల్లో త్రుళ్ళిపడే చేపలు రాముని కనుల ముందు కదల సాగాయి. అవి సీతాపతికి చంచలములైన సీతాదేవి చూపులను స్ఫురింపజేశాయి. ఆ చేపల త్రుళ్లిపాటు ఆర్త ప్రపన్నుల "ప్రాప్య త్వర"కు ప్రతీకగా ఉంటుంది. దాని వలన తనను తక్షణమే కలుసుకోవాలనే సీతాదేవి తహతహను శ్రీరాముడు అవగతం చేసికొన్నాడు.

ఈ విధముగా పంపానదిలోని పద్మాలు కలువలు, చేపలు శ్రీరామునికి సంతోషాన్ని దుఃఖాన్ని కూడ ఒకే సమయంలో కలిగించాయి.

(4) పంపా వన పరిసరాలు వసంత శోభలను సంతరించుకొన్నాయి. ఎత్తైన చెట్లతో ఆ వనము ఒక కొండలాగా కనబడింది. సమున్నత తరు శాఖలతో పూలతో పండ్లతో రామలక్ష్మణులకు ఆ వనము స్వాగతాంజలిని సమర్పిస్తున్నట్లు సాదరంగా ఎదురుగా నిలిచి ఉంది.

వసంతము సామాన్య జనులకు సంతోషాన్ని కల్గిస్తుంది. కాని విరహ శోకావిష్టులైన రామలక్ష్మణులకు ఆ వసంతము అత్యంత దుఃఖావహమైంది. ఆ సమయంలో వారిద్దరికి అయోధ్యా నగరములో "ఋషి జీవితాన్ని" గడుపుతున్న భరతుడు గుర్తుకొచ్చాడు.

భరతుడు ఆ సమయంలో సాక్షాత్తుగా అయోధ్యాధిపతి. అయినా అతడు తనను రాజుగా అనుకోలేదు. తనను రామకింకరునిగానే తలచాడు. రామ పాదుకలనే రాజప్రతినిధులుగా నిలిపి, వాటికి ప్రతి దినము రాజకార్యాలను నివేదించుకొనేవాడు. అపరరాత్రులలో లేచి సరయూనదికి వెళ్లి అందులోని మంచువంటి చల్లనీళ్లలో స్నానమాడి, నీరుకారుతుండే ఆ తడి బట్టలతోనే ఇంటికి చేరుకొనేవాడు. అయోధ్యా జనులు తనను "రామద్రోహి"గా చీదరించుకొంటారని ప్రతిక్షణము భయపడేవాడు.

జడలుగట్టిన తలవెంట్రుకలతో, నారవల్కలాలను ధరించి, చల్లని నీటిస్నానాలతో, తీవ్ర వ్రతోపాసనలతో అడవిలో రామలక్ష్మణుల కంటె మిక్కుటంగా అయోధ్యలో భరతుడు ఋషిజీవితాన్ని గడుపుతూ "రామసంగమము" కొరకు ప్రాణాలను నిలుపుకొని ప్రతీక్ష చేస్తున్నాడు.

**"అత్యంత సుఖసంవృద్ధః। సుకుమారః సుఖోచితః**
**కథంను అపరరాత్రేషు। సరయూ మవగాహతే॥**

"అత్యంత సుఖాలలో పుట్టి పెరిగి, సుకుమారుడై, సుఖోచిత జీవితాన్ని గడుపవలసిన భరతుడు అంతటి కఠిన కష్టాలను ఎలా భరిస్తున్నాడో అని సౌమిత్రి బాధచెందుతూ, అంతటి ధర్మాత్మునికి జన్మనిచ్చిన కైకేయీ మాత అంతటి దుస్స్వభావాన్ని ఎలా కలిగి ఉందో?" అని కైకేయి పట్ల అసహ్యంతో బాధతో లక్ష్మణుడు బుసలు కొట్టాడు.

అయితే సర్వభూత దయామయుడైన, సకలభూత రతుడైన శ్రీరామచంద్ర స్వామికి కైకేయి నింద రుచించలేదు. అందువలన ఆయన లక్ష్మణుని మందలించాడు. "నతేఽంబా మధ్యమా తాత । గర్హితవ్యా కదాచన".

"సౌమిత్రీ! మన మధ్య మాత అయిన కైకేయిని ఎన్నడు నిందింపకూడదు" అని సున్నితంగా మందలించాడు.

భరతుని చరిత్ర తన స్వాంతానికి అత్యంత సంతోషాన్ని కల్గిస్తుందని శ్రీరాముడు వక్కాణించాడు.

భగవంతునే ఆది నుండి అత్యంత ప్రియంగా భావిస్తూ అతనికి అనపాయినిగా ఉంటూ ఒకే ఒక దుర్ముహూర్తంలో క్షణికాకర్షణకు మృగతృష్ణకు లోబడి, భగవంతునికి దూరమై, రాక్షస పరవశ అయిన సీతాదేవి భగవత్సమాగము కొరకు ప్రతిక్షణము ఆర్త ప్రపన్నుని వలె పరితపిస్తున్నది.

అటువంటి సమయంలో ఆ సుందర పంపావన సందర్శనము రామలక్ష్మణులకు బాహ్యంగా సంతోషాన్ని, ఆంతరంగా దుఃఖాన్ని కల్గించింది.

(5) శ్రీరామ లక్ష్మణుల దృష్టి పంపావనము యొక్క పచ్చికబయళ్లపై పడింది. ఆ పచ్చిక బయలు స్వయంగా నీలంగా ఉంటుంది. దానిపై పడిన రంగు రంగు పూలతో ఆ పచ్చిక బయళ్లు నెమిలి కంఠమువలె ఒకప్పుడు నల్లగా మరొకప్పుడు పచ్చగా వివిధ కాంతులీనుతున్నాయి.

భక్తుని హృదయము స్వచ్ఛమైన పచ్చిక బయలు వలె ఉంటుంది. వివిధ వృక్షాలు ఆ పచ్చిక నేలపై అనేక పుష్పాలను రాలుస్తున్నాయి. వివిధ వృక్షముల వలె ఆచార్యులు ఆగలేక భక్తుల హృదయాలలో జ్ఞాన పుష్పాలను పూయిస్తారు. అప్పుడు ఆ భక్తుల హృదయ కేదారాలు సౌందర్య, పరిమళ భరితములై భగవంతునికి అత్యంత ప్రియంగా ఉంటాయి. అందుకే శ్రీరామచంద్రస్వామి ఆ పచ్చిక బయలు తనకెంతో మనోహరంగా ఉందని సౌమిత్రితో అంటాడు.

"అధికం ప్రతిభాత్యేతత్ నీలపీతంతు శాద్వలం"

(6) పంపావనంలోని వృక్షాగ్రాలుపూలతో నిండి ఉన్నాయి. పూవు జ్ఞానానికి గుర్తు. అందువలన పూలతో నిండిన చెట్లు జ్ఞాన సమృద్ధిగల సంసారులైన ఆచార్యులకు సంకేతాలు. నివృత్త రాగులకు గృహమే తపోవనము కదా!

భగవదాశ్రయానికి, భగవత్ప్రాప్తికి గృహస్థాశ్రమము ఒక అడ్డుకాదు. అందువలన పూలతో సమున్నత శాఖలు గల వృక్షాలు జ్ఞాన సమృద్ధులైన సంసారులకు సూచకాలు. పూలు స్త్రీలకు ఉపమానాలు కనుక చెట్ల కొమ్మలపైన పుష్పాలు జ్ఞానులైన సంసారుల ధర్మపత్నులను సూచిస్తాయి. వారు తమ భర్తల జీవితాలను సంతోష సౌఖ్యాలతో అలంకరిస్తారు. గృహస్థులైన జ్ఞానులు సన్యాసుల కంటె మించిన వైరాగ్యంతో తమ సాంసారిక జీవనయాత్రను పారమార్థిక లక్ష్యంతో పురోగమింపజేయడం మనము నిత్య జీవితంలో ప్రత్యక్షంగా చూస్తునే ఉంటాము కదా.

(7) ఆ అడవిలో గాలి వేగానికి నేలరాలిన పూలు కొన్ని. చెట్లపై కొమ్మలపై నిలిచిన పూలు కొన్ని ఉంటాయి. నేల రాలిన పూలలో కూడ కొన్ని రాశిగా ఒకే దగ్గర ప్రోగై ఉండగా, కొన్ని గాలికి చెల్లా చెదరయి పోతాయి.

చెట్ల కొమ్మలంటే ఉన్నతులైన ఆచార్యులు లేక సత్పురుషులు. కొమ్మల పై పూలు అంటే వారి జ్ఞానరాశులు. జ్ఞానాన్ని పుష్పంతో పోలుస్తారు కదా!

ఇక గాలి అంటే భగవంతుడే. "నమస్తే వాయో। త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి" అంటుంది వేదము. గాలి వలన పూలు రాలడం అంటే భగవత్కృప వలన జ్ఞానుల ఉపదేశాలు జిజ్ఞాసువులైన శిష్యుల హృదయాలలో చేరడం. పచ్చిక నేల స్వచ్ఛమైన శిష్యుని హృదయం వంటిదని ఇది వరకే చూచాము కదా!

అయితే ఆచార్యోపదేశం శిష్యులందరికి సాధారణమే అయినా, దాని వలనజ్ఞానం కలిగినా అది అందరి హృదయాలలో ఒకే రకంగా నిలువదు. శ్రద్ధాళువులైన శిష్యులు నిరంతర మననం వలన తమకు కలిగిన జ్ఞానాన్ని మనస్సులలో శాశ్వతంగా భద్రపరచుకొంటారు. వారి హృదయాలు పూలరాశులు నిలిచి ఉన్న పచ్చిక నేలల వంటివి.

మరికొందరు సోమరితనముతో అన్యకార్యాసక్తులై తాము సంపాదించుకొన్న జ్ఞాన సంపద పట్ల శ్రద్ధలేక, దాని మననం లేక ఉంటారు. గాలికి చెల్లా చెదరైన నేలపూలవలె, వారికి ఆచార్యోపదేశం వలన కలిగిన జ్ఞానం చెల్లాచెదరై నిరర్థకమవుతుంది.

(8) అడవిలో గాలికి చెట్ల కొమ్మలు ఊగుతున్నాయి. ఆ కొమ్మలలోని పూలలో ప్రవేశించిన తుమ్మెదలు ఆ పూలలోని తేనెను త్రాగుతూ గాలికి అటు ఇటు ఊగు తున్నాయి.

పరమపదంలో ముక్త పురుషులు భగవదానంద మకరందాన్ని పానం చేస్తూ పారవశ్యంతో సామగానం చేస్తూ, లోకాలన్నిటిలో ఆనందంతో సంచరిస్తుండడాన్ని మకరంద పానంతో మత్తిల్లి "ఝుంకారం" చేసే మధుపాలు గుర్తుచేస్తున్నాయి.

గాలికి ఊగే చెట్ల కొమ్మలు తన్మయత్వంతో నృత్యం చేసే శ్రేష్ఠభక్తులను తలపిస్తున్నాయి.

(9) అడవిలో అనేక రకాల పక్షులు ఆనందంతో కేరింతలు కొట్టుతున్నాయి. ఆ అరుపులను తనను ఓడించడానికి మన్మథుడు పక్షుల ద్వారా చేయిస్తున్న సవాళ్లుగా రామచంద్ర స్వామి భావించాడు.

సీతాదేవితో కలసి ఉన్నప్పుడు ఆ పక్షుల అరుపులు స్వామికి అమితంగా సంతోషాన్ని కల్గించేవి. అవే ఇప్పుడు సీతను ఎడబాసిన స్వామికి ఆవేదనను కల్గిస్తున్నాయి. జీవ పరమాత్మల సంశ్లేష ఎంతటి సంతోషావహమో వారి విశ్లేషము అంత బాధాకరమైనది.

(10) పంపావనంలోని ఆడపక్షులు మగపక్షులతో కలసి ఆనందాన్ని పంచుకొంటూ చిత్ర విచిత్ర ధ్వనులను చేస్తున్నాయి. అవి "పక్షిరుతము"లు, "కూజితములు" అని అనబడుతాయి.

అడవిలోని ఆడపక్షులు "శిష్యులు". మగపక్షులు "గురువులు". ఆచార్యుని ఉచ్చారణను అనుసరించి శిష్యులు ఉచ్చరిస్తూ జ్ఞానలాభంతో సామగానం చేస్తున్నట్లు వాటి అరుపులు వినిపిస్తున్నాయి.

(11) ఆ అడవిలో తుమ్మెదలు మకరంద పానమత్త చిత్తాలతో "ఝుంకార" ధ్వనులు చేస్తున్నాయి. అవి తేటగీతులు (తుమ్మెదల పాటలు)గా వినవస్తున్నాయి. తుమ్మెదల పాటలను "షట్పదగీతాలు" అంటారు.

"షట్పదగీతము" మన సంప్రదాయంలో "ద్వయమంత్రానికి" సంకేతం. తుమ్మెదకు ఆరుపదాలు (పాదాలు) ఉంటాయి. కనుక తుమ్మెదకు "షట్పదము" అని పేరు

అలాగే షట్పదమంత్రమైన ద్వయమంత్రంలో ఆరు పదాలు (శబ్దాలు) ఉన్నాయి. (1) శ్రీమన్నారాయణ చరణౌ (2) శరణం (3) ప్రపద్యే (4) శ్రీమతే (5) నారాయణాయ (6) నమః

ద్వయ మంత్రంలో రెండు చరణాలు ఉంటాయి. రెండు చరణాలు ఉన్న మంత్రము కనుకనే దానిని "ద్వయమంత్రము" అంటారు. ఇందులో మొదటి చరణంలో మూడు పదాలు. రెండవ చరణంలో మూడు పదాలు ఉన్నాయి.

ఈ ద్వయ మంత్రాన్ని శ్వేతద్వీపంలో (పాలసముద్రంలో) పరమాత్మ శ్రీదేవికి ఉపదేశించాడు. "విష్ణుమాదిగురుం లక్ష్మ్యాః మంత్ర రత్న ప్రదంభజే". దీనికే **"మంత్ర రత్నమని"** పేరు. ఈ మంత్రాన్ని తిరుమలలో శ్రీనివాసుడు అలమేలు మంగకు ఉపదేశించాడు. అందుకే శ్రీనివాసుడు "సర్వేషాం ప్రథమాచార్యుడు" అయ్యాడు.

కనుక పంపావనంలోని "షట్పదగీతాలు" ప్రపన్న ప్రవరులు సంతతము అనుసంధించే "ద్వయ మంత్రానికి" సూచికలు. ఆ గీత ధ్వనులు ద్వయమంత్రార్థాలైన "ఉపాయ", పురుషార్థాలకు సంకేతాలు.

(12) ఆ వనంలోని స్త్రీ, పురుష మయూరాలు (నెమిళ్లు) ఆనందంతో కలసి ఆడుతున్నాయి. వర్షాకాలంలో కాని మరే కాలంలో కాని మేఘాలు జలభరితాలై నల్లగా దర్శనమిచ్చినప్పుడు మగ నెమిలి పురివిప్పి ఆడుతుంది. ఆడ నెమిలి ఆనందంతో ఆ మగనెమలి చుట్టు ఆడుతుంది. ఆ రెండు నెమిళ్లుకలసి పరవశంతో కూజితం చేస్తున్నాయి.

ఆ వనమయూరాలు - అవని జాతను కోల్పోయిన తనను పరిహసిస్తున్నాయని స్వామి తన స్వాంతంలో నొచ్చుకొన్నాడు.

**"మయూర వ్యసనే నూనం । రక్షసా నహృతా ప్రియా।**
**తస్మాత్ నృత్యతి రమ్యేషు । వనేషు సహకాంతయా ॥**

"ఆ వన మయూరాలలో ఆడనెమిలిని రాక్షసుడెవ్వడు అపహరించలేదు. అందువలననే మగనెమిలి తన ప్రియకాంత అయిన ఆడనెమిలితో ఆనందంతో ఆ అందమైన వనంలో ఆడుతుంది. నిజంగా తన ప్రియ మయూరాన్ని ఏ అసురుడో అపహరిస్తే, అప్పుడు తెలిసేది ఆ మగ నెమిలికి "ప్రియకాంతా విరహము" ఎంత దుర్భరమో!" అని శ్రీరామచంద్రస్వామి చింతాక్రాంతుడయ్యాడు.

(13) పంపావనంలోని వసంతము సంతతము తనకు వ్యథను కల్గిస్తుంది. తనలాగే సీతాదేవిని కూడ లంకలో అది అత్యంతము బాధిస్తు ఉండవచ్చు.

సీతాదేవి యౌవన మధ్య, పద్మదళాక్షి. సుకుమార భాషిణి, సుందర సుమసుకుమారి. ఏకాంతంలో తన కాంత ఈ వసంత బాధను భరించలేక తన ప్రాణాలనే కోల్పోయి ఉండవచ్చు. అయినా అక్కడ లంకలోని భయంకర రాక్షసులు ఆమెను స్వేచ్ఛగా తిరుగనిస్తున్నారో? లేదో?

14) **"పద్మకేసర సంస్పృష్టో - వృక్షాంతర వినిస్సృతః**
**నిశ్వాస ఇవ సీతాయాః । వాయుర్వాతి మనోహరః ।"**

పంపావనంలోని గాలి మెల్లగా వస్తున్నది. ఆ గాలి తామరపూల పుప్పొడిని మోసుక

వస్తూ, ఆ దుమ్మును నా కళ్లలో నింపి, తామరపూలను నా కళ్లకు కనపడకుండా చేస్తుంది. పోనీ ఆ గాలి దుమ్ముకు దూరంగా వెళ్లి పోదామనుకొంటే, ఆ గాలి సీతాదేవి నిట్టూర్పు వలె నిరంతరము నా మనస్సును హరిస్తున్నది. అందుకే బాధను కల్గిస్తున్నా ఆ గాలిని వదలి దూరంగా వెళ్లలేకున్నాను.

పద్మ కేసరముల (రెక్కల) నుండి వస్తున్న గాలి "కేసరి" అయి నా ప్రాణాలను హరిస్తున్నది. కేసరములు కలది కదా కేసరి. పంపావనంలోని మారుతం కూడ పద్మ కేసరముల (స్పర్శ) కలది కనుక, సింహమువలె హింసిస్తున్నది కనుకనే ఆ వాయువుకు వాల్మీకి మునీంద్రుడు చమత్కారంగా "కేసరి" అనే పేరు పెట్టాడు.

(15) సుకుమారులైన రాజకుమారులు చెట్ల వెనుక (నీడ) నుండి నడచినట్లు ఈ వాయువు కూడ చెట్ల వెనుక నుండి వస్తున్నది.

(16) ఒకప్పుడు చాటుకు దాగి మరొకప్పుడు బయటకు వచ్చి, ఒకప్పుడు అంతా తానే అయి, ఈ మారుతము సీతాదేవి వలె నా మనస్సును దోస్తున్నది.

(17) లక్ష్మణా! ఈ పంపావన వాయువు అతి పవిత్రమైనది. దానిని ఇతరులెవ్వరు ఇంతవరకు స్పృశించ లేదు. గని నుండి ఇప్పుడే తీసిన రత్నము వలె ఇది నూతన కాంతుల నీనుతున్నది. పంపావనంలో కలసి మెలసి తిరుగుతున్న నవ దంపతులు ధన్యులు. పరిమళభరితమైన ఈ వాయుసేవనంతో వారు హాయిని అనుభవిస్తారు.

**"పద్మ సౌగంధి కావహం । శివం శోకవినాశనం**
**ధన్యా లక్ష్మణ సేవంతే! పంపోపవన మారుతం"**

సామాన్య వనవిహారులైన దంపతులకు ఈ వాయువు "శోక వినాశనమైంది" అది వారి శ్రమను, విచారాన్ని అపహరిస్తున్నది.

కాని నేను దురదృష్టవంతుడను. ప్రియావిరహితుడను. ఈ వాయువు నాకు "శోక" "వినాశనమైంది". ప్రియావిరహితుడనైన నాకు శోకాన్ని మరింత పెంచి వినాశనాన్ని కల్గిస్తుంది.

(18) పంపానదీ తీరము, విరజానదీ తీరము వలె శుభప్రదమైనది. అయినా "సఏకాకీ నరమేత" అన్నట్లు బద్ధులకు దూరంగా విరజా తీరంలో ఉన్న భగవంతుడు వారి బాధలను తలచుకొని వారి విరహాన్ని సహింపజాలనట్లే సీతా విదూరుడైన శ్రీరామభద్రునికి శుభావహమైన పంపావన నివాసము పరమ దుఃఖావహమైంది.

(19) పంపా తీరంలోని పద్మ పరాగము శ్రీరామునికి బాధావహమైనది. నిజానికి దానిలో ఒక పరమార్థము ఉంది. "పాదారుంతుదమేవ పంకజరజ(శ్శ్రీః" అన్నట్లు పంకజరజము పరమ సుకుమారి అయిన పద్మజాదేవి శ్రీ పాదాలకు ముల్లు వలె కుచ్చుకొంటుందట. "పద్మకు బాధాకరమైన ఆ పంకజరజము పద్మావతార (సీతా) ప్రియుడైన శ్రీరామునికి అప్రియమగుటలో ఆశ్చర్యమేమిటి?" అంటారు వ్యాఖ్యాతలు.

(20) పచ్చని పూలతో నిండిన పంపావనంలోని పచ్చిక బయలు పరమపదంలోని హేమపర్యంకం వలె ఉంది. అయితే ప్రపన్నులందరికి దూరంగా ఉన్న పరమాత్మకు పరమపదంలోని హేమపర్యంతం కూడ హేయమే అయినట్లు, పంపావనంలోని పరమసుందరమైన పచ్చిక బయలు సీతావిరహితుడైన శ్రీరామభద్రునికి అయిష్టమే అయింది.

లక్ష్మణా! ఈ వనవాసాన్ని ముగించుకొని, మనము అయోధ్యకు తిరిగి వెళ్లిన తరువాత "నా ప్రియతనయ సీతాదేవి ఏది?" అని ధర్మాత్ముడు, సత్యరతుడైన జనక చక్రవర్తి అడిగితే, ఆయనకు సమాధానమేమివ్వగలను?"

మా తల్లి కౌసల్యాదేవి : "శ్రీరామా! నా ప్రియమైన కోడలు ఏది?" అని అడిగితే ఆ మనస్విని కి బదులేమి చెప్పగలను? ఆమెకు తన కోడలు అంటే పంచప్రాణాలు. తన ముద్దుల కోడలు తిరిగి రాలేదని తెలిస్తే ఆమె ప్రాణాలతో ఉండగలుగుతుందా?".

అందువలన అయోధ్యలో అందరికి అప్రియుడనై అక్కడికి తిరిగి రావడము కంటే, ఇక్కడే ఈ అడవిలోనే నా శేషజీవితాన్ని ఒంటరిగా గడుపుకొంటాను.

సీతాదేవి యొక్క కంజదళముల వంటి కనులను, కలువల వంటి కురులను మనోహరములైన మాటలను నెమరువేసికొంటూ, ఆ జ్ఞాపకాలతోనే, ఈ అరణ్యంలోనే చివరకు అసువులను వదులుతాను.

నీవు ఇప్పుడే అయోధ్యకు తిరిగి వెళ్లి, భరతునికి, కైకమ్మకు, మన అమ్మలకు, అయోధ్యా వాసులందరికి సీతాపహరణ వార్తను, నా యావత్ జీవ అరణ్య వాస నిశ్చయాన్ని తెలియజేయు" మని శ్రీరామచంద్రస్వామి సోదరుడైన సౌమిత్రిని ఆదేశించాడు.

శ్రీరామునికి సీతా విరహం అతిశయించింది. కనపడిన ప్రతి గుట్టను, చెట్టును, పుట్టను, పిట్టను సీతాదేవి గురించి అడుగసాగాడు.

ఒక వేపచెట్టు కొమ్మపై ఒక కాకి కూచొని ఉంది. "కాకమ్మా! కాకమ్మా! మా సీతమ్మ ఎక్కడికి వెళ్లిందో చెప్పవా?" అని అడిగాడు. ఏమి మాట్లాడకుండానే కాకి ఆ చెట్టుపై నుండి ఎగిరిపోయింది. "ఛీ పాడుకాకి! పాత పగను ఇంకా మరువలేదు". తప్పు తానే చేసింది. ఇంకా కోపంతోనే ఉంది. పాడు కాకి! పాడు కాకి" అని రాముడు చీదరించుకొన్నాడు.

సీతాదేవి వియోగం అప్పుడప్పుడు అతనికి ఉన్మాదాన్ని కలిగించింది.

"రావణాసురుడు ఒక్క సీతాదేవిని అపహరిస్తే ఏమైంది? ప్రతి చెట్టు చాటున, ప్రతి పొద మాటున అనేక సీతలు అగుపిస్తున్నారు. కార్తవీర్యుని వలె సహస్ర బాహువులతో సహస్ర సీతలను సమాలింగనం చేసికొంటాను" అని వాపోతున్నాడు రాముడు.

"ఒక్కొక్కమారు ఇరువై చేతులతో, ఇరువై నేత్రాలతో దశకంఠుడు తన ఎదుట దర్శనమిస్తున్నాడు. ఆయనను తత్క్షణమే సంహరించాలని సంకల్పించుకొన్నాడుస్వామి. కాని తీరా తేరి చూచేవరకు అక్కడ ఉన్నది రావణుడు కాదు. బూరుగు చెట్టు దగ్గర ఉన్న మిణ్గురు పురుగులు. వానిలా భ్రమను కలిగించాయి."

"నోరులేని జంతువులే నాపైన జాలిని చూపుతున్నాయే. రావణాసురుడెంత కఠినుడు" అని పళ్ళు కొరికాడు.

ప్రకృతి రామునికి భ్రమను కలిగింప సాగింది.

**సౌమిత్రే! ననుసేవ్యతాం తరుతలం-చండాంశురుజ్జృంభతే**
**చండాంశుర్నిశి? కాకథా? హిమకరోచంద్రో౽భికం రాజతే**
**శీతాంశుస్సు వినిశ్చితః కథమహో? ధత్తేకురంగం యతః**
**క్వా౽సిప్రేయసి? హాకురంగనయనే. చంద్రాననే. జానకీ॥**

"లక్ష్మణా ప్రచండంగా సూర్యుడు మండిపోతున్నాడు. నేనీ ఎండను తట్టుకోలేక పోతున్నాను ఏదైనా చెట్టు నీడకు చేరుదాము" అని వాపోయాడు రాముడు. ఆశ్చర్యంతో అనుజుడు "అన్నా! ఇది రాత్రి కదా! ఇప్పుడు చంద్రుడు తన చల్లని వెన్నెలను వెదజల్లుతున్నాడు కదా!" అని అన్నాడు.

"చంద్రుడా!" ఆశ్చర్యచకితుడయ్యాడు రామచంద్రుడు.

"అదెలాగా?" అని అడిగాడు అనుజుని.

"అన్నా! చంద్రుని లోని లేడి నీకు కనపడడం లేదా?" అన్నాడు సౌమిత్రి.

శ్రీరామచంద్రునికి "చంద్రుడు" "లేడి" అనే మాటలు వినపడగానే సీతాదేవి ముఖం, కన్నులు గుర్తుకొచ్చాయి. "ఓ లేడి కన్నులు గలదానా! ఓ చంద్రవదనా! ఓ సీతా!" అని అరుస్తూ మూర్ఛిల్లాడు.

అదే విధంగా రాముడు మరొకసారి సోదరుడైన లక్ష్మణునే గుర్తించలేదు. స్వయంగా తననే గుర్తించుకోలేదు.

**"కస్త్వం బ్రూహి మమాంతికే సహచరః? దాసోऽ నుజో లక్ష్మణః**
**కోऽ హంబ్రూహి? స ఆర్య ఏవ భగవాన్ శ్రీరామచంద్ర ప్రభుః**
**కిం కుర్వే విజనే వనే? తత ఇతో దేవీ సముద్వీక్ష్యతే**
**కాదేవీ జనకాధిరాజతనయా। హాహాప్రియేజానకీ॥**

"ఎవ్వరివయ్యా నా వెంట తిరుగుతున్నావు? శ్రీరాముని ప్రశ్న.

"అయ్యా! నేను నీ దాసుడను, తమ్ముడను" లక్ష్మణుని సమాధానము.

"ఓహో నీవు నా తమ్ముడివా? మరి నేనెవ్వరు? రాముని ప్రశ్న.

"మీరు భగవత్స్వరూపులైన శ్రీరామచంద్ర ప్రభువులు" లక్ష్మణుని ఉత్తరము.

"అలాగా! అయితే ఈ నిర్జనవనంలో ఏమి చేస్తున్నాము? శ్రీరాముని ప్రశ్న.

"అక్కడ ఇక్కడ దేవిని వెదుకుతున్నాము" లక్ష్మణుని సమాధానము.

"దేవా! ఎవ్వరామే" రాముని ప్రశ్న.

"జనకాధి రాజతనయ అయిన మా వదిన" లక్ష్మణోక్తి.

"అయ్యో అయ్యో! నా ప్రాణప్రియా! జానకీ" అని కలవరిస్తూ రాముని మూర్ఛ.

అయితే మూర్ఛిల్లడం, లేకపోతే సీతాదేవిని కలువరించడం రాముని దినచర్య అయింది.

× × ×

"భగవంతుడు, జీవులు వేరువేరుగా ఉన్నప్పుడు ఎవ్వరి వేదన ఎక్కువగా ఉంటుంది?" అనే ప్రశ్న కలుగుతుంది. దానికి సమాధానము భగవంతుని ఆవేదనే అత్యధికమట.

జీవుని వేదన "గోష్పదము" అంటే ఆవుకాలు అంత చిన్నది. పరమాత్మ వేదన పారము లేని సముద్రమంత పెద్దది. అందువలననే ఈ 'కిష్కింధా' కాండ ఆద్యంతము సీతా వియోగముతో రాముడు పడిన అత్యధిక బాధకు అద్దము పడుతుంది.

సీతాదేవి యొక్క కమనీయములైన కనులు, నల్లని కురులు, వాజ్మాధుర్యము భగవద్భక్తుల జ్ఞానాన్ని, అనుష్ఠానాన్ని, సంకీర్తనా మాధుర్యాన్ని స్మరింపజేస్తాయి. అవే అఖిలాత్ముడైన రాముని ఆవేదనకు ముఖ్య కారణాలు.

సీతా వియోగ విషాద విహ్వలుడైన శ్రీరామచంద్రుని సౌమిత్రి ఓదార్చి ఉత్సాహకరంగా మాటలు మాట్లాడసాగాడు --

"అన్నా! నీవు పురుషోత్తముడివి. బుద్ధిమంతులలో వరిష్ఠుడవు. నీకు మరొకరు హితము చెప్పగలిగే వారు లేరు.

జీవితమనే వత్తిని వెలిగించడానికి ప్రేమ అనే చమురు (స్నేహము) అవసరమే. కాని ఆ స్నేహమే అత్యధికమైతే, ఆ వత్తిని కూడ ముంచి దీపాన్ని మలిపి వేస్తుంది. అలాగే రూప గుణాలలో అత్యధికురాలు, నీ ప్రాణాధిక ప్రియ అయిన వదిన పట్ల నీ ప్రేమ మంచిదే. కాని ఆ ప్రేమే నీకు ప్రాణాంతకము కాకూడదు.

వదినను అపహరించిన అసురుని అన్ని విధాల అన్వేషిద్దాము. మనము ప్రయత్నిస్తే పాతాళంలో దాగినా, ఆకాశంలో అంతర్హితుడుగా ఉన్నా, వాడిని పట్టుకోగల్గుతాము. వాడిని వధించి, వదినను తప్పక తిరిగి తెచ్చుకోగల్గుతాము.

"అర్థోహి నష్టకార్యార్థైః । నాయత్నేనాధిగమ్యతే"

ప్రయత్నము చేయకుండా, పోయిన దానిని తిరిగి పొందలేము కదా! అన్వేషణకు ధైర్యోత్సాహాలు అవసరము. ఉత్సాహమును మించిన బలము లేదు. ఉత్సాహముతో వెతికితే, వదిన తిరిగి తప్పక లభిస్తుంది.

సర్వేశ్వరుడు కూడా ఆశ్రిత విరహము వలన అత్యంత ఆవేదనకు గురి అయి అశక్తుడవుతాడు. భాగవతోత్తముల ఓదార్పు మాటలే ఆయనకు ఆశ్వాసాన్ని ధైర్యోత్సాహాలను కలిగిస్తాయి.

లక్ష్మణుని ధైర్యవచనాలు శ్రీరాముని ఉత్తేజితుని చేశాయి. కబంధుని వాక్యములను అనుసరించి వారు ఋష్యమూకం వైపు వడివడిగా అడుగులు వేశారు. తమ వైపే వేగంగా వస్తున్న వారిని దూరం నుండి చూచిన సుగ్రీవుడు భయగ్రస్తుడయ్యాడు.

-- ఇతిశం --

# హనుమ - "ఆచార్య" లక్షణాలు

సింహోరస్కులు, మహాధానుష్కులు, తాపస వేషధారులైన రామలక్ష్మణులు వడివడిగా అడుగులేస్తూ, ఋష్యమూకమువైపు రావడాన్ని గమనించిన సుగ్రీవుడు భయకంపితుడై తన మంత్రులను, సేనాపతులను, తన దగ్గరకు రావలసినదిగా ఆజ్ఞాపించాడు.

నిజానికి రామలక్ష్మణుల అద్భుత రూపాలు, ఆ వానరులందరిని కూడ భయగ్రస్తులను కావించి, చెట్టుకొకరిని, పుట్టకొకరిని పరుగెత్తింప చేశాయి. అయినా వానరాధిపతి ఆజ్ఞను అనుసరించి, వారందరు సుగ్రీవుని చుట్టూ చేరారు.

ఆ విధంగా సమీకృతులయిన సచివుల సమక్షములో సుగ్రీవ మహా రాజు రామలక్ష్మణుల గురించి తన సందేహాలను ఇలా వ్యక్తీకరించాడు:-

"సచివులారా! ఈ పర్వత సమీపంలో సంచరిస్తుండే వీరులను మీరు గమనించారా? వారెవ్వరో గుర్తించడానికి వీలు లేకుండా ఉంది. వీరిద్దరు అశ్వినీ దేవతలా! వసంత మన్మథులా! అని అనిపిస్తున్నది. విల్లమ్ములను ధరించినందువలన వీరు వీరులైన రాజకుమారులనే భావన కలుగుతుంది. కాని వారు ధరించిన నార వస్త్రాలను బట్టి, వారి జడలను బట్టి వారు తపస్వులనే తలపు కలుగుతుంది.

విల్లమ్ములను ధరించిన వీరులు తపస్వులెలా అవుతారు? నారవల్కలాలను, జడలను ధరించిన వారు వీరులెలా అవుతారు? అంతేకాదు వారి దేహాలను చూస్తే దృఢంగా భయంకరంగా ఉన్నాయి.

వారి రాక నాకు అనుమానాస్పదంగా ఉంది. వాలి స్వయంగా ఈ మతంగ పర్వతము పైకి రాలేడు. కనుక తన చారులుగా వీరిని నన్ను చంపడానికి వినియోగించి, పంపి ఉండవచ్చు. వీరిని చూడడంతో నా స్వాంతము భయాక్రాంతమవుతున్నది".

అనుచరులతో ఆ విధంగా వాపోతున్న సుగ్రీవుని అనుమానాలను నివారించడానికి హనుమ ఇలా పూనుకొన్నాడు.

"మహారాజా! మీ మనస్సు నిరాధారమైన భయంతో నిండి ఉంది. ఈ పర్వతమునకు "మలయమని" "మతంగ (పర్వత)"మని పేర్లు. ఇక్కడికి నీవన్నట్లు వాలి శాపభయం వలన స్వయంగా రాలేడు. అంతే కాదు **"ఋషుల మూకలకు** నిలయమైన ఈ **ఋష్యమూకము"** శుభాస్పదమైనదే కాని అశుభావహమైనది కాదు. అందువలన అశుభాలోచనాపరులైన వాలి అనుచరులెవ్వరు ఈ పర్వత ప్రాంతమును సమీపించ

జాలరు" అందువలన ఈ ఆగంతకులు వాలి అనుచరులయ్యే అవకాశమే లేదు".

హనుమ సుస్పష్ట వచనాలు సుగ్రీవుని అంతరంగంలో అభయాన్ని నింపాయి. అందువలన ఆయన ధైర్యాన్ని కూడగట్టుకొని ఆగంతకుల గురించి అన్ని విషయాలను యథాతథంగా తెలిసికొని రమ్మని హనుమను ఆదేశించాడు. తన స్వరూప స్వభావాలను బయటపెట్టకుండా వారి స్వరూప స్వభావాలను సంపూర్ణంగా గ్రహించుమని ఆజ్ఞాపించి పంపాడు.

అవిద్యావశులము, జీవులము అయిన మనము తెలిసో, తెలియకో అనేక అకార్యాలను ఆచరిస్తుంటాము. ఆ అకృత్యాలు అనవరతము మన మనస్సులను భయాందోళనలతో నింపుతాయి. ఎవ్వరిని చూచినా మన స్వాంతము భయాక్రాంతమవుతుంది. అటువంటి సమయాలలో మనకు అన్ని రకాల రక్షణ అవసరమనిపిస్తుంది.

అందరికి అన్ని సమయాలలో అన్ని విధాల సంరక్షణను కల్గించేది సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు, సర్వశక్తి అయిన సర్వ స్వామే కదా! ఆయన కరుణామయుడు. ఆశ్రితుల దుఃఖాన్నుండి రక్షణను కల్పించడానికి నిరంతరం నిరీక్షిస్తుంటాడు.

అయితే అంతటి దయామయుడైన, రక్షాదీక్షితుడైన ఆశ్రియఃపతి కూడ సాధారణంగా జీవులను స్వయంగా ఆదుకో(జాల)డు. సహజంగానే దాసభూతులైన జీవులు కూడ స్వయంగా పరమాత్మను ఆశ్రయింప(జాల)రు. అందరికి అన్ని వేళలలో అన్ని విధాల భగవద్రక్షణను కల్పించే కరుణామయుడు, ఘటనా సామర్థ్యము కలవాడు ఆచార్యుడే.

హనుమ ఇపుడు అటువంటి ఆచార్య పాత్రను నిర్వహింపబోతున్నాడు. భయగ్రస్తుడైన సుగ్రీవుని భయాన్ని తొలగించి, ఆయనకు శ్రీరాముని ఆశ్రయాన్ని, అభయాన్ని, రక్షణను కల్పింపబోతున్నాడు.

× × × ×

అయితే ఆచార్య లక్షణాలంటే ఏవో ముందు గమనించి, ఆ లక్షణాలు హనుమలో ఎలా ఉన్నాయో అనంతరము పరిశీలిద్దాము!

## ఆచార్య లక్షణాలు

**"ఆచార్యో వేదసంపన్నః విష్ణుభక్తో, విమత్సరః**
**మంత్రజ్ఞో, మంత్రభక్తశ్చ । సదామంత్రార్థదశ్శుచిః**
**గురుభక్తి సమాయుక్తో । పురాణజ్ఞో, విశేషతః**
**ఏవం లక్షణ సంయుక్తో । గురురిత్యభిధీయతే"**

1. వేదసంపన్నః :- "అప్రాప్తార్థ ప్రాపకం హిశాస్త్రమ్" ప్రత్యక్షానుమానాది ఏ ప్రమాణం ద్వారా కూడా పరిగ్రహింపబడక, "శాస్త్రయోనిత్వాత్" "వేదైశ్చ సర్వైరహమేవ, వేద్యః" ఇత్యాది "బ్రహ్మసూత్ర" భగవద్గీతా శాస్త్ర ప్రమాణాల ద్వారా నిర్ణయింపబడినట్లు పరబ్రహ్మను పరిపూర్ణంగా ప్రతిపాదించగలిగిన ఋగ్యజుస్సామాధర్వణాలుగా విభజింప బడిన, విస్తృతమైన వేద విజ్ఞాన సంపదను, తదర్థ సంపదను సమగ్రంగా కలిగి ఉండడము ఆచార్యుని మొదటి అర్హత.

(2) విష్ణుభక్తో :- వేదము యొక్క కేవల శబ్దజ్ఞానాన్ని కలిగి ఉండడమే కాక వేదార్థ స్వరూపుడైన విష్ణువు (శ్రియఃపతి) పట్ల సంపూర్ణ భక్తి ప్రపత్తులను కల్గి ఉండడం.

(3) విమత్సరః :- అఘటిత ఘటనా సామర్థ్యము కల పరబ్రహ్మయొక్క అపరిమిత మహిమ పట్ల ఆయన లీలల పట్ల అసూయా మాత్సర్యాలు లేకుండడము.

(4) మంత్రజ్ఞో :- ఋగ్యజు, స్సామములనే మూడు వేద వ్యాహృతులే 'భూర్భువస్సువః' అనే పదాలుగా మారి, వాటి సంగ్రహాక్షర స్వరూపములే "అ, ఉ, మ" గా మారి "ఓం" కారమును సూచిస్తాయని, ఆ ప్రణవ వివరణమే "అష్టాక్షరీ" రూపమైన శ్రీమన్నారాయణ మంత్రమని గుర్తించడము.

(5) మంత్రభక్తశ్చ:- సకల వేదేతిహాస, దివ్య ప్రబంధాదిసారమై "అష్టాక్షర" స్వరూపముగా అతి సంగ్రహంగా ఉన్నా ఈ "అష్టాక్షరీ" మహామంత్రము "సర్వమష్టాక్షరాంతస్థం" అన్నట్లు స్వభావంలో సకలాభీష్టప్రదమని సంపూర్ణ విశ్వాసంతో ఉండడం, ఆ మంత్రము పట్ల భక్తి, ప్రపత్తులను కల్గి ఉండడము.

(6) సదామంత్రార్థదః:- స్వాశ్రితులు ఎప్పుడు తన సంరక్షణను కోరుతారో అని సదా ప్రతీక్షతో ఉండి, వారు అపేక్షించగానే సర్వవిధ సంరక్షణను కల్పించే సర్వస్వామి వలె, సకలాభీష్టప్రదమైన భగవంతుని మంత్రాన్ని ఎవ్వరెప్పుడు అపేక్షిస్తారో అని నిరంతరము నిరీక్షిస్తూ వారు కోరిన వెంటనే ప్రపన్నులకు ఆ మంత్రాన్ని ప్రదానం చేసే స్వభావం కల్గి ఉండడము. "ఆశైయుడైయవర్కెల్లాంపేశుమిన్" ఆశ కలవారందరికి ఉపదేశించండి అని భగవద్రామానుజుల నిర్వాహముకదా!

(7) శుచిః- త్రికాలాలలో శరీర, వాక్, మనస్సులనే త్రికరణాలతో పవిత్రుడు గా ఉండడము. భగవన్మంత్రమును సాధనాంతర, ఫలాంతరముల కొరకు వాడుకోకుండా ఉండడము, అంతేకాదు మంత్రమును ఉపదేశించే సమయంలో తనను గురువుగా కాకుండా తన గురువు యొక్క పరికరంగా భావించుకోవడము, శిష్యులను తన గురు శిష్యులుగా తన సహాధ్యాయులుగా భావించడము. మంత్రోపదేశమును శిష్యుల దుర్గతిని

చూడలేక చేయడమే తప్ప అర్థ, శుశ్రూషాది ప్రాపంచిక ఫలాపేక్షతో చేయకుండడము ఇవన్ని ప్రపన్నునికి పవిత్రతను ఆపాదిస్తాయి.

(8) గురుభక్తి సమాయుక్తో:- "గురుషునరమతిః" అన్నట్లు స్వాచార్యుని ఇతర పురుషులతో సమానంగా భావించక "యథాదేవే తథా గురౌ" అన్నట్లు మంత్రాధి దైవమైన పరమాత్మతో సమానంగా, అంతకంటె మిన్నగా భావించడం గురుభక్తి.

"ఆచార్యాదిహదేవతాం, సమధికాం అన్యాం నమన్యామహే"

(9) పురాణజ్ఞో విశేషతః – వేదార్థ విశదీకరణములైన పురాణాలు భగవద్వైభవాన్ని, మంత్రమహిమను, ఆచార్య ప్రాభవాన్ని వివరిస్తాయి. అందువలన అటువంటి పురాణముల గురించి విశేషముగా తెలిసి ఉండాలి.

ఇదుగో ఇవన్ని ఆచార్యుని లక్షణాలు. ఇటువంటి సర్వ సల్లక్షణ సంపన్నుడే గురువని వ్యవహరింపబడుతాడు.

అయితే సుగ్రీవునితో శ్రీరామచంద్ర స్వామిని చేర్చడం (ఘటకత్వం) లో ఈ ఆచార్య లక్షణాలు హనుమలో ఎలా ప్రకాశిస్తాయో గమనిద్దాము!

సుగ్రీవ దూతగా శ్రీరామ లక్ష్మణులను సమీపించిన హనుమ కపిరూపాన్ని పరిత్యజించి, సన్యాసి స్వరూపాన్ని స్వీకరించాడు. మన సమాజంలో సన్యాసికి సమున్నత స్థానము ఉంది. ఆశ్రమాలన్నిటిలో సన్యాసమే సన్మానింప దగినది కదా! ఎవ్వరు అనుమానించడానికి వీలులేనిది, అందరి ఆదరానికి పాత్రమై భిక్షువులు ధరించే సన్యాసి స్వరూపాన్ని హనుమ స్వీకరించాడు.

సన్యాసి సామాన్యులకు నమస్కరింపకూడదు కాని సంసారులైనప్పటికి తేజశ్శక్తి సమన్వితులైతే వారికి నమస్కరించడం దోషము కాదు.

**"రూపమేవా ఽ స్య మహిమానం వ్యాచష్టే" (యజు 2-3-11)**

హనుమ రామలక్ష్మణులను చూడగానే వారు మహాపురుషులని, సుగ్రీవుని శత్రువును సంహరింపగల సమర్థులని గ్రహించి వారికి నమస్కరించాడు. అత్యంత వినయవిధేయతలతో సుమధురంగా సుస్పష్టంగా సంభాషణ ప్రారంభించాడు.

**"అహం గృహ్ణామి మనసా మనాంసి**
**మమచిత్తమను చిత్తేభిః రాయిత**

**మమవశేషు హృదయాని వః కృణోమి**
**మమయాత మనువర్త్మానః అయిత" (అథ. వే. 3-2-8)**

మీ మనస్సులను నా మనస్సుతో స్వాయత్తం చేసికొంటున్నాను. మీరు కూడ నా చిత్తాన్ని అనుసరించిన చిత్తాలతో వత్తురు గాక అని వారిద్దరి మనస్సులను తన వైపు ఆకర్షించి--

"మీరిద్దరు రాజర్షులా? దేవతలా? తాపసవృత్తిని ధరించారు. ఈ ప్రాంతానికి ఎందుకు వచ్చారు?

వనంలో సంచరించే ప్రాణులకు భయాన్ని కల్గిస్తున్నారు. అయినా పావన సలిలమయమైన పంపావనాన్ని మీ ధైర్యంతో మీ సువర్ణశోభతో ప్రకాశింపజేస్తున్నారు.

మీరు రాజ్యార్హులు. "అమర సమానులు", "తామర రేకుల వంటి కన్నులు" గలవారు జడలను ధరించి ఇక్కడికి ఎలా వచ్చారు?

మీరిద్దరు పరస్పర సమానులు. "దేవలోకమునుండి వచ్చినట్లు"న్నారు. "చంద్ర సూర్యుల వలె స్వేచ్ఛగా సంచరిస్తున్నారు".

మీరు విశాల వక్షములను కల్గి, "మనుష్య రూపములను ధరించిన దేవతల" వలె ఉన్నారు.

మీరు ఈ భూమండలాన్నంతటిని "రక్షింపగల" సమర్థులని భావిస్తున్నాను.

**"ఆయతాశ్చ సువృత్తాశ్చ। బాహవః పరిఘోపమాః**
**సర్వ భూషణ భూషార్హాః। కిమర్థం నవిభూషితాః"**

మీ బాహువులు విశాలములై, పరిఘాయుధములవలె గుండ్రములై మనోహరములుగా ఉన్నాయి. అన్ని రకాల భూషణాలతో అలంకరింపదగినవిగా ఉన్నాయి? ఎందుకు అవి భూషింపబడలేదు? "ఇక్కడ బాహవః" అనే బహువచనము ఉంది. ఉద్దేశ్యము ఇద్దరి భుజాలు నాల్గింటికి కావచ్చు. రాముని చతుర్బాహువుల గురించి కావచ్చు.

జితేంద్రియుడైన హనుమ కూడ రామబాహువుల సౌందర్యానికి ఆశ్చర్యం చెందాడు.

ఇంద్రధనుస్సు వలె మీ ధనుస్సులు వజ్రములవలె కఠినములై బంగారుచే అలంకరింప బడ్డాయి.

నేనింతగా మీతో మాట్లాడుతున్నాను కదా! మీరెందుకు ప్రత్యుత్తర మీయడం లేదు?" అని ప్రశ్నించి తన వృత్తాంతాన్ని తెల్పడం ప్రారంభించాడు హనుమ.

"సుగ్రీవుడనే ధర్మాత్ముడైన వానరరాజు తన అన్న అయిన వాలి చేత హింసింపబడి, నిలువ నీడలేక, దుఃఖంతో అంతట తిరుగుతున్నాడు. నేను ఆయన పంపగా వచ్చాను. నా పేరు హనుమ. ధర్మాత్ముడైన సుగ్రీవుడు మీతో స్నేహాన్ని అభిలషిస్తున్నాడు. నేను ఆయన సచివుడను, వాయుసుతుడను. సుగ్రీవుని కార్యసిద్ధి కొరకు నేను మారువేషంతో వచ్చాను. ఋష్యమూక పర్వతము నుండి కామ వేగంతో మీ సన్నిధి సమీపించాను" అని వాక్యజ్ఞులైన రామలక్ష్మణులతో పలికి ఊరుకున్నాడు.

మొట్టమొదట భిక్షువువలె మారువేషాన్ని ధరించి తన స్వరూప స్వభావాలను దాచుకొని వచ్చిన హనుమ, రామలక్ష్మణ సందర్శనముతో తన కాపట్యము తొలిగించుకొని యథాతథంగా తమ విషయాలను వారి ముందు బయటపెట్టాడు. భగవత్సందర్శనమే అంత విలక్షణమైనది. అది లభించిన తరువాత ఏ మాయలు ఏ మర్మాలు నిలువజాలవు. "శ్రీరాముని కన్నులలో పరమాత్మ తత్వమును లక్ష్మణుని కన్నులలో యోగిరాజ లక్షణాలను" దర్శింపగలిగిన మహనీయుడు హనుమ.

హనుమ యొక్క వాక్య కౌశల్యాన్ని రామచంద్రస్వామి అమితంగా ప్రశంసించాడు.

"లక్ష్మణా! ఎవ్వరిని మనము కలసికోవాలని ఇంతకాలం నుండి కోరుకొంటున్నామో అటువంటి మహిమాత్ముడైన సుగ్రీవుని సచివుడు ఈ హనుమ. ఈయన వాక్యజ్ఞుడు, స్నేహయుక్తుడు. స్వరసంపన్నమైన ఋగ్వేదంలో చక్కగా శిక్షణ పొందనివాడు, అనేక అనువాకాలుగల యజుర్వేదాన్ని ధారణ చేయలేనివాడు, గాన ప్రధానమైన సామవేదంలో విద్వాంసుడు కానివాడు ఈ విధంగా (హనుమవలె) మాట్లాడజాలడు.

ఈయన వ్యాకరణశాస్త్రాన్ని మొత్తంగా అధికరించినట్లున్నాడు. ఇంత మాట్లాడినా, ఒక్క అపశబ్దం కూడ లేదు చూడు! ఈయన సంభాషించినంత సేపు కనుల చూపులలో కాని, నొసలుపై కాని. బొమ్మల కదలికలలో కాని, ఇతర అవయవాలలో కాని ఏ వికారము కనబడడం లేదు.

ఈయన మాటలను ఎక్కువగా సాగదీయడం లేదు. అట్లని మధ్యలో మాటలుక రుస్వైనట్లు సంభాషణ అస్పష్టంగా లేదు. మాటలలో తొందరపాటు లేదు. అట్లని మాటల మధ్య అనవసరమైన ఆలస్యము లేదు.

**"యత్క్రౌంచమన్వాహ ఆసురం, తద్యత్ మంద్రం మానుషం**
**తద్యంతరా తత్సదేవం - అంతరానూచ్యగ్ం సదేవత్వాయ" (యజు 2-5-11)**

అత్యధిక స్వరంతో మాట్లాడడం రాక్షసం. మంద్రస్వరంలో మాట్లాడడం మానుషము.

ఇతరులకు వినరానంత మెల్లగా పలుకడం దైవతము" (ఉపాంశువు) అని సంభాషణ మూడు రకాలు.

మనకు పూర్తిగా వినబడనంత మెల్లగా మాట్లాడలేదు. అలాగని అనవసరంగా గొంతుచించు కోవడం లేదు. మధ్యమ స్వరంలో, మృదువుగా, మధురంగా, శుభప్రదంగా, మనోహరంగా ఉంది హనుమ సంభాషణము. హనుమ యొక్క చతుర సంభాషణము వింటే చంపడానికి కత్తి ఎత్తిన ఎంతటి శత్రువు అయినా కత్తిని దించక మానడు.

ఇటువంటి సచివుడున్న ఏ ప్రభువుకైనా అన్ని కార్యాలు సహజంగానే సిద్ధిస్తాయి".

శ్రీరామచంద్రస్వామి అంతటి మహాపురుషుని బహు ప్రశంసకు పాత్రమైన హనుమ సంభాషణలోని అసామాన్య ఆచార్య లక్షణాలను అవలోకిద్దామా?

ఆచార్యుని లక్షణాలలో మొదటిది వేదసంపన్నత. అది ప్రధానంగా ఋగ్యజుస్సామములు అని మూడు భాగాలతో కూడుకొన్నది. అందుకే వేదానికి "త్రయి" అని పేరు.

రామచంద్రుడు హనుమలో ఆచార్యుని కుండవలసిన మూడు విధాలైన వేద సంపన్నతను చక్కగా వివరించాడు. (1) ఋగ్వేద (సుశిక్షణ) వినీతత్వము (2) యజుర్వేద ధారణము (3) సామవేదవిద్వత్వము.

(1) ఋగ్వేద వినీతత్వము:- ఋగ్వేదములో వినీతుడు అనగా ఆచార్యుని సన్నిధానములో ఉండి ఉచ్చారణానుచ్చారణారూపంగా వేదాధ్యయనంలో ఉదాత్త, అనుదాత్త, స్వరిత రూపములైన స్వరములను చక్కగా గ్రహించువాడు లేదా చక్కగా శిక్షింపబడినవాడు అని అర్థము.

(అ) ఋగ్వేదంలో ప్రతి వర్ణానికి ఒక స్వరము ఉంటుంది. అందువలన ఆ వర్ణాన్ని అధ్యయనం చేసేప్పుడు దాని స్వరాన్ని గ్రహించే ఉచ్చరించాలి. కనుక స్వరానేకత్వము కలిగిన ఋగ్వేదము యొక్క అధ్యయనములో అధ్యేతకు చక్కటి స్వరశిక్షణ కలుగాలి. స్వరము మార్చి పలికితే వేరే అర్థం కలుగుతుంది. "ఇంద్రశత్రు" అనే మంత్రంలోని "ఇంద్ర" అనే పదాన్ని సంబోధన స్వరంతో పలికినందు వలన ఇంద్రునికి విజయము కలిగింది.

హనుమ సంభాషణలో ఏ అక్షరాన్ని ఏ స్వరంలో పలుకాలో అలా పలికాడు. హ్రస్వదీర్ఘాలను చక్కగా ఉచ్చరించాడు. అంతేకాదు సరళ పారుష్యాలను (ఒత్తులను ఒత్తులు కాని వాటిని) శ్రద్ధగా పాటించాడు. అందువలన ఆయనకు ఋగ్వేదంలోని స్వర జ్ఞానము చక్కగా పట్టుబడిందని అర్థమైంది.

(అ) ఋగ్వేదంలోని విషయజ్ఞానము చక్కగా కలవాడు హనుమ. ఋగ్వేదంలో "ఐతరేయమని" ఒక ఉపనిషత్తు ఉంది. అందులో "బ్రహ్మావా ఇదమేకమేవాగ్ర ఆసీత్" అనే వాక్యము ఉంది. "ఈ సృష్టికి పూర్వము (ప్రళయకాలములో) ఒక్క బ్రహ్మ మాత్రమే ఉన్నాడు" అని ఐతరేయ వాక్యార్థము. ఆ బ్రహ్మే సృష్టి చేశాడు. ఆయనే ఈ జగత్తు యొక్క స్థితికి కారకుడు. ఆయనే ప్రళయాన్ని కల్గించేవాడు. సృష్టి స్థితి లయములు జగత్తుకు రూపాంతరములు. అవి పరమాత్మ యొక్క రక్షణ కార్యాలు. "జగజ్జన్మాది కారణం" అనే వాక్యం పరమాత్మ స్వరూపాన్ని తెలియజేస్తుంది.

హనుమ సంపూర్ణ ఋగ్వేద విజ్ఞాని. అందువలననే ఆయన భగవంతుని రక్షణ ధర్మాన్ని చక్కగా గుర్తించి

**"ఉభౌ, యోగ్యావహం మన్యే। "రక్షితుం" పృథివీమిమాం**
**ససాగర వనాం కృత్స్నాం। వింధ్య మేరు సుభూషితాం"**

అని పలికాడు.

"సాగర పర్యంతము వనగిరులతో భూషింపఁడే ఈ జగత్తు నంతటిని రక్షించగలవారు మీరే అనుకొంటాను" అన్నాడు.

(2) యజుర్వేద ధారణము: యజుర్వేదంలో అనేక అనువాకాలు ఉన్నాయి. ఒక అనువాకంలోని వాక్యాల వలెనే మరొక అనువాక వాక్యాలు ఉంటాయి. యజుర్వేదాధ్యయనంలో ధారణము అనగా జ్ఞాపకశక్తి చాల అవసరము. ధారణ లేకుంటే వాక్యాల సాదృశ్యము వలన ఒక అనువాకమును మొదలుపెట్టి మరొక అనువాకంలోకి చొరబడే ప్రమాదము ఉంది. అంటే అవధానము లేనందువలన "అనువాక సాంకర్య" ప్రమాదము కలుగుతుంది.

అంతేకాదు యజుర్వేదంలో రహస్యమైన "పరమాత్మయొక్క అవతార ప్రకారము" "అజాయమానో బహుధా విజాయతే" అని ప్రసిద్ధంగా వివరింపబడింది. అవతార రహస్య జ్ఞానం కలిగినందు వలననే హనుమ రామలక్ష్మణులను "దేవలోకాదిహాగతౌ" "మానుషౌ దేవరూపిణౌ" దేవలోకము నుండి అవతరించినట్లున్నారు, మానుష్య రూపమును దాల్చిన దేవతల వలె ఉన్నారు" అని వర్ణించాడు.

(3) సామవేద వైదుష్యము:- సామవేదము గాన ప్రధానమైనది. గాన వైదుష్యానికి ఊహాశక్తి అవసరము. ఒక గానము ఏ విధంగా పాడితే మరింత మధురంగా ఉంటుందో ఊహించే శక్తి గాయకునికి ముఖ్యము.

అంతేకాదు ఆయనకు వివిధ గాన రహస్యాలు చక్కగా తెలియాలి. హనుమ మాట్లాడేప్పుడు అవసరమైన స్వరము మార్పులతో అత్యంత మధురంగా మాట్లాడాడు. అందువలన ఆయనకు సామవేద వైదుష్యము కలదని రాముడు ప్రశంసించాడు.

సామవేదములోని "ఛాందోగ్యోపనిషత్తు" భగవద్విగ్రహ సౌందర్యాన్ని అంతరాదిత్య విద్యలో వివరిస్తుంది. భగవంతుని యొక్క కేశములు, మీసములు గోళ్లు మొదలుకొని ఆయన స్వరూపమంతా సువర్ణమయమే అని వివరిస్తుంది.

**"అథయ ఏషోంత రాదిత్యే హిరణ్మయః పురుషః**
**ఆప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః"**

భగవద్విగ్రహ వైలక్షణ్యమును గుర్తించినందువలననే హనుమ "సువర్ణాభౌ" అని రామలక్ష్మణులను సువర్ణకాంతికలవారు అని వర్ణించాడు.

అందులోనే "కప్యాసంపుండరీకమేవమక్షిణీ" భగవంతుని రెండు తిరునేత్రాలు అప్పుడే వికసిస్తున్న తామరల వలె ఉన్నాయని వర్ణింపబడింది. అది తెలిసినవాడు కనుకనే "పద్మపత్రేక్షణౌ" అని పద్మపత్రముల వంటి కన్నులు గలవారని రామలక్ష్మణులను ప్రశంసించాడు.

ఇక వేదానికి ఆరు అంగాలు ఉన్నాయి. (1) శిక్ష (2) వ్యాకరణము (3) నిరుక్తము (4) ఛందస్సు (5) జ్యోతిషము (6) కల్పము.

ఇందులో ఆచార్యునికి ప్రధానంగా కావలసినవి శిక్ష, వ్యాకరణము, కల్పము.

(1) శిక్ష:- ఇది శబ్దోచ్చారణకు సంబంధించినది. హ్రస్వము, దీర్ఘము, ఒత్తులు స్వరములు మొదలైనవాటిని జాగ్రత్తగా పాటించడము చాల అవసరము. దాని వలననే శబ్ద సౌందర్యము చెడక, శ్రోతల హృదయంగమంగా వారి వినువీధులలో మనస్సులలో వక్తల యొక్క మాటలు ప్రవేశిస్తాయి. ఇవి ఋగ్వేదంలో ఎక్కువ. అంతేకాదు అనవసరంగా తలను, శరీరాన్ని, కళ్లను, కనుబొమ్మలను హనుమ కదల్చకుండా మాట్లాడాడు. చక్కగా హనుమ తన యొక్క శబ్దోచ్చారణా సౌష్టవంతో శ్రీరాముని మనస్సును ఆకర్షించి ఆయన ద్వారా "ఋగ్వేద (వినీతుడు) సుశిక్షితుడు" అని యోగ్యతా పత్రాన్ని పొందాడు.

(2) వ్యాకరణము: శబ్దాలు సుశబ్దాలు (సాధువులు), అపశబ్దాలు (అసాధువులు) అని రెండు రకాలు. "వ్యాకరోతీతి వ్యాకరణమ్" అన్నట్లు శబ్దాలను సంస్కరించి, అపశబ్దాలను తొలగించి వాటిని సాధు శబ్దాలుగా మార్చేది వ్యాకరణ శాస్త్రము. వ్యాకరణ శాస్త్రజ్ఞుడైన హనుమ తన మాటలలో అపశబ్దములను ఎంత మాత్రము ప్రయోగించ లేదు. అందువలననే హనుమ సంభాషణను సాంతము విన్న శ్రీరాముడు

**"నూనం వ్యాకరణం కృత్స్నం అనేన బహుధాశ్రుతం**
**బహువ్యాహరతా2నేన నకించిదప శబ్దితం"**

"హనుమ సమస్త వ్యాకరణాన్ని చక్కగా తెలిసికొన్నవాడు. ఇంతసేపు మాట్లాడినా ఒక్క అపశబ్దము కూడ దొర్లలేదే!" అని ఆశ్చర్యము చెందాడు రామభద్రుడు.

వేద, వేదాంగ విజ్ఞానమే "వేద సంపన్నత" అనబడుతుంది. ఆచార్యుని ప్రథమ లక్ష్మణమైన ఈ వేద సంపన్నత హనుమలో స్పష్టంగా ప్రకాశించినట్లు శ్రీరాముడే ప్రశంసించాడు.

వేదము కూడ "సగురుమేవాభిగచ్ఛేత్ శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్" నిర్వేదమును పొందిన బ్రాహ్మణుడు "శ్రోత్రియుడు" బ్రహ్మనిష్ఠుడైన గురువును ఆశ్రయించాలి" అని ఆదేశించింది. "శ్రోత్రియుడు" అనగా శ్రుతి (వేద) విజ్ఞాన సంపద కలవాడు.

ఇక హనుమలో అన్యములైన ఆచార్య లక్షణాలు కూడ ఎలా సంపూర్ణంగా ఉన్నాయో గమనిద్దాము:

(2) విష్ణుభక్తః (బ్రహ్మనిష్ఠః):- వేద విజ్ఞాన సంపన్నుడైన ఆచార్యుడు వేద ప్రతిపాద్యుడైన "బ్రహ్మ" (విష్ణువు) పట్ల భక్తి నిష్ఠలు కలిగి ఉండాలి.

హనుమ రామలక్ష్మణులను సందర్శించగానే, వారిని భగవత్స్వరూపులుగా గుర్తించి "రాఘవౌ ప్రణిపత్యచ" అన్నట్లు వారికి దండవత్ ప్రణామాలను సమర్పించాడు. వారి పట్ల ఎనలేని భక్తి శ్రద్ధలను కనబరిచాడు.

(3) విమత్సరః:- మాత్సర్యము లేక పోవడం ఆచార్యుని లక్షణాలలో మరొకటి. మాత్సర్యమనగా ఎదుటి వ్యక్తికి కీడు కావాలని కోరుకొనటం. భక్తి, శ్రద్ధలు, ఉన్నచోట అసూయా, మాత్సర్యాలకు అవకాశమే లేదు కదా! హనుమ ఎప్పుడు మాత్సర్యానికి లోను కాలేదు. తన రామభక్తిని ఎన్నడు కూడ వదులుకోలేదు.

(4) మంత్రజ్ఞో :- "మంతారం త్రాయత ఇతి మంత్రః" మననము చేసి కొనే వారిని రక్షించేది మంత్రము. రామనామమే ఒక మహామంత్రము. అదే "తారకమంత్రము". రామ మంత్రము యొక్క మహిమను మహేశ్వరునితో పాటు చక్కగా గుర్తెరిగినవాడు హనుమ.

(5) మంత్రభక్తశ్చ:- రామునిపై కంటె రామనామముపై హనుమకు ప్రేమ అధికము. రాముడు తనతో రమ్మన్నా వెళ్లక, రాముడు పరమపదానికి వెళ్లాక కూడ అనవరత

రామనామానుసంధాన పారవశ్యముతో ఇప్పటికి అలాగే తన జీవితకాలాన్ని ఏ పర్వత గుహలోనో గడుపుకొంటున్న మహానుభావుడు హనుమ.

(6) సదామంత్రార్థదః:÷ తనను కలిసిన వారందరికి మంత్రార్థ స్వరూపుడైన శ్రీరాముని మహిమను సదా తెలియజేస్తుంటాడు హనుమ.

(7) శుచిః:- వాక్కులో, అహారాది నియమ విషయాలలో పవిత్రుడుగా ఉంటాడు ఆచార్యుడు. అస్ఖలిత బ్రహ్మచర్య దీక్షతో అనవరత రామ నామానుసంధాన పారవశ్యముతో నిరంతర శుచిమంతుడు (పవిత్రుడు) హనుమ.

(8) గురుభక్తి సమాయుక్తో: విద్యాప్రదుడైన వాడు గురువు. ఆయన పట్ల భక్తే గురుభక్తి. హనుమకు వేదవిద్యాప్రదాత సాక్షాత్తుగా సూర్యభగవానుడే. ఆయన రథవేగాన్ని అనుసరించి అనుక్షణము వెళ్లుతూ ఆ ఆదిత్య భగవానుని వలన వేదవిద్య నంతా ఆర్జించు కొన్న ఘనుడు హనుమ.

విద్యార్జన తరువాత ఆచార్యుడైన సూర్యభగవానుని ఆజ్ఞను అనుసరించి, తన తల్లి అంజనాదేవి ఆదేశము ప్రకారము సూర్యపుత్రుడైన సుగ్రీవుని చేరి ఆయనకు అనవరతము కొండంత అండగా నిలిచాడు హనుమ.

(9) పురాణజ్ఞో విశేషతః:- కల్పము పురాణాలను తెలుపుతుంది. పురాణాలు భగవద్వైభవాన్ని పరిపూర్ణంగా ప్రకాశింప జేస్తాయి. శ్రీరామ పరమాత్మ వైభవాన్ని పరిపూర్ణంగా అనుభవించిన హనుమ విశేషమైన పురాణ జ్ఞానము కలవాడు. కల్ప రహస్యాలను పూర్తిగా ఆకళింపు చేసికొన్నవాడు హనుమ.

"ఏవం లక్షణ సంపన్నో - గురురిత్యభిధీయతే"

ఈ విధంగా ఆచార్య లక్షణాలన్ని సంపూర్ణంగా మూర్తీభవించినవాడు హనుమ. రామ సుగ్రీవులకు సఖ్యాన్ని కల్పించడంతో ఆగక, సుగ్రీవ పట్టాభిషేకం కూడ జరిపించిన నీతిమంతుడైన మంత్రి ఆయన. సీతారాముల మధ్య కూడ ఆచార్యుడు (ఘటకుడు)గా ఉండి, వారిద్దరి క్షేమవార్తలను పరస్పరము తెలిపి, వారి ప్రాణములను కూడ నిలిపిన మహనీయుడు హనుమ. అంతటితో ఆగక, విడిపోయిన వారిద్దరిని కలిపి, వారిద్దరు కలువగానే వారిద్దరి సేవలో ధన్యుడైన ప్రపన్నప్రవరుడు, భాగవతోత్తముడు హనుమ.

**"రామాయణ మహామాలా! రత్నం వందే౽నిలాత్మజం"**

అటువంటి ఆచార్య హనుమకు అంజలి ఘటిద్దాము.

-- ఇతిశం --

# సుగ్రీవ సమాగమము

శ్రీరామచంద్రస్వామి హనుమ యొక్క వాగ్వైభవాన్ని ప్రశంసించి, వాక్యజ్ఞుడు, స్నేహ సంయుక్తుడైన హనుమతో మధురంగా మాట్లాడుమని లక్ష్మణుని ఆదేశించాడు.

వాక్యజ్ఞుడైన సౌమిత్రి : – "హనుమా! సుగ్రీవుని గుణాలు మాకు ముందే తెలుసు. ఆయననే వెతుకుకొంటూ వస్తున్నాము. నీవు చెప్పినట్లే సుగ్రీవునితో స్నేహము చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. ఎత్తిన చాపానికి ఎదురులేని ప్రతాపవంతుడు మా అన్న కపిరాజును ఆశ్రయించడానికి సిద్ధమే."

సౌమిత్రి స్నేహ వచనాలను విన్న హనుమ హర్ష పరవశుడై సుగ్రీవునికి భార్యా రాజ్య లాభాలు కలిగినట్లేనని నిశ్చయించుకొన్నాడు. వాక్య విశారదుడైన పవనసుతుడు, "శ్రీరామచంద్రా! నీవు ఇంతటి భయంకరారణ్యములోనికి తమ్ముడితో సహా ఎందుకు వచ్చావు?" అని ప్రశ్నించాడు.

శ్రీరాముని సూచన మేరకు లక్ష్మణుడు ఈ విధంగా సమాధానమిచ్చాడు:– "దశరథుడనే పేరు గల మహారాజు ధర్మవత్సలుడు. ఆయన ప్రజలను పితామహుని (బ్రహ్మ) వలె పాలించాడు. అగ్నిష్టోమాది అనేక యాగాలను భూరిదక్షిణలతో నిర్వహించాడు.

ఆయన పెద్ద కొడుకే ఈ శ్రీరాముడు. సర్వభూత శరణ్యుడు, సమస్త రాజలక్షణ సంపన్నుడు. పిత్రాజ్ఞా పాలనముకై రాజ్యమును వీడి నాతో పాటు వనవాసం చేస్తున్నాడు. ప్రభతో కూడిన ప్రభాకరుని వలె భార్య అయిన సీతాదేవితో కలసి అడవులకు బయలుదేరాడు. మేము తోడులేక ఒంటరిగా ఉన్న మా వదినను ఎవ్వరో ఒక రాక్షసుడు అపహరించాడు.

నేను ఆయన తమ్ముడను. కాని నిజానికి ఆయన సుగుణ గణములకు పూర్తిగా లోబడిన దాసుడను. నన్ను ఆయన తనతో పాటు సమానుడైన తమ్ముడిని అనుకొంటున్నాడు. కాని నేను నన్ను సమస్త కల్యాణ గుణ సంయుక్తుడైన శ్రీరాముని దాసునిగానే భావించుకొంటున్నాను. నా పేరు లక్ష్మణుడు.

× × ×

"దాస్యము చేయడము కుక్క స్వభావము కదా! అది నీచ కృత్యము కదా! అది అందరికి అయిష్టము, దుఃఖకరము కాదా?" అంటే విధిలేక, ఇష్టములేక ఇతరులకు

దాస్యము చేయడం నీచకృత్యము, దుఃఖకరము కావచ్చు. కాని సౌజన్యముగల, ప్రేమగల ఆప్తులకు, ప్రాప్తులకు సేవ చేయడం నీచము కాదు, అయిష్టము కూడ కాదు. పైపెచ్చు అది సేవ చేసే వారికి ప్రీతికరము కూడ.

అనుకూలవతి అయిన సతి, అనురాగవంతుడైన పతికి సేవలు చేయడం ఆమెకు అయిష్టమా? దుఃఖకరమా? కానేకాదు కదా! పైపెచ్చు భర్తకు, పిల్లలకు సేవ చేయడం ప్రతి ఇల్లాలు తన హక్కుగా భావించుకొంటుంది. ఆమె చేసే పనులను వారు వారిస్తే, నిరాకరిస్తే, ఆమె తన హక్కును బలవంతంగా లాగేసుకొన్నట్లు, తన సర్వము కోల్పోయినట్లు బాధపడుతుంది. ఆ గృహిణి తాను చేసే పనులను ఎంతో ఆదరంతో, అనురాగంతో, సంతృప్తితో, సంతోషంతో చేస్తుంది.

× × ×

అలాగే లక్ష్మణుడు తన అన్న, సుగుణాలకు మిన్న అయిన శ్రీరామచంద్రునికి సేవలు చేయడమే తన లక్ష్యమని ప్రకటించాడు.

సౌమిత్రి తన సంభాషణను సాగించాడు.

"హనుమా! మా అన్న సకల కల్యాణ గుణ సముద్రుడు. ఎవరెన్ని అపకారాలను కావాలని చేసినా వెంటనే తన మనస్సులో వాటిని పూర్తిగా మరచిపోతాడు. ఎవ్వరు ఏ కొంచెము మంచి చేసినా, దానికి తాను సంతుష్టుడుగా, కృతజ్ఞుడుగా ఉంటాడు. అన్ని ప్రాణుల హితాన్నే కోరుతాడు. సర్వదా సకల సుఖాలకు అర్హుడు, ఆనంద నిలయుడు.

అట్టి మహానుభావుడు తన రాజ్యాన్ని, సంపదలను వదలుకొని, కఠిన కాంతారముల పాలయ్యాడు. పైపెచ్చు తన పంచ ప్రాణముల వంటి ధర్మపత్నిని కోల్పోయి, పుట్టెడు దుఃఖములో ఉన్నాడు.

కబంధుని ద్వారా సుగ్రీవుని గూర్చి విన్నాము. ఆయన సూచనల మేరకే పంపావనంలో ప్రవేశించాము. సుగ్రీవుడు మా వదినను అపహరించిన అసురుని గురించి అన్వేషిస్తాడని కబంధుడు తెలిపాడు.

**"యస్మాదేవ పరోక్షం వదతి తస్య భాగ ఉదితః" (యజు 2-5-1)**

సుగ్రీవసచివుడవైన నీవు ఆయన గురించి గొప్పగా చెప్పడం కాదు. మీకు దూరంగా ఉన్న కబంధుడు కూడ సుగ్రీవ సౌజన్యాన్ని గురించి ప్రశంసించాడు. పరోక్ష ప్రశంస శిరోధార్యము కదా!

మా అన్న సర్వలోక శరణ్యుడు. సకల లోకస్వామి. ప్రస్తుతము మా అన్న, నేను సుగ్రీవుని ఆశ్రయిస్తున్నాము. నీ మాటలను బట్టి నడచుకొంటాము.

సర్వలోక శరణ్యుడైన, ధర్మాత్ముడైన మా అన్న శ్రీరామచంద్ర ప్రభువు సుగ్రీవుని ప్రభువుగా శరణువేడుతున్నాడు. ఎవ్వరి దయను, ప్రసాదాన్ని సమస్త జనులు, మునులు, సురులు కోరుకొంటారో, అట్టి శ్రీరామచంద్రుడే ఇప్పుడు సుగ్రీవ ప్రసాదమును కాంక్షిస్తున్నాడు. "లోకనాథః పురాభూత్వా సుగ్రీవం నాథ మిచ్ఛతి".

రాజాధిరాజు అయిన దశరథ రాజేంద్రుని పెద్ద కొడుకు, సకల లోక సుఖ్యాతుడైన శ్రీరామచంద్రస్వామి వానరేంద్రుడైన సుగ్రీవుని స్నేహాన్ని అభిలషిస్తున్నాడు.

శోకసాగర నిమగ్నుడు, ఆర్తుడు, శరణాగతుడైన మా అన్న శ్రీరామునికి, హరియూధపుడైన సుగ్రీవుడు సహాయము కావించాలి" అని అత్యంత దుఃఖావేశముతో, అశ్రుపూర్ణ నయనాలతో లక్ష్మణుడు హనుమను అర్థించాడు.

సందర్భ శుద్ధిగల, వాక్య విశారదుడైన హనుమ లక్ష్మణునితో సాంత్వన వాక్యాలను పలికాడు. "సౌమిత్రీ! మీ వంటి బుద్ధి సంపన్నులను, జితేంద్రియులను, వానరేంద్రుడు తప్పక కలువగోరుతాడు.

ఆయన కూడ "వాలి" అనే అన్న చేత రాజ్యము నుండి తరిమి వేయబడి, భార్యను కోల్పోయి, అత్యంత దీనావస్థలో ఉన్నాడు. అయినప్పటికి సీతాన్వేషణ కార్యంలో సూర్యనందనుడు మీకు తప్పక సహాయం చేయగల్గుతాడు" అని మధురంగా మనోహరంగా మాట్లాడాడు.

హనుమ మాటను సమ్మానించి లక్ష్మణుడు శ్రీరామునితో "అన్నా! మారుతాత్మజుడు సంతోషంతో పలికిన పలుకులను విన్నావు కదా! ప్రసన్న వదనంతో ఆయన పలికాడు. అందులో అసత్యము అగుపడడము లేదు. నీవు, సుగ్రీవుడు కలువడం వలన పరస్పరము కృతకృత్యులవుతారు" అని రాముడు అంగీకరించేట్లుగా స్వాభిప్రాయాన్ని తెలిపాడు.

హనుమ తన భిక్షు రూపాన్ని వదిలి, వానర రూపుడై వారిద్దరిని తన వీపుపై ఎక్కించుకొని సుగ్రీవ సన్నిధికి సంతోషంతో సత్వరమే చేరుకొన్నాడు. వారికి "ఖగ వాహనత్వము" పాతదే అనిపించింది.

"గొంతు చించుకొని అరవడం రాక్షసము
మంద్రస్వరంలో మధురంగా మాట్లాడడం మానుషము"

# సుగ్రీవ సఖ్యము

హనుమంతుడు రామలక్ష్మణులను ఋష్యమూకముపై నిలిపి, భిక్షు రూపంతో మలయగిరిపై ఉన్న సుగ్రీవుని సందర్శించి రామలక్ష్మణుల రాకను తెలిపాడు.

"రాముడు మహాప్రాజ్ఞుడు, దృఢపరాక్రముడు, మహాధర్మాత్ముడు, దశరథాత్మజుడు. తన తమ్ముడైన లక్ష్మణునితో ప్రియసతి అయిన సీతాదేవితో కలసి, తండ్రి ఆజ్ఞను తలదాల్చి రాజ్యసంపదను త్యజించి, అడవిలోనికి అడుగిడాడు.

అనేక రాజసూయ, అశ్వమేధ యాగాలను నిర్వహించి, సత్యముతో వసుధను శాసించిన దశరథ సార్వభౌముని పత్ని కైక వరాల కారణంగా శ్రీరాముడు అరణ్యాలకు బయలు దేరాడు. ఒంటరిగా ఉన్న రామపత్నిని రాక్షసుడెవ్వడో అపహరించాడు.

ఇప్పుడు రామలక్ష్మణులు నీ సఖ్యము కోరి వచ్చారు. ఆదరణీయులైన వారిద్దరిని నీవు తప్పక ఆదరించుమని" హనుమ నివేదించాడు.

సచివ వచనాలతో సంతోషపరవశుడైన సుగ్రీవుడు వాలి భయవిముక్తుడై అందమైన మనుష్య రూపంతో శ్రీరాముని ఆదరించాడు.

ఆయన రామభద్రునితో :- "నీవు పరాక్రమోపేతుడవు, ధర్మాత్ముడవు, సర్వ వత్సలుడవు. వాయుపుత్రుడు తెలిపినట్లుగా నీలో ఆ గుణాలన్ని చూడ గల్గుతున్నాము. నీతో స్నేహము నాకు సన్మాన ప్రదమైంది. ఒకవేళ ఈ కోతితో స్నేహము నీకు ఇష్టమైతే ఇదిగో నా చేయిని చాపుతున్నాను. నీ చేయినందించి స్నేహ మర్యాదను నిలుపుము" అని పలికాడు.

శ్రీరామచంద్రుడు సంతోషముతో సుగ్రీవ హస్తాన్ని అందుకొన్నాడు. స్నేహంతో అతనిని గాఢంగా కౌగిలించుకొన్నాడు.

**"త్రయః పశూనాగ్ం హస్తాదానాః**

**పురుషో హస్తీ మర్కటః"**

"తిండి పెట్టడం, ఏదైనా వస్తువును ఇవ్వడం, గ్రహించడం విషయంలో మనుష్యుడు ఏనుగు, కోతి చేతిని వాడుతాయి". (యజు 2-3-11).

అప్పుడు హనుమ భిక్షు రూపాన్ని వదలి, తిరిగి స్వస్వరూపంతో కట్టెలను ప్రోగు చేసి, వాటికి అగ్నిని ప్రజ్వలింప చేశాడు. మండుతుండే ఆ హుతాశనుని పుష్పాలతో అర్చించి, రామ సుగ్రీవుల మధ్య నిలిపాడు.

శ్రీరామ సుగ్రీవులిద్దరు ఆ అగ్నిచుట్టు స్నేహధర్మాన్ని పాటించి ప్రదక్షణాలు చేశారు.

సుగ్రీవుడు సంతోషముతో, "రాఘవా! మనమిద్దరము అగ్నిసాక్షికంగా మిత్రుల మయ్యాము. నేటి నుండి మన ఇద్దరి సుఖదుఃఖాలు ఒకటే" అని పలికి పుష్పితము, సపర్ణమైన ఒక సాలవృక్ష శాఖను నరకి, భూమిపై వేశాడు. దానిపై రాఘవ సుగ్రీవులిద్దరు సుఖాసీనులయ్యారు.

శ్రీరామచంద్రుడు తనకు స్నేహ హస్తాన్ని అందించాడనే హర్షాతిశయంతో సుగ్రీవుడు ఒక ధర్మసూక్ష్మాన్ని విస్మరించాడు. భగవద్భాగవత గోష్ఠి వలె రామలక్ష్మణుల జంట వివక్షకు అవకాశము లేనిది. భగవదపరాధము కంటె భాగవతాపరాధమే అసహ్యమైనది. అలాగే రామునికి చేసిన అపరాధము కంటె లక్ష్మణుని విషయంలో చేసే అపరాధము మరింత ప్రమాదకరమైనది.

**"ఆరాధనానాం సర్వేషాం । విష్ణోరారాధనం పరం**
**తస్మాత్పరతరం ప్రోక్తం । తదీయారాధనం పరం"**

సకల దేవతారాధనము కంటె విష్ణ్వారాధనము శ్రేష్ఠమైనది. ఆ విష్ణ్వారాధనం కంటె విష్ణుభక్తుల (తదీయుల) ఆరాధనము మరింత శ్రేయస్కరము.

విష్ణ్వవతారమైన శ్రీరాముని ఆదరించానని సుగ్రీవుడు మురిసి పోయాడు. కాని "రామస్య దక్షిణో బాహుః" అన్నట్లు రాముని కుడి భుజమైన లక్ష్మణుని పూర్తిగా మరచి పోయాడు.

శ్రీరాముడు మాయామానుష విగ్రహుడు. మర్యాదా పురుషోత్తముడు. తన సోదరుని విషయంలో సుగ్రీవుని అలక్ష్యము రాముని మనస్సును ములుకులా బాధించింది. అయితే ఆ బాధను శ్రీరాముడు గంభీర హృదయుడు కనుక వెంటనే వ్యక్తము చేయలేదు. అపరాధుల పట్ల తక్షణ స్పందనము శ్రీరాముని లక్షణము కాదు.

**"యస్యద్వౌ వైద్యౌ పుణ్యౌ గృహే వసతః**
**యః తయోరన్యం రాధయతి, అన్యంన ఉభేవావ సతావృచ్ఛతీతి"**

ఎవ్వరు తమ ఇంటికి వచ్చిన ఇద్దరు వైద్యులలో ఒకరిని, ఇద్దరు పెద్దలలో ఒకరినే ఆరాధించి, సంభాషించి మరొకరిని వదలి ఉంటారో వారు ఆ ఇద్దరి తిరస్కారానికి పాత్రులవుతారు.

అయితే సూక్ష్మగ్రాహి అయిన హనుమ సుగ్రీవుని అమర్యాదను గమనించక పోలేదు. స్వామి తప్పిదాన్ని భృత్యుడు సవరించాలి కదా! అలాగే హనుమ ధర్మసూక్ష్మాన్ని పాటించి, సుపుష్పితమైన ఒక చందన తరుశాఖను ఛేదించి సౌమిత్రికి దానిని ఆసనంగా సమర్పించాడు. తన అవమానానికి మనస్సులోనే బుసలు కొట్టిన ఆదిశేషాంశుడైన రామానుజుడు ఆ చందన శాఖపై సమాసీనుడయ్యాడు. ఆయన అవమానాగ్ని చందన సపర్యతో తత్ క్షణమే తగ్గింది.

ఇక్కడ మరొక ముఖ్య విషయాన్ని గమనించాలి. వాల్మీకి మునీంద్రుడు సాధారణంగా కథను ఇలా నడిపించాడు కాని హనుమ కైంకర్యములో ఒక విశిష్టత ఉంది.

సుగ్రీవుడు రామునికి సాలశాఖను ఆసనంగా వేసి, దానిపై తాను కూడ రామునితో సమానంగా కూచొన్నాడు. ఒక **ఆశ్రితుడు, కపిమాత్రుడు రాజాధిరాజుతో, స్వామితో ఏకాసీనుడు కావడం ఎంత ఘోర నేరం!** అయితే సుగ్రీవ సఖ్యాభిలాషి అయిన రామచంద్రుడు సుగ్రీవుని ఆ అనుచిత చర్యకు అంత ప్రాధాన్యమీయలేదు.

హనుమ రామానుజునికి హార్దికంగా సమర్పించిన చందన శాఖ రామునికి సుగ్రీవుడు వేసిన సాలశాఖ కంటె సౌందర్యంలో సౌకుమార్యంలో సౌగంధ్యంలో శ్రేష్ఠమైనది. **హనుమ ఆ ఆసనాన్ని లక్ష్మణుని పట్ల భాగవత భక్తితో సమర్పించి, తాను దానికి దూరంగా ఒక మూలలో నిలుచొని ఉన్నాడు.** అత్యంత వినయ సంపన్నుడు కదా హనుమ!

అంతేకాదు హనుమ సమర్పించిన చందనాసనములో మరొక ప్రత్యేకత ఉంది. చందన వృక్షాన్ని నాగసర్పాలు మిక్కిలి ఇష్టపడుతాయి. అవి ఆ చెట్టుకు చుట్టుకొని ఉంటాయి. ఆ చందన పరాగము వాటి శరీరాలకు అంటుకొని, అవి వెళ్లిన చోటల్లా పరిమళభరితంగా అవుతుంది.

లక్ష్మణుడు ఆదిశేషావతారమే కదా! ఆ అవతార విశేషాన్ని కూడ గమనించినట్లుగా హనుమ సౌమిత్రికి అతిప్రియంగా చందనాసనాన్ని సమర్పించాడు. ధన్యుడు కదా హనుమ!

అయితే ఇక్కడ (రామాయణ) 5-8 సర్గలలోని ఒక తేడాను మనము గమనించాలి. వాల్మీకి భగవానుడు లక్ష్మణునికి ఎనమిదవ సర్గలో హనుమ వేసింది సాలవృక్ష శాఖనే అని సాధారణంగా తెలిపాడు.

**"తావాసీనౌ తతో దృష్ట్వా। హనుమానపి లక్ష్మణం।**
**సాల శాఖాం సముత్పాట్య। వినీతముపవేశయత్"**

అయితే అంతకుముందు ప్రథమ సమావేశంలో హనుమ లక్ష్మణునికి సమర్పించింది చందన తరుశాఖాసనాన్నే అని పంచమసర్గలో వాల్మీకి కవీంద్రుడు విశదం చేశాడు.

"లక్ష్మణాయాథ సంహృష్టో। హనుమాన్ ప్లవగర్షభః
శాఖాం చందన వృక్షస్య। దదౌ పరమ పుష్పితాం "

కనుక సుగ్రీవుడు అన్ని సమయాలలోను రామునికి సాలశాఖాసనాన్నే వేశాడు. వానరోత్తముడైన హనుమంతుడు మాత్రము ముందుగా లక్ష్మణునికి చందనశాఖాసనాన్ని అత్యంత సంతోషంతో సమర్పించాడు.

వ్యాఖ్యాతలు సౌమిత్రికి వేసిన చందన శాఖాసనాన్నే ఉపాదేయంగా గ్రహించారు. అష్టమసర్గలో ఆయనకు హనుమవేసిన సాలశాఖాసనానికి అంత ప్రాధాన్యమును వ్యాఖ్యాతలు ఇవ్వలేదు.

అంతేకాదు పై రెండు సందర్భాలలో కూడ సుగ్రీవుడు లక్ష్మణుని అలక్ష్యమే చేశాడని స్పష్టమవుతున్నది. పరమ భాగవతోత్తముడు, ఆదిశేషావతారుడు, శ్రీరామునికి దక్షిణ బాహువు, బహిఃప్రాణమైన లక్ష్మణుని విషయంలో సుగ్రీవుడు చేసిన అనాదరణ రూపమైన అపరాధము సుగ్రీవుని జీవితంలో ముందు ముందు ఎంత ప్రమాదానికి కారణమవుతుందో కదా!

శ్రీరామునివైపు సంతోషంతో చూస్తూ సుగ్రీవుడు తన బాధామయ గాధను వివరింప సాగాడు :-

"రామభద్రా! మా అన్న అయిన వాలి వలన నేను రాజ్య బహిష్కృతుడనయ్యాను. భార్యను పోగొట్టుకొన్నాను. ఆయన భయంతో వనాలు, పర్వతాలు సంచరిస్తూ, దుర్గమమైన పంపావన తీరంలోని ఋష్యమూక పర్వతాన్ని ఆశ్రయించాను. నాకు వాలి నుండి శాశ్వతంగా రక్షణను ప్రసాదించుమ"ని రాముని శరణు వేడాడు.

ధర్మజ్ఞుడు, శరణాగత వత్సలుడైన రామభద్రుడు చిరునవ్వు నవ్వుతూ సుగ్రీవునికి అభయమొసగాడు. "మిత్రమా! స్నేహితుల వలన కలిగే ఉపకార ఫలము నాకు బాగా తెలుసు. నీ భార్యను అపహరించి, నిన్ను రాజ్యం నుండి వెడలగొట్టిన వాలిని తప్పక వధిస్తాను.

నా బాణాలు భయంకరమైనవి. మధ్యాహ్న మార్తాండుని వలె మండుతుంటాయి. మహేంద్రుని వజ్రాయుధమువలె మహా కఠిన మైనవి. భయంకర సర్పాల వలె బుసలు కొడుతుంటాయి.

రాలిపోతుండే రాళ్లుగల పర్వతమువలె వాలి ఈ రోజే నా క్రూర నారాచములతో భూపతితుడవుతాడు" అని రాముడు ఆశ్వాసించాడు.

ఆ క్షణంలో జరిగిన ఒక అత్యద్భుతాన్ని గమనిద్దామా!

**"సీతా, కపీంద్ర, క్షణదాచరాణాం। రాజీవహేమజ్వలనోపమాని**
**సుగ్రీవ, రామ ప్రణయ ప్రసంగే। వామాని నేత్రాణి సమంస్ఫురంతి"**

ఆశ్చర్యంగా అప్పుడు ఒకే సమయంలో ముగ్గురికి ఎడమ కన్నులు అదిరాయి. ఆ ముగ్గురెవ్వరో తెలుసా? వాలి, రావణుడు, సీత అనే ముగ్గురు విఖ్యాత వ్యక్తులు.

సీతకు ఎడమ కన్ను అదరడం ఆమెకు రామప్రాప్తిని సూచిస్తుంది. అది ఆమెకు శుభదాయకమే. కాని వాలి, రావణులకు వామనేత్ర విస్ఫురణము వారి మరణాలకు సూచకమైనది.

-- ఇతిశం --

"ఇంటికొచ్చిన పెద్దలిద్దరిలో ఒకరిని ఆదరించి మరొకరిని వదలితే, ఆ ఇద్దరి ఆగ్రహానికి గురికావలసి వస్తుంది"

"కోపమ్మును అంటిపెట్టుకొని ఉండుటకాపురుషలక్షణంబు"

"ధృతినెత్తిన చాపమునకు ప్రతి లేని మహాప్రతాప వార్నిధి శ్రీరాముడు

# సౌమిత్రి సౌశీల్యము

శ్రీరామ, సుగ్రీవుల స్నేహము అగ్ని సాక్షికంగా సంపూర్ణము అయింది. శ్రీరాముడు – "తాను వాలిని తప్పక చంపుతానని" ప్రతిజ్ఞ కావించి, సుగ్రీవుని సంతుష్టుని కావించాడు. సుగ్రీవుడు కూడ, "హనుమ ద్వారా సీతాపహరణ వార్త తనకు తెలిసిందని, ఒంటరిగా ఆశ్రమంలో ఉన్న రామపత్నిని నిర్దాక్షిణ్యంగా రావణాసురుడు అపహరించి, దారిలో అడ్డుగా వచ్చి, సీతను ఆదుకోబోయిన "జటాయువు" అనే గ్రద్దను ముసలిదని కూడ చూడక వదలక క్రూరంగా వధించాడనే" వార్త తనకు తెలిసిందని శ్రీరామునితో చెప్పాడు.

"అయితే శ్రీరాముడు సీతాదేవిని త్వరలోనే తిరిగి పొందుతాడని, వేదాన్ని అపహరించిన సోమకాసురుడు హతుడయి, వేదము తిరిగి బ్రహ్మను చేరినట్లు, సీతాపహర్త అయిన రావణుడు సంహరింపబడి, సీతాదేవి శ్రీరాముని చేరుకొంటుంద"ని శ్రీరాముని సుగ్రీవుడు ఓదార్చాడు.

"విషము కలసిన పిండివంటను తిన్నవాడు, ఆ ఆహారాన్ని ఎలా జీర్ణింపజేసి కోలేడో, అలాగే సీతను అపహరించిన రావణాసురుడు ఆమెను ఆకాశంలోకి తీసిక వెళ్లినా, రసాతలంలో దాచినా, ఆమెను అనుభవింపజాలడని, హతుడవుతాడ"ని తెలిపాడు.

ఇంతలో సుగ్రీవునికి సీతాదేవి నగలమూట జ్ఞాపకానికి వచ్చింది. "రామచంద్రా! మాటల మధ్యలో ఒక ముఖ్య విషయాన్ని చెప్పడం మరచిపోయాను. నేను ఒకనాడు నలుగురు సచివులతో కలసి, ఈ పర్వత పై భాగంలోకి వెళ్లాను. అప్పుడొక భయంకరాకారుడైన రాక్షసుడు అప్సరస వంటి భామినిని బలవంతంగా తన రథంలో కూచోబెట్టుకొని ఆకాశమార్గంలో వెళ్తున్నాడు. ఆ అబల "పాముల వాని చేతిలో పట్టుబడ్డ ఆడనాగు వలె" "హా రామా! హా లక్ష్మణా" అంటూ బిగ్గరగా రోదిస్తూ విలవిల కొట్టుకొంది.

కొంతసేపటికి ఆ సుందరి తన వస్త్రంలో కొంత భాగాన్ని చింపి, దానిలో తన నగలను కొన్ని మూటగట్టి, ఆ రాక్షసుడు గమనించకుండా మమ్మల్ని గమనించి మా మధ్యలో పడవేసింది. మేము ఆ మూటను విప్పి చూడకుండా అలాగే పదిలంగా దాచాము. ఆ నగలను తెప్పిస్తాను. గుర్తు పట్టగలవేమో" అని పలికాడు.

రాముని మనస్సు ఆ మూటను చూడడానికి తొందరపడసాగింది. శ్రీరామచంద్రుని ముందు శుభకరమైన అభరణాల మూట ఉంచబడింది. ముందుగా శ్రీరాముని కనులకు సీతాదేవి చీర చెరగు కనబడింది. దానిని కనగానే ఆయన కళ్ళు కన్నీటి మయమయ్యాయి.

ఆ ఆభరణాలను చేతిలోకి తీసికొన్నాడు. మంచుకమ్మిన చంద్రుని వలె ముఖకాంతిని కోల్పోయాడు. "హా సీతా!" అని బిగ్గరగా విలపిస్తూ నేలపై పడిపోయాడు. కన్నంలోని నాగుపాము బుసలు కొట్టుతున్నట్లు గాఢమైన నిట్టూర్పులను వదిలాడు. ఆయన కళ్లు కన్నీటితో కాల్వలు కట్టసాగాయి. తన ప్రక్కనున్న అనుజునితో, "లక్ష్మణా! తనను రావణాసురుడు అపహరించి తీసికవెళ్తుండగా మీ వదిన తన మేను నగలనుకొన్ని ఒలిచి తీసి, ఆమె చేలాంచలములో మూటగట్టి క్రింద పడవేసింది. ఇప్పటికి ఈ నగలు ఆమె మేనుపై ధరించినట్లే క్రొత్తగా కాంతివంతంగా ఉన్నాయి. నీవు గుర్తు పగట్టగలవేమో చూడు" మని అడిగాడు.

లక్ష్మణుడు ఆ నగలను చూచి పలికిన పలుకులు విలక్షణంగా ఉంటాయి. లక్ష్మణుని సమాధానాన్ని సూచించే వాల్మీకి విరచిత శ్లోకము, ఆయన కవితా సౌందర్యాన్ని రత్నము వలె మెరపిస్తూ, భారతీయ సంస్కృతికి అద్దము పట్టుతుంది, సౌమిత్రి సౌహార్దానికి మచ్చుతునకగా నిలిచిపోతుంది.

"మాతృవత్ తే పరదారా" అనేది భారతీయ నీతి సూత్రము. "అన్య వనితను మాతృదేవిగా భావింపుమ"ని భారతీయ హితోక్తి.

"మాం విద్ధి జనకాత్మజాం" అనేది సుమిత్రాదేవి శ్రీసూక్తి. "సీతాదేవిని చూచినప్పుడు నన్ను (తల్లిని) చూచినట్లు చూడుమని" సౌమిత్రికి ఆమె సలహానిచ్చింది.

సౌమిత్రి ఆ నగలను చూచాక ఏమన్నాడు? ఆయన మాటలు ముత్యాల మూటలు. సీతాదేవి నగల మూట కంటె విలువైనవి లక్ష్మణుని విలక్షణములైన మాటలు.

భర్తృహరి తన సుభాషితాలలో "భూషలుగావు మర్త్యులకు । భూరిమయాంగద తారహారముల్" అని మొదలు పెట్టి "వాగ్భూషణమే సుభూషణము" అని ముగించాడు.

ఇంతకు లక్ష్మణుని సమాధానము ఆయన విలక్షణమైన మాటలలోనే పరిశీలిద్దామా!

**"నాऽహం జానామి కేయూరే । నాऽహం జానామి కుండలే**
**నూపురే త్వభిజానామి । నిత్యం పాదాభివందనాత్"**

అన్నా! మా వదిన భుజాలకు ధరించే భుజకీర్తులు నాకు తెలియవు. ఆమె చెవులకు ధరించే కుండలాల గురించి నాకు బొత్తిగా తెలియదు. ఎందుకంటే ఆమెను నేనెప్పుడు కన్నెత్తి చూడలేదు.

అయితే ఆమె పాదాలు, వాటి ఆభరణాలు నాకు సుపరిచితాలే. ఎందుకంటే ప్రతి ఉదయము నేను మా వదినను సందర్శించగానే, మా తల్లి పాదాలకు వలె, మా వదినె

పాదాలకు కూడ ప్రణమిల్లుతాను. ఆ సమయంలో నా శిరస్సు ఆమె పాదాలను స్పృశిస్తుంది. అప్పుడు నా నయనాలు ఆమె పాదాలను పిల్లల కళ్లవలె తమకంతో, అత్యాదరంతో అవలోకిస్తాయి. అందువలన ఆమె పాదాలు, వాటి ఆభరణాలు నా మనస్సులో చెరగిపోని ముద్రను వేశాయి.

"నూపురేతు" అని కేయూర కుండలముల కంటె భిన్నంగా "తు" అనే శబ్దంతో సౌమిత్రి నూపురాలను వేరుగా చూసాడు. తెలియని వాటికంటే బాగా పరిచయమున్నవి వేరు కదా! "తు" శబ్ద ప్రయోగంతో సౌమిత్రి కాలి అందెలను వేరుగా చూపడం వాల్మీకి కవితా వైశిష్ట్యము.

ఓహ్! ఏమి సౌమిత్రి విధేయత! మాతృదేవి విషయంలో వలె వదిన విషయములో కూడ ఏమి ఆరాధన! ఎంతటి శీలసంపద! లక్ష్మణా! నీ వైలక్షిణ్యము అమోఘమైనది! సౌమిత్రీ! నీ సౌశీల్యము అపురూపమైనది!

తరతరాలుగా భరతజాతి సమస్తము నీ ముందు తలవంచి నిలుస్తుంది.

భారతీయ పవిత్రతకు ఎల్లవేళలా నీవే ఆదర్శము సుమా!

--- ఇతిశం ---

"ఈ సొగసైన భూషణము లెవ్వడు చూపెవాడె మిత్రమౌ
ఈ సొగసైన భూషణము లెవ్వడు గుర్తెడె వాడె తమ్ముడౌ"

"కట్టె పరమాళ్ళు రాలనిన - నచ్చట నచ్చట నాపెయుండమే"

ప్రతి ఉదయము నేను అభివందనము చేసే మా
వదిన పాదాభరణాలు (నూపురాలు) మాత్రము
నాకు చక్కగా తెలుసు.

# వాలి, సుగ్రీవ వైరము

శ్రీరాముని ద్వారా అభయము నందిన సుగ్రీవుడు కొంతవరకు తేరుకొన్నాడు. "ఇంతవరకు భార్యను కోల్పోయి, మిత్రులు బంధింపబడి, అనేక పర్యాయాలు వాలి వలన హత్యా ప్రయత్నాలు జరిగి, ప్రతి క్షణం భయగ్రస్తుడవుతున్న తాను హనుమదాది సచివ సహాయంతో జీవింప గల్గానని తెలిపాడు. చివరకు సాధు పరిత్రాణ దీక్షితులయిన రామలక్ష్మణులిద్దరిని చూచి కూడ, వారిని వాలి అనుచరులుగానే భావించి, భయపడ్డానని వివరించాడు. అయితే తన భయం పూర్తిగా తొలగి, తాను సుఖంగా జీవింప గల్గుతాననే నమ్మకం కల్గాలంటే వాలి వధ జరుగాల"ని చెప్పాడు.

శ్రీరామచంద్రుడు తాను ధనురారోపణం చేసే వరకే వాలి ప్రాణావశిష్టుడుగా ఉంటాడని ఓదార్చాడు. అయితే అన్నదమ్ములైన వాలి సుగ్రీవుల మధ్య వైరమెలా ఏర్పడిందో తెలుపుమని సుగ్రీవుని అడిగాడు.

శ్రీరాముని అభయవాక్యంతో మరొకమారు సుగ్రీవుడు ఆయన మంత్రులు సంతృప్తిని, సంతుష్టిని పొందారు. సుగ్రీవుడు తన గాథ నిలా తెలిపాడు.

"శ్రీరామా! వాలి మా అన్న మహావీరుడు. మా తండ్రిగారికి, నాకుకూడ చాల ఇష్టమైనవాడు. మా తండ్రిగారి మరణం తరువాత మా అందరి అంగీకారం తోనే వాలి వానర మహారాజు అయ్యాడు.

ఒకప్పుడు దుందుభి కుమారుడైన మాయావికి, మా అన్నకు మధ్య ఒక స్త్రీ కారణంగా వైరము కలిగింది. ఒక అర్ధరాత్రి అందరము గాఢ నిద్రాగతులమై ఉండగా, మాయావి కిష్కింధా నగర ద్వారంలో నిలబడి మహా భయంకరంగా గర్జిస్తూ, వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు. నేను, అంతఃపురస్త్రీలందరు, ఎంత వారించినా వినక, మాయావి గర్జనలను విని సహింపజాలని వాలి ఒక్క ఉదుటున మాయావిపైకి ఉరికాడు. నేను కూడ మా అన్నను విడిచి ఉండలేక, ఆయనను అనుసరించాను.

అయితే మా అన్నదమ్ములిద్దరిని ఆహవంలో తీరా చూచాక మాయావి మనస్సు భయాక్రాంతమైంది. ఆయన పారిపోతూ ఆ రాత్రి చంద్రకాంతిలో గడ్డితో కూడిన ఒక దుర్గమ గుహలోకి దూరాడు.

వానిని అలా గమనించిన వాలి – నన్ను బిలద్వారము దగ్గరే నిలబడుమని, తాను తిరిగి వచ్చేదాకా వేచి ఉండుమని చెప్పి, నేను ఒట్టు పెట్టినా వినక తాను గూడ ఒట్టుపెట్టి ఆ గుహలోకి ప్రవేశించాడు.

వారి యుద్ధము ఒక సంవత్సరము దాకా సాగింది. గుహలో నుండి మాయావి, ఆయన అనుచరుల అరుపులు మహాభయంకరంగా వినవచ్చాయి. వాలి ధ్వని వినరాలేదు. కొంత సమయం తరువాత ఆ బిలం నుండి రక్తస్రావము బయటకు రాసాగింది.

ఒకవైపు మాయావి అరుపులను వింటూ, మరొకవైపు బిలము బయటకు వస్తున్న రక్త ప్రవాహాన్ని గమనించిన నేను భయాక్రాంతుడనై వాలికే ఏదైనా ప్రమాదము కలిగిందేమో అనుకొన్నాను.

మా అన్నపై నాకున్న ప్రేమ ఆ అనుమానానికి కారణమైంది.

"అతి స్నేహః పాపమాశంకతే" (అధిక ప్రేమ ప్రమాదాన్ని ఆశంకిస్తుంది) కదా. మాయావి ఆ గుహ నుండి బయటకు రాకూడదనుకొని, ఆ బిలద్వారాన్ని కఠినశిలలతో మూసివేసి కిష్కింధకు తిరిగి వచ్చాను.

కిష్కింధా వాసులెవ్వరికి, నా మనస్సులోని మర్మాన్ని బయటపెట్టకుండా నాలోనేనే అన్న మరణానికి ఏడుస్తూ రహస్యంగా వాలికి సలిలక్రియలను జరిపాను.

అయితే ఏ రహస్యమైనా ఎల్లకాలము దాగదు. అందులో అయిన వారి వద్ద అసలే దాగదు. మంత్రులు, మా వాళ్లు నన్ను క్రుచ్చి క్రుచ్చి వాలి విషయం అడిగారు. ఆప్తులైన వారికి నా మనస్సులో దాచుకొన్న రహస్యాన్ని విప్పి చెప్పక తప్పలేదు.

కిష్కింధలో వానరగణమంతా, "రాజులేని రాజ్యము అరాజకమై అల్ల కల్లోలమై, అనేక ఛిద్రాలకు ఆలవాలమవుతుంద"ని నిర్ణయించి, నన్ను నిర్బంధించి రాజ్యాభిషిక్తుని కావించారు.

ఒకవైపు అన్న విషయంలో విచారంతో ఉంటూనే, మరొకవైపు మంత్రుల మంత్రాంగ సహాయముతో నేను నిమిత్తమాత్రుడనై న్యాయపాలన కావించాను.

అయితే కొంతకాలము తరువాత మా అన్న మాయావిని సంహరించి హఠాత్తుగా కిష్కింధకు వచ్చాడు. అంత కాలానికి మా అన్నను ప్రాణాలతో క్షేమంగా చూచిన నా ఆనందం కట్టలు త్రెంచుకొంది. అయితే ఆయన భయంకరాకారమును చూడగానే నా పై ప్రాణాలు పైననే ఆవిరై పోయాయి.

నేను వెంటనే నా కిరీటాన్ని ప్రక్కకు పెట్టి, సింహాసనం దిగి వచ్చి మా అన్న పాదాలపై వ్రాలాను. అంత కాలానికి ప్రాణాలతో క్షేమంగా తిరిగి వచ్చిన సోదరుని పాదాలను ఆనందాశ్రువులతో అభిషేకించాను.

మంత్రులందరు వాలి ముందు మోకరిల్లి "చాలకాలము వరకు వాలి కొరకు వేచి ఉండి, ఆయన తిరిగి రానందున మాయావి చేత నిహతుడైనట్లు భావించి, సుగ్రీవుని నిర్బంధించి రాజుగా చేశామ"ని నివేదించారు.

నేను వెంటనే రాజకిరీటాన్ని, శ్వేతఛత్రాన్ని, వాలవ్యజనాన్ని వాలి పాదాల ముందుంచి, అంజలి ఘటించి, తలవంచి నన్ను క్షమించుమని, తత్క్షణమే రాజ్యాధికారాన్ని స్వీకరించుమని ప్రార్థించాను. ఆయనకు ఎల్లకాలము అనుచరుడిగానే ఉండి, నేను నా సహచరులందరము విధేయులమై సేవిస్తుంటామని ప్రార్థించాను.

అయితే ఆగ్రహావేశాలతో ఊగిపోతున్న వాలి నా ప్రార్థనలను పట్టించుకోలేదు. ఆయన ప్రజానీకము, సచివవర్గము వైపు తిరిగి "వానరోత్తములారా! మాతమ్ముడి కపట ప్రేమను, క్రూర స్వార్థ బుద్ధిని గమనించండి.

మాయావి నన్ను సమరానికి ఆహ్వానిస్తే, తోడుగా రమ్మని నేను మా తమ్ముడిని పిలువలేదు. తనకు తానే నన్ను అనుసరించినందు వలన నా పట్ల అనురాగంతో అనుసరించాడనుకొన్నాను.

మాయావి మమ్ములనిద్దరిని చూచి పారిపోతూ ఒక గిరి గుహలో దూరాడు. నేను మా తమ్ముని బిల ద్వారము దగ్గరే నేను తిరిగి వచ్చేదాకా వేచి ఉండుమని ఆజ్ఞాపించి బిలము లోపలికి వెళ్లి మాయావిని ఎదుర్కొన్నాను. నా దెబ్బలను తట్టుకోలేక మాయావి పెడబొబ్బలు పెట్టసాగాడు. ఆయన రక్తము కాలువలు కట్టింది. నేనా మాయావిని మట్టుపెట్టాను. బిలం నుండి బయటకు రావాలనుకొన్నాను. కాని నేను రాకుండా ఈ దుర్మార్గుడప్పటికే పెద్ద పెద్ద బండలతో ఆ ద్వారాన్ని మూసివచ్చాడు. నా బలమంతా ఉపయోగించి ద్వారాన్ని బద్దలు చేసి ఏదో రకంగా బయటపడ్డాను. ఇక్కడికి వచ్చి చూచేవరకు ఈ దురాత్ముడు తల్లి వంటి వదిన తారను చేపట్టి సింహాసనాసీనుడయ్యాడు.

ఈ దుర్మార్గుడు మూడు ఘోర నేరాలు చేశాడు : (1) రాజాజ్ఞను ఉల్లంఘించడం (2) రాజద్రోహము కావించి సింహాసనాన్ని ఆక్రమించడం. (3) బ్రదికి ఉన్న రాజుకే పిండాలు పెట్టడం. ఈ మూడు నేరాలలో (1) మొదటి దానికి కారాగారవాసము (2) శిరచ్ఛేదము. రెండవ దానికి, (3) మూడవ నేరానికి పది కొరడాదెబ్బలు శిక్షలుగా విధింపబడుతున్నాయని హుంకరించాడు వాలి.

రాజసైనికులు నన్ను పట్టుకోవడానికి ప్రయత్నించగా హనుమ భీకరాకారముతో వాళ్లకు అడ్డు నిలిచాడు. నా సచివులు, ప్రజలు కూడ నాకు సహాయంగా నిలిచారు.

పరిస్థితిని గమనించిన వాలి తన ధోరణిని మార్చుకొని ఇలా అన్నాడు. "సుగ్రీవుడు నేను మరణించానని ఎలా నిర్ణయించుకొన్నాడు? నా శవాన్ని చూచాడా? పోనీ నా అరుపులైనా విన్నాడా? దుందుభి అరుపులు విని, బయటకు వచ్చే రక్తాన్ని చూచి నేను చనిపోయానని అనుకోవడమేనా?

లోకంలో తమ ఎదుటే చనిపోయిన వ్యక్తిని చూచి కూడ కాళ్లు చేతులు పూర్తిగా చల్లబడ్డాయా? శ్వాస పూర్తిగా ఆగిపోయిందా? తెల్లగ్రుడ్డు పైకి వచ్చిందా? ఇలా ఎన్నో చూచాక, మరణించినట్లు ధృవపరుచుకొంటారు కదా!

ఈ స్వార్థపరుడు ఇవేవీ లేకుండానే నేను మరణించినట్లు నిశ్చయానికి వచ్చాడు. అంతే కాదు బ్రతికి ఉన్న నాకే సలిల క్రియలు జరిపి అందరిని నమ్మించాడు. నిజానికి ఆయన పెట్టినపిండాలకు అర్థమేమిటి? నేను ప్రేతనైతే కదా తినేది.

వీడింత దుర్మార్గము చేసినా, దుర్భర ద్రోహము చేసినా వీడిపట్ల తమ్ముడన్న మమకారము నాకు పోవడం లేదు. అందువలన కొరడా దెబ్బలు, శిరచ్ఛేదం, కారాగారము వంటి కఠిన శిక్షలు విధించకుండా తక్షణమే ఏకవస్త్రుడిగానే దేశం నుండి బహిష్కరిస్తున్నాను. నా తారను వాడు చేపట్టినందుకు ప్రతిగా వాడి భార్యను రుమను నేను స్వీకరిస్తున్నాను" అని హుంకరించి వాలి నన్ను అతి క్రూరంగా ముష్టి ప్రహారాలతో, పాదఘాతములతో తన్ని తరిమి వేశాడు. ఆయన భయంతో అనేక దేశాలకు పారిపోయి చివరికీ ఋష్యమూకాన్ని ఆశ్రయించాను. నా నలుగురు సచివులు ఆపదలో నన్ను ఒంటరిగా వదలక అనుసరించారు.

"రామచంద్రా! లోకంలో ఏ అన్నలైనా తమ అనుగు తమ్ములను, దాసులును రాళ్లరప్పలపై పడగా తరుముతుంటారా? మీ అన్నతమ్ములను కూడ చూస్తున్నానే. మీ తమ్ముడు నీకు పనులు చేస్తూ ఎక్కడ అలసిపోతాడో అని నీ కనులలో ఆతురత కనిపిస్తుంది. ఆయన పట్ల నీ నయనాల్లో వాత్సల్యానురాగాలు తొణికిస లాడుతాయి.

వాలి భయంతో క్షణమొక యుగంగా బ్రతుకుతున్న నా దుస్థితిని గమనించి నన్ను కాపాడే బాధ్యత నీదే సుమా!" అని సుగ్రీవుడు శ్రీరాముని శరణు వేడాడు. దరహాసంతో శ్రీరామభద్రుడు సుగ్రీవుని దరిజేర్చుకొని అతనికి అభయమొసగాడు.

సుగ్రీవుడంటే మంచి కంఠము కలవాడు. గ్రీవము లేక కంఠము శబ్దోచ్చారణకు సమర్థమైనది. అందువలన సుగ్రీవుడంటే వేదాధ్యేత అని అర్థము.

వేదార్థాన్ని మనస్సులో నింపుకొని విశుద్ధమైన ప్రవర్తన గలవాడు ఆయన. కంఠస్థానంలో "విశుద్ధచక్రము" ఉంటుంది కదా? విశుద్ధ హృదయుడైన సుగ్రీవుడు తండ్రి మరణించగా అందుకే అన్నను రాజుగా అభినందించాడు. ఒంటరిగా అన్నను వదలజాలక మాయావితో యుద్ధానికి అన్నకు తాను తోడయ్యాడు. మాయావే జయించి వస్తాడేమో అని ద్వారాన్ని బంధించాడు.

రాజులేక రాజ్యము అల్లకల్లోలము అయిపోతుందని మంత్రుల నిర్బంధముపై తనకు ఇష్టంలేకున్నా, రాజ్యకిరీటాన్ని ముళ్లకిరీటంగా ధరించాడు. వెంటనే తన పాలనాధికారాన్ని నిష్కంటకం చేసికోవడానికి ప్రయత్నించక "సుమంత్రుల" మంత్రాంగము సహాయంతో ప్రజలను కన్నతండ్రి వలె న్యాయబద్ధంగా ప్రశాంతంగా పాలించాడు.

వాలి మాయావిని సంహరించి కిష్కింధకు తిరిగి వచ్చాక, రాజ్యాధికారాన్ని తృణప్రాయంగా భావించి, వాలి పాదాల ముందు మోకరిల్లి, రాజ్యకిరీటాన్ని కానుకగా అన్నకు సమర్పించాడు.

అంతేకాదు తాను సహృదయంతో ద్వారబంధం కావించి రావడం, ఒకవేళ వాలికి ఆగ్రహాన్ని తెప్పిస్తే అది తనకు తెలియకుండా జరిగిన తప్పిదమని, దానిని నిండుమనస్సుతో, సోదర ప్రేమతో క్షమించుమని సుగ్రీవుడు వాలి పాదాలపై పడ్డాడు.

కిష్కింధలోని మంత్రులు, వానర జనమంతా, తారా సహితంగా సుగ్రీవుని క్షమించుమని ముక్తకంఠంతో ప్రార్థించారు.

ఇక అంతకంటే ఎక్కువగా ఏ అనురాగపూరితుడైన అనుజుడైనా చేయగలిగిందేమిటి? సుగ్రీవుని కంటె మించిన సజ్జనుడు ఎవ్వరుంటారు? పాపము అనుజుడుగా ఆయన చూపించిన అనురాగానికి అన్న అయిన వాలి నుండి ఆయన పొందిందేమిటి? ప్రాణభీతి, చావుదెబ్బలు, భార్యావియోగము.

ఇదంతా సుగ్రీవుని విశుద్ధ హృదయానికి నిదర్శనము.

ఇక సుగ్రీవుని జ్ఞాన సంపదను పరిశీలిద్దామా!

సుగ్రీవుడు సహజ సంస్కారి. దానికి తోడు జ్ఞానము ఆయన ప్రవర్తనకు మెరుగుపెట్టింది.

మొట్టమొదట ఋష్యమూకం నుండి రామలక్ష్మణులను దూరంగా చూచినప్పుడు వాలి భయము ఆయన మనస్సును పనిచేయనీయలేదు. ఆయన జ్ఞాన కుసుమం వికసించ లేదు. అందువలన ఆయన వారిద్దరిని వాలి అనుచరులుగా శంకించాడు.

సచివుడైన హనుమ, రామలక్ష్మణులను గురించి తెలియజేసిన తరువాత ఆయన రామలక్ష్మణులను పూర్తిగా విశ్వసించాడు. రాముని రక్షకునిగా ఆశ్రయించాడు. రాముని కొత్తవానిగా భావించక, మిత్రునిగా నమ్మి, తన జీవిత రహస్యాలను, వాలి జీవిత సంఘటనలను వెల్లడించాడు.

సాధుపరిత్రాణము కొరకు అవతరించిన పరమాత్మగా శ్రీరాముని గుర్తించి, తన ఆకించిన్యము, అనన్య గతిత్వములను ముందుంచుకొని తన రక్షాభారాన్ని ఆయనపై పూర్తిగా వదిలాడు. భారాన్ని రక్షకుని చేతిలో వదలి ఉండడాన్ని "భరన్యాసము" అంటారు. ఈ భరన్యాసాన్ని అన్ని తపస్సుల కంటే అతిశ్రేష్ఠమైనదిగా భావిస్తారు. "న్యాసమేషాం తపసాం అతిరిక్త మాహుః" శరణాగతి యొక్క ముఖ్య లక్షణము భరన్యాసమే.

ఈ విధంగా వాలి పట్ల అంతవరకు సుగ్రీవుని ప్రవర్తన ఆయన విశుద్ధ హృదయాన్ని తెలుపగా, శ్రీరాముని ఆశ్రయించడం ఆయన విశుద్ధ జ్ఞానాన్ని తెలియజేస్తుంది.

× × ×

ఇక వాలి వర్తనమును గమనిద్దామా!

"వలత" ఇతి వాలీ" అని వాలి శబ్దవ్యుత్పత్తి. వలవలె చుట్టు ముట్టేవాడు. ఆక్రమించే వాడు అని అర్థము.

రావణుడంతటి లోకభయంకర రాక్షసుని తోకతో చుట్టి పట్టి, నాలుగు సముద్రాల నీళ్లు త్రాగించడం వాలికి కాక మరొక వీరునికి సాధ్యమేనా?

హిమవంతుని, సముద్రుని వంటి పూర్ణ వ్యక్తులతో, మహా మహులతో తొడలు గొట్టి కయ్యానికి కాలుదువ్విన మహావీరుని దుందుభి వంటి మొరటు రాక్షసుని మట్టుపెట్టి, ఆయన శరీరాన్ని యోజన దూరం వరకు విసరి వేయడం వాలికి తప్ప అన్యవీరులకు అసాధ్యము కాదా!

మాయావితో సంవత్సర కాలము సుదీర్ఘ సమరము జరిపి, ఆతని వీర్యాన్ని ప్రాణాలను హరించడం అనన్య సామాన్యము కాదా!

ఈ సంఘటనలన్ని వాలి యొక్క అవక్ర పరాక్రమానికి, ఆక్రమణ శీలానికి నిదర్శనలు.

ఇక వాలి యొక్క జీవితంలో మరొక కోణాన్ని ఆవిష్కరిద్దామా! "వాలః అస్యాస్తీతి వాలీ" తోక గలవాడు వాలి. తోక పశుత్వానికి చిహ్నము. వాలి జీవితం కూడ పశుత్వానికి, జ్ఞానహీనతకు పరాకాష్ఠ. జ్ఞాన హీనమైనది పశువే కదా!

వాలము లేక తోక వానరులందరికి సహజమే. అయినా అందరికి "వాలి" అనే పేరు లేదు. వాలి ఒక్కడికే ఆ పేరు ఉంది. కారణము వారందరికంటె అత్యధిక పశుత్వము ఆయనలో ఉండడమే.

× × ×

తండ్రి మరణం తరువాత తాను రాజైనప్పుడు మనస్ఫూర్తిగా అభినందించిన అనుజుడు, మాయావితో పోరులో ఒంటరిగా తనను వదలక, అర్ధరాత్రి అని కూడ అనుకోకుండా తనను అనుసరించిన అనురాగశీలి, మాయావి అరుపులను, రక్త ప్రవాహాన్ని గమనించినప్పుడు వాలి మరణించాడేమో అని దుఃఖించిన ప్రేమశీలి. రాజ్యహితాన్ని కాంక్షించి, మాయావి తిరిగి రాకుండా ద్వార బంధము కావించిన అనవరత దేశభక్తుడు, ప్రజాహితశీలి అయిన సుగ్రీవుని అపార్థం చేసికోవడం, అంతటితో ఆగక ఆయనను చంపడానికి యత్నించడం, కూతురు లాంటి మరదలును రుమను చెరపట్టడం, తమ్ముని దేశ బహిష్కృతుని కావించడం వాలి పశుత్వానికి ప్రతీకలే కదా!.

-- ఇతిశం --

"ప్రియతముడైన తమ్ముని" సరే! యెవరినైనను
"దాసభావభారయుతుని నేలపోనడిచి!
రాళ్లల రప్పల నుండనిత్తురా"

"కొండంత మేను చీమ (అ)ంత మనస్సా?"

"అహంకారంతో ఆకాశాన్ని అంటేలా ఎగిసి
పోతావే? తక్షణమే నేలపై విరిగి పడతావే"

నిజానికి మహామహిమోపేతులైన వారెక్కడ అల్పుడవైన నీవెక్కడ?"

"వాళ్లిద్దరు నిన్ను వెఱ్ఱివెంగళప్పను చేశారు"

# వాలి పరాక్రమము

శ్రీరామచంద్రస్వామి అభయ వాక్యాలను విన్న సుగ్రీవుడు ధైర్య స్థైర్యాలు గల్గి, "రామభద్రా! నీవు నిస్సంశయంగా నీ జ్వలద్బాణాలతో యుగాంత భాస్కరునివలె వాలిని భస్మం చేయగల్గుతావు.

అయితే వాలి బలాన్ని కూడ నీవు అవధానంతో విను:- (1) ప్రతిరోజు సూర్యోదయానికి ముందు బ్రాహ్మీముహూర్తంలో లేచి పశ్చిమ, పూర్వ, దక్షిణోత్తర సముద్రాలలో స్నానం చేసి, ప్రాత స్సంధ్యావందనమాచరించి, సూర్యోదయం వరకే ఇంటికి వచ్చేవాడు. అది ఆయన గమనశక్తి.

(2) ఎత్తైన పర్వత శిఖరాలను బంతులవలె పైకి ఎగురవేసి, వాటిని క్రింద పడకుండా పట్టుకొనేవాడు. అది ఆయన హస్త చాతుర్యము.

(3) వనాలలోని మహావృక్షాలను తన పరాక్రమంతో ఊపి ఒకే ఊపులో ఒక్కొక్క చెట్టును ఆకులు లేకుండా రాల్చేవాడు. అది ఆయన బాహు శక్తి.

ఒకప్పుడు "దుందుభి", అనే రాక్షసుడు మహిషాకారంతో, కైలాస శిఖరమంత ఎత్తైన శరీరముతో, సహస్ర గజబలంతో, వీర్యోద్రేకంతో, వరబలంతో సముద్రుని సమీపానికి వెళ్లి అతనిని యుద్ధానికి ఆహ్వానించాడు.

"తాను సతతము సమున్నత తరంగాలతో అల్లకల్లోలంగా ఉంటానని, సమరం చేయడానికి తగిన స్థైర్యము తనకు లేదని, శంకర శ్వశురుడైన హిమవంతుడు మహాపరాక్రమ వంతుడని, అతడు మహిషాకృతుడైన అతనితో పోరాడగల స్థిరుడని సమర్థుడని" సముద్రుడు దుందుభికి తెలిపాడు. దుందుభి పకపక నవ్వి "సముద్రా! భూమిచుట్టు అంతటా నీవే ఆక్రమించావే! అహంకారంతో అలలతో ఆకాశాన్ని అంటుతున్నావే! ఇదేనా నీ పరాక్రమము?" అని దుందుభి అపహసించాడు.

దుందుభి రాక్షసుడు హిమవన్నగము వద్దకు వెళ్లి మహాగజ సదృశాలైన ఆ సమున్నత పర్వత శిఖరాలను పెకిలించి పైకి ఎగురవేస్తూ, బంతులవలె వాటిని భూమిపైకి విసిరి వేశాడు. అప్పుడు అల్లకల్లోలమైన ఆ పర్వత రాజు, "తాను పార్వతీ, పరమేశ్వరులకు, సురులకు, ఋషులకు అనవరతము ఆశ్రయమిస్తుంటానని, స్థిరంగా ఉండవలసిన తాను ఆయనతో ఆహవానికి పరుగెత్తడానికి అసమర్థుడనని తెలిపాడు. దుందుభితో ప్రతి ద్వంద్వ యుద్ధాన్ని అందివ్వగల అత్యంత సమర్థుడు శక్రసుతుడు, శక్ర పరాక్రముడు,

మల్ల బలశాలి అయిన వాలే అని, అతడు నముచితో వాసవుని వలె సముచిత సమరాన్ని సలుపగలడని తెలిపాడు. "బలే బలే పర్వతరాజా! కొండంత శరీరము గలవాడవు, చీమంత పిరికి మనస్సు నీది" అని హిమవంతుని అసురుడు అధిక్షేపించాడు.

క్రోధావిష్టుడైన దుందుభి, తక్షణమే కిష్కింధ పైకి దాడి వెడలి, వర్షకాల నీలమేఘము వలె, దుందుభి వాద్యము వలె మహాధ్వని చేస్తూ, మహావృక్షాలను విరిచి వేస్తూ తన డెక్కలతో భూమిని బ్రద్దలు చేస్తూ, కొమ్ములతో నగరద్వారాన్ని దర్పంగా కుమ్ముతూ వికటాట్టహాసంతో వాలిని యుద్ధానికి ఆహ్వానించాడు.

తారల మధ్య సుధాకరుని వలె అంతఃపురంలో తారాది వరాంగనల మధ్య వాలి మైమరచి మత్తుగా ఉన్నాడు. హఠాత్తుగా దుందుభి చేస్తున్న సంరంభాన్ని భయంకర గర్జనలను విని అమరపతి సుతుడు ఆగ్రహోదగ్రుడై బయటకు పరుగెత్తి వచ్చాడు.

అసహనంతో "దుందుభీ! మహిషాధమా! వ్యర్థంగా నగరము వెలుపల ఎందుకు అంతగా అరుస్తున్నావు? నాకు నీవు తెలుసు, నీ బలము తెలుసు. నిన్ను సముద్రుడు, హిమగిరీంద్రుడు వెఱ్ఱి వెంగళప్పను చేశారు. నిజానికి మహామహిమోపేతులైన వారెక్కడ? అల్పుడవైన నీవెక్కడ? నన్ను ఆహవానికి ఆహ్వానిస్తున్నావా? అది నీకు మరణాహ్వానమే కాగలదు. నీ చావును నీవు తప్పించుకోలేవు" అని వాలి ఆవేశంగా గర్జించాడు.

మహిషుడప్పుడు మహాగర్వంతో, "వాలీ! వనితల మధ్య ప్రగల్భాలు పలుకుతున్నావా? అది వీరుల లక్షణం కాదు. అయినా రాత్రి పూట రమణీమణులతో రహస్యక్రీడలో మత్తునివై ఉన్నావు. మత్తునితో, ప్రమత్తునితో (పరాకుతో ఉన్నవానితో) సుప్తునితో సమరం చేయడం అంటే భ్రూణ హత్య కావించినంత మహాపాపము. అందువలన మోహపరవశు డవైన నీవు ఈ రాత్రి నీ స్త్రీలతో ఆనందాన్ని అనుభవించు. రేపు సూర్యోదయం కాగానే నాతో సమరానికి సమాయత్తమై రా!" అని అధిక్షేపించాడు.

వాలి అప్పుడు వికటాట్టహాసం కావించి, స్త్రీ సంగాన్ని తక్షణమే విసర్జించి, "ఓరీ దుర్మతీ! దుందుభీ! నిద్రామత్తునిగా నన్ను భావించి నిర్భయంగా నీకు ఇష్టము వచ్చినట్లు ప్రలాపాలు పలుకుతున్నావా? ఎంత సుఖాసక్తుడైనా వాలి సర్వదా సమరానికి సన్నద్ధుడేరా!" అని పలుకుతూ, తన తండ్రి అయిన మహేంద్రుడు ప్రసాదించిన కనకమాలను కంఠంలో ధరించి, తక్షణమే యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు.

పర్వత ప్రమాణంతో మహిషాకారుడైన దుందుభి కొమ్ములను వాలి పట్టుకొని దుందుభిని నేలకు కొట్టాడు. వాడి చెవుల నుండి అమితంగా రక్తము రాసాగింది.

అయినా కారే రక్తాన్ని కూడ లెక్కచేయక, దుందుభి తన డెక్కలతో వాలిని తొక్కుతూ, కొమ్ములతో పొడుస్తూ కాళ్లతో తన్నసాగాడు. వాడిని నిగ్రహించి శిలలతో, చెట్లతో, పాదాలతో పిడికిలి దెబ్బలతో వాలి వాడిని బాధించాడు.

వాలి, దుందుభుల మధ్య సమరము భీకరంగా సాగింది. అయితే అక్షీణ బలుడైన వాలి పరాక్రమం క్రమంగా అధికం కాసాగింది. అసురుని పరాక్రమం అస్తమించింది. వీర్యధైర్యాలతో, అవక్ర విక్రమంతో వాలి దుందుభిని పైకెత్తి నేలకు గట్టిగా కొట్టాడు. అప్పుడు దుందుభి ఎముకలు పిండి పిండి అయి రక్తం క్రక్కుతూ, వాడు అసువులను పాసిపోయాడు.

అనంతరం వాలి మహాబలంతో ఆ దుందుభి దేహాన్ని పైకెత్తి, చేతులతో బలంగా ఊపుతూ దూరంగా విసరివేశాడు.

ఆ శవము వాలి బాహు వేగ బలానికి, గాలి వేగానికి రక్తాన్ని కారుస్తూ, అక్కడికి యోజన దూరంలో ఉన్న ఋష్యమూక పర్వతం పైన ఉన్న 'మతంగాశ్రమం" పై వెళ్లి పడింది. నిశ్చల తపో నిమగ్నుడైన మతంగ మహాముని కళ్లు తెరచి, రక్తసిక్తమైన దుందుభి దేహాన్ని గమనించి ఆగ్రహావిష్టుడై "ఈ శవాన్ని ఇలా దుర్మదాంధుడై విసరి వేసిన వాలి ఈ పర్వతము పైకి రాకూడదు, ఒకవేళ నా ఆజ్ఞను అలక్ష్యం చేస్తే, అసువులతో ఉండలేడు, వాలే కాకుండా ఆయన అనుచరులైన వారెవ్వరైనా ఈ ఋష్య మూక పర్వతంపై ఉంటే వాళ్లు తత్ క్షణమే ఈ పర్వతాన్ని వదలాలి లేకుంటే వాలికిచ్చిన శాపమే వాలి అనుచరులకు కూడ వర్తిస్తుంద"ని శపించాడు.

ఈ శాపవార్తను తెలిసికొన్న వాలి స్వయముగా మతంగ సంయమీంద్రుని సందర్శించి సాష్టాంగంగా ప్రణమిల్లి, మహర్షిని అనునయిస్తూ తన శాపాన్ని ఉపసంహరించుమని ప్రాధేయపడ్డాడు. అయినా మతంగ మహాముని వాలివైపు చూడకుండానే ఆశ్రమంలోకి ఆగ్రహంతో వెళ్లిపోయాడు.

అప్పటి నుండి వాలి శాపభీతితో ఈ ఋష్యమూకం పొలిమేరలనే సమీపించ లేదు, ఆ విషయం తెలిసికొన్న నేను ధైర్యంగా ఈ పర్వతాన్ని ఆశ్రయించాను. వాలి భయం నుండి కొంతవరకైనా తప్పించుకొన్నా"నని సుగ్రీవుడు తెలిపాడు.

ఆ విషయం విన్న శ్రీరాముడు ఆశ్చర్యచకితుడై "అదేమిటి సుగ్రీవా! మహర్షుల మాట వజ్రముకన్న కఠినమైనా, మనస్సువెన్న కన్నా మెత్తగా ఉంటుంది కదా! మరి వాలి మౌనిపాదాలపై వ్రాలి ప్రాయశ్చిత్తాన్ని ప్రకటించుకొన్నా మౌని మనము ఎందుకు కరుగలేదు?" అని ప్రశ్నించాడు.

అప్పుడు సుగ్రీవుడు, "రామభద్రా! వాలికి గర్వమధికము. ఆయన ఆది నుండి దుర్మార్గుడే.

మతంగ మహాముని ప్రాణప్రదంగా పెంచుకొన్నది ఈ మొత్తము పంపావనము. ఒక్కొక్క చెట్టు చిగురించి, పూలు పూచి, కాయలు కాచి, ఫలిస్తే మహాముని ఆనందంతో గంతులు వేసేవాడు. అందులో ఆ మునికి సప్తసాలములంటే మరీ మక్కువ.

అటువంటి సప్తసాలాలు ప్రతి సంవత్సరము చిగురించి ఆకులు వేయగానే, ఒక్క ఆకు కూడ లేకుండా వాటిని వాలి రాల్చి మొండిచెట్లుగా మార్చి అదేదో ఘనకార్యమైనట్లు విజయోత్సవాలు జరుపుకొనేవాడు.

ఆ విధంగా ప్రతి సంవత్సరము మౌని మనస్సు గాయపడింది. అయినా అది "ఏదో కోతిచేష్ట కదా!" అని సమాధానపడేవాడు. ఇప్పుడేమో అప్పుడే రక్తము కారుతుండే దుందుభి పచ్చి శవాన్నే విసిరి ఆశ్రమం పైకి వేశాడు. అందుకే తపోనిష్ఠాగరిష్ఠుడైన ఆ మహాతపస్వి ఆగ్రహంతో తన పవిత్రాశ్రమాన్ని మలినము కావించిన వాలి ఆ ప్రాంతానికి వస్తే తల పగిలి చావాలని కఠోరంగా శపించాడు. అప్పుడు వాలి వచ్చి ప్రాధేయపడినా, ఆయన పూర్వకృత్యాలను కూడ స్మరించుకొని వాలి పట్ల జాలి చూపలేదు" అని తెలియజేశాడు.

ఇప్పుడు వాలికి మతంగ మౌని ఇచ్చిన శాపంలోని వేదాంతార్థాన్ని గమనిద్దాము. ఋష్యమూకము మతంగమహాముని ఆశ్రమ ప్రాంతానికి సంబంధించింది. ఇక్కడ మతంగుడు, మిగిలిన ఋషులు మౌనంతో నిశ్చల తపస్సులో నిమగ్నులయ్యేవారు. అందుకే "ఋషుల మూక (మౌన) స్థితికి" మూలమైన ఈ ప్రాంతానికి ఋష్యమూకమని పేరు కలిగింది.

"వలత ఇతి వాలీ" అని వాలి శబ్దోత్పత్తి. "వల" వలె "అల్లుకొనేవాడు" చుట్టుముట్టేవాడు అని వాలి శబ్దానికి అర్థము. మహాపరాక్రమోపేతుడైన వాలి శత్రువులను వల వలె ఆక్రమించేవాడు.

మనకు తెలియకుండా మనస్సును అల్లుకొని ఆక్రమించే వల వంటిది మాయ. వాలి అంటే మాయ. మాయ ఎంత గొప్పదైనా జ్ఞానాన్ని అది ఆవరించ లేదు. జ్ఞానాన్ని ఆక్రమించడానికి ముందుకొస్తే మాయ మసి అయిపోతుంది. అందువలననే ఋష్యమూకంపై తన పరాక్రమాన్ని ప్రదర్శించిన వాలి మతంగ మహాముని శాపగ్రస్తుడయ్యాడు.

"మతంగుడు" అంటే వైదిక మతాన్ని అనుసరించే మహర్షి. ఆయన అఖండమైన వేద విజ్ఞానానికి ప్రతీక. ఆయన వాలికి ఇచ్చిన శాపము తిరుగులేనిది. జ్ఞానము మహిమాన్వితమై – మాయను నిరోధిస్తుందని మౌని శాపార్థము.

సుగ్రీవుడు తన సంభాషణను కొనసాగించాడు "రామభద్రా! రావణుని కూడ నాలుగు సముద్రాల నీళ్లు త్రాగించిన వాలి పరాక్రమానికి సప్త సాలాలను పత్ర రహితం కావించడము, దుందుభి శరీరాన్ని రెండువందల ధనువుల దూరము విసరివేయడం అనే రెండు అద్భుత చర్యలు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచాయి. అంతటి అవక్ర పరాక్రమశాలిని నీవు నిర్జింప గలుగుతావా? ఆలోచించుకొమ్మని నిత్య పరాక్రముడైన శ్రీరాముని సామర్థ్యాన్ని సుగ్రీవుడు సందేహించాడు. శ్రీరాముని పరాక్రమము నిత్యము. ఇతర వీరుల పరాక్రమాల వలె దానికి ఆద్యంతాలు లేవు.

**"సుగ్రీవః శంకితశ్చా సీత్ నిత్యం వీర్యేణ రాఘవే".**

అప్పుడు మొలకెత్తిన చిరునవ్వుతో, "సుగ్రీవా! నీ సంశయము తీరాలంటే మా అన్న ఏమి చేయాలో చెప్పుమ"ని సౌమిత్రి అడిగాడు. దానికి సూర్యనందనుడు దశరథ నందనునితో "శ్రీరాముడు దుందుభి దేహాన్ని రెండు వందల ధనువుల దూరం విసరగల్గాలి. ఒకే బాణంతో సప్త సాలాలలోని ఒక వృక్షాన్ని నిష్పత్రం కావింప గల్గాలి' అని షరతు విధించాడు. కొన్ని గ్రంధాలలో వాలి సాలవృక్షాలను బాహువులతో ఊపి పత్రరహితం చేశాడని ఉంది. మరికొన్నిటిలో బాణంతో పత్ర విరహితం చేశాడని ఉంది.

శ్రీరాముడు దరహాసంతో "వానరోత్తమా! నీవు విధించిన ఈ రెండు షరతులను నీ విశ్వాసం కొరకు తప్పక అవలీలగా ఆచరింపగల్గుతాను" అని బదులు పలికాడు. **అంతేకాదు నా రాక కొరకు నిరీక్షిస్తూ నాకు ఆతిథ్యమివ్వడానికి శబరిని నిలిపి ఉంచిన మహోదారుడు మతంగముని. దుందుభి మలిన దేహాన్ని దూరంగా విసరివేసి ఆ ఆశ్రమ ప్రాంతాన్ని, నిర్మలం చేసి ఆ మహామునికి కృతజ్ఞతలను తెలుపుకొంటాను" అన్నాడు రాముడు.**

రామభద్రుడు తన బాహువులతో కాక పాదమంతటితో కూడ కాక కేవలము కాలిబొటన వ్రేలుతో దుందుభి దృఢమైన అస్థిపంజరాన్ని సంపూర్ణ దశ యోజన దూరంలోకి చిమ్మివేవాడు. ఎక్కడ సుగ్రీవుడు విధించిన కేవలము రెండు వందల ధనువుల దూరము! ఎక్కడ రామభద్రుడు దుందుభిని చిమ్మివేసిన సంపూర్ణ దశయోజన దూరము!

సుగ్రీవుడు వెంటనే రాముని అద్భుత శక్తికి విస్మయ చకితుడయ్యాడు. అయినా అప్పటికి కూడా ఆయన మనస్సులో సంపూర్ణ విశ్వాసము కుదురలేదు. అప్పుడాయన "రామచంద్రా! నీవు దుందుభి దేహాన్ని నేననుకొన్నదానికంటే అధికాధిక దూరంలో చిమ్మి వేశావు. సత్యమే. అయితే వాలి విసరినప్పుడు దుందుభి దేహము సంపూర్ణ రక్తమాంసాలతో బలంగా నిండుగా ఉండేది. ఇప్పుడది రక్త, మాంసాలు ఎండిపోయి, ఎముకల గూడుగా మాత్రమే మిగిలింది, తేలిక అయింది. అందువలన దుందుభి దేహ విక్షేపముతో నాకు నీ పట్ల పూర్తిగా నమ్మకము కుదురడం లేదు.

ఇక నా రెండవ షరతును కూడ నీవు పూర్తి చేస్తేనే, నాకు పూర్తిగా విశ్వాసం కుదురుతుంది. ఎందుకంటావా? వాలి పూర్తిగా ఆకులు రాల్చిన అవే సాలవృక్షాలు ఇప్పటికి సంపూర్ణ శాఖా, పత్రాలతో అలాగే బలంగా ఉన్నాయి. అందువలన నీవు ఒక అమ్ముతో వాలి వలె ఏదైనా ఒక మహావృక్షాన్ని నిశ్చేతనం చేయాలి" అని అడిగాడు.

రామభద్రుడు చిరునవ్వు నవ్వాడు. తన అక్షయ తూణీరం నుండి ఆశీవిష సర్పము వంటి ఒక భయంకర బాణాన్ని తీసికొని, దానిని ధనస్సులో సంధించి, ఆకర్ణాంతము లాగి ప్రయోగించాడు. అది అతి భయంకరంగా ధ్వనిని కావిస్తూ వెళ్లి ఆ ఏడు సాలవృక్షాలను ఒకేసారి కూల్చి, వెంటనే భూమిలో ప్రవేశించి, దానిని కూడ బ్రద్దలు కావించి, తిరిగి వచ్చి రామచంద్ర స్వామి అక్షయ తూణీరంలో చేరింది.

ఆ మహాద్భుతాన్ని గమనించిన సుగ్రీవుడు భయ, విస్మయాలతో స్థబ్ధుడయ్యాడు. అతని శరీరము ఆశ్చర్యంతో గగుర్పాటు చెందింది. కొంతసేపటికి తేరుకొని స్వస్థుడయ్యాడు. వెంటనే రాముని పాదాలపై వ్రాలి దండవత్ప్రణామాలను ఆచరించాడు. తడబడుతూ లేచి, నిలబడి, చేతులు జోడించి, "మహాశ్చర్యము! మహాద్భుతము! రామభద్రా! నీ పరాక్రమము అమోఘమైనది. నీవు మహేంద్రునితో సహా ముప్పై మూడు కోట్ల మంది అమరుల నందరిని అరక్షణంలో నిర్జింపగల్గిన సర్వ సమర్ధుడవు. నీకు వాలి ఒక లెక్కా? ఒకే శరముతో సప్తసాల భంజనము జరుపగల నీ ముందు ఏ వీరుడు నిలువ గలుగుతాడు? మహేంద్ర, వరుణోపముడవైన నిన్ను సన్మిత్రునిగా పొందగల్గిన నాకు ఇంకా దుఃఖమెక్కడ? వెంటనే వాలిని వధించి నా శోకాన్ని పూర్తిగా తొలగించు"మని వేడుకొన్నాడు.

శ్రీరాముడు సుగ్రీవుని ప్రేమతో బిగ్గరగా కౌగిలించుకొన్నాడు. అతనిని ఆశ్వాసించి, తాను వాలి వధకు సంసిద్ధుడనని తెలిపి, సుగ్రీవుని ముందు వెళ్లుమని తామతనిని అనుసరిస్తామ"ని అభయమిచ్చాడు.

దుందుభి పర్వతమంత ఎత్తుతో మహిషాకృతిని ధరించిన ఒక మహా రాక్షసుడు. మహిషమంటే దున్నపోతు. అది బలానికి, మొరటుదనానికి ప్రతీక. ఎదుట ఎవ్వరున్నా కాళ్లతో తన్నుతూ, గిట్టలతో తొక్కుతూ, కొమ్ములతో కుమ్ముతూ మొరటుదనానికి, క్రూరత్వానికి నిదర్శనంగా ఉంటుంది.

అంతేకాదు "మహ్యాం శేతే" ఇతి మహిషః అని వ్యుత్పత్తి. నేలపై పడుకొనేది. బురుదనేలపై పొరలేది మహిషము. దుందుభి స్వభావము కూడ నీచమైనది. బలగర్వంతో కనబడ్డ వీరుని కవ్విస్తూ, చివరకు తనకంటె బలం గలవాని చేతిలో దెబ్బలు తినడం మహిష స్వభావము.

దుందుభి అలాగే ప్రతిద్వంద్విని వెతుక్కుంటూ వెళ్లి వాలితో కయ్యానికి కాలుదువ్వి, అతని చేతిలో కీళ్లూడగొట్టుకొని మరణించాడు. శారీరక బలంలో వాలి అసమానుడు కదా. అటువంటి దుంధుభి దేహాన్ని వాలి కంటె పదిరెట్ల శక్తితో కొనగోట చిమ్మిన అలౌకిక వీరుడు శ్రీరాముడు. దుందుభి మహిషాకారుడు. మహిషము అవిద్యకు సంకేతము. దానిని అత్యంత దూరము చిమ్మడం జ్ఞానస్వరూపుడైన రామునికే కదా సాధ్యము.

సప్త సాల భంజనము కూడ పరమాద్భుతమైనది. దానిని కావించిన వాడు బలానికే బలమైన పరమాత్మ.

సప్త సాలములు అంటే మన శరీరంలోని సప్త శక్తి చక్రాలు. ఈ ఏడింటికి పైన ఉండేవాడు పరమాత్మ. వీటిని తన ఆధీనంలోకి తెచ్చుకొన్న శక్తి సంపన్నుడాయన. ఒక్క చక్రాన్ని అదుపులోనికి తెచ్చుకోవడమే అద్భుతము కదా! ఒక చక్రాన్ని దాటడమంటే ఒక మహాభూతాన్ని జయించడమే.

"సప్త సాలములు" అంటే సప్త ధాతువులు అవి కలిగిన మాయా మయ శరీరమును పోగొట్టే వాడు రామ పరమాత్మే.

దేవకి అష్టమ పుత్రుడైన శ్రీకృష్ణుడు ఏడు ఆబోతుల రూపంలో ఉన్న కాలనేమి అనుజులను పరిమార్చినట్లే స్వసంకల్పంతో మాయామయ శరీరంలో నున్న సప్త ధాతువులను నియంత్రింప గల, సప్త శక్తి చక్రాలను, స్వాధీనము చేసికోగల పరమాత్మ రూపుడైన శ్రీరాముడు సప్త సాలవృక్షాలను ఒకే అమోఘ శరముతో నేలగూల్చగల్గాడు.

-- ఇతిశం --

**"ఒక చక్రాన్ని అదుపులోకి తెచ్చుకోవడమే అద్భుతము.
ఒక చక్రాన్ని దాటడమంటే ఒక భూతాన్ని జయించడమే."**

# వాలి సుగ్రీవ సమరము

శ్రీరామ, లక్ష్మణ, హనుమలు వెనుక నడుస్తుండగా, సుగ్రీవుడు కిష్కింధానగరానికి చేరాడు. అక్కడ ఉన్న గుబురు చెట్ల మధ్య ఆ ముగ్గురు దాగుకొన్నారు. సుగ్రీవుడు వాలిని సమరానికి కాలు దువ్వుతూ నగర ద్వారము దగ్గర భయంకరంగా గర్జింపసాగాడు.

వానరేంద్రుడైన వాలి ఆ సమయంలో సంతోషంతో సుందరీ జనసమావృతుడై మద్యపానమత్తుడై ఉన్నాడు. అనుకోకుండా అప్పుడు సుగ్రీవుని సింహనాదం వాలిని అప్రమత్తుని కావించింది. అస్తమయాద్రిని అధిరోహించబోయే అరుణకిరణుడు ఆకస్మాత్తుగా ప్రకాశాన్ని పుంజుకొన్నట్లు వాలి సుగ్రీవుని సమరనాదాన్ని సహింపక సమరాంగణంలో సంరంభంతో ప్రత్యక్షమయ్యాడు.

ఆరిపోయే దీపము అంతిమంగా అధికంగా ఒక వెలుగు వెలిగి మలిగి పోతుంది. అలాగే అస్తమిస్తున్న ఆదిత్యుడు అనుకోకుండా తన ప్రకాశాన్ని హఠాత్తుగా అధికంగా విరజిమ్మవచ్చు. అయితే మలిగే దీపపు వెలుగు, అస్తమించే ఆదిత్యుని అంతిమ ప్రకాశము తాత్కాలికాలే కదా!

అలాగే వాలి తన అస్తమయం ముందు అంతిమంగా ఉద్యద్భానుని వలె సుగ్రీవుని పైకి ఉరికాడు. కుజ, బుధ, గ్రహాలు కోపావిష్టులై కలియబడినట్లు, వాలి సుగ్రీవులు పరస్పర వైరంతో పరాక్రమించారు.

పిడుగుల వంటి పిడికిలి పోట్లతో, అరి భయంకరములైన అరచేతి చరుపులతో అన్నదమ్ములు అప్రతిహతంగా ఆహవాన్ని కొనసాగించారు. అయితే క్రమంగా వాలి విక్రమం అధికమైంది. సుగ్రీవుడు బల శూన్యుడు కాసాగాడు.

సుగ్రీవుడు సూర్యవంశ ప్రదీపకుడైన శ్రీరాముని రక్షణ కొరకు నిరీక్షించాడు. కాని ఫలితము కానరాలేదు. చివరకు వాలి చేతుల్లో ప్రాణాంతకములైన దెబ్బలని తిని, తాళలేక ఋష్య మూకాచలము వైపు ఆయన పరుగులెత్తాడు. వాలి ఆగకుండా ఆయన వెంటబడ్డాడు. అయితే ఋష్యమూకం కనబడగానే శాపభయంతో వెనుదిరిగాడు. కొంతసేపు తరువాత రామ, లక్ష్మణ హనుమలు కూడ ఋష్యమూకం చేరారు. రాముని అండ లభించడం సుగ్రీవుని అహంకార పరవశుని కావించింది. ఆ అహంకారమే ఆయన పరాభవానికి కారణమైంది.

**"అపహా ఏతస్మాత్ ఇంద్రియం వీర్యం క్రామతి. యస్మైతి సంగ్రామం"**

"ఎంతటి మహావీరుడైనా అహంకారంతో ఆహవానికి వెళ్లితే అపజయం, అవమానం కలుగవచ్చు".

సూర్యనందనుడైన సుగ్రీవుడు సూర్యవంవజుడైన శ్రీరాముని ముఖాన్ని చూడడానికి ఇష్టపడలేదు. ఆయన ఆగ్రహంతో, దుఃఖంతో, అవమానంతో పరితపించసాగాడు.

తనను అనునయింప దలచిన జానకీ జానితో ఆయన, "రామచంద్రా! ఎందుకయ్యా అనేక ఆశలు కల్గించి, నన్ను రణానికి రెచ్చగొట్టి పంపించావు? వాలి నన్ను అంత క్రూరంగా కొడుతుంటే, వినోదాన్ని చూస్తూ ఉండిపోయావా? నీకేమి అన్యాయం చేశానయ్యా?" అని సుగ్రీవుడు నిష్ఠూరాలు పలికాడు.

శ్రీరాముడు సుగ్రీవుని శాంతుని చేయదలచి "వానరోత్తమా! నీవు, మీ అన్న వాలి స్వరూపములో కంఠ స్వరములో కూడ ఒకే రకంగా ఉన్నారు. మీ ఇద్దరిలో ఎవ్వరెవ్వరో ప్రత్యేకంగా గుర్తింపలేక పోయాను. అనాలోచితంగా నేను నా అమ్మును వదలితే, అది వాలిని హతము చేయక, నీకే ఏదైనా ప్రమాదాన్ని కల్గిస్తే, అది ఎంత అన్యాయము? నిన్నే సీతాన్వేషణ విషయంలో నమ్ముకొన్న మాకు వేరే దిక్కెవ్వరు? నా మిత్రద్రోహ పాపము నన్ను చుట్టుముట్టదా? నా పొరపాటును గమనించిన లోకులు నన్ను చూచి పరిహసించరా?

ఇక ముందు నీవు వాలితో సమరానికి సమాయత్తం అయినప్పుడు వాలిని, నిన్ను వేర్వేరుగా గుర్తించడానికి వీలుగా, ఏదో ఒక ప్రత్యేకమైన గుర్తును పెట్టుకో. అప్పుడు నా భయంకరమైన బాణాగ్రము వాలిని తక్షణమే వధించి తీరుతుంది" అని ఆదిత్య తనయుని ఆశ్వాసించాడు.

శ్రీరాముడు సుమిత్రానందనుని పిలిచి సూర్యనందనుని వెంటనే గుర్తించడానికి వీలుగా అతనిని గజపుష్ప మాలాలంకృతిని కావించుమని ఆదేశించాడు. లక్ష్మణుడు అగ్రజాదేశము మేరకు సుగ్రీవుని గజపుష్పమాలాగళుని కావించాడు.

అయితే శ్రీరామచంద్రుడు సుగ్రీవుని గుర్తించక పోవడానికి చెప్పిన కారణాలు అంత సమర్ధనీయంగా అగుపించవు. ఎందుకంటే?

1) వాలి, సుగ్రీవులిద్దరు కవల పిల్లలు కారు. వారిద్దరి తల్లి ఒకరే కావచ్చు. కాని తండ్రులు వేర్వేరు. వాలి మహేంద్ర నందనుడు, సుగ్రీవుడు సూర్యసుతుడు. అటువంటప్పుడు వారిద్దరి రూపాలు ఒకే రకంగా అచ్చుగ్రుద్దినట్లు ఉండవు కదా!

2) వాలి కంఠంలో మహేంద్ర వరప్రసాద లబ్ధమైన సువర్ణ మాల ఉంది. సుగ్రీవుని గళములో అటువంటి మాల ఏది లేదు కదా!

3) సుగ్రీవునితో శ్రీరామభద్రుడు అంతకుముందే కొంత కాలము కలసి ఉన్నాడు. ఆయనను చక్కగా గమనించాడు. ఆయనతో సుదీర్ఘంగా సంభాషించాడు. ఆయనతో సఖ్యం కావించాడు. అటువంటిది సుగ్రీవుని శ్రీరాముడు గుర్తింపజాలలేదా?

4) వాలి స్వంత నగరంలో నారీ జనము మధ్యలో సంతోషంగా ఉన్నాడు. ఆయన కాయము బలంగా, కాంతివంతముగా ఉంది. ఆయన నేత్రాలు మద్యపానంతో ఎఱ్ఱబారి ఉన్నాయి.

సుగ్రీవుడు దేశబహిష్కృతుడై బంధు, మిత్ర పరివార విదూరుడై, భార్యా విరహతుడై, శోకతప్తుడై, కృశించిన శరీరముతో ఉన్నాడు.

అటువంటి సమయంలో అంత సమీపంలో సుగ్రీవునితో పోరాడుతున్న వాలిని గుర్తించి ఆయనను హతం చేయడం రామభద్రునికి అసాధ్యమా? మరెందుకు వాలిని వధించలేదు? వాస్తవ కారణము సుగ్రీవుని ప్రవర్తనలో దోషమే. అదేమిటో సూక్ష్మంగా గమనిద్దామా!

సుగ్రీవుడు హనుమ ద్వారా శ్రీరామలక్ష్మణులను గురించి పూర్తిగా తెలిసి కొన్నాడు. వారు సింహ పరాక్రములని, దేవరూపులని, సమస్త భూమండలాన్ని శాసింపగల సమర్థులని, తండ్రిని ధర్మచరితుని, సత్యవాక్యుని కావించడానికి అడవికి అడుగిడిన ధర్మావతారులైన తనయులని తెలిసికొన్నాడు.

అయితే సహజమైన రాజసగుణము సుగ్రీవునిలో చోటు చేసికొంది. ఆయన శ్రీరామునితో స్నేహము చేయాలనుకొన్నాడు. తన చేయి చాపాడు. శ్రీరాముని స్నేహ హస్తాన్ని అందుకొన్నాడు. తన అవసరము తీరిందనుకొన్నాడు.

రామునికి సాలవృక్ష శాఖను ఆసనంగా సమర్పించాడు. అంతేకాదు రామునితో సమానంగా ఆ ఆసనంపైన ఆసీనుడయ్యాడు.

శ్రీరామునికి ఆసనం సమర్పించడం వరకు బాగానే ఉంది. కాని రామునితో సమానంగా తాను కూడ అదే ఆసనంపై కూచోవడమా? ఏకాసనం పై కూచోవడం సమానత్వం, సాధారణ స్నేహ ధర్మం కావచ్చు. కాని రాముని తనకు రక్షకునిగా వరించాడే? రక్షకుడైన రామప్రభువు, రక్షణను అపేక్షించిన తాను ఒకే ఆసనంపై కూచోవడం ఆశ్రిత ధర్మము కాదు కదా!

అంతేకాదు భగవంతునితో తనను సమానంగా భావించుకోవడం భగవదపచారము అవుతుంది. అది జీవులమైన మనకు ఉచితం కాదు.

అయితే రాముడు మాయా మానుష విగ్రహుడు. తన మనస్సులోని మర్మాన్ని అన్యులెవ్వరు అర్థం చేసికోలేనంతగా గాఢంగా దాచుకోగలడాయన. అందువలన సుగ్రీవుడు తనతో పాటు ఒకే ఆసనంపై కూచోవడాన్ని గమనించి కూడ, పల్లెత్తు మాట అనలేదాయన.

అంతేకాదు రాముడు సుగ్రీవుని స్నేహమును తన అవసరంగా కూడ గుర్తించాడు. అందువలన సుగ్రీవుని అపచారాన్ని చూచి కూడ ఏమి అనలేకపోయాడు.

మరొక విషయము ముందుగా రామలక్ష్మణులను వాలి చారులుగా భావించడాన్ని అర్థం చేసికోవచ్చు. కాని నిత్య సత్య పరాక్రముడైన రాముని సామర్థ్యాన్ని కూడ తక్కువగా అంచనా వేసి సందేహించాడు. సర్వశక్తిని సందేహించడం తీవ్ర భగవదపచారమే కదా!

**"సుగ్రీవః శంకితశ్చాసీత్ । నిత్యం వీర్యేణ రాఘవే"**

కాని సుగ్రీవుని దోషము అంతవరకే ఆగిపోలేదు అది భాగవతాపచారము వరకు పరిణమించింది.

రామునికి స్నేహధర్మంగానైనా సాలశాఖాసనాన్ని సమర్పించాడు. కాని రామానుజుని బొత్తిగా గుర్తించనేలేదు. సౌమిత్రిని పూర్తిగా సుగ్రీవుడు అలక్ష్యం చేశాడు. ఇది భాగవతాపచారము. ఇది భగవదపచారము కంటె పెద్ద దోషము. ఆనాడు సీతాదేవి సౌమిత్రిని దూషించి దూరంగా తరిమి, భాగవతాపచారానికి ఒడిగట్టింది. ఫలితంగా ఆమెను రావణాసురుడు అపహరించి, లంకకు తీసికొని వెళ్ళి, రాక్షసగణము మధ్య ఆడపులుల ముందు హరిణి లాగా క్రూరంగా కాపలా ఉంచాడు.

ఈనాడు సుగ్రీవుడు లక్ష్మణుని అలక్ష్యం చేసి భాగవతాపచారాన్ని మూట గట్టుకొన్నాడు. ఫలితంగా వాలి చేతిలో చావు దెబ్బలు తిన్నాడు. తప్పక రక్షిస్తానన్న రాముడు కూడ తన మాటను ఏవో చిన్న చిన్న కారణాలను చూపి తప్పుకొన్నాడు.

వాస్తవమేమిటంటే భాగవత (లక్ష్మణుని) అభిమానానికి పాత్రుడు కాని వాడు భగవంతుని (రాముని) కృపకు అర్హుడు కాడు.

అందువలననే ఆ తరువాత సౌమిత్రి కృపకు సుగ్రీవుని పాత్రుని కావించాలని రాముడు కాంక్షించాడు. లక్ష్మణుని ద్వారా గజపుష్పమాలాలంకృతునిగా సుగ్రీవుని కావించి, ఇక వాలి వధకు ఉద్యుక్తుడై, ఆయనను తిరిగి వాలితో ఆహవానికి పురికొల్పాడు.

అందుకు సుగ్రీవుడు అంగీకరించి అత్యుత్సాహంతో ధైర్య బలసమేతుడై సుగ్రీవుడు "కడిగిన ముత్యం వలె" స్వచ్ఛమైన స్వాంతంతో వాలితో పునర్యుద్ధానికి సమాయత్తమయ్యాడు.

"గజపుష్పలత" అంటే గజము వలె పెద్దవైన పుష్పములు గల లత అని అర్థము. దీనికే 'నాగ పుష్పలత' అని మరో పేరు. (గజము, నాగము సమానార్థ పదాలే)

-- ఇతిశం --

"ఎంతటి అరివీరభయంకరుడైనా,
ఆహవానికి అహంకారముతో వెళ్లితే,
అపజయము, అవమానము తప్పవు"

"భగవదభిమానానికి పాత్రుడు కాని
వాడు, భగవత్కృపకు అర్హుడు కాడు"

"నిత్య పరాక్రముడైన శ్రీరాముని వీర్యాన్నే
సుగ్రీవుడు శంకించాడు" ఎంత భగవదపచారమది!
ఫలితమే వాలి చేతిలో పరాభవము

నేను పూజించిన పెద్దల
పాదాలను నేనే చేరుకొంటాను

# సప్త జనాశ్రమ సందర్శనము

లక్ష్మణుని చేత సుగ్రీవుడు గజపుష్ప మాలా లక్షితుడైన తరువాత అతడు తిరిగి ధర్మాత్ముడైన రాముని, రామానుజుని, మిగిలిన తన అనుచరులను తీసికొని కిష్కింధా నగరానికి వెళ్లసాగాడు.

లక్ష్మణానుగ్రహము సుగ్రీవునికి లభించింది. భాగవతానుగ్రహము భగవత్ప్రీతికి కారణమవుతుంది. ధర్మాత్ముడైన రామచంద్రునికి, వాలి వధ విషయంలో ఆటంకము కనపడలేదు. వాలి వధ్యుడైన దుర్మార్గుడు. సుగ్రీవునికి సౌమిత్రి సౌహార్దము లభించింది. ఇక వాలి వధ జరుగవలసిందేనని శ్రీరాముడు నిర్ణయించాడు.

శ్రీరాముని హస్తములో కనకమయ చాపము ఉంది. ఆయన చేతిలో ఆశీవిషసర్పము వంటి శరము ఉంది. చాపము రాముని సంకల్పాన్ని, శరము సౌమిత్రి సహృదయతను చాటుతున్నాయి.

లక్ష్మణుడు, నల, నీల, తారులు శ్రీరాముని అనుసరిస్తూ వెళ్లారు. దారిలో పూల తరువులు, నదులు, గుహలు, గిరులు, లోయలు కనబడ్డాయి. దారి మధ్యలో మధుర జలాల తటాకాలు ఉన్నాయి. హంస, సారస, కారండవ, చక్రవాకాది జలజంతువులు స్వచ్ఛమైన జలాల్లో విహరిస్తున్నాయి.

వనంలోని హరిణాలు నిర్భయంగా విహరిస్తూ లేతపచ్చని గడ్డిని కొరుకుతూ పరిసరాలను తమ చంచల దృక్కులతో వీక్షిస్తున్నాయి.

మహా గజాలు నల్లని కొండల వలె ఆ వనమంతా మదంతో సంచరిస్తున్నాయి. అవి తటాకాలలోని మధుర జలాలను పానం చేస్తూ, వాటి ఒడ్లను చెరిపి వేస్తున్నాయి.

వారు అలా వన పరిసరాలను హర్షపరవశులై పరిశీలిస్తూ, వెళ్తుండగా దారి మధ్యలో ఒకే చోట దట్టమైన వనము కనబడింది. శ్రీరాముడు ఆసక్తితో ఆ వనంవైపు చూచి, సుగ్రీవుని ఆ వన విశేషాలను గురించి అడిగాడు.

సుగ్రీవుడు, శ్రీరామునికి ఆసక్తిని కల్గించే ఆ వన విశేషాలను వివరింప సాగాడు :

"రామభద్రా! ఇది ఒక ఋష్యాశ్రమము. ఇక్కడి మనోహర వాతావరణము సకల విధశ్రమలను హరిస్తుంది.

ఇక్కడ "సప్తజనులనే" ఏడుగురు ఋషులు నిరంతర తపోనిమగ్నులై ఉండేవారు. వారు తలక్రిందులుగా తపస్సు చేశారు. కేవల జలపానంతో కాలము గడిపారు. తలక్రిందులుగానే జలపానం చేసేవారు. సప్తరాత్రముల కొకసారి వాయువును పీల్చుకొని జీవించారు.

ఆ విధంగా వారు ఏడువందల సంవత్సరాలు తపస్సును కావించారు. ఆ సప్తర్షుల సంతత తపోధ్యానాలు వారికి సశీరీర స్వర్గాన్ని సాధించిపెట్టాయి. ఈ ఆశ్రమం చుట్టు చెట్లు ప్రాకారం వలె బలంగా పెరిగాయి. సురాసురులు కాని, సురేంద్రుడు కాని ఈ వనాన్ని భంగం చేయడానికి సాహసింపజాలరు. పక్షులు కాని, మృగాలు కాని ఈ వనంలో ప్రవేశింపవు. మానవులు పొరపాటున కూడ ఈ ఋష్యాశ్రమంలోనికి వెళ్లరు. వెళ్లిన వారు తిరిగి రారు.

మధురాతి మధుర స్వరాలతో కమ్మని పాటలు వీనులకు విందును కావిస్తాయి. దివ్య పరిమళ వాయువులు ఈ వనం నుండి సతతము వీస్తుంటాయి. నిరంతరము త్రేతాగ్నుల జ్వాలలు ఈ వనమంతటిని జాజ్వల్యంగా ప్రకాశింప జేస్తున్నాయి. యజ్ఞదూమం మబ్బుల రూపంలో మహావృక్షాలను ఆచ్ఛాదించి ఉంటుంది. పచ్చని చెట్లపై నల్లని ధూమ మేఘాలు వైడూర్య పర్వతాలను మరపిస్తాయి".

ఆ సప్త జన మహర్షులకు రామలక్ష్మణులు, సుగ్రీవుడు, సచివులు మనఃపూర్వకంగా ప్రణమిల్లారు. వారు సప్త జన మహర్షి ఆశ్రమాన్ని దాటి శత్రు దుర్భేద్యమైన కిష్కింధా నగరానికి చేరుకొన్నారు.

శ్రీరామచంద్రస్వామి ఇంతకు ముందు సప్త సాలవృక్షాలను ఒకే బాణముతో నేలగూల్చాడు. దీని వలన సప్త శక్తి చక్రాలపై ఆధిపత్యము, సప్తధాతుమయ శరీరముపై రామ పరమాత్మ నియంత్రణ అర్థమయ్యాయి.

ఇక సప్త జనాశ్రమాన్ని రాముడు దాటి వచ్చాడు. సప్తజనులంటే సప్తావరణాలు. పంచభూతాలు బుద్ధ్యహంకారాలు అనేవి సప్తావరణాలనబడుతాయి.

ఇవి దాటిన తరువాతే ప్రకృతి ఆవరణములు పూర్తి అవుతాయి. ఈ సప్తావరణములలో చివరది అహంకారావరణము. ఈ ఆవరణము దాటడమంటే అహంకారము మూర్తీభవించిన వాలి వధను సూచించడమే. ఆ వనంలో మధుర జలాలు, ఫలాలు, శీతల వాయువులు, మనోహర పరిమళాలు వాలి యొక్క ప్రమత్త స్థితిని సూచిస్తున్నాయి.

వాలిని ఏ ప్రత్యర్థి సమరానికి ఆహ్వానించినా, ఆ సమయంలో ఆయన మద్యపానమత్తుడై కామకేళీ విలాసుడై ఉంటాడు.

వాలి పశు స్వభావానికి, పాశవిక శక్తికి ప్రతీక కదా! ఇక ఆయన నుండి అంతకంటె అధికంగా ఇంకేమి ఆశింపగలము? ఆ సాత్విక వాతావరణము వాలి వధకు సుగ్రీవ విజయానికి సూచనగా నిలిచింది.

-- ఇతిశం --

"సప్త జనాశ్రమాలు సప్తావరణలకు సంకేతము.
**అహంకారమనే చివర ఆవరణ దాటితే**
**ప్రకృతి అవరోధము తొలిగినట్లే"**

"సప్త సాలవృక్షాలు - మన శరీరంలోని కుండలిని
చక్రాలకు సంకేతము. సహస్రార చక్రాన్ని
చేరుకొన్నవాడు సర్వశక్తి సముడే" కదా!

సత్యమే నా వ్రతము - సత్యమే నా ధర్మము
సత్యమే నా దైవము - సత్యమే నా సర్వము

"రామాయణమంటే - శబరి, తార, మండోదరి,
సుమిత్రల వంటి "**రామల అయనము**".

# ప్రసాద మహిమ

సుగ్రీవుని గళాన్ని లక్ష్మణుడు గజపుష్పమాలా లక్షితుని కావించాడు. ఆ మాలయే సుగ్రీవునికి వజ్రకవచమై నిలిచింది. దాని వలన సుగ్రీవుని దూరం నుండి కూడ ప్రత్యేకంగా గుర్తించడానికి శ్రీరామునికి వీలు ఏర్పడింది.

"రావణ మిత్రుడు, దుర్మార్గుడు, దుర్జయ బలశాలి అయిన వాలి వధ జరుగవలసిందే" అని దేవతలు కూడ తీర్మానించారు. వారి ఒక్కొక్కరి వదనం నుండి సుగ్రీవునికి వరంగా వేదమంత్రం ఈ విధంగా వెలువడింది.

**"మర్మాణి తే వర్మభిః ఛాదయామి. సోమస్త్వా రాజాఽమృతేనాభివస్తాం.**
**ఉరోర్వరీయో వరివస్తే అస్తు. జయంతం త్వాం అనుమదంతుదేవాః" (యజు 4-6-4)**

"నీ ఆయువు పట్లను నేను కవచముతో కప్పుతున్నాను. సోముడు నిన్ను అమృతముతో మరణ నివారకంగా అంతటా ఆచ్ఛాదించుగాక – ఇతరుల కన్న ఎక్కువగా ధన సంపదలను అనుభవించాలని నిన్ను దేవతలు అనుమతింతురు గాక".

సురవరమే కాక ఇప్పుడు రెండవ మారు కిష్కింధకు వచ్చే ముందు అంతకుముందు అలక్ష్యం చేసిన "సప్త జనముని" ఆశ్రమాన్ని శ్రీరామ లక్ష్మణులతో సహా సుగ్రీవుడు సందర్శించాడు.

ఈ కారణాల వలన సుగ్రీవునికి దైవ సంకల్పము అనుకూలమైంది. అంతే కాదు సప్త (జన) మునుల మంగళాశాసనము లభించింది.

అయితే సుగ్రీవుని పట్ల శ్రీరామునికి అత్యంత అనుగ్రహము కల్గడానికి దైవ సంకల్పము, ఋషుల మంగళాశాసనములు మాత్రమే కారణం కాలేదు. వాటికంటె ముఖ్యంగా సుగ్రీవుని పట్ల సౌమిత్రికి దయాభిమానాలు ఉదయించాలని శ్రీరామచంద్ర స్వామి సంకల్పించాడు. అందువలననే లక్ష్మణుని శ్రీహస్తాలతో సుగ్రీవుని కంఠాన్ని గజపుష్ప మాలాలంకృతం కావింప జేశాడు. అన్న చేతిలో భయంకర ముష్టి ప్రహారాలను తిని, ప్రాణభయంతో దీనాతిదీనుడైన సుగ్రీవుని చూడగానే సౌమిత్రి స్వాంతం కరిగి నీరైంది. అప్పటి వరకు తనను అలక్ష్యం చేసిన వానర రాజును ఆయన మనస్సు మన్నించింది. ఆయన అపరాధాన్ని లక్ష్మణుడు క్షమించాడు. అరక్షణమే కదా పెద్దల అలుక!

ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని మనం గుర్తించాలి. మనము అనుక్షణము అనేక అపరాధాలను ఆచరిస్తూనే ఉంటాము. కాలత్రయాలలో, శరీర, వాఙ్మనస్సులనే త్రికరణాలతో అపరాధాలను కావిస్తునే ఉంటాము.

**"నిత్యం త్వహం పరిభవామి గురుంచ మంత్రం।**
**తద్దేవతామపి నకించిదహో బిభేమి॥"**

మనము చేసే అతి భయంకర పాపములు - "ఆచార్యావమానము", "వారు అనుగ్రహించిన మంత్రాన్ని", "ఆ మంత్రాధి దైవమైన శ్రీమన్నారాయణుని అవమానించడం". అని వరవరమునులు మన ఘోరాపరాధాలను సెలవిచ్చారు. పరమపిత, అయిన పరమాత్మ, శ్రియః పతి శ్రీమన్నారాయణుడు తనను, తన మంత్రాన్ని మనము అవమతి చేసినా ఆగ్రహించడట. "పితేవ పుత్రస్య" అన్నట్లు తనయుల తప్పులను తండ్రి అంతగా పట్టించుకోక పోవచ్చు. హితము కోరి కొడుకు తప్పులకు అప్పుడప్పుడు కోపానికి వచ్చినా, "నిప్పును చల్లార్చే నీరు వలె" తక్షణమే తండ్రి కోపాన్ని తగ్గించే తల్లి దగ్గరే ఉంటుంది కదా!

**"పితేవ త్వత్ప్రేయాన్......కిమేతత్ నిర్దోషఃకః.....మాతా తదసినః"**

అని కదా పరాశరుల శ్రీసూక్తి.

అందువలననే తనతోపాటు సాలశాఖపై సుగ్రీవుడు సమానంగా కూచొన్నా రాముడు మర్యాదా పురుషోత్తముడు కనుక మన్నించాడు. అయితే అంతటి జగత్పిత అయినా మనము ఆచార్యునికి చేసే అపరాధాన్ని మాత్రము ఎంత మాత్రము సహించడట. అందుకే దానిని "అసహ్యాపచారము" అంటారు.

భగవంతుడైన శ్రీరామభద్రుని విడువజాలక వెంట వచ్చిన సుమిత్రాసుతుడు కేవలము భాగవతోత్తముడే కాదు. ఆయన ఆదిశేషాంశుడు, జగదాచార్యుడు కూడ.

**"ఆదౌ జగదాధారః శేషః - తదను సుమిత్రానందన వేషః**
**తదుపరి ధృతహల ముసల విశేషః తదనంతర మభవత్ గురురేషః"**

అటువంటి జగదాచార్య రూపుడైన రామానుజునికి (లక్ష్మణునికి) కావించిన అసహ్యాపచారానికి శ్రీరామచంద్రస్వామి సుగ్రీవునికి విధించిన అత్యంత భయంకర కఠిన శిక్ష, "వాలి చేతులలో అతడు ప్రాణాలు పోయేంత పిడిగ్రుద్దులను తినడం, అవమానకరమైన పరాజయము".

అయినా సుగ్రీవుడు ప్రాణాలతో తిరిగి రావడానికి మూడు కారణాలు. ఒకటి వాలి అతనిని క్షమించి వదలి వేయడం (2) రామాశ్రయము (3) రామానుజుని అనుగ్రహానికి ఆయన పాత్రుడు కావలసి ఉండడము – వీటిలో మూడవ కారణమే ముఖ్యమైనది.

"పర దుఃఖ దుఃఖిత్వము" భాగవతోత్తముల లక్షణము. ప్రత్యేకంగా అది ఆచార్య లక్షణము. అందువలననే సౌమిత్రి – హనుమతో మాట్లాడి సుగ్రీవుని చేరదీయవలసిందే అని రామునికి మొట్టమొదటే పురుషకారము చేశాడు. ఇప్పుడు తననే అవమానించిన ఆదిత్య నందనుని అతి దైన్యాన్ని అవలోకించి మనస్సు కరిగి ఆయన అపరాధాన్ని మన్నించి ఆయనను గజ పుష్పమాలతో అలంకరించాడు. అందువలన ఆచార్యుడైన సుమిత్రా నందనుని అభిమానానికి పాత్రుడై సుగ్రీవుడు శ్రీరామరక్షకు పూర్తిగా అర్హుడయ్యాడు.

తాను అలక్ష్యం చేసిన లక్ష్మణుని ముందు తలవంచి (తన తప్పిదాన్ని అంగీకరించి) కంఠంలో మాల వేయించుకొన్న సుగ్రీవుడు నిజంగా "సుగ్రీవుడే (బుద్ధిమంతుడే) కదా!

"గజపుష్పము" అంటే సాధారణముగా "ఏనుగ పూవు" అని అర్థము. ఆ పేరు రావడానికి అది పెద్దగా ఉండడమో, ఏనుగులకు ఇష్టమైనది కావడమో కారణము కావచ్చు. ఆ పూలతో కూడుకొన్న తీగ గజపుష్పీలత. "నాగ పుష్పీలత" అని దానికి మరో పేరు.

అయితే ఇక్కడ **మహేశ్వర తీర్థుల వారు** "గజపుష్పీలత" అనే శబ్దానికి **"గజపుష్పీ సంజ్ఞాం లతాం" – "కుందలతాంవా"** అని తమ తత్వదీపికలో వ్యాఖ్యానించారు. గజ పుష్పాలకు పరిమళం ఉంటుందో, లేదో తెలియదు.

**"కుందలత" అంటే "మల్లెపూల తీగ" అని అర్థము. మల్లెపూవు అందానికి, పరిమళానికి ఆశ్రయమిస్తుంది. అది శ్రీశ్రియఃపతుల మిథునానికి నిదర్శనము.** "పుష్పత్తైయుం, మణత్తైయుం" పోలే అని లోకాచార్య శ్రీసూక్తి. పుష్పము, పరిమళము ఏ విధముగా విడదీయరానివో, అలాగే శ్రీ శ్రియఃపతులు కూడ విడదీయరాని జంట అని అభిప్రాయము.

ఆ విధంగా లక్ష్మణుడు గజపుష్పలతామాలను సుగ్రీవుని గళంలో అలంకరించాడంటే ఆచార్యుడైన సుమిత్రానందనుడు దీనజీవుడైన సుగ్రీవుని **(కంఠాని)కి శ్రీమన్నారాయణ (ద్వయ) మంత్రాన్ని అనుగ్రహించడమని అర్థము.**

**ఆచార్య రామానుజుల ద్వారా సమాశ్రయణాన్ని పొందిన సుగ్రీవునికి (ఆశ్రిత పురుషునికి) శ్రీరామ రక్ష లభించడంలో ఆలస్యం కూడ ఉండదుకదా!**

xxx

ఎంతగా ఆచార్య సమాశ్రయణము లభించినా ఆర్తులైన సంసారుల స్వాంతాలలో భగవద్రక్షణ పట్ల సందేహము సాగుతూనే ఉంటుంది. అలాగే సుగ్రీవుని మనస్సులో శ్రీరామరక్ష పట్ల ఇంకా సంశయ చింత రగులుతునే ఉంది. ఆయన "స్వామితో," రాఘవా! వాలిని తప్పక వధిస్తానని నాకిచ్చిన వాగ్దానాన్ని కనీసము ఇప్పుడైనా నిలబెట్టు కొంటావా?" అని దీనంగా యాచించాడు.

శ్రీరామచంద్రుడు వెన్నెల వంటి చిరునవ్వుతో "వానరోత్తమా! మా లక్ష్మణుడు నీ మెడలో గజపుష్పమాలను వేశాడు కదా! ఇక దానితో నా సమస్య పరిష్కారము అయింది.

ఇంతకు ముందు (వాలి సుగ్రీవులు) మీరిద్దరు **వేర్వేరు తండ్రులకు జన్మించిన వారైనా ఒకే తల్లికి ప్రభవించారు. ఆమె పతి (కేసరి) రూపాన్నే అనవరతము మనస్సులో నింపుకొన్న మహాపతివ్రత. అందువలన మీరిద్దరు దృఢత్వంలో, ఉన్నతతత్వంలో సర్వవిధాల సమానరూపులై ఉన్నారు.** అందువలన మీ ఇద్దరిలో ఎవ్వరెవ్వరో గుర్తింపజాలక శర ప్రయోగములో జాప్యము చేశాను.

ఇక ఇప్పుడు గజ పుష్పీలతా మాలాధారణము వలన నిన్ను సులభంగా గుర్తించగలుగుతాను. మీ అన్నను వాలిని తప్పక నిరాటంకంగా వధిస్తాను.

ఇక నా స్వభావము నీకు స్పష్టముగా తెలియదు. అందువలననే నా ప్రతిజ్ఞను నెరవేర్చుమని సందేహంతో మాటిమాటికి బ్రతిమాలుతున్నావు.

**అనృతం నోక్త పూర్వంమే। వీర కృచ్ఛ్రేఽపి తిష్ఠతా।**
**ధర్మలోభ పరీతేన। న చవక్ష్యే కథంచన'**

సుగ్రీవా! నా జీవితంలో నేనెన్నడూ అసత్యమాడలేదు. ఎన్నో భయంకర సమస్యలు ఎదురయ్యాయి. తట్టుకోలేని కష్టాలు తలెత్తాయి. ప్రమాదాలు సంభవించాయి. అన్ని అపాయాలలో కూడ (కృచ్ఛ్రేఽపి తిష్ఠతా) అనృతము పలుకలేదు. సత్యదీక్షను సడలింప లేదు. అలాగే ఇక ముందు కూడ నాకెన్నో అవరోధాలు ఏర్పడవచ్చు. అయినా నా అనవరత వ్రతాన్ని వదలుకోబోను.

సత్యమే నా వ్రతము. సత్యవాక్యమే నా భూషణము. సత్యమే నా ధర్మము. సత్యమే నా దైవము. సత్యమే నా శ్రేయము. సత్యమే నా సర్వము.

సత్యధర్మము పట్ల నాకత్యంత లోభము (పిచ్చి ప్రేమ). అందువలన నా ప్రతిజ్ఞ సత్యము. దానిని నిలబెట్టు కోవడం నా ధర్మము. నా ధర్మాన్ని నిస్సందేహంగా పాటిస్తాను.

పంట పొలములో నాటిన నారు, పుష్కలమైన నీరు ఉన్నప్పుడు ఎలా ఆ క్షేత్రము తప్పక సస్యాన్ని సమకూరుస్తుందో అలాగే నా సత్యదీక్షా సంపూర్ణత వలన నా ప్రతిజ్ఞ తప్పక ఫలిస్తుంది" అని తెలిపాడు. పంట పొలములోని నారు రాముని సత్యదీక్ష. ఆ పొలములోని నీరు రామానుజుని అనుగ్రహ విశేషము.

# శుభ వాతావరణము

రామభద్రుడు సుగ్రీవునికి వాలి వధను సూచించే విధంగా వాతావరణము అనుకూలంగా ఉందని ఆయన మనస్సును అత్యంత ధైర్యవంతం చేస్తున్నాడు "సూర్య నందనా! గజ పుష్పమాలా గళుడవైన నీవు గగనంలో నక్షత్రమాలతో కూడుకొన్న సూర్యుని వలె విపరీతంగా వెలిగిపోతున్నావు".

"విపరీత ఇవ ఆకాశే సూర్యో నక్షత్ర మాలయా."

అది సంధ్యా సమయము. అరుణ కిరణాలతో ఆదిత్యుడు సంధ్యారాగరంజితుడై విరాజిల్లుతున్నాడు. అప్పుడాయన నక్షత్రమాలతో ఆవరింపబడడమేమిటి?

నక్షత్రాలు నక్తంలో (రాత్రి) దర్శనమిస్తాయి. అవి సంధ్యా సమయంలో అగుపడడము విపరీతమేకదా? వాస్తవమే. సామాన్యంగా సంధ్యా సమయంలో నక్షత్ర సందర్శనము జరుగదు. అలా జరిగిందంటే అది మహారాజ మరణము వంటి ఘోర విపత్తును సూచిస్తుందన్న మాట. అప్పుడు అలా ఆదిత్యుడు ఉండగానే నక్షత్రాలు ప్రకాశిస్తున్నాయంటే అది విపరీతమై "వాలి వధ" అనే ఘోర విపత్తును సూచిస్తున్నదని అర్థము.

"విపరీతము" అంటే రెండు అర్థాలు ఉన్నాయి. (1) విపత్తును సూచించేది: (2) రాత్రి. **"పరీత" మంటే పగలు - విపరీతమంటే 'రాత్రి'.** అని అర్థము. అందువలన విపరీత ఇవ ........ నక్షత్ర మాలయా" అంటే నక్షత్రమాలతో కూడిన రాత్రి అనే అర్థము.

విపరీతమంటే రాత్రి అనే అర్థము సరియైనది కావచ్చు. కాని "సూర్యో నక్షత్ర మాలయా" అని నక్షత్ర మాలతో రాత్రి సూర్యుడు విరాజిల్లడమేమిటి? అప్పుడు **"సూర్యో నక్షత్ర మాలయా" అంటే నక్షత్ర మాలతో వెలిగే చంద్రుడు** అని అర్థము కావాలి కదా.

సూర్యుడు అంటే చంద్రుడు అనే అర్థము ఉందా? ఉంది **వేదంలో** ఒక మంత్రంలో చంద్రుని నిర్దేశిస్తూ **"అహ్నః కేతుః" అని తెలుపుతుంది.** "అహ్నః కేతుః" అంటే పగలు

గుర్తు అని అర్థము. పగలును సూచించేది సూర్యుడే కదా! చంద్రుడెట్లా అవుతాడు? మరి వేద నిర్దేశం అసత్యమవుతుందా? అసత్యము కావడం అసంభవము.

మరి చంద్రుడు పగలుకు ఎలా గుర్తుగా కాగలుగుతాడు. **అలా అవుతాడని వేదము వివరించిందంటే "సూర్యుడ"నే శబ్దానికి చంద్రుడు కూడ అర్థమవుతాడు.** సూర్యుని పగలు కాంతితోనే చంద్రుడు రాత్రి ప్రకాశిస్తాడు. కనుక "అహ్నః కేతుః" అంటే సూర్యచంద్రులిద్దరు అర్థము. అలా అర్థమవుతుందనే వేదము నిర్దేశించింది. అప్పుడు "విపరీత ఇవ ఆకాశే సూర్యో నక్షత్రమాలయా" అంటే రాత్రి పూట నక్షత్ర మాలావృతుడైన చంద్రుడు అని అర్థము. **ఇది సుగ్రీవునికి శుభసూచకము.**

మొత్తానికి **"విపరీత ఇవ ఆకాశే సూర్యో నక్షత్ర మాలయా"** అన్న **రాముని** వచనము **వాలికి విపత్కరమై, సుగ్రీవునికి శుభసూచకమైంది.** అంతే కాదు "విపరీతము" అనే శబ్దానికి మరొక అర్థము కూడ ఉంది. (3) "వి" అనే ఉపసర్గకు **విశేషంగా అని 'విరుద్ధంగా'** అని రెండు అర్థాలు. 'పరీతము' అంటే చుట్టబడి ఉండుట అని అర్థము.

సూర్యుడనే శబ్దానికి సూర్యుడనే అర్థము చెప్పినప్పుడు "నక్షత్ర మాలయా విపరీతః" అంటే **'వి' ఉపసర్గకు విరుద్ధమనే అర్థము వలన "విరుద్ధంగా ఆవరింపబడ్డ సూర్యుడని" అర్థము. "వి" అంటే విశేషము అని మరొక అర్థము. "సూర్యః అంటే చంద్రుడు** అని అర్థము చెప్పినప్పుడు "విశిష్ట నక్షత్రమాలయా పరీతః చంద్రః "విశేష నక్షత్రాలతో కూడిన చంద్రుడు" అని అర్థము. అద్భుతమైనది కదా వాల్మీకి రచనా వైశిష్ట్యము.

శ్రీ రామచంద్రస్వామి ప్రోత్సాహము సుగ్రీవుని పౌరుషాగ్నిని ప్రజ్వలింపజేసింది. వర్షకాల వలాహకము (మేఘము) వలె ఆయన గంభీరంగా గర్జించాడు. ఆ పరిసరాలలోని వాయుతరంగాల వలన సుగ్రీవుని ఆ సింహగర్జన మృగాలకు ప్రాణభయాన్ని కల్గించి వాలి వీనుల దాకా వెళ్లింది.

-- ఇతిశం --

**"ధర్మ లోభము వలన ఎన్ని ఆపదలు వచ్చినా నేనెప్పుడు అసత్య మాడలేదు. ఇక ముందు అసత్యము పలుకబోను"**

**- శ్రీరాముడు**

# తారా హితోక్తి

సుగ్రీవుడు కావించిన సింహగర్జన వాలిని అప్రమత్తుని కావించింది. అంతవరకు ఆయన మదవతుల మధ్య మద్యపాన మత్తుడై ఉన్నాడు. కరేణుల మధ్య మదకరీంద్రుని వలె కామకేళీ విలాసుడై ఒడలు మరచి ఉన్నాడు.

సాధారణంగా అంతటి సంతోష పారవశ్యంలో ఉన్న పురుషునిపై శత్రువులు ఆకస్మికంగా దండెత్తి వచ్చి, అత్యంత సులభంగా అతనిని ఆక్రమించుకోగల్గుతారు.

కాని వాలి స్వభావము అందరి స్వభావం కంటె పూర్తిగా భిన్నమైనది. అంగనా సంగమము, మద్యపానమదము, మొదలైనవేవీ శత్రువు యొక్క సమరాహ్వానము ముందు నిలువ జాలవు.

అందుకే అప్సరోభామినులను తలదన్నే తార మొదలైన అపురూప సుందరీమణుల సాంగత్యము కాని, వారు స్వయంగా తమ చేతులతో అత్యంత ప్రియంగా అందించే మద్యమును త్రాగిన మదముకాని సుగ్రీవుని గర్జన ముందు సుంతైనా పని చేయలేదు.

సుగ్రీవుని గర్జన వాలి వీనులకు అసహ్యంగా వినిపించింది. ఒక క్షణకాలము ఆయన నివ్వెరపోయాడు. **"ఉపరక్త ఇవ ఆదిత్యః సద్యో నిష్ప్రభతాంగతః"** ఆ క్షణంలో రాహుగ్రస్తుడైన ఆదిత్యునివలె వాలి కాంతిహీనుడయ్యాడు.

మరుక్షణమే ఆయనలో కోపము పొంగిపోయింది. మధ్యాహ్న మార్తాండుని వలె ఆగ్రహాగ్ని ఆయనను భయంకరాకారుని కావించింది. ఆయన కోరలు కొరవి వలె మండసాగాయి. తత్క్షణమే కొదమ సింహము వలె సుగ్రీవునిపైకి దుముకడానికి సిద్ధమయ్యాడు.

అదిగో ఆ సమయంలో తారమదిలో వివేకము మేల్కొంది. ఆమె తన ప్రియకాంతునకు కాంతాసమ్మితంగా హితాన్ని ఉపదేశించాలనుకొంది. సాధారణంగా తమ పురుషులను తమ వైపు త్రిప్పుకోవడానికి అంగనామణులు ఆలింగనాస్త్రాన్ని ప్రయోగిస్తారు కదా! తార కూడ కట్టలు తెంచుకొని పొంగుతున్న వాలి ఆగ్రహప్రవాహానికి తన గాఢాలింగనము ద్వారా అడ్డుకట్ట వేయాలనుకొంది. తన వల్లభుని ప్రియంగా కౌగిలించుకొని తన హితోక్తిని ఆరంభించింది.

"మహావీరా! వర్షకాలములో అధికమైన జలప్రవాహంతో నదులు వరదలై పారినట్లు నీ మనస్సులో కూడ ఆగ్రహం కట్టలు త్రెంచుకొని పొంగిపోతున్నది. ప్రస్తుతం "రాత్రి

ధరించి, వాడిన మాలను స్త్రీలు తెల్లవారి విసర్జించినట్లు" నీవు పనికిరానినీ కోపాన్ని పరిత్యజించు. అంతేకాదు నేను నీ శ్రేయస్సు కోరి చెప్పే కొన్ని మాటలను నన్ను మన్నించి విను.

"వల్లభా! నీ తమ్ముడు నీతో యుద్ధంలో చావుదెబ్బలు తిని, ఎలాగో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని పారిపోయి ఎంతో సమయం కాలేదుకదా! నిజానికి ఆ దెబ్బల బాధ పూర్తిగా తగ్గడానికి చాలకాలము కావాలి.

మరి ఆయన ఇంత త్వరగా నీ పైకి ఇంత ఉత్సాహముతో కయ్యానికి కాలు దువ్వుతున్నాడే? ఏమిటి ఈ ఆశ్చర్యము? అంతే కాదు సుగ్రీవుని యుద్ధగర్జనలో మున్నెన్నడు లేని ధైర్యము, దర్పము స్పష్టంగా అర్థమవుతున్నాయి. ఆయనలోని ఈ ధైర్యానికి, దర్పానికి కారణాన్ని లోతుగా ఆలోచించి చూడు. ఈ సమయంలో కొంచెము నిదానంగా ఆలోచించి రేపు ఉదయాన్నే సుగ్రీవుని సమరాహ్వానాన్ని అంగీకరించు.

ప్రియవల్లభా! బహుశః సుగ్రీవుని దర్పానికి కారణము ఆయనకేదో బలమైన అండ లభించి ఉండాలి. లేకుంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని క్షతగాత్రుడై పారిపోయిన వాడు ఇంత త్వరగా నిన్ను మళ్లీ కవ్వించడానికి తెగించడు. నిన్ను మళ్లీ కవ్వించినందు వలన కలిగే మహా ప్రమాదము ఆయనకు తెలియదా?

సుగ్రీవుడు చాల బుద్ధిమంతుడు. ఆయన తనకు లభించిన అండ ఎంతటి బలవత్తరమైనదో పరీక్షించి ఈపాటికే తెలిసికొని ఉంటాడు. నీతో కలిగే ప్రమాదం కంటే ఆయనకు లభించిన అండ మరింత బలవంతమైనదని నిర్ధారించుకొన్నాకే తిరిగి నీతో తలపడడానికి నిర్ణయించుకొని ఉంటాడు. ప్రాణప్రియ! నీ అనుజునికి లభించిన బలమైన అండను గురించి నేను విని ఉన్నాను. మన అంగదకుమారుడు నిన్న రాత్రి వాహ్యాళికై మన నగరము వెలుపల ఉన్న ఉపవనానికి వెళ్లాడట. అక్కడ ఆయనకు ఆప్తులైన చారులు ఒక రహస్యాన్ని తెలిపారట.

"అయోధ్యా నగర సార్వభౌముడైన దశరథ మహారాజు అనుంగు పుత్రుడైన శ్రీరామచంద్రుడు తన తండ్రిగారి నిర్దేశము మేరకు సీతాలక్ష్మణులతో కలసి అడవులకు బయలుదేరాడట. ఆ మధ్యలో ఆయన అర్ధాంగి అయిన సీతాదేవిని కపటోపాయంతో ఒక రాక్షసుడు అపహరించాడట. ఆమెను అన్వేషిస్తూ సోదరులైన రామలక్ష్మణులు పంపారణ్యంలో ప్రవేశించారట.

హనుమ దౌత్యంతో తన వలెనే భార్యా విహీనుడైన నీ తమ్మునితో రాముడు ఋష్యమూకంపై స్నేహం చేశాడట. బహుశః ఆ రాముడు నీ తోడబుట్టిన సుగ్రీవునికి

తోడుగా వచ్చి ఉంటాడు. అందుకే నీ తమ్ముని కింత ధైర్యం కలిగి ఉంటుంది.

ఇక శ్రీరాముని గురించి నేను విన్న విషయాలను నీకు తెలుపుతాను విను.

(1) ఆయన సాక్షాత్తుగా బాలుడుగా ఉన్నప్పుడే పరశురాముడంతటి మహాబలుని గర్వభంగము కావించాడు.

(2) శ్రీరాముడు శత్రువిరాముడు. ఆయన ఆహవంలో ప్రళయకాల భయంకరుడు. పదునాల్గువేల మంది మహాపరాక్రమోపేతులైన రాక్షస వీరులనుకొన్ని క్షణాలలో తన బాణాగ్నికి భస్మము చేశాడు.

(3) రాముడు నీకంటె బలవత్తరుడట. నీవు దుందుభి దేహాన్ని మొత్తము బలంతో యోజన దూరము విసరి వేయగల్గితే ఆయన దానిని కాలిగోటితో దశయోజన దూరం చిమ్మివేశాడట. నీవు ఒక బాణంతో ఒక సాలాన్ని నిష్పత్రం చేయగల్గితే ఆయన ఒకే బాణంతో సప్తసాలాలను నిష్పత్రం చేసి నేలగూల్చాడట.

ఆయన సాధుజన పరిత్రాణ పరాయణుడు.

**"నివాస వృక్షస్సాధూనాం । ఆపన్నానాం పరాగతిః**
**ఆర్తానాం సంశ్రయశ్చైవ । యశసశ్చైక భాజనం"**

**నివాసవృక్షః సాధూనాం:**

రాముడు ఆశ్రితులకు ఒక వృక్షము వంటి ఆధారము. ఎండలో మండిపోతూ, చల్లని నీడకావాలని పరితపించే వారికి చెట్టు ఆ చల్లని నీడను అందిస్తుంది. అలాగే తనను ఆశ్రయించిన వారి సకల విధ తాపాలను పరిహరించి, తక్షణమే వారికి హాయి నందించే రక్షక వృక్షము శ్రీరాముడు.

అయితే తాను పచ్చిగా ఉన్నంత వరకే పాంథులకు నీడనిచ్చి, కొంత కాలానికి వాడిపోయి బాటసారుల ఎండ బాధను నివారింపజాలని సామాన్య వృక్షము కాదు శ్రీరాముడు.

ఆయన ఒక నివాస వృక్షము. తన నీడలో ఆశ్రితులు సర్వదా సర్వథా క్షేమంగా ఒదిగి ఉండడానికి వీలైన మహావృక్షము. తనను దరిజేరిన వారి సర్వ తాపాలను దూరం చేయగలిగి, ఇక అవి మళ్లీ ఎన్నడు తల ఎత్తకుండా ఉండే విధంగా శాశ్వతంగా వారికి రక్షణను కల్పించగలిగిన నివాస వృక్షము శ్రీరాముడు.

చెట్టు తాను ఎండకు ఎండుతూ తన దరిని జేరిన వారికి చల్లని నీడను ఇస్తుంది. అలాగే తన బాహుచ్ఛాయను ఆశ్రయించిన వారికి సకల విధ రక్షణలను శాశ్వతంగా

కల్పించడంలో తాను ఎన్ని అవాంతరాలను, ఎన్ని కఠిన పరీక్షలను, ఎన్ని ప్రమాదాలనైనా ఎదుర్కోవడానికి సర్వదా సిద్ధంగా ఉండే రక్షకోత్తముడు శ్రీరాముడు.

రక్షణ అంటే ఇష్టము కాని వాటిని నివారించడం, ఇష్టమైన వాటిని అందించడం అని రెండు రకాలు.

ఒక పుష్ప ఫల సంభరితమైన వృక్షము బాటసారులకు వారి తాపాన్ని (ఎండ బాధను) వారించడమే కాక, వారు ధరించడానికి, వారు భక్షించడానికి కావలసిన పుష్ప; ఫలాలను కూడ అందిస్తుంది. అలాగే రామభద్రుడు తనను ఆశ్రయించిన వారి బాధలను నివారించడమే కాక, వారి సకల వాంఛలను ఫలప్రదం కావిస్తాడు.

'బాహుచ్ఛాయా మవష్టబ్ధో లోకోయస్య మహాత్మనః' అన్నట్లు తన బాహుచ్ఛాయను అవలంబించిన లోకులందరు కష్టాలన్ని పోయి, కోరికలన్ని తీరి "కరం వక్షసి నిక్షిప్య । నిద్రాం కుర్వంతి నిర్భరాః" అన్నట్లు హాయిగా తమ వక్షముపై చేయివేసి కొని సుఖనిద్రను పొందగలిగినట్లు చేయగల మహాత్ముడు శ్రీరాముడు.

**సాధూనాం నివాసవృక్షః**

తన క్రింద నిలిచిన వారు మంచి వారా? చెడ్డవారా? అనే వివక్ష లేకుండా అందరికి హాయిని సమకూర్చేది నివాస వృక్షము. అలాగే శ్రీరాముడు కూడ తనను ఆశ్రయించిన వారు సన్మార్గులా? దుర్మార్గులా! అని చూడడు. శరణుకోరి వచ్చిన శత్రువునైనా సంరక్షించ వలసిందే నన్న కరుణా సముద్రుడా శ్రీరాముడు.

అయితే ఆయన ఎంతో ఉదారంగా తనను ఆశ్రయింప రమ్మని మనస్సు నిండా పిలిచినా ఆయనను ఆశ్రయించేది సాధువులే. తమ ప్రాణాలు పోయినా ఫరవాలేదు. కాని అన్యులను ఆశ్రయింపమనే మూర్ఖులు దుర్జనులు. వారి అహంకారమే వారికి శ్రీరామ రక్షను దూరం కావిస్తుంది.

అందువలననే సాత్విక గుణ సంపన్నుడు, సాధు పురుషుడైన నీ అనుజుడు రాముని అండను పొందాడు. అభయాన్ని అందుకొన్నాడు.

రామాశ్రితుడయిన నీ అనుజునిపై ఆగ్రహంతో ఆహవానికి దిగి ప్రమాదాన్ని ఆహ్వానింపక నీ తమ్ముడైన సుగ్రీవుని చేరదీసి, అతని భార్యను ఆయనకు అప్పగించి, ఆయనను యౌవరాజ్య పట్టాభిషిక్తుని కావించి, సర్వజన సంరక్షణా దీక్షితుడైన శ్రీరామచంద్ర స్వామి అపార కరుణకు పాత్రుడివి కా!" అని వాలికి సాధుత్వాన్ని ఉపదేశిస్తున్నది తార. ఆమె తన ఉపదేశాన్ని కొనసాగిస్తున్నది:-

**ఆపన్నానాం పరాగతిః -**

ఆపన్నులనగా ఆపదలలో చిక్కుకొన్న అసహాయులు. వారికి పరమ రక్షకుడు శ్రీరాముడు.

అరణ్యంలో ఎవ్వరికి ఏ అపకారము తలపెట్టక కందమూలాలను తింటూ, నిరంతర, తపో, ధ్యాన, యజ్ఞాచరణ నిమగ్నులైన ముని సత్తములకు ఖరదూషణాది వేల రాక్షసులు ప్రమాదకారులయ్యారు. వారి యజ్ఞాలకు విఘ్నాలు కల్పిస్తూ, వారి తపోధ్యానాలను భంగం కావిస్తూ, తమ ఆహారం కొరకు ఆ ఋషులనే సంహరించి భక్షించేవారు.

అటువంటి ప్రాణాపాయంలో చిక్కుకొన్న మహర్షులు శ్రీరామభద్రుని ఆశ్రయించి, "ఏహి పశ్య శరీరాణి। మునీనాం భావితాత్మనాం" ఇదిగో రాక్షసులు భక్షించిన మహర్షుల శరీరాలలోని అస్థిపంజరాలను చూడుమని చూపెట్టారు. తమకు రాక్షసులనుండి రక్షణను కల్పించుమని రాముని శరణు వేడారు.

తక్షణమే తనను ఆశ్రయించిన ఆ ఋషులకు అభయమొసగి, వారి ఆపాయానికి కారణమైన పదునాల్గు వేలమంది రాక్షసులను తన బాణాగ్నితో భస్మం కావించి, అప్పటి నుండి ఆ మునులను రాక్షస భయముక్తులను కావించాడు.

**ఆర్తానాం సంశ్రయశ్చైవ:-**

భార్యను బంధుజనులను, అధికారాన్ని, సంపదలను పోగొట్టుకొని అత్యంత దుఃఖావిష్టులైన దీనులు, ఆర్తులు. అటువంటివారికి తిరిగి వాటిని అందివ్వగల ఆశ్రిత కల్పవృక్షము శ్రీరాముడే.

**యశసశ్చైక భాజనం:-**

కీర్తి కంతటికి నిదానము శ్రీరాముడే. లోకంలో తల్లి, తండ్రి అన్న, భర్త, ప్రభువు, సంతానానికి, సహోదరులకు, భార్యకు, పాలితులకు రక్షకులుగా ఉండవచ్చు. కాని శ్రీరామ రక్ష అటువంటిది కాదు. సామాన్య రక్షకులు (పైన పేర్కొన్నవారు) అందరు చేయి విడిచినా ఆర్తులను, అసహాయకులను విడువకుండా రక్షించే అచ్యుతుడు శ్రీరాముడే. కాబట్టి "సర్వజన సంరక్షకుడు శ్రీరాముడే" అనే యశస్సుకు నిలయమైన వాడు శ్రీరామచంద్రుడు.

శ్రీరామచంద్ర స్వామి యొక్క అనంత కల్యాణ గుణాలను వాలి ముందు తార ప్రస్తుతిస్తున్నది:-

**"జ్ఞాన విజ్ఞాన సంపన్నో। నిదేశే నిరతః పితుః**
**ధాతూనామివ శైలేంద్రో! గుణానామాకరో మహాన్"**

**జ్ఞాన విజ్ఞాన సంపన్నః-**

ప్రాణవల్లభా! శ్రీరామచంద్రస్వామి యొక్క రక్షణ కీర్తిని ఇంతవరకు తెలిపాను కదా! రక్షణకు కావలసినవి (1) శక్తి (2) జ్ఞానము.

రక్షకునికి అపాయ నివారణ శక్తితో పాటు, ఆ అపాయానికి సంబంధించిన జ్ఞానము కూడ అవసరము.

జ్ఞానము రెండు రకాలు (1) సామాన్య జ్ఞానము (జ్ఞానము) (2) విశేష జ్ఞానము (విజ్ఞానము)

సాధారణంగా పంచజ్ఞానేంద్రియాలతో కలిగే లౌకిక జ్ఞానము (సామాన్య) జ్ఞానమన బడుతుంది.

ఇంద్రియాతీతమై కేవలము శాస్త్రము ద్వారా మాత్రమే కలిగేది విజ్ఞానము.

అలాగే శరీరానికి సంబంధించింది జ్ఞానమని, ఆత్మకు సంబంధించింది విజ్ఞాన మని అనబడుతుంది.

శ్రీరామచంద్రుడు తనకు ఎప్పుడు తీరిక లభించినా ఆ సమయంలో జ్ఞాన వృద్ధులను సేవిస్తూ వారి వలన అనేక లౌకిక, పారమార్థిక విషయాలను తెలసికొనేవాడు. అందువలననే ఆయనను "వృద్ధోపసేవీ" అంటారు. తద్వారా ఆయన జ్ఞాన, విజ్ఞాన సంపదలకు నిలయంగా ఉంటాడు.

**నిదేశే నిరతః పితుః-**

సాధారణంగా కొందరిలో జ్ఞానము పుష్కలంగా ఉండవచ్చు. కాని వారిలో అనుష్ఠానము లేకపోవచ్చును. కొందరిలో అనుష్ఠానము ఉండవచ్చు. కాని వారికి జ్ఞానము లేకపోవచ్చు.

జ్ఞానము కన్నువంటిది. ఆచరణము చరణముల (కాళ్ల) వంటిది. కేవల జ్ఞానము కలిగి, అనుష్ఠానము లేనివాడు కుంటివాని వంటివాడు. అనుష్ఠానము మాత్రమే ఉండి జ్ఞానము లేనివాడు గుడ్డివాని వంటివాడు.

మనిషికి తెలిసికోవడానికి కన్ను వంటి జ్ఞానము అవసరమే. దాని ద్వారా తెలిసికొన్న విషయాలను అందుకొని అనుభవించడానికి కర, చరణాదుల కార్యము వంటిది అనుష్ఠానము. జ్ఞానానుష్ఠానములు రెండు రెండు శక్తులు. ఒక పక్షి యొక్క రెండు రెక్కల వంటివి. ఆ రెండు సంపూర్ణంగా కలవాడే పూర్ణ పురుషుడు.

రామచంద్రుడు జ్ఞానానుష్ఠానములు రెండు పరిపూర్ణంగా కలవాడు. ఆయనకు తెలిసిన ధర్మాలను తప్పక అనుష్ఠించేవాడు. ఆయన జ్ఞాన, విజ్ఞాన సంపన్నుడు మాత్రమే కాదు, సంపూర్ణ ధర్మాచరణ నిష్ణాత కూడ.

శ్రీరామచంద్రుని ధర్మాచరణ నిరతికి స్థాలీ పులాక న్యాయంగా (అన్నము ఉడికిందా లేదా అని తెలిసికోవడానికి ఒక మెతుకును పట్టి చూచినట్లు) తార ఒక ఉదాహరణను తెలిపింది" నిదేశే నిరతః పితుః" రాముడు పితృవాక్య పాలకుడు.

రామచంద్రుడు ఏదో అధర్మాన్ని ఆచరించినందువలన దేశబహిష్కృతుడై అడవులకు వెళ్లలేదు.

కైకేయిని కేకయరాజ్యాన్నుండి తిరిగి వచ్చిన భరతుడు అడుగుతాడు – "అమ్మా! అడవికి వెళ్లదగినంత నేరం మా అన్న రాముడు ఏమి చేశాడమ్మా?" అని. కేకేయి అంటుంది. "రాముడు ఏమి నేరము చేయలేదు. తండ్రి మాట విని అడవికి వెళ్లాడు" అని.

తండ్రి మాటను నిలబెట్టడానికి, ఆయనను సత్యవాక్య పాలకుని చేయడానికి, తాను పితృ వాక్య పాలకుడై కట్టుబట్టలతో అడవికి బయలుదేరాడు.

ధర్మాచరణకు ఇంతకు మించిన ఉదాహరణ ఉంటుందా?

**ధాతూనామివ శైలేంద్రో । గుణానామాకరో మహాన్:**

ఒక మహా పర్వతము గైరికాది అనేక ధాతువులకు నిలయమై ఉంటుంది. అలాగే శ్రీరామచంద్రుడు సకల కల్యాణగుణములకు ఒక గొప్ప గని వంటివాడు. సువర్ణాది ధాతువులు గనిలో ఉంటాయి. ఆ గనిని త్రవ్విన కొద్ది, ఆ ధాతువు తరుగకుండా వెడలుతూనే ఉంటుంది.

అలాగే రామచంద్రుడు వాత్సల్యాది కల్యాణగుణాలకు రాశిలో, వాసిలో కూడ ఒక గని వంటివాడే".

ఈ విధంగా తన ప్రియభర్త అయిన, వాలికి శ్రీరాముని యొక్క అనంత జ్ఞాన శక్తి మయ స్వరూపాన్ని, సకల కల్యాణ గుణ స్వభావాన్ని పరిచయం చేసింది. ఎంత ఆశ్చర్యము। ఒక వానర కాంత రామభద్రుని స్వరూప స్వభావాలను ఎంత చక్కగా ఆవిష్కరించింది!

ఇంతవరకు తార ప్రవచించిన రెండు శ్లోకాల యొక్క వాచ్యార్థాన్ని స్పష్టంగా చూచాము కదా! ఇప్పుడు వాటి వ్యంగ్యార్థాన్ని లేక ధ్వన్యార్థాన్ని పరిశీలిద్దాము. ధ్వన్యర్థ ప్రధానము

లైనవే ఉత్తమ కావ్యాలు. ఈ శ్లోకాల యొక్క ధ్వన్యర్థము రామచంద్రుని పరమాత్మగా సూచిస్తున్నది.

**"నివాసవృక్షః సాధూనాం । ఆపన్నానాం పరాగతిః**
**ఆర్తానాం సంశ్రయశ్చైవ । యశసశ్చైక భాజనమ్"**

**నివాసవృక్షః సాధూనాం:** శ్రుతి, స్మృతులు పరమాత్మను ఒక వృక్షంగా పోల్చాయి.

**"వృక్షం యత్ గావః పరిషస్వ జానాః"** అని అధర్వణ వేదము పరమాత్మను గోవులు సంచరించే వృక్షంగా కీర్తించింది.

**"వాసుదేవ తరుచ్ఛాయా । నాతి శీతా నఘర్మదా ।**
**నరకాంగార శమనీ । సా కిమర్థం న సేవ్యతే"**

అంటుంది స్మృతి.

**వాసుదేవ తరుచ్ఛాయా । నాతి శీతా నఘర్మదా । :-**

వాసుదేవుడనే తరువు యొక్క నీడ శీతాతపాది ద్వంద్వాలను నివారించేది. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, లాభాలాభాలు, జయాపజయాలు, పుణ్య పాపాదులు ద్వంద్వములనబడు తాయి. ఈ ద్వంద్వాలు సకల ప్రాణుల మనస్సులను పరవశం చేస్తాయి. వీటిని దాటగలిగిన స్థితినే "ద్వంద్వాతీతస్థితి" అంటారు. ఈ స్థితి వాసుదేవ తరుచ్ఛాయా సేవనము వలన మాత్రమే లభిస్తుంది.

**నరకాంగార శమనీ:-**

వాసుదేవ తరుచ్ఛాయా ప్రసాదము వలన "పుణ్య పాపేవిధూయ" అన్న విధంగా పుణ్యపాపాలు కూడ తొలగినందువలన వాటి ఫలాలైన స్వర్గ నరకాలు కూడ నివారించ బడుతాయి.

"నరకాంగార శమనీ" అన్నట్లు నరక బాధాగ్నిని తొలగిస్తుందనే స్మృతి తెలిపింది. కాని వాసుదేవ తరుచ్ఛాయ స్వర్గ సౌఖ్యాలను తొలగిస్తుందని చెప్పలేదు. కదా? అని ఒక సందేహము కలుగుతుంది.

"నాతి శీతా నఘర్మదా" అని శీతోష్ణాలనే ద్వంద్వాలను పేర్కొనడం జరిగింది. అందువలన పాప ఫలితము అయిన నరకాంగారమును తొలగిస్తుందని తెలిపినప్పుడు ద్వంద్వములోని మరొకటి అయిన పుణ్య ఫలితమైన స్వర్గాగమనాన్ని కూడా నిషేధిస్తుందన డంలో ఆశ్చర్యము లేదు.

వాసుదేవ తరుచ్ఛాయను సేవించేవారు స్వర్గ ప్రాప్తిని కోరుకోరనే విషయము స్పష్టమే.

స్వర్గము సౌఖ్యప్రదము అనడంలో అనుమానము లేదు. కాని స్వర్గము కలిగించే సౌఖ్యము తాత్కాలికమైనది. అంతేకాదు అది స్వల్పమైనది. అయితే ఆ స్వర్గ సౌఖ్యము ఇక్కడ భూమిపైన అనుభవించే సౌఖ్యము కంటె అధికమైనది. అందుకే:-

**"తేతం భుక్త్వా స్వర్గం। విశాలం**
**క్షీణే పుణ్యే మర్త్యలోకం విశంతి"**

విశాలమైన స్వర్గ ఫలాన్ని అనుభవించి పుణ్యము క్షీణం కాగానే భూమిపై జన్మిస్తారు అంటుంది భగవద్గీత. అయితే అక్షయము, అనంతము అయిన భగవత్ (పరమపద) ఆనందం ముందు ఆ స్వర్గసౌఖ్యము ఏ పాటిది? "ఆనందో బ్రహ్మ", "రసోవైసః" అని బ్రహ్మను ఆనంద స్వరూపునిగా వర్ణిస్తుంది వేదము. "నలమంద మిల్లదోర్ నాడు" అని అనంతానంద ప్రదమైనది పరమపదమని ఆళ్వార్లు కీర్తించారు.

అంతేకాదు స్వర్గలోకవాసులకు "పతన భీతి" కూడ వెంటాడుతుంది. పుణ్యము పూర్తి అయిన వారిని, స్వర్గాధికారులు, "ధ్వంస!" అని తలక్రిందులుగా నెట్టేస్తారట. ఆ దృశ్యాన్ని పుణ్యము మిగిలి ఉన్న స్వర్గవాసులు కళ్లనిండా చూచాక, తమకు కూడ ఆ స్థితి తప్పదని తెలిశాక స్వర్లోక భోగాలు వారికేమి రుచిస్తాయి?

అందువలననే "తృణీకృత విరించాది । నిరంకుశ విభూతయః" అని భగవత్ప్రాప్తి కాములకు బ్రహ్మలోకైశ్వర్యము కూడ గడ్డిపోచవంటిది అంటారు పెద్దలు.

కనుక "నరకాంగార శమీనీ" అన్నప్పుడు స్వర్గ సౌఖ్యనివారిణీ" అని కూడ అర్థము చేసికోవచ్చు.

అటువంటి వాసుదేవ తరుచ్ఛాయను "సా కిమర్థం న సేవ్యతే?" లోకులు ఎందుకు ఆశ్రయించరో? అని ఆశ్చర్య పడుతున్నాడు మహర్షి.

అందువలననే **"నివాస వృక్షస్సాధూనాం"** అని (రామ) పరమాత్మను సాధువుల (ప్రపన్నుల) నివాసవృక్షంగా వాల్మీకి వివరించాడు. ఆ విషయాన్నే (శ్రీరాముడు పరమాత్మ అని) వాలికి తార సూచించింది.

భగవద్గీత:- భగవంతుని ఆశ్రయించేవారు నాలుగు రకాలుగా ఉంటారనే భగవద్వాక్యాన్ని పేర్కొన్నది.

**"చతుర్విధా భజంతేమాం। జనాస్సుకృతినోర్జున।**
**ఆర్తో, జిజ్ఞాసు, రర్థార్థీ। జ్ఞానీ చ భరతర్షభ"**

ఆర్తులు, జిజ్ఞాసులు, అర్థార్థులు, జ్ఞానులని నాలుగు రకాల వ్యక్తులు తనను ఆశ్రయిస్తారని కృష్ణభగవానుడు ఆనతిచ్చాడు.

శ్రీరాముని ఆశ్రయించేవారు కూడ నాలుగు రకాలు అని తార పేర్కొన్నది. (1) సాధువులు (2) ఆపన్నులు (3) ఆర్తులు (4) యశస్వులు.

**నివాసవృక్ష స్సాధూనాం:-**

సాధువులు ఆశ్రయించే నివాస వృక్షము శ్రీరాముడు అని తార వివరించింది. సాధువులు జప, తపాదులను కావిస్తారు. వీరినే గీతాశాస్త్రము "జిజ్ఞాసులు" అని వ్యవహరించింది.

వారు శరీరాత్మల భేద (సాంఖ్య) జ్ఞానాన్ని లభించి, ఆత్మ యొక్క శాశ్వతానంద స్వరూపాన్ని గుర్తించి, అటువంటి ఆనంద స్వరూపమైన స్వాత్మ స్వరూపాన్ని పొంద గోరుతారు. వీరిని "కేవలులు" అని కూడ అంటారు. వారు పొందే స్థానము "కైవల్యము" అనబడుతుంది. అటువంటి ఆత్మ ప్రాప్తి కాములకు కూడ నివాసవృక్షము పరమాత్మే.

**ఆపన్నానాం పరాగతిః-**

ఆపన్నులకు పరమగతి పరమాత్మే. ఆపన్నులు అంటే ఐశ్వర్య కాములు. వీరినే "అపూర్వ ఐశ్వర్యకాములు" అని కూడ అంటారు. వీరికి ఇంత వరకు ఐశ్వర్యము లభించలేదు. ఐశ్వర్యవంతులను చూచినప్పుడు తమకు కూడ ఆ ఐశ్వర్యము కావాలని వీరు కోరుకొంటారు. ఆ కోరికతో వీరు భగవంతుని ఆశ్రయిస్తారు. వీరికి కావలసిన ఐశ్వర్యాన్ని అందించగలవాడు సర్వేశ్వరుడు తప్ప మరెవ్వరు ఉంటారు?

ధృవాదులు ఐశ్వర్యాపేక్షతోనే పరమాత్మను ఆశ్రయించినట్లు భాగవతము వివరిస్తుంది.

ఐశ్వర్యము కొరకు అన్యదేవతలను ఆశ్రయించే వారు కూడ ఉన్నారు. అయితే అన్య దేవతల ఐశ్వర్యము పరిమితమైనది. అది కూడ వారికి సహజమైనది కాదు. ఆ దేవతలకు కూడ ఐశ్వర్యప్రదుడు పరమాత్మే.

ఆ దేవతలు తమను ఆశ్రయించినవారికి అందించే ఐశ్వర్యమును కూడ వారికి పరమాత్మే కృప జేస్తాడు.

"మయైవ విహితాన్‌హి తాన్" అని "తానొసగిన ఫలములనే ఆయా దేవతల ద్వారా వారి ఆశ్రితులు పొందుతారు" అని గీతాచార్యుని వచనము. అందువలన సాక్షాత్తుగా పరమాత్మను ఆశ్రయించినా - అన్యదేవతల ద్వారా ఆశ్రయించినా పరాగతి లేక అంతిమగతి పరమాత్మే.

అపూర్వ ఐశ్వర్య కాములయిన ఆపన్నులకు పరమగతి (రామ) పరమాత్మే అని వివరిస్తుంది తార.

**ఆర్తానాం సంశ్రయశ్చైవ : -**

ఐశ్వర్య కాములలో రెండవ రకము వారు "భ్రష్టైశ్వర్య కాములు". ఇంతకుముందు వీరు ఐశ్వర్య వంతులే. కాని దురదృష్టము వలన వీరు ఐశ్వర్య హీనులయ్యారు. ఇది వరకు ఐశ్వర్యమే లేని వారి కంటే ఐశ్వర్య భ్రష్టుల యొక్క దుఃఖము మరింత దుర్భరమైనది.

వీరే "ఆర్తులు" అని తార వివరించింది. గీతాశాస్త్రము కూడ వీరిని "ఆర్తులనే" వ్యవహరించింది.

ఆర్తులు (భ్రష్టైశ్వర్య కాములు) కూడ సమాశ్రయించవలసింది పరమాత్మనే.

**యశసశ్చైకభాజనమ్:-**

యశస్వులకు (కీర్తికాములకు) కూడ ఏకైకాశ్రయము పరమాత్మే. "తస్యనామ మహద్యశః" అని పరమాత్మను వేదము "యశః" అని వ్యవహరించింది. అటువంటి యశస్స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్మను నందగోకులానికి తరువాత మధురకు, ప్రపంచానికి, అందించిన తల్లి "యశోద".

పరమాత్మకు **"మహద్యశః" అనే పేరు ఉండడానికి కారణము చరాచర జగత్తు కంతటికి ఆయనే ఆధారము కనుక.**

"యస్య పృధివీ శరీరం, యస్యాత్మా శరీరం" అని బృహదారణ్యకోపనిషత్తు ప్రకృతి సర్వము, సకల జీవాత్మలు పరమాత్మకు శరీరభూతములే. అనగా పరమాత్మకు ఆధీనములే అని వేదము వివరిస్తున్నది.

పరమాత్మ సర్వస్వామి అనే కీర్తిని కల్గి ఉన్నాడు కనుక ఆయనకు "మహద్యశః" "గొప్పకీర్తి స్వరూపుడు" అనే పేరు కలిగిందని శ్రుతి తెలిపింది.

అయితే అంతటి సర్వస్వామి కూడ తనకు "జ్ఞానే ఆత్మ" అని భగవద్గీతలో వివరించాడు. "జ్ఞానీత్వాత్మైవ మే మతం"

కనుక "పరమాత్మకే ఆత్మ" అనే కీర్తి కలవాడు జ్ఞాని. అందువలన జ్ఞాని యశస్వి.

"తేషాం జ్ఞానీ నిత్యయుక్తః ఏకభక్తిర్విశిష్యతే" అని గీతాశాస్త్రము వివరించినట్లు జ్ఞాని పరమాత్మ యొక్క నిరంతర సంశ్లేషను కోరుకొంటాడు. పరమాత్మ యొక్క విశ్లేషమంటే

భయపడతాడు. పరమాత్మ పట్ల నిశ్చల భక్తిని కలిగి ఉంటాడు. అటువంటి యశస్వులయిన జ్ఞానులకు (ఏకభాజనము) ఏకైకాశ్రయము పరమాత్మే.

**జ్ఞాన విజ్ఞాన సంపన్నః-**

జ్ఞాన, విజ్ఞాన సంపదలకు నిలయమైన వాడు పరమాత్మే. పరమాత్మను "సర్వజ్ఞః సర్వవిత్" అని వేదము తెలుపుతుంది.

పరమాత్మ చరాచర జగత్తుకు సంబంధించిన సర్వ విషయములు తెలిసినవాడు ఆయన జ్ఞాన సంపన్నుడు.

సర్వ విషయాలను సర్వ విధాలుగా తెలిసినవాడు కనుక విజ్ఞాన సంపన్నుడు భగవంతుడు.

ఈ విధంగా శ్రీరాముని యొక్క పరమాత్మ తత్వమును వాలికి ధ్వన్యర్థముతో సూచించిన తార మహావిజ్ఞాని.

"తార" అనే పదానికి రెండు వ్యుత్పత్తులు చెప్పవచ్చు. "తరతీతి తారా" "తారయతీతి తారా".

స్వయంగా తరించగలిగినది, ఇతరులను తరింపజేయగలిగిన విజ్ఞానవతి తార.

ఈ రెండు ఆచార్యుని లక్షణాలు. అందుకే ఆమె పతికి ఆచార్యోపదేశం చేసింది.

కిష్కింధలో తార ఒక వానర కాంత. ఆమెకు అంతటి జ్ఞానము భగవత్ప్రసాదము వలన కలిగింది. తనకు కలిగిన జ్ఞానంతో వాలిని సంస్కరించాలనుకొని ఇంతటి ఉపదేశాన్ని మధురాతి మధురంగా ప్రియాతిప్రియంగా తన కాంతునికి అందించింది.

అయోధ్యలో సుమిత్ర కూడ అటువంటి విజ్ఞానవతే. విజ్ఞానము అంటే పరమాత్మ జ్ఞానము. ఆ జ్ఞానాన్ని కలిగినందువలననే "రామం దశరథం విద్ధి సృష్టస్త్వం వనవాసాయ" అనే శ్లోకాల ద్వారా శ్రీరాముని పరమాత్మ తత్వాన్ని లక్ష్మణుని ఆదిశేష తత్వాన్ని" ఆవిష్కరించినది.

అందుకే "రామాయణము" అంటే సీతాదేవి, సుమిత్ర, తార, మండోదరివంటి "రామల (రామా మణుల) ఆయనము" అని కూడ అర్థమగుచున్నది.

-- ఇతిశం --

# వాలి వధ

తార శ్రీరామచంద్ర స్వామి పరాక్రమాన్ని, మహిమను వాలికి తెలియజేసింది. అయితే అంతకుముందే వాలికి శ్రీరాముని సత్య పరాక్రమాల గురించి, ధర్మనిష్ఠ గురించి కొంతవరకు తెలుసు.

అయితే వాలి అభిప్రాయము ప్రకారము శ్రీరాముని వలన తనకు ప్రమాదం కలిగే అవకాశము ఏ మాత్రము లేదు. తనకు, శ్రీరామునితో విరోధమే లేదు. అంతేకాదు తాను రామునితో యుద్ధము చేయబోవడము లేదు. సుగ్రీవునితో తాను పోరుకై వెళ్లుతున్నాడు.

మధ్యలో రామచంద్రుడు ఎందుకు కల్పించుకొంటాడు? సుగ్రీవునితో తాను పోరాడుతుండగా సుగ్రీవుని ప్రక్కకు నెట్టి శ్రీరాముడు తాను ముందుకు వస్తాడా? అది అసంభవము. ఆయన సుగ్రీవుని వైపు నుండి ముందుకు వచ్చే లోపే తాను సుగ్రీవుని అతి త్వరలో నిర్వీర్యుని కావించి, పరాభవించి పారగొట్టుతాడు. ఒకవేళ రాముడే తనను ఆహవానికి ఆహ్వానించితే తాను మల్లయుద్ధమే చేస్తాడు. మల్ల యుద్ధంలో తానే మేటి. తనకు తానే సాటి. రాముడు తనకు ఎంత మాత్రము సాటిరాడు.

అయినా రాముడు సుగ్రీవుని వైపు నుండి యుద్ధానికి ముందుకు వస్తే తనకు రామునితో యుద్ధం చేయవలసిన అవసరము లేదు. ఆ విషయాన్ని శ్రీరామునికి స్పష్టము చేసి, తాను యుద్ధాన్ని నిలిపివేయవచ్చు.

ఇవన్ని కాక తాను సుగ్రీవునితో పోరాడుతుండగా తనకు (వాలికి) తెలియకుండా రాముడు బాణప్రయోగం చేస్తాడా? అది ఎంత మాత్రము సాధ్యము కాదు. "రామో విగ్రహవాన్ ధర్మః" అని రాముడు ధర్మమూర్తి. ఆయన అటువంటి అధర్మానికి ఎన్నడు పాల్పడడు. రాముని గతచరిత్ర అతనిని అంతటి అధర్మాచరణకు అనుమతించదు.

ఇక సుగ్రీవుని శక్తి, సామర్థ్యాలు తనకు బాగా తెలుసు. ఆయన తనపై దాడి చేసిన ప్రతి సందర్భంలో, తనతో చావు దెబ్బలు తిని వెళ్లాడు. సుగ్రీవుడు తనకంటె చిన్నవాడు. తనకు విధేయంగా ఉండవలసిన వాడు. దేశబహిష్కృతుడు అయిన నేరస్థుడు. అటువంటి వాడు ఆయన కంటె పెద్దవాడు, బలవంతుడు, మహారాజు అయిన తన నెదిరించి, ధిక్కరించి, యుద్ధానికి కాలుదువ్వడం క్షమింపరాని మహాపరాధము.

ఈ అపరాధానికి తగిన దండనము విధించి, సుగ్రీవుని ఉద్ధ ృతిని తగ్గించి, పరాభవించి, పారిపోయేలా తరిమివేస్తే సరిపోతుందని వాలి యొక్క నిశ్చితాభిప్రాయము.

అంతేకాదు సుగ్రీవుడు తనను ఆహవానికి ఆహ్వానిస్తుండగా తాను పోరు వద్దని తమ్ముడిని ప్రేమతో సంధికి రమ్మంటే తనను సమరభీతునిగా భావించి సుగ్రీవుడు అపహాస్యం చేయవచ్చు".

తన మనస్సులోని భావాలను తారకు స్పష్టం చేసి సుగ్రీవుని పట్ల సోదర భావము తన మనస్సులో ఇంకా చావలేదని, అందువలన తాను సుగ్రీవుని చంపబోనని తారపై ఒట్టుబెట్టుకొని, ఆమెకు ధైర్యాన్ని కలిగించి అంతఃపురం లోకి తిరిగి వెళ్లుమని తెలిపాడు.

వాలి ఎంత ధైర్యాన్ని నూరిపోసినా, తార మనస్సు మనస్సులో లేదు. ఎందుకంటే ఈసారి ఆమెకు ధైర్యం కలుగడం లేదు. ఇదివరకు ఎన్నో మారులు వాలి ఎన్నో అర్ధరాత్రులలో యుద్ధానికి దాడికి వెళ్లాడు. కాని ఎన్నడు ఆమె మనస్సు ధైర్యాన్ని కోల్పోలేదు. నిర్భయంగా భర్తను యుద్ధానికి సాగనంపింది. ప్రతిసారి విజయ దరహాసంతో ఆయన యుద్ధం నుండి తిరిగి వచ్చేవాడు. ఈసారి మాత్రము అంత ధైర్యంగా తాను వాలిని అలా పంపలేకపోతున్నది. తన మనస్సెంతో కీడును శంకిస్తున్నది.

నిజానికి ఇదివరలో వాలి యుద్ధాలు ఇతర శత్రువులతో జరిగాయి. ఈ మధ్యలో మాత్రమే వాలి సుగ్రీవుల మధ్య అన్నదమ్ముల పోరు ఆరంభమైంది. అది తారకు ఎంత మాత్రము ఇష్టములేదు. సుగ్రీవుడు వాలి చనిపోయాడనుకొని, మంత్రుల, ప్రజల నిర్బంధము వలననే రాజ్యసింహాసనం పైన కూచొన్నాడని ఆమెకు తెలుసు. వాలి దౌర్జన్యం వలన సుగ్రీవుడు దేశబహిష్కృతుడు, భార్యా విహీనుడు అయ్యాడు. అందువలన సుగ్రీవుని పట్ల ఆమె మనస్సు సానుభూతితో నిండి ఉంది. అందువలన ఈ పోరును నివారించడానికి సుగ్రీవుని ఆదరంతో పిలిచి, ఆయనకు ఆయన భార్యను అప్పగించి, యౌవరాజ్య పట్టాభిషేకాన్ని జరుపుమని బ్రతిమిలాడింది. వాలిని ఎంతో అనునయించింది.

అంతేకాదు ఈసారి పోరు ఆ ఇద్దరు అన్నదమ్ములకు మాత్రమే పరిమితమైంది కాదు. మహా పరాక్రమోపేతులైన మహాభయంకర రాక్షసులను క్షణాల్లో మట్టుపెట్ట గలిగిన మహావీరుడు శ్రీరామభద్రుడు సుగ్రీవునికి అండగా నిలిచాడని ఆమె విన్నది. ఆయన వలన వాలికి ఏమి ప్రమాదము కలుగబోతుందో అని ఆమెకు భయంగా ఉంది. వాలి సుగ్రీవులలో ఏ ఒక్కరికి ప్రమాదం కలిగినా ఆమె భరించలేదు. వారిద్దరు ఆమెకు రెండు కళ్లు. ఏ కన్నుకు బాధ కలిగినా దుర్భరమే కదా! అందువలననే అత్యంత దుఃఖంతో వాలికి వీడ్కోలు చెప్పి తార అన్యవనితలతో కలసి కిష్కింధకు తిరిగి వెళ్లింది. వెళ్లే ముందు ఆమె వాలికి ప్రదక్షిణం చేసి, ఆయనకు శుభం కలుగాలని కోరుకొంది.

తార వెళ్లి పోయిన తరువాత వాలి ఒక భయంకరమైన మహా సర్పంవలె బుసలు కొట్టుతూ యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. ఆయనకు ఎదురుగా సుగ్రీవుడు ఎరుపు, పసుపు

రంగులతో కలసి, మొలకు గట్టిగా బట్ట కట్టుకొని, భూమిపై పాదాన్ని నొక్కి పట్టుకొని మండుచున్న అగ్నివలె తీవ్రంగా యుద్ధసన్నద్ధుడై నిలిచి ఉన్నాడు.

ఆగ్రహోదగ్రుడై వాలి కూడ నడుముకు వస్త్రాన్ని బిగించాడు. పిడికిలిని బిగబట్టి, "ఒకే దెబ్బతో నీ ప్రాణాలను గాలిలో కలుపుతానని" సుగ్రీవుని హెచ్చరించాడు.

వాలి మాటలకు సుగ్రీవుడు పిడికిలితోనే సమాధానం చెప్పాడు. సుగ్రీవుని దెబ్బకు మారుగా వాలి తన బలాన్నంతటిని ఉపయోగించి ఆయనను కొట్టాడు. వాలి దెబ్బకు సుగ్రీవునికి కళ్లు బైర్లు కమ్మాయి.

ఆయన శరీరము రక్తధారలను ఎగజిమ్మింది. అయినా మరుక్షణంలో ఎలాగో తేరుకొన్నాడు. అక్కడ ప్రక్కలో ఉండే ఒక పెద్ద చెట్టును పెకిలించి బయటకు తీసి, దానితో తన శక్తినంతటిని కలుపుకొని వాలిని బలంగా మోదాడు. ఆ దెబ్బ వాలిని నిశ్చేష్టుని చేసింది. అయినా ఆయన కూడ మళ్లీ విజృంభించాడు.

వాలి సుగ్రీవులిద్దరు సహజంగా మహా బలవంతులు. దానితో పాటు వారిద్దరికి ఒకరినొకరు జయించాలనే పట్టుదల ఏర్పడింది. ఫలితంగా వారిద్దరి మధ్య సంగ్రామం అంతకంతకు భయంకరంగా మారసాగింది. వారి యుద్ధము భయంకరమైన "మహేంద్ర వృత్రాసుర" యుద్ధాన్ని తలుపుకు తెచ్చింది. ఆకాశంలో చంద్రసూర్యులిద్దరు సమరం చేస్తున్నారా? అనిపించింది. అలా కొంత సమయము జరిగింది. క్రమంగా సుగ్రీవుని బలదర్పాలు తగ్గసాగాయి. ఇక ఎంతోసేపు తాను వాలి దెబ్బలకు తట్టుకోజాలనని ఆయన గ్రహించాడు. అందువలన ఆయన రామ సహాయాన్ని అపేక్షించి రామునివైపు దీనంగా చూడసాగాడు.

రాముడింతవరకు బాణ ప్రయోగం చేయక ఆగింది, సుగ్రీవుని ఈ స్థితి కొరకు ఎదురు చూడడం వలననే. యుద్ధారంభంలోనే బాణప్రయోగం చేస్తే రాముడు బాణం వేయకున్నా, తాను ఈసారి తప్పక వాలిని సమరంలో సంహరించే వాడినని సుగ్రీవుడు తలచేవాడు. తన పరాక్రమం వలననే వాలి చచ్చాడని రాముని బాణ ప్రయోగము నిమిత్త మాత్రమే అని భావించేవాడు. ఇప్పుడు సుగ్రీవుడు పూర్తిగా దుర్బలుడయ్యాడు. ఇక ఏ కొద్ది సమయము రాముడు ఉపేక్షించినా తన చావు తప్పదని గ్రహించి రామునివైపు దీనంగా చూచాడు.

అప్పుడు అరక్షణమైనా ఆగక, ఆశీవిష సర్పమువంటి భయంకరమైన బాణాన్ని తన అక్షయ తూణీరం నుండి రాముడు బయటకు తీశాడు. తన చెవి వరకు నారిని లాగి వదిలాడు. ఆ నారీ టంకార ధ్వని మహా ప్రళయ భయంకరమైనది. ఆ ధ్వని వినగానే అక్కడ ఉన్న పక్షులు, మృగాలు భయంతో ప్రాణాలను కోల్పోయాయి.

అ నారి నుండి తాను ఎక్కుబెట్టిన క్రూర నారాచాన్ని రామభద్రుడు వదిలాడు. సువర్ణ రజిత భూషితమైన ఆ మహా బాణము పొగలతో నిప్పులు క్రక్కుతూ మెరుపులను మెరిపిస్తూ, పిడుగుపాటు ధ్వనితో మహావేగంగా వెళ్లి వాలి వక్షఃస్థలాన్ని "గొడ్డలి నరికిన చెట్టువలె" చీల్చి వాలిని నేల కూల్చింది. ఆశ్వీయుజ పూర్ణిమనాడు ఇంద్రధ్వజము నేల కూలినట్లు రక్తము కక్కుతూ వాలి రక్తాశోకము వలె నేలవాలాడు. శత్రు భయంకర మహాబలుడైన వాలి రామభద్రుని ఒకే బాణంతో మట్టిగరిచాడు.

వాలి నిర్యాణముతో ఆ ప్రాంతం చంద్రుడస్తమించిన ఆకాశం వలె పూర్తిగా కళా విహీనమైంది. అయినా వాలి శరీరంలోని సువర్ణాభరణాలు తమ కాంతిని కోల్పోలేదు. మహేంద్రుని మాలా ప్రభావము వలన వాలి దేహము కాంతినికోల్పోలేదు. రామబాణము వాలి శరీరంలో గ్రుచ్చుకొని అలాగే ఉండిపోయింది.

-- ఇతిశం --

"చేతిని కోసివేయుదురె? చెల్లి యెకించుక లేచునంతటన్"

"వారణమును మత్తమని చంపుకోరు,
కోరి యుద్ధమది సిద్ధమై వచ్చుచున్న వేళ"

"ధాతువులకు శైలేంద్రము వలె
రాముడు కల్యాణ గుణములకు ఆకరము"

"రామభద్రా! నీవు మహాత్ముడవు.
తార నన్ను ఎన్ని విధాల వారించినా
నీ చేతిలో మరణం కావాలని కోరుకొన్నాను"
- వాలి

# వాలి ఆక్షేపాలు

తన తమ్మునితో పోరాడుతున్న తనపై హఠాత్తుగా బాణప్రయోగం చేసి తనను శ్రీరాముడు వధిస్తాడని వాలి కలలో కూడ ఊహించలేదు. అందువలన శ్రీరాముడు తన కంటబడితే తన మనస్సులోని ఆవేదనను, అసహ్యాన్ని వెళ్లగక్కాలని వాలి నిశ్చయించుకొన్నాడు.

వాలి మనస్సును రాముడు అర్థం చేసికోగలడు. ఆయనను ఆయన చూడకుండా తాను చంపడం తప్పుగా భావిస్తాడని శ్రీరామునికి తెలుసు. అందువలననే వాలి ముందుకువెళ్లి తాను వాలినెందుకు సంహరింపవలసి వచ్చిందో ఆయనకు తెలుపాలని శ్రీరాముడు కూడ నిర్ణయించుకొన్నాడు. అందువలన రామభద్రుడు లక్ష్మణ సమేతంగా వెళ్లి వాలి ముందు నిలిచాడు.

వాలి మనస్థితి విచిత్రంగా ఉంది. ఒకవైపు శ్రీరామచంద్రుడు ధర్మ సంస్థాపనే ప్రధాన లక్ష్యంగా పనులు చేసేవాడని లోకులందరు కీర్తిస్తున్నారు. మరొకవైపు శ్రీరాముని పట్ల నిరపరాధినైన తనను, మరొకరితో పోరాడుతూ ఆ పోరులోనే నిమగ్నుడై ఉన్న తనను హఠాత్తుగా చాటునుండి బాణము వేసి రాముడు వధించాడు. అంతటి ధర్మాత్ముడు తనను ఎందుకు ఇంత అధర్మంగా వధించాడో వాలి ఊహకు అందడం లేదు. తన వక్షస్థలంలో రాముడు నాటిన బాణం తనకు ప్రాణాంతకంగా బాధను కలిగిస్తున్నది.

అందువలన వాలి "ప్రశ్రితం, ధర్మ సంశ్రితమైన వాక్యాలను పరుషంగా" రాముని ముందు పలికాడు. పరుషంగా అంటే కఠినంగా పలికాడు. కాని పలికిన పలుకులు ప్రశ్రితములు అనగా మృదువైనవిగా ఉన్నాయి. అంతేకాదు అవి ధర్మబద్ధంగా ఉన్నాయి. అంటే వాలి మాటలు పైకి పరుషంగా కనుపిస్తున్నాయి. కాని అవి ప్రశ్రితములు అంటే మృదువుగా ధర్మబద్ధంగా ఉన్నాయి.

వాల్మీకి యొక్క ఈ పదాలను దృష్టిలో పెట్టుకొనే వాలి మాటలు పైకి నిందారూపంగా కనిపిస్తున్నా నిజంగా అవి అంతరంగా స్తుతి రూపాలే అని మహేశ్వర తీర్థులు తమ తత్వదీపికా వ్యాఖ్యానంలో వివరించారు. అక్కడక్కడ వాలి నిందా వాక్యాలను వారు స్తుతి రూపంగా నిరూపించారు కూడ. వాటిని ఆయా సందర్భాలలో గమనిద్దాము.

వాలి యొక్క సంభాషణా ప్రారంభమే స్తుతి రూపంగా సాగింది.

**"త్వం నరాధిపతేః పుత్రః ప్రథితః ప్రియదర్శనః**
**కులీనః సత్వ సంపన్నః। తేజస్వీ చరితవ్రతః"**

రామభద్రా! నీవు రాజకుమారడువు. శాస్త్రప్రియుడవు. ఉత్తమ కుల సంజాతుడవు. సత్వగుణ సంపన్నుడవు, ఇతరులను వశం చేసికొనే తేజస్సు కలవాడవు, సత్కర్మలను ఆచరించేవాడివి.

రామచంద్రుని గురించి తన అభిప్రాయాన్ని వాలి ఎలా తెలిపాడో చూచారా? తన అభిప్రాయాన్నే మాత్రమే కాక లోకులందరు రాముని కీర్తించే విధానాన్ని కూడ వాలి తెలియజేస్తున్నాడు.

**"రామః కరుణవేదీచ। ప్రజానాంచ హితే రతః**
**సానుక్రోశో జితక్రోధో। సమయజ్ఞో దృఢవ్రతః"**
**ఇతే తే సర్వభూతాని। కథయంతి యశో భువి.**

"రాముడు దయామయుడు, ప్రజల హితము పట్ల ఆసక్తి కలవాడు. బాధామయుల పట్ల సానుభూతి (జాలి) కలవాడు, కోపమును జయించినవాడు, సమయా సమయములు తెలిసినవాడు, రక్షాదీక్షితుడు" అని సమస్త జనులు నీ కీర్తిని భూమిపై చెప్పుకొంటారు.

ఇంతవరకు రాముని గురించిన పలుకులు స్తోత్రరూపాలేకాని నిందాత్మకములు కావు కదా!

అయితే తన శరీరములో దిగిన రామబాణము ప్రాణాంతకంగా బాధిస్తున్నది. భరించరాని బాధలో ఉన్న వ్యక్తికి ధర్మాధర్మ విచక్షణ ఉండదు కదా! అందువలన అంతటి తన బాధకు కారణమైన శ్రీరాముని వాలి అధర్మపరుడని నిందించడం ప్రారంభించాడు.

(1) పరాఙ్ముఖ వధం కృత్వాకో2 ను ప్రాప్తస్త్వయాగుణః?"

ఇంతటి సుప్రసిద్ధ ధర్మాత్ముడవు నన్నెందుకు చాటునుండి చంపావయ్యా? దీని వలన నీ కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయా? పైపెచ్చు అలా చాటునుండి చంపడం నీకు అసహ్యమనిపించలేదా?

సుప్తుని, మత్తుని, ప్రమత్తుని (పరాకుతో ఉన్న వానిని) మరొకరితో పోరాడుతున్న వాని విషయంలో ఆయుధమెత్త కూడదని సామాన్య యుద్ధనీతి కదా! నీ బుద్ధి చెడిందా? నీవు ధర్మవేషధారివైన అధార్మికుడవు. పైన గడ్డి మొలచిన నూతివంటి వాడివి. నివురు గప్పిన నిప్పువు నీవు.

నీవు నన్ను వధించడానికి కారణాలు చెప్పగలవా?

(1) నీవు నాగరికుడవు. మీ ప్రధాన ఆహారము అన్నము. మేము వనవాసులము వానరులము. అడవిలో పండ్లను, దుంపలను తినేవాళ్లము. మన మధ్య వైరమెలా ఏర్పడింది?

(2) మన మధ్య వైరము ఏర్పడడానికి నేను మీ దేశంపై దండెత్తి వచ్చానా? మీ ద్రవ్యాన్ని (బంగారు, వెండి) అపహరించానా?

(3) మేము తినే పండ్లు మీకు కావాలని నన్ను చంపావా?

(4) మేము మృగాలము కనుక నన్ను వేటాడి చంపానంటావా? మేము మీ నగర జనులకు ఆపదలు కల్పించలేదే?

(5) మేము మృగాలము కనుక మమ్ము తినాలని చంపావా? పంచనఖాల మృగాలను క్షత్రియులు తినవచ్చంటావా? మీరు తినే పంచనఖాల మృగాలు (పంచ) అయిదే: (1) చెవుల పిల్లి (2) ముండ్లపంది (3) ఉడుము (4) కుందేలు (5) తాబేలు. మేము మీరు తినే మృగాలము కామే?

(6) తినకున్నా చర్మం కొరకో, వెంట్రుకల కొరకో, గోళ్ల కొరకో, ఎముకల కొరకో చంపవచ్చు కదా! అంటావా?

జింకచర్మం వలె, పులి చర్మం వలె మా చర్మం కప్పుకోవడానికి, కూచోవడానికి కట్టుకోవడానికి పనికిరాదు.

మా వెంట్రుకలు గొఱ్ఱెల వెంట్రుకల వలె ఉన్ని బట్టలు నేయడానికి పనికి రావు. మా గోళ్లు పులిగోళ్ల వలె నగలలోనో స్వతంత్రంగానో ధరించడానికి ఉపయోగకరాలు కావు. మా ఎముకలు ఏనుగు దంతాల వలె విలువైనవి కావు. మరెందుకు అంత కష్టపడి చాటుకు నిలబడి చంపావు?

(7) రామా! నీవు మీ తమ్ముడు ముని వేషాలు ధరించారు. ఋషులు పరహింసకు పాల్పడుతారా? మేము రాజపుత్రులమే కదా! అంటావా? రాజకుమారులు శాస్త్రానుసారము దండిస్తారు కాని నిరపరాధులను వధిస్తారా?

(8) రాజహంతకులు, బ్రాహ్మణ హంతకులు, గోహంతకులు, అకారణ ప్రాణి హంతకులు, నాస్తికులు, చోరులు, అన్న కంటె ముందు పెళ్లి చేసికొన్న తమ్ములు (పరివేత్తలు) నరకాన్ని పొందుతారు.

(9) అంతేకాదు పరులపై లేని కొండాలు చెప్పేవాళ్లు, లోభులు, మిత్ర హంతకులు, గురుపత్నీగాములు కూడ క్రూరనరక యాతనలు అనుభవిస్తారు.

నీవు కూడ నిష్కారణప్రాణి హంతకుడవు. నీవు కూడ నరకయాతనలు అనుభవిస్తావు.

(10) రాజులు శత్రువులను వశం చేసికోవడానికి సామ, దాన, భేదోపాయాలను అనుసరించి, అవేవి ఫలించక పోతేనే దండాన్ని ఉపయోగిస్తారు. నీకు దండము తప్ప మరే ఉపాయము లేదా?

(11) పాలకులు ప్రజల విషయంలో నిగ్రహానుగ్రహాలు రెండు అనుసరిస్తారు. నీకు నిగ్రహమొక్కటే తెలుసా?

(12) పోనీ నీవు నీ నిగ్రహాన్ని, నీ దండాయుధాన్ని నాపై ఉపయోగింప దలిస్తే నా ముందుకు వచ్చి, నాతో ద్వంద్వ యుద్ధము చేసి ఉంటే, యుద్ధారంభమయిన మరుక్షణంలోనే నిన్ను చంపి, యమపురికి పంపేవాడిని. పిరికితనంతో చాటుకుండి చంపావు. (అయితే వాలి ఇక్కడ ఒక ముఖ్య విషయం మరిచాడు. రాముడు తనకంటె శరీర బలంలో కూడ అధికుడే. తాను యోజనదూరంలో విసిరిన దుందుభి దేహాన్ని రాముడు దశయోజనాలు గోటితో చిమ్మాడు).

(13) నీవు అరణ్యములలోకి బయలుదేరాక, నీ భార్య రావణాసురుని చేత అపహరింపబడిందని, ఆమెను తిరిగి పొందడానికి సుగ్రీవునితో స్నేహం చేశావని విన్నాను. నీవు తెలివిలేనివాడివి. లేకుంటే దేశ బహిష్కృతుడు, స్వయంగా భార్యను పోగొట్టు కొన్నవాడు, బలహీనుడైన సుగ్రీవునితో స్నేహం చేస్తావా?

(14) వానర సామ్రాజ్యాధిపతిని, అమోఘ పరాక్రమ సంపన్నుడను, శత్రు భయంకరుడనైన నాతో ఒక్క మాట ముందుగా చెప్పి ఉంటే, రావణుని బంధించి, నీ భార్యను ఒక్క పూటలో తెచ్చి నీకిచ్చేవాడిని కదా!

(15) పాతాళంలో మధుకైటభులు అనే రాక్షసులు వేదాన్ని దాచగా, హయగ్రీవుడు ఆ వేదాన్ని తీసిక వచ్చి బ్రహ్మకు అప్పగించినట్లు, రావణుడు నీ భార్యను సముద్రములో దాచినా, పాతాళంలో దాచినా, ఆయనను బంధించి, నీ భార్యను తెచ్చి నీకు అప్పగించే వాడిని కదా!

(16) దానవ సంహారము కొరకు దేవతలకు సహాయము చేయడానికి స్వర్గానికి వెళ్లిన మహా పరాక్రమోపేతుడైన "కకుత్స్థ" ప్రభువు వంశంలో జన్మించావే? పిరికితనంతో చాటు నుండి నన్ను చంపుతావా? నీకు సిగ్గుగా లేదా?

(17) నీవు సుగ్రీవునితో స్నేహం చేసికొన్నావని, నీ మూలంగా ప్రమాదం వాటిల్ల వచ్చునని తార ఎంతగానో వారించినా వినక, నేనుసుగ్రీవుని గర్వమణచడానికి ఆయనతో తలబడ్డాను. కాని నీవు ఇంత పాపానికి ఒడిగట్టుతావనుకోలేదు.

(18) మా అన్నతమ్ముల మధ్య పోరులో నన్ను సుగ్రీవుడు చంపినా న్యాయంగానే ఉండేది. కాని దారిలో వెళ్లే ఎవ్వరివో అయిన నీతో చావడం నాకు అన్యాయంగా ఉంది.

(19) జనన, మరణాలు ప్రతి జీవికి సహజాలే. నేనిప్పుడు నీ చేతిలో చచ్చాను. కాని నన్ను అన్యాయంగా చంపి నీవు పాపాన్ని మూటగట్టుకొన్నావు గదా! నీ పరిస్థితి ఏమి కానుందో ఆలోచించుకో!

(20) దూర్తుడైన భర్తను పొందిన పతివ్రత అయిన భార్య బాధలు పడినట్లు నీవు రాజువైతే ఈ భూమి అలా బాధపడుతుంది.

(21) మహాత్ముడైన దశరథ మహారాజుకు వంచకుడవు, సదా క్రూరకర్ముడవు, పాపాత్ముడవైన నీవు కొడుకుగా ఎలా పుట్టావు?

(22) త్రాగి, మత్తులో పడుకొన్న వానిని పాము కాటువేసి చంపినట్లుగా నీ వైపే రాని నిరపరాధినైన నన్ను చాటునుండి చంపావే? ఇంత నీచమైన పని చేసి సత్పురుషుల ముందు ఏమి చెప్పి తలెత్తుకొని తిరుగుతావు?

**"కిం వక్ష్యసి సతాం మధ్యే। కృత్వా కర్మ జుగుప్సితం"**

నా ప్రశ్నలకు, నీకు చేతనైతే బాగా ఆలోచించుకొని సమాధానములు ఇవ్వుమని శర బాధతో సతమతమవుతున్న వాలి మాట్లాడలేక ఊరుకొన్నాడు.

**వాలి ప్రశ్నల విషయంలో మహేశ్వర తీర్థుల వారి వ్యాఖ్యా విశేషాలు**

వాలి శ్రీరాముని నిందిస్తు మాట్లాడిన మాటలలో వాస్తవానికి నింద లేదని, అందులో శ్రీరాముని స్తుతే దాగుందని మహేశ్వర తీర్థుల వారి అభిప్రాయము. వారి అభిప్రాయానికి కొన్ని ఆధారాలు ఉన్నాయి:

(1) త్వం నరాధి పతేః పుత్రః । ...... తేజస్వీ, చరితవ్రతః॥

(2) రామః కరుణవేదీచ ...। సమయజ్ఞోదృఢవ్రతః॥" అనే ఈ రెండు స్తుతి శ్లోకాలు వాలి అభిప్రాయాన్నే సూచిస్తున్నాయి కదా!

(1) అలా కాదు మనము ఎంతో మంచివారు అనుకొన్నవారు, ఏదో తప్పు చేసినట్లు తెలిస్తే – అవును అంతమంచివాడిగా కనబడ్డావే? ఇంత దుర్మార్గుడివా? అని ఆశ్చర్యపడ

వచ్చు కదా! అంటే కావచ్చు కాని అంత మాత్రాన రాముని పట్ల వాలికి సద్భావం లేదనే చెప్పరాదు కదా!

(2) వాలి మహా పాపి. ఆయనకు తాను చేసిన తప్పు బాగా తెలుసు. కాని బల మదము, అధికార మదము, అహంకారమదము ఆయనను ఇంత కాలము తన తప్పును గురించి ఆలోచించనివ్వలేదు. తార తన తప్పు గురించి ఎప్పుడు సూచించినా, ఆయన దానిని పట్టించుకోలేదు.

కాని రామ శరాఘాతము ఆయనకు ప్రాణాంతకమైన బాధను కలిగించింది. తనకు అంతిమ సమయము సమీపించిందని ఆయనకు తెలుసు. ఆ సమయంలో ప్రతి వ్యక్తి ఆత్మపరిశీలన తప్పక చేసికొంటాడు. ఆ సమయంలో తన తప్పు ఆయనకు గుర్తుకు వచ్చి ఉంటుంది.

**శ్రీరాముడు "ప్రియదర్శనుడ"ని వాలే అన్నాడు కదా! ప్రియదర్శనుడు అంటే శాస్త్రమే ప్రియమైనవాడు. అంతటి శాస్త్రాచార సంపన్నుడు పాపం చేశాడని వాలి అనుకొంటాడా?** బాణం తగిలినవెంటనే భరించరాని బాధతో రాముడు తనను సంహరించడం తప్పు అనుకోవచ్చు. కాని నెమ్మదిగా ఆలోచించినప్పుడు తన ఆలోచన తప్పని అనిపించ లేదా? అంత తప్పు చేసిన రాముడు తన ఎదుటే వచ్చి నిలుస్తాడా? నిలిచినప్పుడు కూడ వాలి అనాలోచితంగా అలా నిందిస్తాడా?

(3) పదునాలుగు వేల భయంకర రాక్షసులను క్షణంలో మట్టుబెట్టిన మహావీరునికి తనంత వానిని ఒకే బాణంతో నేలగూల్చగల్గిన మహాబలునికి నిజంగా సుగ్రీవుని అండ కావాలా?

(4) తనకు మహేంద్ర దత్తమైన కాంచనమాల ఉండవచ్చు. దాని వలన తనకు ఇంతవరకు శత్రు విజయము లభించి ఉండవచ్చు. అంత మాత్రాన దానికి భయపడి రామభద్రుడంతటి వాడు తనను చాటునుండి చంపాలా?

ఇదివరకు వాలి జయించింది, వధించింది మల్లయుద్ధంలో తన నెదిరించిన శత్రువులనే. బాహాబాహి పోరాడినవారినే. వారిలో కూడ దుందుభిని ఓడించిన సమయం కంటె మాయావి అయిన మహిషాసురుని సంహరించడానికి అధిక (సంవత్సర) సమయము పట్టింది. గోకర్ణుని ఓడించడానికి పది సంవత్సరాలుపట్టింది. అటువంటిది పూర్ణ బల సంపన్నుడైన శ్రీరాముడు ఎదురుగా వచ్చి పోరాడితే తాను క్షణంలో రాముని యమపురికి పంపగలిగేవాడా? దూరంగా ఉండి బాణ ప్రయోగంతో పోరాడే శ్రీరాముని మహేంద్రుని మాల బలహీనుని చేయగల్గుతుందా? రాముడు తనను చంపడానికి వచ్చినప్పుడు మల్ల యుద్ధం తోనే చంపుమని వాలి అడిగితే రాముడు బాణప్రయోగం

చేయక వదులుతాడా? దుందుభి దేహాన్ని తనకంటె పదిరెట్లు దూరానికి కాలి గోటితో చిమ్మిన మహాబలుని మీందు తన దేహ బలము ఏపాటిది? మల్లయుద్ధ శక్తి కూడ దేహబలం పైననే ఆధారపడి ఉంటుంది కదా! అయినా శ్రీరాముడు తనను చాటునుండి చంపడానికి వేరే కారణాలు ఏవో ఉండవచ్చు కదా?

(5) సరే! ఆ మాటలన్ని అలా ఉండనీ! సార్వభౌమ తనయుడు, మహా పరాక్రమోపేతుడు, శాస్త్రా చార సంపన్నుడు, తనను వధించడానికి ఏదో బలమైన కారణము ఉంటుంది కదా! ఆ కారణము తన అనాచారము ఎందుకు కాకూడదు?

ఈ ఆధారాలన్నిటిని బట్టి శ్రీ మహేశ్వర తీర్థులు వాలి ఆక్షేపణలు నిందా స్తుతులన్నారు.

**మహేశ్వర తీర్థుల వారి వ్యాఖ్యా విశేషాలు - వాలి ఆక్షేపాలు**

**1) "పరాఙ్ముఖ వధం కృత్వా। కో2ను ప్రాప్తస్త్వయాగుణః-**

నన్ను చాటునుండి వధించడం వలన నీకేమి గుణము (గొప్ప) కలిగింది?

మహేశ్వర తీర్థులు:- నన్ను చాటుకుండి వధించడానికి సామాన్య కారణాలేవి లేకున్నా "నిర్వక్తుం అశక్యో గుణః" సామాన్యులకు తెలియని ఒక విశేష గుణము ఉండి ఉంటుంది. ఆ గుణము మన ఇద్దరికి అమలత్వాన్ని కల్గిస్తుంది.

**"రాజాత్వశాసన్ పాపస్య తదవాప్నోతి కల్బిషం"**

ఒక పాపాత్ముని శిక్షించకపోతే, ఆయన పాపము రాజుకు సంక్రమిస్తుంది. అందువలన నన్ను శిక్షించడం ద్వారా నీకు పాపము అంటకుండా పోయింది. అంతే కాదు.

**"రాజభిః ధృతదండాస్తు। కృత్వా పాపాని మానవాః**
**నిర్మలాః స్వర్గమాయాంతి। సంతః సుకృతినో యథా॥"**

పాపాత్ములైన మానవులు తమ పాపాలకు తగిన రాజదండనలను అనుభవిస్తే - వాటితో తమ పాపాలు పోయి సత్పురుషుల వలె స్వర్గానికి వెళ్తారు.

అందువలన నీవు నన్ను వధించడం ద్వారా నా పాపము పరిహారమైంది. నీవు నన్ను వధించడం వలన నీకు, నాకు అమలకత్వ (పాపరాహిత్య) గుణము కలిగింది.

**2) "దమః శమః క్షమా ధర్మో ధృతిస్సత్యం పరాక్రమః**
**పార్థివానాం గుణా రాజన్। దండశ్చాపరాధిషు"**

బహిరింద్రియ, అంతరింద్రియ నియమనాలు, సహనము, ధైర్యము సత్యము, పరాక్రమము, అపరాధులను దండించడం రాజా । ఇవి రాజ లక్షణాలు.

**మహేశ్వర తీర్థులు:**

వాలి రాజుల యొక్క మంచి లక్షణాలలో అపరాధులను దండించడం కూడ తెల్పి - శ్రీరాముని "రాజా" అని సంబోధించడం వలన ఈ గుణాలన్ని రామునికున్నాయని వాలి అభిప్రాయము. అందువలన తనకు అపరాధ దండన విధింపబడింది సబబే అని ఆయన నిశ్చయము.

**(3) తాన్‌గుణాన్ సంప్రధార్యాహం । అగ్ర్యం చాభిజనం తవ'**
**తారయా ప్రతిషిద్ధో2పి । సుగ్రీవేణ సమాగతః ।**

నీలో అటువంటి సామాన్య రాజ లక్షణాలు, అపహత పాప్మాది విశేష (పరమాత్మ) లక్షణాలు ఉన్నాయని ముందుగానే నిర్ధారించుకొన్నాకే - భర్తృవ్యామోహం వలన తార నన్ను యుద్ధానికి వెళ్లవద్దని నిషేధించినా నీతో చావడానికే నేను సుగ్రీవుని పైకి యుద్ధానికి వచ్చాను.

**(3) "రామ రాజకులే జాతో - ధర్మవానితి విశ్రుతః**
**అభవ్యో భవ్య రూపేణ - కిమర్థం పరిధావసి?"**

మహేశ్వర తీర్థులు :- రామా! నీవు ఉత్తమ రాజకులసంజాతుడవు. ధర్మాత్ముడవని ప్రసిద్ధి చెందావు. నీవు భవ్యుడవు (పూజ్యుడవు) (దుష్టుని) అభవ్యుని రూపంలో ఎందుకు సంచరిస్తావు? సంచరింపవు.

(4) నచత్వాం అవజానేచ - కస్మాత్త్వం హన్స్యకిల్బిషం?

మహేతీర్థులు: నీవు పాపరహితులను ఎందుకు వధిస్తావు? వధించవు. నీవు అకారణ దండన విధిస్తావని నేను నిన్ను అవమానించను కూడ.

(5) నతే2స్త్యపచితిర్ధర్మే - నార్థేబుద్ధిరవస్థితా

నీవు వానప్రస్థుడవై అరణ్యాలలో సంచరిస్తున్నావు. అందువలన సామాన్యమైన గృహస్థాశ్రమ ధర్మాల పట్ల గౌరవము లేదు. అంతకంటె ఉన్నతమైన వానప్రస్థాశ్రమ ధర్మాల పట్ల లక్ష్యము కలవాడవు. నీకు అర్థము (ద్రవ్యము) పట్ల మోహబుద్ధి లేదు.

**(6) నయశ్చ - వినయశ్చో భౌ । నిగ్రహానుగ్రహావపి ।**
**రాజవృత్తి రసంకీర్ణా । న నృపాః కామవృత్తయః ॥**

మహేశ్వర తీర్థులు: సత్పురుషుల పట్ల నయము (విధేయత), అనుగ్రహాన్ని పాటిస్తారు. దుర్మార్గుల పట్ల వి(విరుద్ధ) నయము, నిగ్రహాన్ని పాటిస్తారు. ఈ విధంగా రాజుల ప్రవర్తన స్పష్టమైనది. రాజులెప్పుడు ప్రజల విషయంలో కామ (స్వేచ్ఛా) వృత్తిని పాటించరు. సామాన్య రాజుల విషయమే అంత శాస్త్ర బద్ధంగా ఉన్నప్పుడు ఇక సర్వేశ్వరుడవైన నీ గురించి వేరే చెప్పాలా?

(7) తారయావాక్యముక్తో2హం । కాలస్య వశమాగతః

తార భార్యా బుద్ధితో వారించినా - నేను ఆమెను కావాలని లెక్కచేయక కాలరూపుడవైన ఈశ్వరుడవైన నీ వశమయ్యాను.

(8) భూమిర్హిరణ్యం రూప్యంచ । విగ్రహే కారణానిచ

విషయేవా పురేవాతే । యదానాపకరోమ్యహం ॥

మహేతీర్థులు:- రామా! సాధారణంగా భూమో - బంగారో, వెండో (ధనమో) వివాదానికి కారణాలవుతాయి. నీ రాజ్యంలో కాని, నీ నగరంలో కాని నేను కల్గించు కోలేదు. అందువలన నీవు వాటి కొరకు విధించిన దండన కాదు.

(9) కథం దశరథేన త్వం । జాతః పాపోమహాత్మనా ।

మహేతీర్థులు: మహాత్ముడైన దశరధుని చేత జరుపబడిన పుత్రకామేష్టి యాగకారణంగా జన్మించిన నీవు ఎలా పాపాత్ముడివౌతావు?

(10) "చర్మచాస్థిచమేరాజన్ । న స్పృశంతి మనీషిణః

అభక్ష్యాణి చమాంసాని । సో2హం పంచనఖోహతః"

మహేతీర్థులు: రాజా! మా చర్మాలను, ఎముకలను బుద్ధిమంతులు స్పృశించడానికి కూడ ఇష్టపడరు. మా మాంసము మీకు తినడానికి పనికిరాదు. అందువలన పంచనఖుడ నైన నేను నీ చే వధింపబడడానికి స్పర్శకు, భక్షణానికి సంబంధించిన కారణం కాదు.

(11) "ఉదాసీనేషు యో2స్మాసు । విక్రమస్తే ప్రకాశితః

అపకారిషు తం రాజన్ । నహిపశ్యామ విక్రమః"

మహేశ్వర తీర్థులు:- రామప్రభూ! అనుకూలులతో పాటు, ఉదాసీనులమైన మా పట్ల కూడ మీ విక్రమము (పాదన్యాస వైభవము) ప్రదర్శితమవుతుంది. తద్వారా మేము నీ అడుగునీడ క్రింద చేరుతాము. కాని దుర్మార్గులు ఎవ్వరు చెప్పినా వినరు కనుక వారి విషయంలో నీ ఆశ్రయము ఫలించడాన్ని చూడము.

ఈ విధంగా వాలి ఆక్షేపాలలో నిందకంటె స్తుతే ప్రధానమని సుప్రసిద్ధ రామాయణ వ్యాఖ్యాతలైన మహేశ్వర తీర్థులు తమ తత్వదీపికా వ్యాఖ్యానంలో వివరించారు. ఇదొక ప్రత్యేకమైన అభిప్రాయ విశేషము.

వాలి ఆక్షేపాలకు శ్రీరామచంద్రుడు – వాలి దోషాన్ని చూపి అందుకు విధించబడిన దండనమే వాలివధ అనితెలిపినప్పుడు వాలి "రామభద్రా! ఏదో తొందరపాటుతో నిన్ను నిందించాను. **"దోషం కర్తుం నార్హసి రాఘవ । ధర్మజ్ఞ పరిపాలయ"** ధర్మజ్ఞుడా తప్పు పట్టుకోకు, క్షమించుమని" వేడుకొన్నాడు.

**"న దోషం రాఘవే దద్యౌ – ధర్మేఽధిగత నిశ్చయః"**

ధర్మముపైన విశ్వాసము కలిగిన వాలి రాఘవుని చర్యను దోషముగా పరిగణించ లేదు.

ఈ నిర్ణయానికి వాలి రావడానికి కారణము కేవలము వాలి ఆక్షేపాలకు శ్రీరాముడిచ్చిన సమాధానము మాత్రమే కాదు. రాముని పట్ల వాలికి అప్పుడు భయమేర్పడి కూడ కాదు. రామ సమాధానము నిస్సందేహంగా వాలి మనస్సును కుదుటపరిచింది. అయితే అలా కుదుట పడడానికి అంతకుముందే ఆయనకు తన దోషము పట్ల గుర్తింపు కల్గడం దానికి శిక్షారూపమే తన వధ జరిగిందేమో అనే ఆలోచన కల్గడం జరిగింది. అందుకే రాముని సమాధానము విన్నవెంటనే వాలి మనస్సు సమాధానపడింది.

"అన్నిటి కంటె ముఖ్యంగా తానే రాముని చేతిలో వధను కోరుకొన్నానని చెప్పడం ఆశ్చర్యకరంగా లేదా?

త్వత్తోఽహం వధ మాకాంక్షన్ । వార్యమాణోఽపి తారయా ।

సుగ్రీవేణ సహభ్రాత్రా । ద్వంద్వయుద్ధముపాగతః"

రామభద్రా! నీ చేతిలో వధను కావాలనే కోరుకొన్నాను. అందువలననే తార ఎన్ని విధాల వారించినా – సోదరుడైన సుగ్రీవునితో ద్వంద్వ యుద్ధానికి దిగాను.

శ్రీరాముని ఆక్షేపిస్తూ ఆయనతో వాలి సంభాషణను ఆరంభించిన విధము – శ్రీరాముని సమాధానము తరువాత వాలి యొక్క మనస్సమాధానము – ఈ రెండింటిని దృష్టిలో పెట్టుకొని వాలి ఆక్షేపణలలో కూడ నిందాస్తుతే ఉందని మహావ్యాఖ్యాతలైన మహేశ్వర తీర్థుల తత్వదీపికా వ్యాఖ్యానము కొనసాగింది.

–– ఇతిశం ––

# వాలి ఆక్షేపాలకు - శ్రీరాముని సమాధానాలు

శ్రీరాముని అమోఘ బాణ ప్రయోగ ఫలితంగా ప్రభాశూన్యుడైన ఆదిత్యుని వలె, జలరహితుడైన మేఘునివలె, శాంతించిన అగ్నిహోత్రునివలె, బలవిఘటితుడై వాలి భూపతితుడయ్యాడు. ఆయన మనస్సంతా అల్లకల్లోలంగా ఉంది. "తనకు ఎదురు నిలిచి పోరాడకుండా, తనతో ఏ వైర కారణం లేకుండా రాముడు అధర్మంగా తనను వధించాడే" అన్న ఆలోచనలు ఆయన మనస్సును గజిబిజిగా అల్లుకొన్నాయి.

తాను ఎందుకు వాలిని వధించవలసి వచ్చిందో, అలా చంపడంలో అధర్మము ఏ మాత్రము ఎలా లేదో వివరించడానికి శ్రీరామచంద్రుడు నిర్ణయించుకొన్నాడు. మరింత దగ్గరగా వచ్చి, ఎదుటే నిలిచి వాలి ఆక్షేపాలకు ఒక్కొక్క దానికి క్రమంగా సమాధానాలివ్వడం రామచంద్రమూర్తి ప్రారంభించాడు:

1. వాలీ! నిన్ను నేను అధర్మంగా వధించానని, సత్పురుషుల సమాజంలో నేనేమి సమాధానమివ్వజాలనని నిందించావు కదా! ముందు ధర్మార్థ కామాల సరియైన స్వరూపము నీకు తెలుసా? లేదా బుద్ధి సంపన్నులైన పెద్దలనైనా ఆశ్రయించి తెలిసికొన్నావా?

   ధర్మార్ధకామాలు త్రివర్గాలు అనబడుతాయి. వాటిలో ధర్మము ప్రథమము, ప్రధానమైనది. అర్థకామాలను ధర్మ బద్ధంగా ఆర్జించి, అనుభవించాలని ధర్మకోవిదులు తెలుపుతారు. ధర్మాన్ని బట్టి అర్థాన్ని ఆర్జించినా, కామాన్ని అనుభవించినా, ఆ అర్థకామానుభవ ఫలము ధర్మాచరణ ఫలమే అవుతుంది. ఇవేవి తెలియకుండానే, ఈ విధమైన ఆచరణలేకుండానే నన్ను అధర్మ పరుడని ఆక్షేపిస్తున్నావా? వింతగా ఉందే?

2) నాకు, నీకు మధ్య, భూ, హిరణ్య, రజతాదివైర కారణాలేవి లేవే? మరి ఏ అధికారంతో నిన్ను వధించానని అడుగుతున్నావు కదా! నీ ప్రశ్నకు నా సమాధానము విను.

   నీ అభిప్రాయంలో అయోధ్య పై మాత్రమే మా అధికారము ఉందని, కిష్కింధ పై నీ అధికారమే ఉందని అర్థము కదా! కాని అది సరియైనది కాదు.

"ఇక్ష్వాకూణామియం భూమిః । సశైల వన కాననా"

సకల పర్వతాలతో, అరణ్యాలతో, సముద్రాలతో పరివేష్టింపబడిన సమస్త భూమండలముపై అధికారము ఇక్ష్వాకు మహారాజులదే. ఈ మొత్తము ప్రాంతంలో చరాచర జగత్తు సర్వాన్ని నిగ్రహించడానికి, అనుగ్రహించడానికి అధికారము ఇక్ష్వాకు ప్రభువులదే.

ప్రస్తుతము మహాత్ముడైన భరతుడు ఇక్ష్వాకు మహీపతిగా ఈ దేశము మొత్తాన్ని పరిపాలిస్తున్నాడు. ఆయన సత్యవంతుడు, ధర్మాత్ముడు, ఆర్జవ గుణాధికుడు. ధర్మార్థ కామాల తత్వాన్ని చక్కగా గ్రహించినవాడు, నయ, వినయ సంపన్నుడు, అమోఘ విక్రమోపేతుడు, నిగ్రహానుగ్రహ సమర్థుడు. దేశ, కాలాలను కళ్లతో చూచినంత స్పష్టముగా పూర్తిగా తెలిసినవాడు.

అంతటి ప్రభావ సంపన్నుడు, ధర్మవత్సలుడు, రాజశార్దూలుడైన భరతుడు ఈ సర్వ వసుధను శాసిస్తుండగా ఈ భూమండలంలో ఎక్కడైనా అధర్మాన్ని ఆచరింప గలిగిన దుస్సాహసము ఎవ్వరికుంటుంది?

మేము ఆ భరత భూపతి ఆజ్ఞతో అధర్మాచరణకు పూనుకొన్న వారిని ఎంతవారినైనా శిక్షించడానికి బయలు దేరాము. అందుకే నిన్ను శిక్షించాను.

3. "ఈ భూమండలమంతా మీ పరిపాలనలోనే ఉన్నప్పుడు అందరిని శిక్షించే అధికారము మీకు ఉందని అంగీకరిస్తున్నాను. అయితే నీవు అంత క్రూరంగా వధించదగిన ఘోరపాపము నేనేమి చేశానని" అడుగుతావా? నీవు చేసిన మహాపాపాన్ని గురించి తెలుపుతాను విను.

నీవు వానర రాజుగా ఎన్నడైనా ధర్మానికి ప్రాధాన్యమిచ్చావా? ఏవైనా ధర్మ కార్యాలను ఆచరించావా? లేదే! నిరంతరం నీ రాజ్య పాలనలో నిందింపదగిన రీతిలో దివారాత్రాలు కామానుభవంలో మునిగి తేలావు.

"ధర్మము నాకు మాత్రము తెలియదా?" అంటావా? ధర్మము అతి సూక్ష్మమైనది. అందరికి పూర్తిగా అవగతమయ్యేది కాదు. ధర్మజ్ఞానానికి సత్పురుషుల మనస్సాక్షే ముఖ్యాధారము. శుభాశుభాల నిర్ణయించేది వారి స్థిర మనస్సే.

"శతాంధాః కూపే ప్రవిశంతి" గుడ్డివానితో కలసిన మిగిలిన గ్రుడ్డి వారందరు బావిలోనే పడిపోతారు కదా! అలాగే చపలుడవైన నీవు, నీలాగే చపలులు, నీకు వశవర్తులైన వానరులతో కలసి ధర్మస్వరూపాన్ని, ప్రకాశాన్ని తెలిసికోలేక కామ కూపంలోపడి తల మునుకలయ్యావు.

అటువంటి దుష్కాముకుడివి, రోషావేశపరుడివి నా ధర్మా ధర్మాలను గురించి నిందిస్తావా?

4. ఇక నీవు చేసిన మహా పాపాన్నిగూర్చి, దానికి శాస్త్రాలు విధించిన మరణదండన గురించి స్పష్టంగా తెలుపుతాను. జాగ్రత్తగా విను.

జ్యేష్ఠో భ్రాతా, పితాచైవ । యశ్చవిద్యాం ప్రయచ్ఛతి

త్రయస్తే పితరో జ్ఞేయాః । ధర్మే పథిహి వర్తినః

"అన్న, తండ్రి, విద్యా గురువు," ధర్మ మార్గంలో నడుచుకొనేవారికి ఈ ముగ్గురు పితరులే.

యవీయానాత్మనః పుత్రః । శిష్యశ్చాపి గుణోత్తమః ।

పుత్రవత్ తే త్రయః చింత్యాః । ధర్మశ్చేదత్ర కారణమ్ ।

"తమ్ముడు, కొడుకు, ఉత్తమ శిష్యుడు". ఈ ముగ్గురు ధర్మజ్ఞునికి పుత్రుని వంటివారే అని శాస్త్రాలన్ని ఉద్ఘోషిస్తున్నాయి కదా. మరి తండ్రిలాగా గౌరవంగా ఉండి, తమ్ముని కొడుకుగా ఆదరించవలసిన నీవు చేసిందేమిటి?

"భ్రాతుర్వర్తసి భార్యాయాం । త్యక్త్వా ధర్మం సనాతనం"

అనాదిగా వస్తున్న ధర్మాన్ని కాలరాచి, నీ తమ్ముని భార్యతోనే కామ సుఖాలను యథేచ్ఛగా అనుభవిస్తున్నావే? ఎంత ఘోరము!

**"అదేమి నేరం కాదు. మా వానరులలో "దేవర న్యాయము" ఉంది. అన్నదమ్ముల భార్యలను అనుభవించడం దోషము కాదు. ఇంతకు ముందు నేను మాయావితో పోరాడుతుండగా సుగ్రీవుడు తారను అనుభవించాడుకదా!" అంటావా?**

నీవు మాయావితో యుద్ధంలో చనిపోయావని మీ తమ్ముడు సుగ్రీవుడు, తార, సచివులు, ప్రజలందరు అనుకొన్నారు. అందుకే మీ తమ్ముడు వారి బలవంతంపై మహారాజై తారను స్వీకరించాడు.

**"అస్యత్వం ధరమాణస్య । సుగ్రీవస్య మహాత్మనః**

**రుమాయాం వర్తసే కామాత్ । స్నుషాయాం పాపకర్మకృత్**

నీవేమో సుగ్రీవుని బలవంతంగా దేశబహిష్కృతుని చేశావు. నీ తమ్ముడు సుగ్రీవుడు మహాత్ముడు. ఆయన జీవించే ఉన్నాడు. ఆయన బ్రతికి ఉండగా ఆయన భార్య అయిన రుమతో కామకేళి జరుపుతున్నావే? కొడుకు జీవించి ఉండగా కోడలును

అనుభవించే అంతటి మహాపాపివి.

"భ్రాతృ భార్యావమర్శే2స్మిన్ । దండో2యం ప్రతిపాదితః"

నీ తమ్ముడి భార్యను అనుభవించిన మహా నేరానికి నేను నీకీ దండనను విధించాను.

**"మరదలును అనుభవిస్తే దానికి తగిన శిక్ష మరణ దండనమా? అని అడుగుతావా?"**

**"ఔరసీం, భగినీంచా 2 పి । భార్యాం చాప్యనుజస్యయః**
**ప్రచరేత నరః కామాత్ । తస్యదండో వధః స్మృతః"**

కన్న కూతురుతో, తోబుట్టువుతో, తమ్ముని భార్యతో కామాసక్తుడై ప్రవర్తిస్తే దానికి "మరణదండనమే తగిన శిక్ష" అని శాస్త్రాలు నొక్కి వక్కాణిస్తున్నాయి.

భరతమహారాజ పాలనలో ఆయన ఆజ్ఞ ప్రకారము పాపులను శిక్షించడానికి బయలు దేరిన వాళ్లము. నీ వంటి మహా పాపిని ఎలా వదలి వేస్తాము?"

5. "నేను సుగ్రీవునితో యుద్ధంలో చావో, రేవో తేల్చుకొనేవాడిని. మధ్యలో ఆయనకు అడ్డంగా నీవెందుకు వచ్చావు? అని అడుగుతావా?

నాతో సుగ్రీవుడు స్నేహం చేశాడు. అందువలన ఆయన నాకు మా తమ్ముడు లక్ష్మణునితో సమానం. దారా రాజ్యాల కొరకు సుగ్రీవుడు నాతో స్నేహాన్ని ఏర్పరచుకొన్నాడు. మిత్రులకు ఆపద కల్గినప్పుడు వారిని ఆదుకోవడం మైత్రీ ధర్మము కదా!

ఆయన సచివుల సమక్షంలో సుగ్రీవుని కాపాడుతానని వాగ్దానం చేశాను. ప్రతిజ్ఞను అప్పుడు అలా చేసి, ఇప్పుడెలాగా దానిని మరచి ఏమరుపాటుతో ఉంటాను?

6. ఆయనతోనే స్నేహమెందుకు చేశానని అడుగుతావా?

సుగ్రీవుడు మహాత్ముడు. ఆపదలలో చిక్కుకొన్నవాడు, ఆ ఆపదల నుండి రక్షించుమని నన్ను ఆశ్రయించినవాడు. సాధుజన సంరక్షణమే పరమ ధర్మమని శాస్త్రాలన్ని వివరిస్తున్నాయి కదా! అటువంటి ధర్మాత్మునితో కాక నీ వంటి దురాత్మునితో స్నేహం చేస్తానా?

7. "నాతో స్నేహం చేస్తే – సీతాదేవిని ఒకే రోజులో రావణుని చెర నుండి విడిపించి తెచ్చి నీ కిచ్చేవాడిని కదా! అంటావా?

నా భార్యను ఎవ్వడో దుర్మార్గుడైన రాక్షసుడు అపహరించాడని ఆయన బారి నుండి

నా భార్యను కాపాడుకోవడానికి, స్వంత తమ్ముని భార్యనే అపహరించి రాక్షసంగా అనుభవించే ఒక పరమదుర్మార్గుని సహాయాన్ని స్నేహాన్ని నేను కోరుకొంటానా?

8. "నాతో ఎదురుగా వచ్చి యుద్ధం చేయక, చాటుకుండి సంహరించడం నీకుపాపము కాదా" అని అడుగుతావా?

నీ వంటి వారిని చాటు నుండి సంహరించినప్పటికి ఏ దోషం లేదని వేట నియమాలు తెలుపుతున్నాయి.

"యధా త్సారీయతి మ ఆఖ ఇయతి
నా పరాత్స్యామి ఇతి ఉపాస్సృజత" (యజు 6-4-11)
(అపరాధి కాకుండానే వేటగాడు చాటుకుండే ఆలోచించి బాణం వదులుతాడు)

నీకు ఎదురుగా నిలిచే యుద్ధం చేయవలసిన అవసరము నాకు లేదు. నేను నరుడను. ద్వంద్వ యుద్ధం నాతో చేయడానికి నీవు కూడ నరుడవా? కాదే! నీవు వానరుడవు.

నీవు ఒక వనచరుడవైన శాఖామృగానివి. నీ వంటి అడవి జంతవులను సంహరించడానికి ఎదురుగా ఉండే సంహరించాలని ఎక్కడా నియమం లేదు. ఒంటరిగా ఉన్న జంతువునైనా గుంపులుగా ఉన్న వాటినైనా, ఎదురుగా వచ్చిన మృగాన్నైనా, చాటుకు దాగున్న జంతువునైనా, స్థిరంగా నిలిచి ఉన్న దాన్నైనా, భయంతో పారిపోతున్న దాన్నైనా, వేరే మృగాలతో పోరాడుతున్న మృగాన్నైనా ఎదురుగా నైనా, చాటు నుండి అయినా, వలలు విసిరి పట్టుకొని అయినా, పాశాలతో బంధించి అయినా, ఇంకా ఏ ఉపాయాన్ని అనుసరించి అయినా వేటాడి సంహరింప వచ్చునని శాస్త్రములు వివరిస్తున్నాయి. రాజులకు అడవి మృగాలను వేటాడడం కూడ రాజధర్మమే. అందువలన సుగ్రీవునితో పోరాడుతూ నన్ను గమనించ కుండా ఉన్న నిన్ను చంపినా నా రాజధర్మానికి ఏమి హాని కలుగదు.

9. వాలీ! నిన్ను నేను వధించడం వలన నీకు, నాకు ఇద్దరికి మేలే కలుగుతుంది. ఈ ముఖ్య విషయం నీకు తెలియదేమో! ఈ విషయం మను ధర్మశాస్త్రంలో రెండు శ్లోకాలలో తెలుపబడింది. విను..

"రాజభిర్ధృత దండాస్తు । కృత్వా పాపాని మానవాః
నిర్మలా స్స్వర్గ మాయాంతి । సంతః సుకృతినోయథా"

నేరాలు చేసిన వారు తప్పక శిక్షను అనుభవించాలి. రాజుల వలన శిక్షలు అనుభవించిన పాపాత్ములు తమ పాపాల నుండి విముక్తులవుతారు. పుణ్యాత్ములతో

పాటు, శిక్షలను అనుభవించిన పాపాత్ములు కూడ స్వర్గానికి చేరుకొంటారు. వారు నరకలోకానికి వెళ్లి అక్కడ నరకయాతనలను అనుభవించే అవసరం లేదని శిక్షాస్మృతి తెలుపుతుంది.

పాపాలు చేసి శిక్షలను అనుభవించని వారు మరణానంతరము తప్పక నరకానికి వెళ్లి యమబాధలను పూర్తిగా అనుభవింపవలసిందే. అంతేకాదు పాపాత్ములను శిక్షించకుండా వదలివేసినట్లయితే "రాజారాష్ట్రకృతం పాపం" అన్నట్లు ఆ పాపాత్ముల ఫలాన్ని ఆ దేశపు రాజు (కూడ) అనుభవిస్తాడు.

"శాసనాద్వా విమోక్షాద్వా । స్తేనః స్తేయాద్విముచ్యతే

రాజాత్వశాసన్ పాపస్య । తదవాప్నోతి కిల్బిషం".

పాపాత్ముడు రాజదండను అనుభవించి అయినా లేదా రాజు దోషాన్ని విమర్శించి క్షమించి వదలినా – తన పాపాన్నుండి విముక్తుడవుతాడు.

నేరస్థుల నేరాలను పట్టించుకోకుండా వదలిన రాజు మాత్రము వారి పాప ఫలాన్ని తాను అనుభవించక తప్పదు.

ఈ రెండు శ్లోకాల ద్వారా రాజులు పాపాత్ములను శిక్షించడం ద్వారా వారికి, తమకు కూడ మేలు చేసిన వారవుతారని మనువు నిర్దేశించాడు.

10. వాలీ! మహారాజులు ధర్మ రక్షకులు, ప్రజలకు శుభప్రదాతలు. ఆపన్నులకు అభయ సంధాతలు. అందులో ఏమైనా లోటు ఉంటుందా?

అందుకే "నా విష్ణుః పృథివీ పతిః" అని శాస్త్రాలు వివరిస్తాయి. విష్ణ్వంశ లేని వాడు మహారాజుగా ధరణిని శాసింపజాలడు.

అటువంటి కన్న తండ్రి వంటి మహారాజును, ఆయన బంటులను ఎవ్వరు బాధింప కూడదు, అనవసరంగా ఆక్షేపించకూడదు. వారి గురించి చాటుగానైనా, నేటుగానైనా అప్రియాలు పలుకకూడదు. అకారణంగా ఆగ్రహాన్ని వెళ్లగక్క కూడదు.

11. నేను, మా తండ్రి, తాత, ముత్తాతల కాలం నుండి ధర్మ రక్షణలో బద్ధకంకణులుగా ఉన్నాము. అటువంటి ఆనువంశిక సదాచార పరాయణుని, అనవసరాగ్రహంతో ఆవేశంతో నిందిస్తావా? ధర్మాన్ని తెలిసికోవా?

"త్వంతు ధర్మమవిజ్ఞాయ । కేవలం రోషమాస్థితః

ప్రదూషయసిమాం ధర్మే । పితృపైతామహే స్థితం"

శ్రీరాముని సమాధానాన్ని సాంతము ప్రశాంతంగా సావధానంగా వాలి విన్నాడు. ఆయన మనస్సులో ధర్మము పట్ల ఆలోచనలు అల్లుకోసాగాయి.

12. ఇవన్ని కాదని ఒకవేళ శ్రీరాముడు ఎదురుగా వచ్చి, వాలితో పోరాడినా, ఆయనను వాలి ఓడించగల్గేవాడా? వాలి బలమెంత? రాముని బలమెంత? ఇంద్ర ప్రదత్తమైన కాంచనమాల వాలిని నిత్య వీర్యుడైన రామునికంటె బలవంతుని కావించగల్గేదా? ఇవన్నీ ఊహాజనిత ప్రశ్నలు. అయినప్పటికి చాలమంది ఆధునికులే కాదు, పూర్వికులు కూడ చాల కాలం నుండి ఈ ప్రశ్నలను కల్పించుకొని 'చెట్టు చాటు నుండి కాకుండా, ఎదురుగా నిలిచి పోరాడితే వాలే రాముని జయించే వాడని" వాదిస్తూ వచ్చారు. వారి వాదనకు వాలి మొదటి మాటలు కూడ బలాన్ని ఇచ్చాయి.

"అద్యవైవస్వతం దేవం । పశ్యేఃత్వం నిహతో మయా"

"రామా! నిన్ను ఈ రోజే చంపి, యమ సందర్శనానికి పంపి ఉండేవాడిని" అన్నాడు కనుక ఇక ఈ ప్రశ్నలను మనము కూడ వేసికొని వీటికి వాస్తవ సమాధానాన్ని మనము కూడ అన్వేషిద్దామా.

వాలి సహజపరాక్రమ సంపన్నుడు. మహేంద్ర తనయుడు. మహేంద్ర ప్రదత్తమైన కాంచనమాలాసంపన్నుడు.

వాలి రావణుని తన తోకతో నిర్బంధించి నాలుగు సముద్రాల నీళ్లు తాగించాడు. దుందుభి, మాయావి మొదలైన మహాబల సంపన్నులైన రాక్షసులను వధించిన మహావీరుడు.

అయితే మాలగళంలో ఉన్నా దుందుభిని వధించిన కాలము కంటె మాయావిని వధించడానికి ఒక సంవత్సర కాలము పూర్తి పట్టింది. గోలభుడు అనే గంధర్వుని నిర్జించడానికి పదిహేను సంవత్సరాలు పట్టింది. ఆ లెక్కలలో రాముని, వాలి, మాల ఉన్నా సూటిగా పోరాడినా గెలిచేవాడా?

రాముడు లోక విద్రావణుడైన రావణుని వధించడానికి దేవతల ప్రార్థన కారణంగా దశరథ తనయుడుగా అవతరించిన శ్రీమన్నారాయణుడు.

పన్నెండు సంవత్సరాల ప్రాయంలోనే తాటకా తాటకేయులను సంహరించి మహర్షి సంఘానికి యజ్ఞవిఘ్న నివారకుడైన అమేయ పరాక్రమ సంపన్నుడు. విశ్వామిత్ర వరప్రసాదంగా వశీకృత సమస్త శస్త్రాస్త్ర విద్యామహిముడు. విష్ణువు యొక్క అవతారంగా ప్రసిద్ధుడైన పరశురాముని ఒకే నిమిషంలో నిస్తేజుని గావించిన పూర్ణబలుడు.

మూడు గడియల సమయంలో ఖరదూషణ, త్రిశిరస్క సమేతంగా పదునాల్గు వేల రాక్షస బలాన్ని మట్టుపెట్టగల్గిన అమోఘ వీర్య విశిష్టుడు.

ఈ విధంగా వేర్వేరుగా చూచినప్పుడు వాలి శ్రీరాములిద్దరు మహావిక్రమోపేతులుగానే కనుపడతారు. ఇద్దరు అరివీర భయంకరులే. అయినా శత్రు నిరసన బలము రామునికే అధికమని తోస్తుంది కదా!

అయితే వారిద్దరి బలాలను పోల్చి చూచినప్పుడు ఎవ్వరి బలము ఎక్కువో నిజంగా తెలుస్తుంది.

సుగ్రీవుడు శ్రీరాముని ఆశ్రయించి ఆయన అభయాన్నైతే పొందాడు. కాని ఆయన వాలిని జయింపగల్గుతాడో లేదో అనే అనుమానము సుగ్రీవుని స్వాంతాన్ని నిరంతరము పీడిస్తూ ఉండేది. "సుగ్రీవఃశంకితశ్చాసీత్ నిత్యం వీర్యేణ రాఘవే"

లక్ష్మణుడు సుగ్రీవుని సంశయము తీరే విధానాన్ని తెల్పుమని కోరాడు. సుగ్రీవుడు వాలి చేసిన రెండు మహా కార్యాలను వివరించాడు. (1) మహా పర్వత సన్నిభమైన దుందుభి మహాకాయాన్ని ఒక యోజన దూరం విసరివేయడం. (2) ఒక్కొక్కసారి ఒక్కొక్క మహాసాల వృక్షాన్ని ఒకే దెబ్బతో సంపూర్ణంగా పత్రహీనం కావించడం.

శ్రీరాముడా పనులు చేస్తే ఆయన వాలిని నిర్జింపగల్గుతాడని సుగ్రీవుడు వివరించాడు.

రామభద్రుడు దుందుభి మహాకాయాన్ని తన కాలిబొటన వ్రేలితో చిమ్మివేశాడు. అది వెళ్లి పడింది ఒక్క యోజన దూరంలో కాదు సంపూర్ణ దశ యోజన దూరంలో వెళ్లి పడింది. సుగ్రీవుని మనస్సులో కొంత ఆశ కలిగింది. కాని ఆయన అనుమానం పూర్తిగా తీరలేదు. వాలి విసరి వేసినప్పుడు దుందుభి దేహము రక్త మాంసాలతో పచ్చిగా మహా బలిష్ఠంగా ఉండేది. ఇప్పుడా దేహము ఎండిపోయి రక్త మాంసాలు లేక తేలిక అయింది. అందువలన ఆ దుందుభి దేహాన్ని అంత దూరం చిమ్మినంత మాత్రాన కూడ తన అనుమానం తీరలేదని వివరించాడు.

ఒకవేళ శ్రీరాముడు ఒకే బాణంతో ఒక మహాసాలాన్ని కూల్చగలిగితే తన సంశయము తీరుతుందని తెలిపాడు. ఎందుకంటె సాల వృక్షాలు అప్పటికి ఇప్పటికి బలంగానే ఉన్నాయి. తత్క్షణమే రామభద్రుడు తన అక్షయ తూణీరం నుండి అమోఘమైన ఒక బాణాన్ని తీసి ధనుస్సులో సంధించి వదిలాడు. ఆ అమోఘ మహాశరం అరక్షణంలో ఒక్కసాలాన్ని కాక ఏకకాలంలో ఏడు మహాసాలవృక్షాలను నేలకూల్చి పిడుగుపాటు ధ్వనితో భూమిని బద్దలు కావించి, తిరిగి శ్రీరాముని అక్షయతూణీరంలో ప్రవేశించింది.

ఆ అత్యద్భుత దృశ్యం సుగ్రీవుని పూర్తిగా స్థబ్ధుని కావించింది. నిశ్చేష్టుని చేసింది.

ఆ క్షణంలో ఆయనకు మహాశ్చర్యము, భయము కలిగాయి. కొంత సమయానికి తేరుకొన్నాడు. ఇక వాలి వధ అనివార్యమని ఆయనకు తెలిసిపోయింది.

ఈ విధంగా వాలి శ్రీరాముల బలాలను తులనాత్మకంగా పరిశీలించిన సుగ్రీవునికి రామబలం వాలి బలం కంటె ఎన్నోరెట్లు అధికమని అమోఘమని అర్థమైంది.

అయితే మాత్రమేమిటి? వాలి రాముల బలాన్ని ఊహించడం వేరు. వారిద్దరు ఎదురెదురుగా నిలిచినప్పుడు వారి బలాబలాలు స్పష్టంగా తెలుస్తాయి కదా! అంటే శ్రీరామునితో పోరాడవలసిన అవసరము వాలికి ఎందుకు ఉంటుంది? సుగ్రీవునికి బదులు శ్రీరాముడు వాలితో పోరుకు నిలిచినా వాలి అంగీకరించే వాడు కాదు. నీకు నాకు మధ్య వైరము లేదు. నీతో యుద్ధము చేయనని అనేవాడేమో?

(2) అంతేకాదు సుగ్రీవుని రక్షించడానికి తాను వాలితో సమరం సాగిస్తానంటే రామ బలాన్ని ఇదివరకే విన్న వాలి రాముని శరణు వీడి సుగ్రీవునికి రుమను అప్పగించేవాడేమో. దానివలన వాలిని వధించి తీరుతానని వానరుల మధ్య రాముడు చేసిన ప్రతిజ్ఞ వ్యర్థమయ్యేది కాదా? అప్పుడు దుర్జన సంహార ధర్మాన్ని రాముడు నెరవేర్చ గలిగేవాడా?

(3) అలా ఎందుకు? వాలి గళంలో మహేంద్ర హారము ఉంది కదా! దాని వలన రామ బలము తగ్గేది కాదా? వాలి బలము పెరిగేది కాదా? అని మరొక ప్రశ్న.

ప్రతి శాపానికి ఒక అంతము ఉన్నట్లే ప్రతి వరానికి ఒక పరిమితి ఉంటుంది. శ్రీరాముని బలానికి ఒక అంతము లేదు. అది క్షీణించే ప్రశ్నేలేదు. మాలాధారియైన వాలే దుందుభి మాయావులను సంహరించినంత సులభంగా గోలభుడనే గంధర్వుని నిర్జించలేదు. గోలభుని నేలకూల్చడానికి 15 సంవత్సరాల సుదీర్ఘ కాలం పట్టింది.

హనుమ సుందరకాండలో రావణాసురుని ముందు శ్రీరామబలాన్ని ప్రస్తావించి "శ్రీరాముడు ఎవ్వరినైనా వధిస్తానని నిర్ణయించుకొంటే బ్రహ్మరుద్రేంద్రాదులు కూడ వాడిని రక్షింపజాలరు, బ్రహ్మా, రుద్రః ఇంద్రః ...... త్రాతుం నశక్తాః యుధి రామవధ్యం" అని వివరించాడు. బ్రహ్మరుద్రేంద్రాదులు ముక్కోటి దేవతల బలం కలసినా రామబలం ముందు అల్పమే అన్నప్పుడు వాలి బలమెంత? ఇంద్రుడు ఇచ్చిన వాలి మాల బలమెంత?

శ్రీరాముడు అక్షయ బలస్వరూపుడు. ప్రహ్లాదుడన్నట్లు బలవంతులకు బలహీనులకు బలమాయనే. అటువంటి శ్రీరాముని అక్షయ బలాన్ని హరించడానికి అనేకానేక మహేంద్ర హారాలకు కూడ అసాధ్యమే. మరొక్కమాట! వాలి మెడలో మాల ఉండగానే రాముడు ఒకే బాణాన్ని వాలిపై ప్రయోగించాడు. అది వాలి గుండెకు కుచ్చుకొంది. అయితే

మాత్రమేమిటి? అంతటి మహా బలి వాలి దానిని తొలగించుకోరాదా? అంతటి మహిమ గలిగిన మహేంద్రుని మాల వాలిని కాపాడజాలదా? రామ బాణము వాలికి అంత ప్రాణాంతకం కావాలా?

శ్రీరాముడు వాలిని ఎదిరించి పోరాడితే ఇంద్రుని మాలాశక్తి తగ్గిపోక తప్పదు. అందువలన మహేంద్రుని మాట వ్యర్థమౌతుంది. అలా చేయడము ఇష్టము లేకే శ్రీరాముడు వాలితో ఎదిరించి పోరాడి వధించలేదని సుప్రసిద్ధ వ్యాఖ్యాతలు వ్యాఖ్యానించారు.

అందువలన శ్రీరాముని నిర్జింప తగిన బలము వాలికి లేదు. శ్రీరాముని బలాన్ని హరింపదగిన శక్తి మహేంద్రుని మాలకు కూడ లేదని అభిజ్ఞుల అభిప్రాయము. అయినా "శ్రీరాముడు పిరికితనముతో చెట్టు చాటునుండి వాలిని వధించాడని" ఎవ్వరో పరిహసిస్తే ప్రాజ్ఞులా మాటలను పట్టించుకోవలసిన అవసరం లేదు.

శ్రీరాముని సమాధానాలతో వాలి ఆవేశం చల్లారింది.ఆయన బుద్ధి స్థిరత్వానికి వచ్చింది. ఆయన నెమ్మదిగా ఆలోచింపసాగాడు. ఆలోచిస్తుంటే తనను వధించడంలో రాముని దోషము ఏమి లేదని అనిపించ సాగింది.

"న దోషం రాఘవే దధ్యౌ । ధర్మే 2 ధిగత నిశ్చయః"

అందువలననే ఆయన రామచంద్రునితో అన్నాడు: "రామా! నీవు చెప్పిన దానిలో అణుమాత్రమైనా అనుమానం లేదు. నీవన్నది కాదనడానికి ఎవ్వరి తరము?

"దోషం కర్తుం నార్హసి రాఘవ"

ఏదో బాణ బాధ (ప్రమాదం) వలన నేను నిన్ను అనేక విధాల నిందించాను. అయినా నేనన్న మాటలకు తప్పు పట్టుకోవద్దు సుమా!

"ధర్మజ్ఞ పరిపాలయ"

నీవు సమస్త చరాచరముల గురించి యదార్థ జ్ఞానము కలవాడివి. సర్వ ప్రజల హితాభిలాషివి. కార్యకారణముల విచారములో నీ బుద్ధి సాటిలేనిది. ఘోర అధర్మాన్ని ఆచరించిన నన్నుదయతో "మన్నించానని" ఒక్క మాట చెప్పు.

రామభద్రా! నేను మరణిస్తున్నానని కాని, తార విషయంలో కాని, నా బంధువుల గురించి కాని ఇప్పుడు నేను విచారించడం లేదు. నా విచారమంతా అంగద కుమారుని గురించే. నా కుమారుని ముద్దుగా ఎల్లప్పుడు కనకాంగదాలతో అలంకరిస్తుంటాను. చిన్నప్పటి నుండి ఆయనను అత్యంత ప్రేమతో లాలిస్తుంటాను. నేను కొద్దికాలము కనపడకున్నా ఎండిన చెరువులో త్రాగునీరు కరువైనట్లు బాధ పడుతాడు.

అంగదుడు తార వలన నాకు కలిగిన ఒకే ఒక కొడుకు. చిన్నపిల్లవాడు. ఇంకాబుద్ధి పూర్తిగా రాలేదు. రామభద్రా! నా కొడుకును మహాబలుడవైన నీవే కాపాడాలి సుమా!

రామచంద్రా! అంగదునితో పాటు సుగ్రీవునికి కూడ బుద్ధి చెప్పవలసింది నీవే. వాడిని కార్యాకార్యాలలో శాసించవలసింది నీవే. రక్షింపవలసింది నీవే. నీ తమ్ములైన భరత లక్ష్మణుల నెంత ప్రేమగా చూచుకొంటావో, అంత ప్రేమతో సుగ్రీవాంగదులను చూచుకో.

రామా! నేను చేసిన దోషాలను భర్త అనే గౌరవంతో తార సహిస్తూ వచ్చింది. ఆమే వివేకవతి. నేను చేసిన అవమానాన్ని దృష్టిలో పెట్టుకొని సుగ్రీవుడు తారను అవమానించకుండా చూచే బాధ్యత నీదే.

**"ఇంద్రాణీవై సేనాయాం దేవతా। యస్య సేనా అసంశితేవస్యాత్" ఇంద్రాణి దేవతా సేనానాయకి** ఆమె వలన ఆమె సైన్యము జయింపరానిది. వాలి ఇంద్రాంశ కలవాడు కనుక తార ఇంద్రాణి అంశ. అలాగే వానర రాజ్యాన్ని రక్షింపదగిన బుద్ధి బలసంపన్నురాలు తార.

నీవు ప్రసాదించిన వానర మహాసామ్రాజ్య సంపదను సుగ్రీవుడు నీకు అనుకూలంగా నడుచుకొంటేనే కాపాడుకోగలడు.

రాఘువా! అన్నిటికంటే ఒక ముఖ్య విషయాన్ని దయతో విను. నీ ధర్మనిష్ఠ, నీ అసాధారణ బలపరాక్రమాలు, నీ మహోన్నత వ్యక్తిత్వాల గురించి నాకుముందే పూర్తిగా తెలుసు. నాకు నీ చేతిలో మరణం లభించాలని ఎప్పటి నుండో బలమైన కోరిక ఏర్పడింది. నేను గతంలో చేసిన పాపాల పట్ల, దురాచారాల పట్ల నాకు ఏవగింపు ఏర్పడింది. నేను అతి దీర్ఘకాలంగా అనుభవిస్తున్న అర్థకామాల పట్ల అనాసక్తి పెరిగింది. ఇక ఈ జీవితానికి స్వస్తి చెప్పాలని నీ చేతిలో మరణించి పుణ్యలోకాలకు వెళ్లాలనే కోరిక ఏర్పడింది. ఒకవేళ నీ చేతిలో చావకుంటే నా పాపము నన్ను నరకానికే తీసిక వెళ్లేది కదా!

నీవు, నీ తమ్మునితో పంపా వన ప్రాంతానికి వచ్చావని సుగ్రీవునితో స్నేహము చేశావని తెలిసింది. నీవు సుగ్రీవుని రక్షింప వస్తావని తెలుసు, దానికి అవసరమైతే నన్ను తప్పక హతమారుస్తావని తెలుసు. నేను చాల కాలం నుండి కోరుకొంటున్న నా కోరిక తీరబోతున్నదని సంతోషమైంది. అయితే నా ఆలోచనలను నా మనస్సులోనే దాచు కొన్నాను. నా బహిః ప్రాణమైన తారకు కూడ వాటిని తెలువనివ్వలేదు. ఒకవేళ నేను

ఆమెకు తెల్పినా ఆమె నా మరణానికి అనుమతించదు. అందువలన సుగ్రీవుని పట్ల నా కోపాన్ని ఆమె ముందు అలాగే ప్రదర్శిస్తు వచ్చాను.

నీవు అయోధ్యా నగర వాసివని, దశరథ సార్వభౌమ తనయుని వని, అమేయ బలపరాక్రమ యుక్తుడవని, సుగ్రీవునితో సఖ్యమేర్పరుచుకొన్నావని అందువలన ఆయనతో ఆహవానికి సిద్ధపడక, ఆయనను పిలిచి, రుమను అప్పగించి, ఆదరించుమని అనేక విధాల తార నన్ను ప్రార్థించింది. ఆమె ప్రార్థనను నేను కావాలనే మన్నించలేదు. సుగ్రీవునితో పోరుకే సిద్ధమయ్యాను. నేను కోరుకొన్నట్లే నీ చేతిలో మరణము లభించింది. నా ఆశయము నెరవేరింది. నాకు స్వర్గద్వారాలు తెరచుకొన్నాయి.

**"త్వత్తో2హంవధ మాకాంక్షన్ । వార్య మాణో2 పి తారయా**
**సుగ్రేవణ సహభ్రాత్రా । ద్వంద్వ యుద్ధముపాగతః"**

చూచారా! వాలి వ్యక్తిత్వాన్ని! రామభద్రుని మహోన్నత వ్యక్తిత్వాన్ని, ధర్మ దీక్షను పూర్తిగా అర్థం చేసికొన్న ప్రతిభాశాలి వాలి. మనమేమో ఇప్పటికి "రాముడు పిరికిపంద. వాలికి భయపడి చెట్టుచాటు నుండి వధించి దోషముచేశాడు" అని అనుకొంటున్నాము. నిజానికి ఎంతటి అల్పమతులము మనము!

శ్రీరాముడు వాలిని సేదదీరుస్తున్నాడు. తన మధురమైన మాటలతో "వాలీ! నీ గురించి, మా గురించి విచారాన్ని చాలించు. దండించే అధికారము కలవాడు తప్పు చేసిన వానిని తప్పక దండించవలసిందే. అది మన ఇద్దరికి శ్రేయస్కరమే.

అంగదుడు ఇంతవరకు నీకెంత ప్రియుడో, ఇకనుండి మాకు కూడ అంత ప్రియుడే. నీవు తార గురించి, అంగదుని గురించి బెంగపెట్టుకోవలసిన అవసరము లేదు. సుగ్రీవుడు మహారాజయితే, అంగదుడు యువరాజవుతాడు.

ఆ మాటలు విని అత్యంత సంతోషంతో శ్రీరామునికి చేతులు జోడించి "మహాప్రభో! మహేంద్ర సదృశమహిమోపేతా । రామచంద్రా! నా తప్పులన్నిటిని మన్నించు" మని మరీ మరీ వేడుకొన్నాడు. అపరాధ క్షామణం కంటె మనకు కావలసిందేముంటుంది?

"వలత ఇతి వాలీ" వలలా తన పరాక్రమంతో పరవీరులను చుట్టుముట్టిన వాడు వాలి. ఇప్పుడు తన భగవత్ జ్ఞానంతో మన మనస్సులను పరవశం చేస్తున్నాడు వాలి. వాలీ! నిజంగా నీవు ధన్యుడవు! నీ దేహబలమే కాదు, నీ బుద్ధి బలం కూడ అసాధారణమైనదే సుమా!

--- ఇతిశం ---

# తారా విలాపము

వాలి నేలకొరిగాడనే వార్త తారకు తెలిసింది. దుఃఖాతిశయముతో ఆమె కొండ గుహనుండి బయలు దేరింది. ఆమెముందు భయంతో చెల్లాచెదరై పారిపోతున్న వాలి అనుచరులు అగుపడ్డారు. వారి భయ కారణాన్ని ఆమె అడిగింది. "అమ్మా! రాముడనే యముడు వాలి ప్రాణాలను హరించి మనను అనాధులను చేశాడు.

ఇది మనకు ప్రమాద సమయము. వాలి రాజ్యాన్ని పాలించే రోజులలో ఎందరో ప్రత్యర్థులను వధించి వారి వనితలను విధవలను కావించాడు. శత్రువుల భార్యలను ఎందరినో అపహరించి తెచ్చి అంతఃపురంలో పెట్టుకొన్నాడు. మన మహారాజు జీవించి ఉన్న రోజులలో ఆయనకు భయపడి వారందరు అణగిమణగి ఉన్నారు. ఇప్పుడు వారందరు తిరుగబడి మహా ప్రవాహంగా మారి మన పుట్టిని ముంచడానికి ముందుకొస్తారు.

భార్యను కోల్పోయి, ప్రతీకారం కొరకు ఎదురు చూస్తున్న వాళ్లలో సుగ్రీవుడు కూడ ఉన్నాడు. రాముని ద్వారా అన్నను చంపించాడు. ఇప్పుడు అంగదుని మనలను అనాధలను చేసి రాజ్యాన్ని ఆక్రమించబోతున్నాడు. మనము జాగ్రత్తగా ఉండి, వాళ్ల ఉపాయాన్ని చిత్తు చేయాలి" అని మొరపెట్టుకొన్నారు.

తారకు దుఃఖమాగలేదు "మహావీరుడు, మహానుభావుడైన నా భర్తే మరణించిన తరువాత నాకు రాజ్యమెందుకు? కొడుకెందుకు? నా పతి సుడిగాలిలా శత్రువులపై విరుచుకపడేవాడు. వర్షమేఘంలా గర్జించేవాడు. ఇప్పుడు నీరు లేని మొగులు వలె కళాహీనంగా ఉన్నాడు" అని ముందుకు ఉరికింది.

తన భర్తను వధించిన శ్రీరాముడు, సుగ్రీవుడు దారిలో ఎదురయ్యారు. వారివైపు కన్నెత్తి చూడక రోదిస్తూ వెళ్లి, ఒక చెట్టును అల్లుకున్న తీగ ఆ చెట్టుతోపాటే నేల కూలినట్లు భర్త శవంపై వాలి పోయింది.

"ప్రాణనాథా! నీవు జీవించి ఉన్న కాలములో నాకంటె ప్రియమైన వారు వేరెవ్వరు లేరని అన్నావే? ఇప్పుడు నన్ను విడిచిపెట్టి ఈ భూ వనితను విడువకుండా కౌగిలించుకొని పడుకొన్నావా?

వినువీధిలో నీవు మరొక కిష్కింధను నిర్మించుకొని, అక్కడ నా కంటె మించిన సుందరులైన అప్సరో భామినుల పొందుతో విందు చేసికోవాలనుకొంటున్నావా?

ప్రాణప్రియా! నా హృదయము మృదువైనదని, నిన్ను విడిచి ఉండజాలదని అనుకొన్నాను. కాని అది పాషాణమువలె కఠినమైనది. నీవు నన్ను విడిచిపెట్టి కానరాని లోకాలకు వెళ్లాక కూడ, అది బ్రద్దలు కావడం లేదు.

సుగ్రీవునితో సమరానికి సమాయత్తం కావద్దని, ఆయన భార్యను అప్పగించి, ఆయనను ఆదరించుమని నిన్నెంతగానో అర్థించాను. నీవు నా మాటను లక్ష్యం చేయలేదు. నా ప్రార్థన వ్యర్థమైంది. నా బ్రతుకు బీడుభూమి అయింది.

తార అంగదుని దగ్గరకు తీసికొని "నాయనా! అంగదకుమారా! ఇక నీ తండ్రి లేడురా! నీ శిరస్సును ఆఘ్రాణించి నిన్ను ఆశీర్వదించే నీ తండ్రి మనను దిక్కులేని వాళ్లను చేసి మనకు అందనంత దూర లోకాలకు తరలి పోయాడు తండ్రీ!" అని ఆవేదన వెలిబుచ్చింది.

సుగ్రీవుని ఉద్దేశించి, "సుగ్రీవా! నీ కోరిక తీరింది. నీ బాధ అంతమైంది. ఇప్పుడు నీ భార్యను పరిగ్రహించు. నీ రాజ్యాన్ని స్వీకరించు" మని తెలిపింది.

మళ్లీ వాలిపై బడి, "నాథా! మన దాంపత్య జీవితంలో తెలిసో, తెలియకో నీకేదైనా అప్రియము ఆచరించానా? ఒకవేళ అలా అప్రియాన్ని ఆచరించి ఉంటే నన్ను మన్నించు. నీ పాదాలపై పడి ప్రార్థిస్తున్నాను" అని దయనీయంగా విలపిస్తూ, భర్త సన్నిధిలోనే ప్రాయోపవేశం చేయాలని నిశ్చయించుకొంది.

--- ఇతిశం ---

ప్రాణప్రియా! నా హృదయము నీవు అనుకొన్నట్లు పూవు వంటి సుకుమారమైనది కాదు. నీ స్పర్శకు దూరమవుతున్నా అది వాడిపోయి రాలిపోవడం లేదు. అది పాషాణం కన్నా కఠినమైనది. నీవు నన్ను విడిచి వెళ్లినా అది బ్రద్దలు కావడం లేదు.

# హనుమ సాంత్వనము

మూర్తీభవించిన శోకదేవతగా ఉన్న తారను హనుమంతుడు సమీపించాడు. ఆమె దుఃఖాన్ని తగ్గించ ప్రయత్నించాడు.

"అమ్మా! మరణించిన మహారాజు గురించి నీ వింతగా దుఃఖిస్తున్నావే? మనము మాత్రము శాశ్వతంగా ఇక్కడే ఉండిపోతామా? రేపు చనిపోయే మనము ఈ రోజు చనిపోయిన మహారాజు గురించి అంత దుఃఖిస్తే ఏమి ప్రయోజనము?

ప్రతి వ్యక్తి బ్రతికి ఉండగా శుభాశుభ కార్యాలను ఆచరిస్తాడు. వాటి ఫలాలను ఇక్కడ ఉండగా కొన్ని అనుభవింపవచ్చు. అయినా మిగిలిన సుఖదుఃఖాలను అనుభవించడానికి స్వర్గానికో, నరకానికో ప్రయాణం చేయక తప్పదు.

భర్త ఎలాగూ చనిపోయాడు. కాని నీ కొడుకు బ్రతికే, నీ దగ్గరే ఉన్నాడు. మరణించిన భర్త గురించి విచారాన్ని చాలించి, బ్రతికి ఉన్నకొడుకు బాగు గూర్చి ఆలోచించు.

అయినా మన మహారాజు సామాన్యుడు కాదు. ఆయన మాన్యుడు. ఆయన పరిపాలనలో వేలాది వానరుల జీవితాలు బాగుపడ్డాయి. ఆయన దుఃఖార్తులను ఓదార్చాడు. అన్నార్తులను ఆదరించాడు. తెలియక ప్రజలు చేసిన తప్పులను మన్నించాడు. ఇంతకంటె ఏ వ్యక్తి అయినా ఇంకేమి చేయగల్గుతాడు?" అని వాలి ప్రశంస ద్వారా తారను హనుమ ఓదార్చాడు.

హనుమ తారకు ముందు చేయవలసిన పనులను సూచిస్తున్నాడు. "తల్లీ! నీవిప్పుడు నీ కుమారుని రక్షించుకో! ఆయనకు రాజ్యాభిషేకము చేయించి ఆయనను ఉత్తమ పరిపాలకుడిగా తీర్చిదిద్దు.

మరణించిన నీ భర్తకు నీ కొడుకు ద్వారా రాజలాంఛనాలతో అంత్యక్రియలను జరిపించుమని" తెలిపాడు.

హనుమ మాటలతో తార దుఃఖాన్ని కొంత వరకు దిగమింగుకొన్నది. "హనుమా! కొడుకును రక్షించేది తల్లి కాదు. తండ్రే రక్షిస్తాడు. తండ్రికి కొడుకుతో అంత్య సంస్కారాలను జరిపించేది కూడ నేను కాదు. ఆ పని చేయించ వలసినవాడు సుగ్రీవుడు. నేను నా భర్తను అనుసరించడమే నా ధర్మము".

హనుమ తార దుఃఖాన్ని ఉపశమింప జేయడానికి ప్రయత్నించాడు. అయితే కొన్ని మాటల ద్వారా ఆమె మనస్సును కొట్టి చూచాడు కూడ.

"తల్లీ! నీవిప్పుడు నీ కుమారుని రక్షించుకో! ఆయనకు రాజ్యాభిషేకాన్ని చేయించి, ఆయన ద్వారా రాజలాంఛనాలతో మహారాజుకు అంత్యక్రియలను జరిపించుమని" తెలిపాడు. ఆ మాటలు హనుమ హృదయం నుండి వచ్చినవి కావు. నిజానికి ఆయన మొదటి నుండి కోరుకొన్నది సుగ్రీవుడు రాజు కావాలనే. ఆయన ఆధిపత్యమే అంతట నడువాలని"

అయితే ఆయన తారతో ఆ మాటలు అలా అన్నది నిజంగా తారకు అంగదుని రాజును చేయాలని ఉందేమో తెలుసుకోవాలని.

తార మాత్రము హనుమ మాటలకు పడిపోయేదా? ఆమెకు సుగ్రీవుని ప్రస్తుత పరిస్థితి తెలుసు. శ్రీరాముని సహాయముతో వాలి వధను చేయించి సుగ్రీవుడు మహా బల సంపన్ను దయ్యాడు. ఇప్పుడు రాజ్యము ఆయనదే. అధికారము ఆయనదే. కాదనడానికి ఎవ్వరికి ఉంటాయి గుండెలు? అంతేకాదు ఆమెకు సుగ్రీవుని పట్ల మొదటి నుండి సానుభూతి ఉంది. అయితే వాలి మూర్ఖత్వం ముందు ఆమె సానుభూతి పనిచేయలేదు. అందువలననే తార తన కొడుకు రాజు కాదని - సుగ్రీవుడే రాజు అవుతాడని, ఆయనే అంగదుని ద్వారా వాలికి అంత్యక్రియలు జరిపిస్తాడని తన అభిప్రాయాన్ని స్పష్టం చేసింది.

--- ఇతిశం ---

"మరణించిన భర్త గురించి విచారించడం మాని బ్రతికి ఉన్న కొడుకు బాగు చూచుకో"

రేపు ఎలాగూ చావవలసిన మనము
ఈ రోజు చచ్చిన మహారాజు గురించి
ఎంత ఏడిస్తే ఏమి లాభము?

# వాలి అంతిమ సందేశము

తారాంగదుల, పరివార జనుల ఏడుపులు వాలికి చావు తెలివిని తెప్పించాయి. అతి కష్టము మీద కొద్ది కొద్దిగా కళ్లు తెరచి చూచాడు. ఆయన కళ్ల ముందు దిగాలుగా అంగదుడు, ఆయన వెనుక సుగ్రీవుడు నిలుచొని ఉన్నారు.

వాలి తన తమ్ముడైన సుగ్రీవుని రమ్మని అనునయించి పిలిచాడు. "తమ్ముడా! మొదట మనమెంతో అన్యోన్యంగా ఉండే వాళ్లము. అప్పుడు నా మనస్సు ఆనందంతో ఎంతో నిండుగా ఉండేది. మన పెళ్లిళ్లయ్యాక కూడ మన అనురాగంలో మార్పు రాలేదు.

కాని మాయావితో యుద్ధము మన జీవితాలనే మార్చివేసింది. దైవము మనను వేరు చేసింది. నా మూర్ఖత్వము నాతో నీకు చెప్పరాని అపకారాన్ని చేయించింది. నా వివేకము నశించింది. నా బుద్ధి భ్రమించింది. మోహము ఆవేశించింది.

నన్ను అంతవరకు నీడలా అంటిపెట్టుకొని ఉన్న నిన్ను నా బుద్ధి వక్రించి అపార్థం చేసికొని ఉన్నాను. నీవెంత నచ్చచెప్పినా, తార, మంత్రులందరు జరిగిన నిజాన్ని ఎన్నిసార్లు వివరించినా నా మొండితనంతో నిన్ను బాగా హింసించాను. నీ భార్యను అపహరించాను. నిన్ను రాజ్యం నుండి తరిమి వేశాను. తార నిన్ను క్షమించుమని ఎన్ని మార్లు అభ్యర్థించినా ఆ అభ్యర్థనలు అన్ని వ్యర్థమయ్యాయి.

తమ్ముడా! ఆనాటి నుండి మనము అన్యోన్యంగా కలసి ఉండే అదృష్టానికి దూరమయ్యాము.

ఇక నీ భార్యను స్వీకరించి, ఈ రాజ్యాన్ని యశోవంతంగా పాలించు. "నన్ను ఎదిరించి ఎవ్వరు కూడ బ్రతికి తిరిగి పోలేరు" అనే నా కీర్తి, నా అహంకారము అంతమయ్యాయి. ఇక నేను పరలోకానికి ప్రయాణం చేస్తున్నాను.

సోదరా! ఈ అంగద కుమారుని ఆదరించు. పసివాడు ఇంతవరకు ఎంతో ప్రేమతో పెరిగాడు. ఇప్పటి నుండి నీవే కన్న తండ్రివి. నీ కన్న కుమారునిగా పెంచు. అతనిని ఆపదలలో నుండి రక్షించు. ఆయన అవసరాలను ఆదరంతో తీర్చు. అంగదుడు పిల్లవాడే కాని బుద్ధిమంతుడు. పరాక్రమవంతుడు. శ్రీరాముని పక్షంలో నీవు నిలిచి సేవలు చేసేప్పుడు నీకు అండగా ఉంటాడు. తోడు నీడలా నిలుస్తాడు.

తార సుషేణుని కూతురు, సూక్ష్మజ్ఞురాలు, వివేకవతి. రాబోయే అపార్థాలను, అనర్థాలను ముందుగానే ఊహించగల ధీమంతురాలు. ఆమె సలహాను తప్పక స్వీకరించు.

"ఇంద్రాణీవై సేనాయాం దేవతా । యస్యసేనా అంశితేవస్యాత్" ఇంద్రాణి అమరసేనకు దేవత. బలహీనమైన సైన్యాన్ని అయినా బలోపేతం చేయగల్గుతుంది. అలాగే తారా వాక్కు వానర రాజ్యాన్ని శత్రు దుర్భేద్యం చేయగలుగుతుంది... (ఇక్కడ వాలి ఇంద్రాంశ సంభూతుడు కనుక తారను ఇంద్రాణి తో పోల్చడం జరిగింది).

ఆమె నన్ను నీతో యుద్ధానికి వెళ్లవద్దని వారించింది. ఏదో ప్రమాదము కలుగ బోతుందని హెచ్చరించింది. నేనామె మాటను నిర్లక్ష్యము చేశాను. అతి దుఃఖంతో నన్ను వీడి అంతఃపురానికి వెళ్లింది. ఇప్పుడు చూస్తున్నావు కదా నా దుస్థితి. ఆమె మాటను కాదన్నందుకు ఫలితము అనుభవిస్తున్నాను.

నీవెప్పుడు ఆమె సలహాను పెడచెవిన పెట్టకు. అనర్థాన్ని కొని తెచ్చుకోకు.

ఇక శ్రీరామచంద్రుడు అఘటిత ఘటనా సమర్థుడు. ఆయన నీకు బాసటగా నిలిచి రాజ్యాన్ని, భార్యను ఇప్పించాడు. నీకు శత్రుశేషాన్ని లేకుండా చేశాడు.

"నేను అనుకొన్నది అయింది కదా! ఇక రామునితో నాకేమి పని" అని ఉదాసీనుడవై ఉండకు. శ్రీరాముని పట్ల నిరంతరము కృతజ్ఞుడవై ఉండు. నీ కర్తవ్యాన్ని స్నేహ మర్యాదను మరచిపోకు. సీతాన్వేషణ తప్పక కావించు.

నీవు కృతఘ్నుడవై సంతోషాలలో మునిగితేలుతూ, శ్రీరామకార్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ పోతే, మహాబలుడైన రామభద్రుడు నిన్ను వదలి పెట్టడు. ఆయన కోదండ విక్రమానికి నీవు గురికాక తప్పదు. కృతజ్ఞతతో నైనా రామకార్యం చేయవలసిందే, భయంతో నైనా నీవు చేయవలసిందే. కృతఘ్నుడవైతే పాపాన్ని మూట గట్టుకోవలసి ఉంటుంది, ప్రాణాలను కూడ పోగొట్టుకోవలసి ఉంటుంది. శ్రీరామసేవే సకల శ్రేయస్కరము.

నా ప్రాణాలు అనంత వాయువులలో కలువ బోతున్నాయి. ఆ లోపే నీవు నా కంఠంలోని కనకమాల తీసి నీ గళంలో ధరించు. ఆలస్యం చేస్తే నా ప్రాణాలతో పాటు ఈ మాల కాంతి, మహిమ కూడ అదృశ్యమవుతాయి" అని తెలుపుతూ ఆ స్వర్ణ మాలను సుగ్రీవుని మెడలో ధరింపజేశాడు.

వాలి అంగదును పిలిచి, దగ్గరకు తీసికొని "నాయనా! ఇక నుండి సుగ్రీవుడే నీ తండ్రి, రాజు, రక్షకుడు, సర్వము కూడ. ఆయన మాటను కాదనకు. మా దగ్గర చేసినట్లు ఇక ముందు మారాము చేయకు.

సుగ్రీవుని మాటను సదా పాలించు. ఆయన శత్రువులతో కలువకు. ఆయనకు దూరంగా వెళ్లకు. అట్లని ఆయనకు మరీ దగ్గరకు వెళ్లి ఆయన రహస్యాలను తెలిసికొనే

యత్నం చేయకు. రాజుతో సాహచర్యము కత్తిమీద నడచినట్లు ఉంటుంది. పుత్రా! జాగ్రత్త సుమా!

ఈ విధంగా సుగ్రీవాంగదులకు హితోపదేశం చేశాడు. రామబాణ బాధ దుర్భరమైంది. ఆయన తలప్రక్కకు వాలిపోయింది.

వాలి జీవితంలో ఆద్యంతాలు అతి విచిత్రమైనవి. మొదట వాలి ఒక మొరటు వీరుడు. తనను ఎదిరించిన వాడెవడైనా, ఎంతవాడైనా వాడిని యుద్ధంలో మట్టు పెట్టేవాడు.

శత్రువుల భార్యలను బలవంతంగా చేపట్టడం, లేదా వారిని విధవలను కావించడం వాలి ముఖ్య కృత్యము.

ఆయన క్రూరుడు, నియంత కూడ. అందువలన ఆయనకు ఎదురు చెప్పే వాడే లేడు. తార ఆయన ప్రియభార్య. సుగ్రీవుడు మొదట ఆయన అనుగు సోదరుడు. వారైనా తమకు తోచిన హితాన్ని చెప్పి చూచేవారు. ఆయనకు అంగీకారమైతే వినేవాడు, లేకపోతే లేదు. ఆయన తన మాట వినకున్నా, ఆయనను వీడని నీడలా, సుగ్రీవుడు అనుసరించేవాడు.

మాయావి యుద్ధంతో, వాలి సుగ్రీవుల (అన్నదమ్ముల) అనుబంధంలో అనుకోని మార్పు తలెత్తింది. వాలి మాయావిని చంపి తిరిగి వచ్చేవరకు చాల కాలము గడచింది. వాలి హతమైనట్లు సుగ్రీవునికి సూచనలు కలిగాయి. ఆయన కిష్కింధకు తిరిగి వచ్చాక మంత్రులు, ప్రజలు, తార సుగ్రీవుని సూచనలను విని అవి అందరు నిజమే అని నమ్మారు. బలవంతంగా సుగ్రీవుని సింహాసనాసీనుని చేశారు.

సుగ్రీవుడు పాలి పగతో గుహద్వారాన్ని బండలతో బంధించాడని, తాను వచ్చేలోపే రాజయి కూచొన్నాడని అపార్థం చేసికొన్నాడు వాలి. సుగ్రీవుడు, తార, సచివులు ఎన్ని విధాల అనునయించినా, ఆగ్రహావేశాలతో అనుజుని క్రూరంగా హింసించి, దేశబహిష్కృతుని చేసి, ఆయన భార్యను వాలి అపహరించాడు. ఇది వాలి జీవితంలో ఒక కటిక చీకటి తెరను పడవేసింది.

అయితే వాలి జీవితంలో వెలుగు కోణం కూడ లేకపోలేదు. ప్రతిరోజు ఆయన సూర్యోదయాత్పూర్వమే లేచి సంపూర్ణ సూర్యోదయము అయ్యేలోపు నాలుగు సముద్రాలలో స్నానమాడి, సూర్యునికి ప్రాత స్సంధ్యావందనమాచరించే వాడు.

ఆయన తన ప్రభుత్వంలో అర్తులను, అన్నార్తులను తప్పక ఆదుకొనేవాడు. దుఃఖార్తులను ఓదార్చేవాడు. ప్రజల అవసరాలను తీర్చేవాడు. వారి బాగోగులను చూచేవాడు. ఉద్యోగాలనిచ్చి, శాశ్వత భృతిని సమకూర్చేవాడు. తెలియక తన వారు చేసిన తప్పులను మన్నించేవాడు. ప్రజారంజకంగా పరిపాలించేవాడు. తారను హనుమ ఓదారుస్తూ పలికిన పలుకులు వాలి ప్రభుత్వంలో జరిగిన మంచి పనులను తెలియజేశాయి.

కాని శ్రీరాముని విషయంలో వాలి అభిప్రాయము చివరదాకా ఎవ్వరికి తెలియకుండా ఆయన మనస్సులోనే దాగి ఉంది.

శ్రీరాముని జననం నుండి, విశ్వామిత్రానుసరణము, శివధనుర్భంగం, పరశురామ విజయము, పితృవాక్య పాలనార్థము అరణ్యగమనము, ఖరదూషణాది రాక్షస నిధనం, సుగ్రీవ మైత్రి మొదలైన విషయాలన్ని వాలి చారుల ద్వారా వింటు వచ్చాడు.

వాలికి సంబంధించిన మరొక ముఖ్య విషయము ఉంది. శత్రు నిరసనము, సంతత స్త్రీ సంగమము, మదిరాపానము ఆయన జీవితంలో ప్రధాన భాగాలు అయ్యాయి. కొంత కాలానికి ఆయనకు జీవితంలో విసుగు ఏర్పడింది. ఏదో ఒక క్రొత్త మార్పు కలుగాలని ఆయనకు అనిపించింది.

తార తనకు వెంటే ఉండి, వీలయినప్పుడల్లా తాను సుగ్రీవుని నిర్దాక్షిణ్యంగా నిష్కారణంగా హింసించి, దేశబహిష్కృతుని చేయడం, ఆయన భార్యను అపహరించడం అన్యాయమని కాంతాసమ్మితంగా బోధిస్తూ వచ్చింది. క్రమంగా వాలి మనస్సులో తాను మహా పాపం చేశాననే భావన బలపడసాగింది.

సుగ్రీవుడు శ్రీరాముని శరణు వేడాడని, రాముడు ఆయనకు అభయమిచ్చాడని తెలిసింది. అంత గొప్ప అండ లభించిన సుగ్రీవుడెలాగు ఊరక ఉండిపోడు. సమరానికి సన్నద్ధం అవుతాడు. సుగ్రీవునికి సహాయంగా శ్రీరాముడు కూడ రణరంగానికి తప్పక వస్తాడు. తనతో జరిగే సమరంలో సుగ్రీవుడెలాగు ఎక్కువ సేపు తట్టుకోలేడు. అప్పుడు చాటుగానో, నేటుగానో శ్రీరాముడు రంగంలోకి తప్పక దిగుతాడు. తనను వధించి తీరుతాడు. శ్రీరాముని చేతిలో తనకు మరణము కలిగితే తనకు పాప వినాశనము, పుణ్యలోక ప్రాప్తి కలుగుతాయి. తన ఆశ, తీరి తాను కోరుకొన్న మార్పు సంభవిస్తుంది.

అందుకే తారవద్దని వారించినా, సుగ్రీవునికి సహాయంగా శ్రీరాముడు వచ్చాడని తెలిసినా, సమరానికి సన్నద్ధుడయ్యాడు. అనుకొన్నట్లు తనను వధించి తనకు "పాపనివృత్తి అవుతుందని, పుణ్యలోక ప్రాప్తి కలుగుతుందని" రాముడు స్వయంగా వివరించాడు.

మొదట రామశరాఘాతము వలన దుఃఖము, ఆగ్రహము కల్గి రాముని దూషించినా, శ్రీరాముని సమాధానముతో ఆవేశము తగ్గి, వివేకము తలెత్తి శ్రీరాముని మన్నించుమని వేడుకొన్నాడు.

చూచారా! వాలి జీవితంలో దాగి ఉన్న వెలుగుకోణాన్ని! ఆయన మనస్సులో క్రమంగా రామభక్తి మొలకెత్తి, పుష్పించి ఫలించింది. చివరకు వాలి సాధారణ మరణము వలన తన పాపము పరలోకంలో వెంబడిపడి నరకానుభవానికి కారణమవుతుందని, రాముని చేతిలో మరణం వలన పాపప్రాయశ్చిత్తము ఇక్కడే జరిగి, తనకు స్వర్గప్రాప్తి కలుగుతుందనే నిర్ణయానికి వచ్చాడు. అందుకే రాముని చేతిలో హతమై స్వర్గానికి మార్గమును వెతుకుకొన్నాడు.

మన ప్రాచీనులలో మంచివారైనా, చెడ్డవారైనా సంస్కారము వలన భగవత్ జ్ఞానం కల్గి, వయస్సు ముదిరినా కొద్ది ఆ జ్ఞానం భక్తిగా మారి, మరణ దశలో ప్రత్యక్ష సాక్షాత్కార సమానమైన ధ్యానము కలుగుతుంది. తద్వారా భగవత్ ప్రాప్తి కలుగుతుంది. వాలి జీవితమే దానికి ఒక ప్రబల తార్కాణము.

--- ఇతిశం ---

"కృతజ్ఞతతో నైనా రామకార్యం చేయవలసిందే
భయంతోనైనా చేయవలసిందే"

"నేననుకొన్న పని నెరవేరింది కదా!
ఇక నాకెవ్వరితో ఏమి పని?"
అని ఉదాసీనుడవై ఉండకు సుమా!

"రాముని పని మరచిపోకు
పాపాన్ని మూట గట్టుకోకు"

# సుగ్రీవ విషాదము

వాలి అంతిమ సమయంలో తనకు కావించిన హితోపదేశము సుగ్రీవుని మనస్సును మార్చివేసింది. ఆ సమయంతో వాలి తనకు వైరిలా అనుపించలేదు. ఆప్యాయత కల్గిన అన్నలా, తన హితాన్ని కోరే తండ్రిలా అగుపించాడు. ఆయన మరణము సుగ్రీవుని మనస్సుకు బాధ కలిగించింది. తారా విలాపము, అంగదుని దుఃఖము ఆయన విషాదాన్ని మరింత అధికం కావించాయి. ఆయన నయనాలు అశ్రుపూర్ణాలు అయ్యాయి. అంతవరకు అన్న పట్ల ఉన్న వైరభావము అంతరించి సోదరప్రేమ మహోన్నత తరంగంవలె సుగ్రీవుని మనస్సముద్రంలో ఉవ్వెత్తుగా పైకి లేచింది.

చేతిలో విల్లును, బాణాన్ని ధరించి, వీరశ్రీతో విరాజిల్లుతున్న శ్రీరాముని చూచి, "రాజపుత్రా! మన మైత్రీ బంధాన్ని అనుసరించి, నా ప్రార్థనవలన నీవు వాలి వధ కావించావు. మహావీరుడైన మా అన్న మరణించి ఈ మహీతలంపై పడి ఉన్నాడు. మా అన్న మరణాన్ని కళ్లారా చూచాక, అనురాగ భరితమైన ఆయన అంతిమ సందేశాన్ని విన్నాక నా మనస్సు నిర్విణ్ణమైంది. తారాంగదుల విలాపం నా మనస్సును అల్లకల్లోలం కావిస్తున్నది.

నాకిప్పుడు రాజ్యముపై ఆశ అంతరించిపోయింది. భోగముల పట్ల కోరిక పూర్తిగా లేకుండా పోయింది.

నేను తిరిగి ఋష్యమూకానికే వెళ్లి పోతాను. అక్కడే ఫలమూలాలను తింటు శేష జీవితాన్ని గడుపుకొంటాను. ఈ రాజ్యభోగాలు మా అన్న నెత్తురులో తడిసి ముద్ద అయ్యాయి. ఆ నెత్తుటి కూడును నేను తినజాలను.

మా అన్నను చంపించి నేను మహా పాపాన్ని మూటగట్టుకొన్నాను. ఆయనతో నేను అనేక పర్యాయాలు పోరుకుతలబడ్డాను. ఆహవంలోనేను అలసిపోగానే, "వెళ్లు ఇకనైనా బుద్ధి గల్గి జీవించుమని" నన్ను మన్నించి జాలితో వదలిపెట్టేవాడు. అంతటి దయాశాలి మా అన్నవాలి.

వాలివధ వలన కలిగిన మహాపాపము నన్ను వదలిపెట్టదు. ఆనాడు విశ్వరూపుని సంహరించినందువలన ఇంద్రునికి కలిగిన మహాపాపాన్ని భూమి, నీరు, చెట్లు స్త్రీలతో కలసి సమానంగా పంచుకొన్నాయి.

ఆ పాప ఫలితంగానే భూమిలో బీడు ఏర్పడింది. నీరులో నురుగు కలిగింది. చెట్లలో జిగురు చేరింది. స్త్రీలలో ప్రతిమాసం రక్తస్రావం ఏర్పడింది.

నా పాపఫలితాన్ని పంచుకొనే వారే లేరు. ఇక నా పాపానికి ప్రాయశ్చిత్తమే లేదు.

తండ్రిని కోల్పోయి అంగదుడు బ్రతికేలాలేదు. అంగదునికి అణుమాత్రము ఆపద కల్గినా తార జీవింపదు. వానరులందరు శోక సాగరంలో మునిగి ఉన్నారు.

నీరు పల్లమువైపు పారినట్లు నామనస్సును దుఃఖము వశముచేసికొంటున్నది. మదించిన మహాగజము నదీ తీరాన్ని కూలగొట్టినట్లే నామహాపాపమునా మనస్సును కొల్లగొట్టుతున్నది. బంగారుకు మైల చేరి, దాని కాంతిని మసకబార్చినట్లే నా మనస్సుకు పాప పంకిలంచేరి, దాన్ని మైల కావించింది. బంగారును అగ్నిలోవేస్తే అది మళ్లీ పరిశుద్ధమవుతుంది. కాని నా పాపమలినము ప్రక్షాళితం ఎలా కాగలుగుతుంది?

నేను ఋష్యమూకానికి తిరిగి వెళ్లి అక్కడే. ఆకులు అలములు తింటూ బ్రతుకును సాగదీసినా, లేక ఇప్పుడే జీవితాన్ని చాలించినా, నీకు నేనిచ్చిన మాట తప్పక నెరవేరుతుంది. నా అనుచరులు నీకు సీతాదేవి అన్వేషణలో తప్పక తోడ్పడుతారు. ఆవిధంగా అనుచరులను నేను శాసిస్తాను. మహాపాపినైన నాకు మరణమే మంచిదారి అనిపిస్తున్నది. అందువలన మహావీరా! మరణించడానికి నన్ను అనుమతించుమని" సుగ్రీవుడు అభ్యర్థించాడు.

సుగ్రీవుని దుఃఖాన్ని చూస్తుంటే రామునికి కూడ దుఃఖమాగలేదు. ఆయన కళ్లు ధారాపాతంగా కన్నీళ్లను వర్షించసాగాయి.

"సంజాత బాష్పః పరవీరహంతా"

శ్రీరాముడు అజాత శత్రువు. ఆయనకు సహజంగా శత్రువులు లేరు. ఆయనను ఆశ్రయించిన వారే ఆయన మిత్రులు. ఆశ్రయించినవారి శత్రువులే ఆయన శత్రువులు.

వాలి - శ్రీరాముల మధ్య సహజమైన వైరమేదీలేదు. సుగ్రీవుడు శ్రీరాముని ఆశ్రయించిన వాడు. అందువలన సుగ్రీవుడు శ్రీరామమిత్రుడు.

సుగ్రీవుని అపార్థం చేసికొని ఆయనను క్రూరంగా హింసించి, అన్యాయంగా ఆయన భార్యను అపహరించి, ఆయనను రాజ్యం నుండి తీవ్రంగా దండించి దిక్కులేని విధంగా తరిమివేశాడు వాలి. ఆ విధంగా తనమిత్రుడైన సుగ్రీవుని శత్రువైన వాలిని తన శత్రువుగా భావించి, సుగ్రీవుని ప్రార్థనపై వాలిని హతుని కావించాడు శ్రీరామచంద్రుడు.

ఇప్పుడు తన మిత్రుడైన సుగ్రీవుడే వాలి మరణానికి దుఃఖిస్తున్నాడు. తన మిత్రుడైన సుగ్రీవుని శోకమే ఇప్పుడు శ్రీరామునికి తన దుఃఖమైంది. అందువలననే "సుగ్రీవా! నీ కోరిక వలననే వాలిని చంపాను కదా! అప్పుడు అతనిని చంపుమని ఇప్పుడెందుకు ఏడుస్తున్నావని?" రాముడు అడుగలేదు. సుగ్రీవుడు ఏడుస్తుంటే రామునికి కూడ దుఃఖమాగలేదు. అందుకే "సంజాత బాష్పః పరవీరహంతా" అని వివరించాడు వాల్మీకి.

పరులు ఏడుస్తుంటే తాను కూడ దుఃఖించడాన్ని "పరదుఃఖ దుఃఖిత్వము" అంటారు. అది కూడా స్వామి కల్యాగుణాలలో ఒకటి అంటారు అభిజ్ఞులు.

దశరథ మహీపాలుని ముందు శ్రీరామచంద్రుని కల్యాణ గుణాలను వివరిస్తూ, "వ్యసనేషు మనుష్యాణాం। భృశంభవతి దుఃఖితః" అంటారు అయోధ్యాపౌరులు.

ప్రజలలో ఎవ్వరికి ఏ ఆపద వచ్చినా, ఆ ఆపదను అప్పుడే తొలిగించే వాడు. అంతేకాదు. ఆ ఆపద కలిగినందుకు, వాళ్లకంటే తానే ఎక్కువగా దుఃఖించేవాడు కల్యాణగుణాభిరాముడైన శ్రీరామభద్రుడు.

--- ఇతిశం ---

**సుగ్రీవుని దుఃఖాన్ని చూస్తుంటే**
**రాముని కళ్లు ధారాపాతంగా కన్నీళ్లను కార్చసాగాయి**
**"పరదుఃఖ దుఃఖిత్వమే ఉత్తమ కల్యాణ గుణము"**

# "రామా! నీవు సాటిలేనివాడివి"

వానరరాజైన వాలి శవంపై పడి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తారను వానర వీరులు లేపి ఓదార్చడం ప్రారంభించారు. ఆమె నిలదొక్కుకోవాలనుకొంది. అటుఇటు తన చూపులను సారించింది. ఆమె దృష్టి అకస్మాత్తుగా ధనుర్ధారి అయిన శ్రీరామచంద్రునిపై పడింది.

శ్రీరామభద్రుడు భర్త మరణంతో పుట్టెడు దుఃఖంలో మునిగిన తారను ఓదార్చాలను కొన్నాడు. ఆయన ఆమె వైపు మెల్లగా అడుగులు వేశాడు.

తనను సమీపిస్తున్న రాముని చూడగానే తార దుఃఖం మరింత అధికం కాసాగింది. తన భర్తను హత్య చేసిన వాడు తనకు ఎదురుగా నిలిచి ఉన్నాడు. ఆమెకు ఆగ్రహము అతిశయించింది. తన అక్కసు అంతా తీరేలా అతనిని దూషిద్దామనుకొంది. ఆమె తలెత్తి రామునివైపు చూచింది. ఆశ్చర్యము ఆయన కనులు కూడా బాష్పధారలను స్రవిస్తున్నాయి. ఆమె ఒక్క క్షణంలో అవాక్కు అయింది. ఆయన పరదుఃఖ దుఃఖిత్వము ఆమెను నిశ్చేష్టురాలిని చేసింది. ఆయన అపార సానుభూతిని ఆమె తట్టుకోలేకపోయింది. ఆమెలోని క్రోధము అంతరించిపోయింది. తామస గుణము తలవాల్చి సాత్విక గుణము ఆమెలో తల ఎత్తింది. ఆయన తామరనేత్రాలు అమెను తన్మయురాలిని చేశాయి. వాటిని చూచి ఆమె రాముని పురుషోత్తమునిగా గుర్తించింది. అప్రయత్నంగా "శ్రీరామతత్వము" శూర్పణఖలో లాగే తారలో కూడ స్తుతి శీలాన్ని కల్గించింది. ఆశ్చర్య కరమైంది కదా భగవత్తత్వము! అనుకోకుండా ఆమె నోటి నుండి శ్రీరాముని విషయంలో ప్రశంసా వాక్యాలు రాసాగాయి.

**శ్లో॥ "త్వమప్రమేయశ్చ, దురాసదశ్చ, జితేంద్రియశ్చోత్తమ ధార్మికశ్చ,**
**అక్షయ్య కీర్తి శ్చ, విచణశ్చ క్షితిక్షమావాన్, క్షతజోపమాక్షః॥**

1) **త్వమప్రమేయశ్చ:-** రామచంద్రా! నీవు సాటిలేని వాడివి. నీ తండ్రిగారి నిర్దేశంవలన నీవు అడవికి బయలు దేరావు. పితృవాక్య పాలనాధర్మాన్ని నిరుపమానంగా పాటించావు.

క్రూరారణ్యములో విరాధ, ఖర, కబంధాది ఘోర రాక్షసులను అవలీలగా హతమార్చిన అవక్రవిక్రముడవు.

నీ కమల పత్రాక్షములు నిన్ను కమలానాథునిగా స్ఫురింపజేస్తున్నాయి.

నీ పరదుఃఖ దుఃఖిత్వము నిన్ను సకల కల్యాణ గుణాలతో సాటిలేని వాడివని నిరూపిస్తున్నది.

నీవు విల్లు అమ్ములను ధరించి నా ముందు నిలిచావు. అయితే శంఖచక్రాది సర్వాయుధోపేతుడవని నిన్ను గుర్తించగలుగుతున్నాను.

నీవు నా కనులముందే నిలిచి ఉన్నావు. కాని నీవు ఇంత వాడివని గుర్తించడానికి వీలు లేకుండా ఉంది.

"క ఇత్థా వేద" ఆయన ఇంత వాడని, పరమాత్మను వేదాలు కూడ తెలసికోజాలవు. "సోऽంగవేద యదివానవేద" స్వయంగా ఆయన కూడ తన మహిమను కొంత గుర్తించగల్గుతాడో లేదో" అని భగవద్వైభవాన్ని వేదాలు వివరిస్తున్నాయి. నీ స్వభావము కూడ అటువంటిదేనని నామనస్సుకు తోస్తున్నది.

నీవు ఒంటరిగా అసహాయునివలె నిలుచున్నావు. కాని అనేక ప్రబల శత్రువులు నీపై ఒక్కుమ్మడిగా దండెత్తి వచ్చినా నీవు అకంప్యుడవు.

నీ ప్రభావము వాఙ్మనసాతీతము.

**2. దురాసదశ్చ:- (దుర్+ఆ+సదః):-**

నీ ప్రభావము వాక్కులకు, మనస్సుకు అందనిది కావచ్చు. అయినా నీవు కట్టెదుట నిలిచి ఉన్నావు కదా! బాహ్యేంద్రియాలతో నిన్ను అనుభవించవచ్చుకదా! అంటే అదీ అసాధ్యమే. మనస్సుకందిన విషయాన్నే కదా బాహ్యేంద్రియాలతో అనుభవింపగల్గేది.

"షదిల్" ("సద్") అనే ధాతువుకు 1. (విశరణము) శిథిలము, 2. గతి 3. అవసాదము (దుఃఖము) అనే మూడు అర్థాలు ఉన్నాయి.

శిథిలము:- విశరణము:- స్థూల వస్తువునైతే సూక్ష్మంగా విభజించి శిథిలము చేయవచ్చు కాని నీవు "అణోరణీయాన్" అణువులకంటే అణువు అన్నట్లు "సుసూక్ష్మమైన" వాడివి. నిన్ను శిథిలము చేయడము అసాధ్యము కదా!

**"గతి" అంటే "చలనము"** అని అర్థము. నిన్ను ఒక చోట లేకుండా మరొక చోటికి మారుద్దామంటే అది కూడ కుదరదు. ఎందుకంటే నీవు విభుడవు. సర్వ వ్యాపివి. అంతట వ్యాపించి ఉన్నవాడివి ఎక్కడైనా ఒకచోట లేకుండా చేయడం కుదరదుకదా!

నీకు అవసాదమును (నిర్మూలనమును) కలుగచేద్దామంటే నీవు లేకుండా పోయే వాడివి కాదు. నీవు నిత్యుడవు.

వాలి వధకు కోపించిన వానరులందరు కలిసి నిన్ను దుఃఖ పరచాలనుకొన్నా అది సాధ్యముకాదు.

నీవు ఆశ్రితులందరికి అత్యంత సులభుడవు. అనాశ్రితులందరికి అత్యంత దుర్లభుడవు.

"మహాజనో యేన గతః స పంథా" అన్నట్లు భక్తి మార్గంలో పయనించే వారందరికి పట్టుగొమ్మవు.

"తర్కో2ప్రతిష్ఠః" – హేతువాదంతో నిన్ను లేవని నిరూపిద్దామంటే "ధర్మస్య తత్వం నిహితం గుహాయాం" వేదగుహలో స్థిరంగా నిహితమై ఉన్న నిన్ను లేదని నిరూపించడం ఎవ్వరి తరముకాదు.

ఇక నిన్ను సాధించడమెలా? బాధించడమెలా? అందువలననే నీవు "నిత్యం, విభుం, సర్వగతం, సుసూక్ష్మం" అయినవాడివి. "దురాసదుడవు".

**3. జితేంద్రియశ్చ:-**

నీవు ఇంద్రియములను జయించినవాడివి. నీవు వాలి రావణులవలె ఇంద్రియములకు లోబడి పరదారలను ఆశించే వాడివా? కాదు.

మహేంద్రుడంతటి వాడు అహల్యా జారుడయ్యాడు. ప్రజాపతి అయిన చతుర్ముఖ బ్రహ్మ స్వయంగా ఆత్మ తనయ అయిన సరస్వతికి వశుడయ్యాడు. తారకాధిపతి అయిన చంద్రుడు గురుపత్ని అయిన తారవిషయంలో చోరుడయ్యాడు. విశ్వామిత్ర మహాముని మేనక విషయంలో చపలుడయ్యాడు.

కాని నీవు వాలిని చంపి కూడ రుమను సుగ్రీవునికి అప్పగించావు. సహజంగా సౌందర్య వంతులయిన స్త్రీ పురుషులు పరస్పరము ఆకర్షణకు లోబడుతారు. అప్సరసలను మించిన అందముగల నేను, భార్యా విహీనుడవైన నీకు ఇంత దగ్గరలో ఉన్నా నన్ను కన్నెత్తి కూడ చూడడంలేదు. "నరామః పరదారాన్వై చక్షుర్భ్యామపి పశ్యతి" రాముడు పరస్త్రీలను కన్నెత్తి కూడ చూడడు" అనే మాట సత్యమైనది.

ధర్మబద్ధంగా మాత్రమే అర్థకామాలను అనుభవిస్తావు. వాలిని నిరసించి ఆయన రాజ్యాన్ని ఆయన తమ్ముడైన సుగ్రీవునికే అప్పగించావు. నీవు జితేంద్రియుడవు ప్రభూ".

రాముడు జితేంద్రియుడు. ఇంద్రియములను జయించినవాడు.

"పశ్యత్యచక్షుః, సశృణోత్యకర్ణః, అపాణిపాదో జవనోగ్రహీతా" పరమాత్మకు ఈ ప్రపంచాన్నంతటిని చూడడానికి కనులు అక్కరలేదు. సర్వ శబ్దాలను వినడానికి కర్ణాలు అవసరంలేదు. అందరికంటే ఆయన వేగంగా కదులుతాడు. అయితే అలా కదలడానికి ఆయనకు కాళ్లు అక్కరలేదు. సర్వాన్ని గ్రహిస్తాడు (పట్టుకొంటాడు). కాని అందుకు హస్తాలు అవసరం లేదు. ఆయన ఇంద్రియాధీనుడు కాదు. "సర్వేంద్రియైర్వినా సర్వం సర్వత్ర పశ్యతి". ఏ ఇంద్రియావసరము లేకుండానే ఆయన అన్నిటిని అధీనంలో ఉంచుకొంటాడు.

**4. ఉత్తమ ధార్మికశ్చః-**

రాముడు జితేంద్రియుడు కావచ్చు. కాని వైర కారణమేమి లేకుండానే వాలిని వధించాడే? ఆయన ధార్మికుడెలా అవుతాడు?

సాధారణంగా వైర కారణం లేకుండా ఏ ప్రాణిని సంహరించినా అది హింసే. అది అధర్మమే.

కాని పరులకు ఉపకారం చేయడంలో ఏ ప్రాణినైనా హింసిస్తే అది అధర్మము కాదు. "తనను కాటువేయలేదు కదా" అని తన ఇంట్లో ప్రవేశించిన నాగు బామును ఎవ్వరైనా వదలివేస్తారా? విషప్రాణిని చంపడం హింస అవుతుందా? అధర్మమవుతుందా?

"ఆనృంశంస్యం పరో ధర్మః" అన్నట్లు భూతదయ సామాన్య ధర్మము కావచ్చు. కాని ఆశ్రిత రక్షణము అంతకు మించిన ధర్మము. ఉత్తమ ధర్మము.

(1) తన స్వార్థం కొరకు ధర్మాన్ని ఆచరిస్తే అది స్వార్థ ధర్మము. అది అధమ ధర్మము. తన కొరకు, పరులకొరకు కూడ కలిపి ధర్మాన్ని ఆచరిస్తే అది మధ్యమ ధర్మము. తన కొరకు ఎంతమాత్రము కాకుండా పరులకొరకే ధర్మాచరణకావిస్తే అది ఉత్తమ ధర్మము. చెట్టు చాటు నుండి అధర్మంగా వాలిని హత్య కావించాడనే నిందను భరించికూడ, సుగ్రీవుని కొరకు వాలిని వధించడం రాముని ఉత్తమోత్తమ ధర్మము.

(2) వర్ణాశ్రమ ధర్మాలను పాటించడం సామాన్య ధర్మము. చతుర్విధ భక్తులకు రక్షణ కల్పించడం అంతకంటే మించిన (ఉత్) ధర్మము. జ్ఞానులకు ఆశ్రితులకు సర్వదా సర్వథా శరణునివ్వడం దానిని మించిన "ఉత్తర" ధర్మము. ఆచార్యోపాయంతో అమ్మగారి పురుషకారంతో భక్తులకు వశం కావడం ఉత్తమ ధర్మము.

(3) వధను వైర కారణంగా చేయడం సామాన్య ధర్మము. వధను పాప పరిహారార్థము చేయడం ఉత్తమ ధర్మము. వాలి చేసిన సోదర భార్యాపహరణ పాపాన్నుండి అతనిని విముక్తుని చేయడం కొరకే అతనిని వధించానని వాలికి రాముడు సమాధానమిచ్చాడు.

"రాజభిర్ధృతదండాస్తు! నిర్మలాః స్వర్గ మాయాంతి"

రాజుల ద్వారా దండింపబడ్డవారు, తమ పాపాలనుండి నిర్మలులై స్వర్గానికి వెళ్లుతారని రాజనీతిని వాలికి రామచంద్రుడు వివరించాడు.

ఇక శాఖామృగాలను చండపంలో చాటునుండి చంపినా తప్పు లేదని వేట ధర్మాన్ని శ్రీరాముడు వివరించాడు.

**ఇంతకు సుగ్రీవుడు సీతాన్వేషణ కావిస్తాడని కదా రాముడు వాలిని చంపింది. ప్రత్యుపకారాన్ని ఆశించి చేసిన పని ఉత్తమ ధర్మము ఎలా అవుతుంది?**

సుగ్రీవుని సీతాన్వేషణలో సహకరించుమని శ్రీరాముడు అతనిని యాచించలేదు. జనస్థానం నుండి కిష్కింధకు వచ్చేదాక ఆయన ఎవ్వరి సహాయాన్ని ఆశించాడు? లేదు కదా! విరాధ, ఖర, కబంధ, వాలి మొదలైన వీరులను సంహరించిన మహా వీరుడైన శ్రీరామునికి సీతాన్వేషణలో అన్య సహాయము అవసరమవుతుందా? కాదు కదా? అందువలన సుగ్రీవ సంరణార్థము వాలిని వధించడం రాముని ఉత్తమధర్మమే. రాముడు ఉత్తమ ధార్మికుడే.

**అక్షయ్యకీర్తిశ్చ:-** నన్ను పిరికి వాడివై చెట్టు చాటునుండి చంపిన దుర్మార్గుడవు. 'కింవక్ష్యసి సతాం మధ్యే'' సత్పురుషులమధ్య నీవు ఈ కార్యాన్ని ఎలా సమర్థించుకొంటావు? అని రాముని వాలి ప్రశ్నిస్తే - తాను

"కిం దూషయసి మాం ధర్మే పితృ పైతామహేస్థితం?" - ఏమిటి? (తాతల, తండ్రుల నుండి) మొదటి నుండి ధర్మమార్గంలో స్థిరంగా నిలచిన నన్ను దూషిస్తావా? అని వాలిని నిలదీసి "సోదరుని భార్యతో అధర్మ కామాన్ని అనుభవించిన పాపానికి దుండనము వధే" అని శిక్షాస్మృతిని వివరించిన మహాయశుడు శ్రీరాముడు. శాఖా మృగాన్ని వేటాడటంలో ..... చాటు నుండి చంపడం కూడ ధర్మమే అని మృగయా ధర్మాన్ని వివరించి, వాలిని నిరుత్తరుని కావించిన మహాయశస్వి శ్రీరాముడు

"తస్యనామ మహద్యశః"

**విచక్షణశ్చ:-** వివేకము కలవాడు.

సుగ్రీవుడు వాలి దురాగతాన్ని వివరించగానే రాముడు వాలిని సంహరించలేదు. తాను వెంటనుండి సుగ్రీవుని వాలివద్దకు వెళ్లుమన్నాడు. వాలి అప్పటికైనా బుద్ధిని తెచ్చుకుని సుగ్రీవుని ఆదరిస్తాడేమో అని చూశాడు. కాని వాలి తన దుర్మార్గాన్ని మానలేదు. వాలి దురాగతాన్ని కళ్లారా చూచాక వాలిని సంహరించాలని నిర్ణయించు కొన్నాడు. అది రాముని విచక్షణ.

అంతేకాదు సుగ్రీవునికి లక్ష్మణునిచే గజపుష్ప మాలను వేయించాడు. దానివలన సుగ్రీవుని లక్ష్మణునికి ప్రీతిపాత్రుని కావించాడు. ఆయనను రక్షించాలనే సంకల్పము లక్ష్మణునికి కూడ కల్గించాడు. అంతేకాదు గజపుష్పమాల వలన దూరం నుండి కూడ వాలి సుగ్రీవులను వేర్వేరుగా గుర్తించడం వీలయింది. ఆ విధంగా ఆశ్రితుడైన సుగ్రీవునికి పొరపాటున కూడ ప్రమాదంకల్గించకుండా ఉండడము శ్రీరాముని విచక్షణకు గుర్తు.

“సమర్థుడనైన నాతో సఖ్యం చేస్తే ఒకే రోజులో సీతాదేవిని తెచ్చి ఇచ్చే వాడిని కదా! అసమర్థుడైన సుగ్రీవునితో స్నేహమెందుకు చేశావని?” వాలి ప్రశ్నించాడు. ఆ ప్రశ్నే సాధారణంగా మనందరి మనస్సులలో కలుగుతుంది కూడ.

రాముని అవతార ప్రయోజనము రావణవధ. ముందే వాలితో స్నేహం చేస్తే [1]తనకంటే అధిక బలవంతుడైన వాలే రాముని ఆశ్రయించాడు. కనుక తాను కూడ రామునితో వైరం మానుకంటే మంచిదనే రావణుడు అనుకొంటాడు. అందువలన దురాచారుడైన రావణవధ జరుగడానికి వీలులేదు.

అంతేకాదు తనకు సీతాన్వేషణలో సహాయంకొరకు దుర్మార్గుడైన వాలిని ఆశ్రయిస్తే, సన్మార్గుడు, అసహాయుడైన సుగ్రీవునికి రక్షణ లభించదు. తన అవతార ప్రయోజనము, అసహాయులను రక్షించడమే కదా.

ఈ విధంగా కారణాలను నిర్ణయించుకొని కార్యాలను సాధించడం రాముని విచక్షణకు నిదర్శనము.

సర్వజ్ఞుడు, సర్వవేత్త అయిన పరమాత్మ అవతార రూపుడైన శ్రీరామునికి విచక్షణ సహజమేకదా!

శ్రీరాముని ఉత్తరోత్తర యుక్తిలో బృహస్పతితో పోలుస్తారు.

అంతేకాదు రావణ సంహారానికి వాలిని ఆశ్రయిస్తే వాలి అహంకారముతో రాముని కళ్లగానక గడ్డిపోచవలె చూస్తాడు. వాలి స్వయంగా బల గర్విష్ఠుడు కనుక వానర సేనలో వరిష్ఠుల నెవ్వరిని కూడ ఆదరించలేదు. అందువలన వారందరు వాలిపట్ల విముఖులే. కనుక వారెవ్వరి సహకారముకూడ లభించదు.

రావణాసురుని సంహారం కొరకు రాముడు వాలిని ఆశ్రయించడమంటే వాలి కూడ దుష్టుడే కనుక ఆయనను శిక్షించడం జరుగదు.

**క్షితిక్షమావాన్:–** భూమికున్నంత ఓపిక కలవాడవు! శ్రీరాముని కల్యాణ గుణాలను వాల్మీకికి నారదమునీంద్రుడు వివరిస్తూ "క్షమయా పృథివీ సమః" సహనంలో భూమితో సమానుడని తెలిపాడు.

సుగ్రీవుని భార్యను అపహరించి, ఆయనను అకారణంగా అడవులకు తరిమి వేశాడని విని రామునికి వాలిపై కోపము కట్టలు తెంచుకొంది. సుగ్రీవుని అవమానించడంలో తార, అంగదుల పాత్ర ప్రత్యక్షంగా ఏమి లేకున్నా, సుగ్రీవుడు ఒంటరి వాడై అడవులలో అమితంగా దుఃఖిస్తుంటే తార, అంగదులు వాలితోపాటు సుఖ సంతోషాలలో తేలుతు ఉన్నారు. అందువలన "వాలిని భార్యాపుత్ర, మిత్ర, అమాత్య, జ్ఞాతి, బాంధవులందరితో కలిపి వధిస్తే కాని రాముని కోపము తీరదు" అనుకొన్నారు అందరు.

కాని తారాంగదులు తనకళ్ల ఎదుటే నిలిచినా వారిపై తన కోపాన్ని వెళ్లగక్కలేదు. సరికదా తారను ఓదార్చడానికి రాముడు పూనుకొన్నాడు. వాళ్లను మనసారా క్షమించాడు. ఎంతటి సహన శీలుడు రాముడు!

తార రాముని సహనానికి నివ్వెరపోయింది. "యాభై కోట్ల యోజనాల విస్తీర్ణమైన ఈ భూమండలమంతా ఒక ఎత్తు! నీ సహనం ఒక ఎత్తుగా నిలిపినా నీ సహనమే ఎక్కువ కదా రామయ్యా!" అనుకొంది ఆ నారి.

"నీవు ప్రపంచమంతటిపై చూపవలసిన క్షమనంతా ఒక్క ఈ ఆడుదానిపై చూపావేమయ్యా ప్రభూ!" అని విస్తు పోయింది తార!

"నా ఒక్కదానిపై చూపిన నీ అపార క్షమ ప్రపంచాన్ని అంతటిని క్షమించడానికి సరిపోతుంది కదయ్యా స్వామీ!" అని ఆశ్చర్యపడింది తార!

సుగ్రీవుని కష్టాలకు వాలే ప్రత్యక్షకారణమైనా, ఆయనతో కలిసి జీవించడమువలన నాకు, నా కొడుకైన అంగదునికి కూడ ఆ వాలినేరంలో భాగముంది కదా! మా దోషాన్ని తెలిసికొని కూడ మమ్మల్ని మనసారా క్షమించి మమ్మల్ని ఓదారుస్తున్నావే? ఎంతటి సహనశీలివి తండ్రీ! అని తార రాముని వైపు చేతులు జోడించింది.

**క్షతజోపమాక్షః:–** రక్తము వంటి ఎఱ్ఱని కన్నులు కలవాడవు! ప్రాణులందరిని కన్న తల్లివలె అనురాగంతో కాపాడే వాడివి కదా! ఆ అనురాగము నీ కళ్ల ఎరుపుకు కారణమైందా?

వాలిపైన ఆగ్రహంతో నీ నేత్రాలు రక్త వర్ణాలయ్యాయా? అయితే ఆ ఆగ్రహం ఇంకా తగ్గలేదా? కోపంతో కనులు రక్త వర్ణాలయితే మరి నాపై, నా కొడుకుపై ఆగ్రహాన్ని ప్రదర్శించడం లేదే?

అంటే నీ రక్త నేత్రాలకు వాలిపై ఆగ్రహము తాత్కాలిక కారణమే కాని సంపూర్ణ కారణముకాదన్న మాట! మరి నీ కన్నులు సహజంగానే అరుణంగా ఉంటాయా? ఔనులే! నీవు ఎఱ్ఱతామరల వంటి కన్నులు కలవాడవు కదా!

"త్రి తామ్రః, రక్తాస్య, నేత్ర, పాణిః" ముఖము, నేత్రాలు, అరచేతులు – ఈ మూడు అవయవాలు ఎఱ్ఱగా ఉండడము సార్వభౌమ లక్షణాలు కదా! నీవు సార్వభౌముడవు కనుక నీ కన్నులు ఎఱ్ఱగా ఉన్నాయిలే!

అయితే ఈ ఎఱుపు నీ కన్నులకు సహజమైంది కాదేమో? సీతా వియోగంవలన నీ కన్నులు ఎఱ్ఱబారాయేమో? లేక సుగ్రీవుని పై వాత్సల్యంవలన అరుణిమను సంతరించుకొన్నాయేమో?

"ప్రభూ! నీ రక్తాక్షములకు కారణము ఏమని ఊహింపగలను"? అని విస్మితురాలైంది తార.

ఎంతటి విజ్ఞానఖనితార! ఎంతటి వివేకవతి ఒక వానరవనిత? ఆశ్చర్యకరమైంది భారతీయ సంస్కృతి. అపురూపమైంది భారతీయ వనితా మహిత మతి సంపద!

వాల్మీకి కవీంద్రుడు తారనోట చకార పూర్వకంగా రామగుణాలను వర్ణింపజేశాడు. "అప్రమేయశ్చ, దురాసదశ్చ, జితేంద్రియశ్చోత్తమ ధార్మికశ్చ" అని ఈ సముచ్చయము ఆశ్చర్యాన్ని సూచిస్తుంది. రాముని కల్యాణ గుణాలలో ఒక్కొక్క గుణమే అనంతంగా ఉంటే ఇటువంటి అనంతమైన గుణములను అనేకంగా కలవాడివే? అని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తున్నాడు వాల్మీకి మునీంద్రుడు తార ద్వారా.

"క్షితిక్షమావాన్, క్షతజోపమాక్షః" అనే వాటికి చకారము ప్రయోగింపబడలేదు. అంటే ఇవి ఒకేరకమైన (ఏకాధికరణము కలిగిన) గుణాలుకాదు. ఒకటి స్వభావ గుణము. మరొకటి శరీర గుణము.

"క్షతజోపమాక్షః" అనే శబ్దంలో విసర్గ తీసివేస్తే "క్షతజోపమాక్ష" అని సంబోధనకు (రీత్యంతంగా) కూడ ఉపయోగిస్తుంది.

వాల్మీకి మహాముని ఇంతవరకే "ఆనృంశంస్యమనుక్రోశం, శ్రుతం, శీలం దమ, శ్శమః రాఘవం శోభయంత్యేతే షడ్గుణాః పురుషోత్తమం" అని సౌలభ్యానుకూలమైన గుణ షట్కాన్ని, "జ్ఞాన శక్త్యాది" పరత్వానుకూలమైన గుణషట్కానికి భిన్నంగా చెప్పాడు. ఇప్పుడు "అపహతపాప్మాది" గుణాష్టకానికి, భిన్నంగా అప్రమేయత్వాది" గుణాష్టకాన్ని వివరించాడు.

--- ఇతిశం ---

వాలిపై కోపముతో నీ కనులు ఎరుపు బారెయా?
సుగ్రీవునిపై వాత్సల్యం వలననా?
సీతా వియోగం వలననా?
నీ సార్వభౌమ లక్షణాల వలననా?
రామభద్రా! నీ రక్తాక్షములకు కారణమేమని
ఊహింప గలను ప్రభూ!"

ఎంతటి విజ్ఞానఖని తార!
ఎంతటి వివేకవతి తార!
ఆశ్చర్యకరమైనది భారతీయ సంస్కృతి
అపురూపమైనది భారత వనితామతి

# ౨౦. వాలి అంత్యక్రియలు

శ్రీరాముని చూడగానే దుఃఖముతో దూషించాలనుకొన్న తార అనుకోకుండా అతనిని స్తోత్రము చేసింది. కొంత సమయానికి ఆమె మరణించిన తన భర్తవైపు తిరిగి చూచింది. తన భర్త మరణము ఆమెను వివశురాలిని చేసింది.

ఆమె శ్రీరామునివైపు మరలి చేతులు జోడించి, "రామచంద్ర ప్రభూ! భార్యను పోగొట్టుకొని నీవు పొందుతున్న వియోగ దుఃఖము నీకు తెలుసు కదా! అలాగే నన్ను విడిచివెళ్లిన నా భర్త కూడ స్వర్గంలో నా తోడు లేక దుఃఖాక్రాంతుడు అవుతాడు. నేను కూడ పతివిహీననై జీవింపజాలను. అందువలన నన్ను కూడ నీ బాణంతో వధించి నా భర్త దగ్గరకు చేర్చు.

స్త్రీ హత్య మహాపాపము కదా! అని అనుమానించవలసిన అవసరము లేదు. పురుషుని శరీరములో అర్ధభాగము స్త్రీ. ఆమె అతనికి అనుక్షణము వెంట నుండి, అతని సుఖదుఃఖాలలో పాలు పంచుకొని, అతని జీవిత నౌకకు చుక్కాని అవుతుంది.

అందువలననే "ఆత్మాహి దారాః" అని భార్యను భర్తకు ఆత్మగా వివరిస్తారు. శరీరాత్మలను విడదీయడం పాపము. కాని శరీరాత్మలను కలుపడం పాపము కాదు కదా! అంతే కాదు ఒక పురుషునికి ఇచ్చే దానాలన్నిటిలో భార్యా దానమే శ్రేష్ఠమైనది. నన్ను నా భర్త నుండి దూరము చేయడమే హింసా రూపమైన పాపము అవుతుంది. అందువలన నన్ను వెంటనే వధించి నాభర్తతో నన్ను చేర్చి పుణ్యాన్ని మూట కట్టుకో" అని ఎంతో ప్రార్థించింది.

శోకమూర్తి అయిన తారను మహానుభావుడైన రామచంద్రుడు ఎంతో ఓపికతో ఓదార్చాడు. "అమ్మా! నీవు వీరపత్నివి. వీరులకు వీరమరణం లభించడం ఎంతో పుణ్యం వలననే కలుగుతుంది. తమ భర్తలు వీర స్వర్గాన్ని అలంకరించడం వీర పత్నులందరికి గర్వకారణము, సంతోషదాయకము కూడ.

ఎవ్వరికెప్పుడు ఏది జరుగాలో అంతా విధి లిఖితమై ఉంటుంది. జరుగవలసిన దానిని జరుగకుండా ఆపడం ఎవ్వరి తరము కాదు. నీవు నీ మనస్సును చిక్కపట్టుకో. ధైర్యము తెచ్చుకో. చనిపోయిన నీ భర్త మరణానికి చింతించడము మాని జీవించి ఉన్న నీ కొడుకు జీవితాన్ని చూచుకో. నీ ప్రియ కుమారుడు అంగదుడు యువరాజుగా పట్టాభిషిక్తుడు అవుతాడు. అతనిని చూచుకొంటూ నీ కాలము గడుపుకో.

శ్రీరామచంద్రస్వామి సాంత్వనము తార దుఃఖాన్ని కొంత శమింపజేసింది. ఆయన ఓదార్పుతో ఆమె మనస్సు ఊరడిల్లింది. తరువాత రామభద్రుడు సుగ్రీవునివైపు తిరిగి, "చనిపోయిన వారి గురించి శోకిస్తు ఉండడము వలన ప్రయోజనము ఏమి ఉండదు. మృతులకు శ్రేయస్కరంగా వారికి తగిన విధంగా అంత్యసంస్కారాలు జరుపాలి.

లోకంలో జీవులందరికి "షడ్భావవికారాలు" తప్పక కలుగుతాయి. 1. తల్లి గర్భంలో ప్రవేశించుట (అస్తి) 2. జన్మించుట (జాయతే) 3. మారుట (పరిణమతే), 4. పెరుగుట (వివర్ధతే), 5. కృశించుట (అపక్షీయతే) 6. నశించుట (వినశ్యతి) అనే ఆరు వికారాలు (మార్పులు) ప్రతి జీవికి తప్పవు.

ఈ ఆరు వికారాలు కాలానుగుణంగా కలుగుతాయి. "కాలానికే", "నియతి", "స్వభావము" అనే పేర్లు ఉన్నాయి. ఈ "కాలము", "నియతి", "స్వభావము" అనేవి "ఈశ్వరునికి" పర్యాయపదాలు అని "శ్వేతాశ్వతరము" అనే ఉపనిషత్తు వివరిస్తుంది.

వాలి తన జీవిత కాలంలో ప్రధానంగా "అర్థ", "కామ" పరవశుడై కొన్ని చెడు కర్మలను చేశాడు. ఫలితంగా నా బాణపు దెబ్బకు నేలకొరిగాడు. ప్రాయశ్చిత్తము వలన పాపము అడుగంటుతుంది. నా బాణా ఘాతమువలన వాలి పాప విముక్తుడయ్యాడు.

మహారాజుగా ఉన్నప్పుడు వాలి ప్రజల అవసరాలను తీర్చి కొన్ని ధర్మకార్యాలను అనుష్ఠించాడు. ఆయన జీవితములో శత్రువుల వలన అపజయము ఎరుగడు. చివర సమరంలో కూడ వీర మరణాన్ని పొందాడు. కాబట్టి స్వర్గానికి వెళ్లి సద్గతిని పొందాడు.

సద్గతిని అందినవారి గురించి శోకించడం ఉచితం కాదు. అందువలన దుఃఖాన్ని దిగమింగుకొని వాలికి సద్గతిని కలిగించేదహన సంస్కారాల గురించి ఆలోచించండి.

సుగ్రీవా! నీవిప్పుడు మీ కుటుంబానికి పెద్ద వాడివి. నీ అన్నమరణాన్ని గురించి విచారించడం మాని, దీనుడైన అంగదుని అక్కున జేర్చుకొని, ఆయనను ఓదార్చి, అయన ద్వారా వాలికి మహారాజోచిత దహన సంస్కారాలను నెరవేర్చు" మని ప్రబోధించాడు.

రామాజ్ఞతో తక్షణమే వాలి శవవహనం కొరకు అత్యంత సుందర శిల్పాలంకృతమైన శిబిక (పల్లకి) సిద్ధమైంది. అందులో ఒక సుఖాస్తరణంపై వాలి శవము ఉంచబడింది. ఆ శవ సమక్షంలో విరివిగా రత్నదానం జరిగింది. ఆశిబికను ఒక కొండవాగు దగ్గర దించారు. ఇసుకు తిన్నెలపై శవానికి దింపుడు కల్లము జరిగింది. తార మొదలైన వానరాంగనలు ఆ శవముపై పడి అమితంగా దుఃఖించారు.

శిబికనుండి వాలి శవాన్ని చితిపై చేర్చారు. అంగదుడు ఆ చితిచుట్టూ కుడి నుండి ఎడుమ వైపుకు (అప్రదక్షిణంగా) నీటి కుండతో మూడు సార్లు తిరిగాడు. శవానికి అగ్ని సంస్కారము జరిగింది. నీటి కుండ పగలడంతో వాలి ఆత్మ తృప్తి చెందింది. వాలితో శరీర సంబంధము అంతమైంది. అంగదుడు, సుగ్రీవాదులు కొండవాగుకు వెళ్లి ధర్మోదకాలు (జలతర్పణాలు) వదిలారు.

మన సనాతన ఆర్ష సిద్ధాంత ప్రకారము శరీరాత్మలు వేరు. శరీరంలోకి ఆత్మ ప్రవేశించడం "జన్మ" అని. శరీరం నుండి ఆత్మ వెళ్ళి పోవడం "మరణమని" అన బడుతాయి.

ఈ శరీరం నుండి వేరైన ఆత్మకు తాపం తొలగాలి అంటే శరీర సంబంధులందరు ధర్మోదకాలు వదలుతారు. కర్తలు వాసోదకాలను కూడ వదులుతారు. అటువంటి సలిల క్రియల ద్వారా అంతవరకు శరీరంలో ఉన్న ఆత్మ తృప్తితో ఉత్తమ లోకాలకు వెళ్లుతుంది. ఇది కనీస అంతిమ సంస్కారము.

--- ఇతిశం ---

"ఎవరికెప్పుడు ఏది జరుగాలో
అంతా విధి వ్రాసే ఉంటాడు.
జరుగవలసిన దానిని జరుగకుండా ఆపడం
ఎవ్వరి తరము కాదు"

# 21. సుగ్రీవ పట్టాభిషేకము

మహర్షులు బ్రహ్మను సేవించినట్లు, వాలికి అంత్యక్రియలు జరిగిన తరువాత వానర వీరులందరు శ్రీరాముని చుట్టు చేరి, ఆయనకు నమస్కరించారు.

అప్పుడు వానర ప్రముఖుడు, వాయుపుత్రుడైన హనుమ చేతులు కట్టుకొని, "ప్రభూ! నీవు అనుమతిస్తే సుగ్రీవుడు కిష్కింధానగరానికి వెళ్లి మంగళ స్నానము చేసి వచ్చి, సుగంధ ద్రవ్యాలతో, ఓషధులతో, పుష్పాలతో, రత్నాలతో పూజించి, మిమ్మల్ని నగరానికి తీసికవెళ్లి, మీ అధ్వర్యంలో పట్టాభిషిక్తుడై వానర రాజ్యాధిపత్యాన్ని స్వీకరిస్తాడని" నివేదించాడు.

శ్రీరాముడు చిరునవ్వుతో "హనుమ! మా తండ్రి గారి నిర్దేశం వలన పదునాల్గేండ్ల వనవాసంతోనే మేము గడుపుకోవాలి. అందువలన మేము నరగంలోకి ప్రవేశింపజాలము.

అందువలన మీరు అందరు అందమైన గిరి గుహలోనికి వెళ్లి వానర శ్రేష్ఠుడైన సుగ్రీవునికి మహావైభవంతో పట్టాభిషేకాన్ని జరిపించండి" అని తెలిపాడు.

ఆయన సుగ్రీవునివైపు తిరిగి, "సూర్యనందనా! మీ అన్న కుమారుడైన అంగదుడు తండ్రితో సమానమైన బలం కలవాడు. మరణించిన మీ అన్న వాలి, జీవించి ఉన్న తార సంతోషించే విధంగా అంగదునికి యౌవరాజ్య పట్టాభిషేకము జరుపు. దానివలన వానరులందరు హర్షించడమే కాకుండా, అంగదుడుకూడ యావజ్జీవము నీకు విధేయుడుగా ఉంటాడు.

ఇప్పుడు వర్షాకాలము మొదలైంది. ఈ నాలుగు నెలలు సకల రాజ్య భోగాలను, సర్వ విధ సౌఖ్యాలను అనుభవించు. ఈ సమయం యుద్ధ సన్నాహాలకు అనుకూలంగా ఉండదు. అందువలన కార్తీకమాసం ప్రారంభం కాగానే సీతాన్వేషణ ప్రయత్నాన్ని ప్రారింభించు.

నేను, నా తమ్ముడు లక్ష్మణుడు ఈ పర్వత గుహలో ఈ నాలుగు నెలలు గడుపుతాము. ఈ ప్రాంతము జలరామణీయకత్వంతో, స్థల రామణీయకత్వంతో మాకు సకల సౌకర్యాలను కలిగి ఉంది.

కాబట్టి నీవు, నీ సచివులు, నీ ప్రజలు అందరు కిష్కింధా నగరానికి వెళ్లి మీ దైనందిన జీవితాన్ని గడుపుకొండి" అని సుగ్రీవాదులకు వీడ్కోలు తెలిపాడు.

మహర్షులు, మరుత్తులు, వసువులు, ఇతర సురులందరు అమరావతిలో అమరేంద్రునికి పట్టాభిషేకం జరిపినంత వైభవంతో, సుగ్రీవ మహారాజ పట్టాభిషేకం జరుపాలని కిష్కింధకు చేరిన వానర వీరులందరు నిర్ణయించుకొన్నారు.

అంతః పురం నుండి మంగళ స్నాతుడై సభాభవనానికి అరుదెంచిన వానరేంద్రునికి సువర్ణ శలాకలు కల శ్వేత ఛత్రాన్ని పట్టారు. సువర్ణ దండాలంకృతాలైన చామరాలతో వానరాంగనలు విసరసాగారు.

తెల్లని వస్త్రాలను, తెల్లని చందనాన్ని, రత్నాలను, సుఫలాలను పరిమళ సుమాలను, ఓషధులను, అక్షతలను, బంగారును, కుంకుమ పూవును, తేనెను, నేయిని, వ్యాఘ్రచర్మాన్ని, వరాహచర్మ పాదుకలను సమకూర్చారు. గోరోచనముతో, మనశ్శిలతో ఆయన దేహానికి లేపనం కావించారు. పదహారు మంది కన్యలు పవిత్ర జలాలతో, ఓషధులతో సుగ్రీవుని అభిషేకించడానికి సిద్ధంగా ఉన్నారు.

మంత్ర విదులైన బ్రాహ్మణోత్తములు వేదికను సిద్ధంచేసి, దర్భలను పరచి, హోమ కుండాన్ని నిర్మించి, అందులో అగ్నిని ప్రజ్వలింపజేసి సకల దేవతలకు ప్రీతికరంగా హవిస్సులను అర్పించారు.

బంగారుపాద పీఠంగల సింహాసనంపై ఒక మహాస్తరణాన్ని పరచి అందులో సుగ్రీవుని ఆసీనుని కావించి. బ్రాహ్మణోత్తములు, కన్యకలు, వానర వీరులు పరిమళ భరితములైన ప్రసన్నములైన పుణ్యనదీ జలాలతో, ఓషధులతో ఆయనను అభిషేకించారు.

అక్కడ చేరిన వానరులందరు ఆ శుభసమయంలో జయజయ ధ్వానాల కావించారు.

ఆ తరువాత రామభద్రుని ఆనతిని అనుసరించి, ప్రేమ పూర్వకముగా సుగ్రీవుడు అంగదునికి యౌవరాజ్య పట్టాభిషేకం స్వయంగా జరిపాడు. రామచంద్రుని హితబుద్ధికి, దీర్ఘ దృష్టికి, సుగ్రీవుని ఔదార్యానికి వానర వీరులందరు మనః పూర్వకంగా ఆనందించారు. కిష్కింధా నగరమంతా ఆనందంతో కోలాహలాన్ని సంతరించుకొంది.

సుగ్రీవుడు వెంటనే శ్రీరామ చంద్ర స్వామిని సేవించి, పట్టాభిషేక విషయాలన్ని ఆ ప్రభువుకు నివేదించాడు.

ఆవిధంగా శ్రీరామ చంద్రస్వామి కృపావిశేషంతో సుగ్రీవుడు రుమను, వానర రాజ్యాన్ని స్వీకరించి మహారాజు అయ్యాడు.

మన సంప్రదాయంలో మహారాజు అనే బిరుదు జటాయువుకు సుగ్రీవునికి ఇద్దరికి మాత్రమే ఉంది.

--- ఇతిశం---

# 22. వర్షకాల జీవనము

సుగ్రీవుని పట్టాభిషేకం తరువాత శ్రీరాముడు సౌమిత్రితో కూడ వర్షకాలము నాలుగు నెలలు మాల్యవత్పర్వతముపై సీతా విరహంతో గడిపాడు. ఆ పర్వతముపై అనేకములైన అడవి జంతువులు ఉన్నాయి. వెండివలె తెల్లగా మెరుస్తుండే స్వచ్ఛ జలాలు, జలధారలు ఉన్నాయి.

శ్రీరాముడు సోదరునితో ఆ పర్వత సౌందర్యాన్ని ప్రశంసించాడు. పర్వతంపై ఉన్న సరస్సులతో సరోజాలు వికసిత వదనాలతో సూర్యోదయంకాగానే స్వాగతాలు పలుకుతాయి. అనేక జలజంతువులు నీటిలో విహరిస్తూ కనులకు పండుగ చేస్తాయి.

ఆ పర్వతానికి దగ్గరలోనే ఉన్న కిష్కింధానగరంలోని గీత వాద్య ధ్వనులు రామలక్ష్మణులకు వినవస్తున్నాయి. ఒకవైపు సుగ్రీవుడు మత్తు పానీయాల మధ్య మదవతుల కౌగిళ్లలో సుఖసాగరంలో తేలియాడుతుంటే, మరొక వైపు ఆయనకు దగ్గరలోని ప్రస్రవణ పర్వతముపై సీతావియోగ దుఃఖసముద్రములో రాజకుమారులైన రామలక్ష్మణులు నిండా మునిగి ఉన్నారు. ఆ సుఖసాగరానికి ఈ దుఃఖసముద్రానికి మధ్య దూరం ఎంతో లేదు. ఇదే విధాత సృష్టిలోని వైచిత్రి.

రాముడు సీతావిరహ శోకంతో ఏమయిపోతాడో అన్న బెంగతో అనురాగ సంపన్నుడైన రామానుజుడు అన్నగారిని అనేక విధాల అనునయిస్తూ ఆయన శోకాన్ని కొంతవరకైనా ఉపశమింపజేయడానికి ప్రయత్నించాడు.

అయినా సీతావిరహవేదనను ఆవర్షకాలము మరింత రామునిలో అధికం చేయసాగింది. కొంత సంయమనంతో, మరికొంత విరహ వ్యధతో రామచంద్రుడు అనుజునికి ఆ వర్షకాల సన్నివేశాలు వివరించాడు.

"లక్ష్మణా! భాస్కరుడనే భర్త సముద్రజలాలను తన వాడి కిరణాలతో పీల్చి, ఆ వీర్యజలాలను ఆకాశ వనితాగర్భంలో నింపుతాడు. ఆ ఆకాశాంగన ఆ వీర్యజలాలను నవమాసాలు మోసి, వర్షర్తువులో ప్రసవకాలం రాగానే సుమధురంగా వర్షిస్తుంది.

బారులు తీరిన మేఘాలు ఆకాశానికి మెట్లవలె ఉన్నాయి. భూమిపై సుందరంగా నిలిచిన సుమ్మ తరువులు చేతులనిండా పూలను గ్రహించి మేఘాల మెట్ల ద్వారా ఆకాశాన్ని అధిరోహించి ఆకాశ దీపమైన సూర్యనారాయణుని పాదాలను పూజించడానికా అన్నట్లు తమకంతో తలలెత్తిచూస్తున్నాయి. సంధ్యాసమయంలో అస్తమించే ఆదిత్యుని అరుణ

కిరణాలు సజల జలదాలలో ప్రవేశించి నలుపుదనంతో పాటు ఎఱ్ఱదనాన్ని ప్రకాశింప జేస్తున్నాయి. మరొకవైపు ఆకాశంలో మరికొన్ని మేఘాలు పూర్తిగా వర్షించి, జలశూన్యత వలన వెల వెల బోతూ తెల్లబారుతున్నాయి. ఈ రెండు రకాల సన్నివేశాలను కలిపి చూస్తే, ఆకాశానికి పుండు ఏర్పడినందువలన దానికి నలుపు, తెలుపు రంగుల కొనలు గల వస్త్రంతో పుండు రక్తముపై కట్టు కట్టినట్లుగా ఉందని రామచంద్రుని ద్వారా వాల్మీకి కవీంద్రుడు మనోజ్ఞంగా కనులకు కట్టినట్లుగా వర్ణించాడు. ఈ భావన ఆధునికులైన దిగంబర కవులకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

మధ్య మధ్యలో గాలులు వీస్తున్నాయి. అవి ఆకాశమనే కాముకుడు ప్రియా విరహంతో వదిలే నిట్టూర్పులను తలపిస్తున్నాయి. సంధ్యాకాంతులు విరహ తాపశమనానికై ఆకాశ ప్రియుడు తన మేనుకు అలదుకొన్న ఎఱ్ఱచందనాన్ని స్ఫురింపజేస్తున్నాయి. ప్రియా విరహ వేదనతో తెల్లబడిన ఆకాశ పురుషుని శరీరంవలె తెల్లని మబ్బులు తేలి ఆడుతున్నాయి".

రామభద్రుడు ఆ వర్షర్తువువలన సీతాదేవికి కలిగే విరహ బాధను సౌమిత్రికి వివరించాడు.

"సోదరా! గ్రీష్మర్తువులోని దుర్భరమైన వేడిని అంతా అనుభవించిన భూమి వర్షకాలంలో తడిసి ఆవిర్లను వదలుతుంది. అదేవిధంగా నా నుండి వేరయి దూరమైన నా సీత దుర్భరమైన విరహాగ్నికి వేగిపోతూ వేడినిట్టూర్పులను వదలుతూ కనుల నిండా కన్నీరును కారుస్తు ఉంటుంది.

ఈ మాల్యవత్పర్వత రాజము అర్జునాది అనేక పుష్పాలను ధరించి మొగిలి పూల వాసనలతో గుబాళిస్తూ, వర్షధారలకు తడుస్తూ తాపము తగ్గి ఉంది. అలాగే సుగ్రీవ మహారాజు కూడ వాలి వధతో తాపము తగ్గి, అనేక పుష్పమాలాలంకృతుడై అంగనామణుల ఆలింగనాదులతో చందనాదుల అనులేపనంతో, అభిషేకధారలవలన తాపరహితుడై ఉన్నాడు.

ఆకాశంలో నల్లని మేఘాల మధ్య తళుక్కుమని మెరసిన మెరుపుకాంత, రావణాసురుని బలమైన నల్లని బాహువుల మధ్య బంధింపబడిన సీతాదేవిని స్ఫురింపజేస్తుంది.

మేఘాల నుండి మెల్లగా వచ్చే చల్లనిగాలులు సరస్సులలోని పద్మాలపై నుండి వీస్తూ వాటి పరిమళాలను కూడ మోసుకవస్తున్నాయి. అట్టి శీతల పరిమళ మిళిత మందవాయువులు తాపార్తులకు దోసిళ్లతో త్రాగడానికి అనువైనవా అన్నట్లు ఉన్నాయి.

ఇక్కడ ఒక చమత్కార భావము ఉంది. సహజంగా గాలులలోని చల్లదనము చర్మానికి, సువాసనలు నాసికకు హాయినిస్తాయి. అలాగే సరస సుమధుర జలాలు దోసిళ్ళతో

త్రాగడానికి అనువుగా ఉంటాయి. కాని శీతల చందన వాయువులు త్రాగబడవు కదా!

సీతా విరహ తాపము అధికమై శ్రీరాముని మదిలో ఒక అవయవ కార్యాన్ని మరొక అవయము నిర్వహిస్తున్న భావనను కలిగించి ఉంటుంది.

అయితే "తాం స్పృష్ట్వా, మామపిస్పృశ" అన్నట్లు ఆ గాలులు సీతాదేవి మేనును స్పృశించి, తనను తాకుతున్నాయనే భావనలో శ్రీరామభద్రుడు ఉన్నాడు. కనుక వాటి ద్వారా సీతాదేవి శరీరాన్ని స్పృశించిన ఒక మధురానుభూతి శ్రీరామచంద్రుని సర్వావయవాలకు సంపూర్ణ తృప్తిని ఇచ్చి ఉంటుంది. ఈ భావనా సౌందర్యము కేవలము విరహులైన ప్రియాప్రియులకు అనుభవైక వేద్యము.

వర్షకాలంలో పర్వతాలు మేఘావృతాలై క్రిందికి జాలువారే సెలఏళ్లను కలిగి ఉంటాయి. అవి నల్లని జింక చర్మాన్ని తెల్లని యజ్ఞోపవీతాన్ని ధరించిన బ్రాహ్మణులను గుర్తుకు తెస్తాయి.

ఆ పర్వత గుహలలో నుండి వెలువడే వాయువులు బ్రాహ్మణులు చేస్తుండే వేదనాదాలను స్ఫురింపజేస్తాయి.

వర్షకాలంలో మేఘావృత ఆకాశంలో తారా చంద్రుల ప్రకాశం ఉండదు. కనుక ఆ సమయంలో ప్రియులను రహస్యంగా కలుసుకోవడానికి వెళ్లే అభిసారికలకు అనుకూలంగా ఉంటుంది.

కొండచరియలపైన పూచిన కుటజ కుసుమాలపై నీటి ఆవిరి కప్పి ఉంటుంది. అది ప్రియా సమాగమంతో పరిపూర్ణ తృప్తిని పొంది, అది ఉన్మస్తకమై కళ్లలో ఆనందబాష్పాలు స్రవిస్తున్న కాముకుని ముఖకమలాన్ని స్ఫురింపజేస్తుంది.

వర్షఋతువులో రజస్సు (ధూళి) పైకి లేవదు. వేసవి కాలంలో అనుభవించిన తాపము తగ్గి పోతుంది. ఆ సన్నివేశము భగవత్కటాక్ష పాత్రుల మనస్సు స్థితికి నిదర్శనంగా నిలుస్తుంది. భగవత్కృపా పాత్రుల మనస్సులలో రజస్తమోగుణాలు పూర్తి తగ్గి సత్వగుణము ప్రవృద్ధమవుతుంది. చలికాలము వేసవి కాలాల్లో ఉద్యోగ నిమిత్తము అన్యస్థలాలకు వెళ్లిన ప్రియులు వర్షకాలంలో రహదారులు జలమయాలై రాకపోకలు లేనందున తమ ఇండ్లలోనే ఉండి ప్రియకాంతా సంగమంతో హర్షపరవశులై ఉంటారు.

అలాగే భగవదనుగ్రహ వర్షానికి పాత్రులైన వారు బాధామయ సంసార తాపముల నుండి, భగవద్విరహతాపము నుండి విముక్తులై పరమపదములో నిత్యముక్తులతో సమానంగా శాశ్వతంగా భగవదానందానుభవ పూర్ణులై హర్షపరవశులై ఉంటారు.

వేసవిలో జ్వరాది శరీర తాపాలు, బంధువులకు సంభవించే ప్రమాదాలవలన కలిగే మానసిక తాపాలు, తుఫానులు, భూకంపాదుల వలన అధి దైవిక తాపాలు కలుగుతాయి. వర్ష కాలములో అవి తొలగిపోతాయి. అలాగే భగవద్దయా వృష్టికి పాత్రులైనవారికి అధి భౌతిక, అధ్యాత్మిక, అధి దైవికములనే తాపత్రయాలు తొలిగిపోతాయి.

వర్షర్తువులో నదుల జలాలు కలుషితాలవుతాయి. కనుక గంగాది దివ్యనదులలో విహరించే రాజహంసలు ఆ నాలుగు నెలలు నిర్మలమైన మానస సరోవరములో విహరిస్తాయి.

అలాగే సంవత్సరంలో ఎనిమిది నెలలు సంసార కలుషిత వాతావరణాన్ని అనుభవించిన సన్యాసులు (పరమహంసలు) వర్షర్తువులోని నాలుగు నెలలు ఎక్కడికి ప్రయాణాలు చేయకుండా తమ ఆశ్రమాలలోనో, లేక అన్య పవిత్ర స్థలాలోనో "చాతుర్మాస్యవ్రతం" నిర్వహించి భగవద్విషయమానస సరోవరాలలో తన్మయ విహారం చేస్తారు.

ఆకాశంలో ఒకచోట మబ్బులు కమ్మి నల్లగా ఉంటుంది. ఇంకొకచోట మేఘాలు లేక తెల్లగా ఉంటుంది. అప్పుడు ఆ ఆకాశము నిస్తరంగ సముద్రమువలె అగుపడుతుంది.

ఆచార్యానుగ్రహంతో సంపూర్ణంగా బ్రహ్మజ్ఞానం కలుగని వాని మనస్సులో కొంత అజ్ఞానాంధకారము, కొంతశాస్త్రజ్ఞాన నైర్మల్యము కలిగి బ్రహ్మ స్వరూపము స్పష్టాస్పష్టముగా ప్రకాశిస్తుంది. పూర్తి చీకటి కాదు. పూర్తి వెలుతురు కాక మసక మసకగా ఉన్నట్లు బ్రహ్మజ్ఞానము సుస్పష్టంగా భాసించదు.

సర్పపుష్పాలతో, కదంబ కుసుమాలతో కూడ నదులు ఎరుపు రంగుతో పారుతున్నాయి. గైరికాది ధాతువులు కలువడం వలన వివిధ వర్ణములతో (రంగులతో) ప్రవహిస్తున్న నదీజలాలు భగవంతుని స్తుతించే సత్వరజస్తమోగుణాలను కల్గిన భక్తుల మనస్సులవలె ఉన్నాయి.

తుమ్మెదలు బారులు తీరినట్లు బాగా పండిన నల్లని అల్లనేరేడు పండ్లు పర్వతాలపై ప్రకాశిస్తున్నాయి. పండిన పసుపురంగు మామిడి పండ్లు గాలికి నేలపై పడుతున్నాయి. కొంగల బారులు మెరుపు జండాలవలె వినువీధులలో విహరిస్తున్నాయి. నెమిళ్ళు క్రేంకార ధ్వనులతో నాట్యం చేస్తున్నాయి. వనాలన్ని ఆకుపచ్చ మొదలైన వర్ణాలను ఆవహించుకొన్నాయి.

ఈ సన్నివేశాలను సందర్శిస్తే శ్రీ శ్రియఃపతులు తమకృపావర్షంతోవన్యాల ద్వారా అర్థ కామాలను పరిపూర్ణంగా అనుభవిస్తూ లోకాలన్ని ఆనందమయాలు కావాలని సంకల్పించినట్లు అనిపిస్తుంది.

తెల్లని కొంగలు బారులు తీరి పర్వత శిఖరాలపై అప్పుడప్పుడు ఆగుతూ పయనిస్తుంటే తమ కడుపులలోని పరమాత్మకు శ్రమ కలుగకుండా తమ కడుపులు చేతులతో పట్టుకొని భక్తులు నెమ్మదిగా వెళ్లుతున్నట్లుంది.

పచ్చిక బయళ్లపై ఆకు పురుగులున్నాయి. అప్పుడానేల ఎఱ్ఱని పూలను కల్గిన పచ్చని చీరను భూదేవి ధరించినట్లుగా అందంగా ఉంది. అంతేకాదు భగవదనురాగముతో నిండిన భక్తుని హృదయమువలె ఉంది.

మేఘాలు ఉరుములతో, మెరుపులతో సాగిపోతున్నాయి. వాటిని చూస్తే తెల్లని జండాలను ధరించి ఘీంకార రవాలను చేస్తూ సమర రంగానికి వెళ్లుతున్న గజబలము కనుల ముందు నిలుస్తుంది.

ఆ వనంలో లయబద్ధంగా గాలివీచి సంగీతము వినవస్తుంది. తుమ్మెదలు వీణలను మీటుతున్నట్లు, కప్పలు తాళాలు వేస్తున్నట్లు, మేఘాలు మద్దెలను వాయిస్తున్నట్లు ఉంది. .... పర్వత శిఖరాలనుండి జాలువారే సెలయేళ్లు ప్రియసమ్మర్దంవలన అప్సరసల మెడలనుండి తెగి జారిపడే ముత్యాల హారాలవలె ఉన్నాయి.

ఒకవైపు మహా గంభీరంగా మేఘాలు ఉరుముతుంటే, ఆ సవాలును స్వీకరిస్తున్నాయా అన్నట్లు మదగజాలు ఘీంకరిస్తున్నాయి.

వర్షాలు కురిసే వేళలలో మాతంగాలు మత్తిల్లి ఉంటాయి. సింహాలు గిరి గుహలలో నిద్రిస్తుంటాయి. వృషభాలు హర్షపరవశమై ఉంటాయి. రాజధానిలో, నగరాలలో, గ్రామాలలో యుద్ధాలులేక రాజులు, ప్రజలు విశ్రాంతి సౌఖ్యాలలో మునిగితేలుతు ఉంటారు.

వర్ష ఋతువులలో సూర్యుని ఉదయాస్తమయాలు స్పష్టంగా కనపడవు. సూర్యుడు కనిపించకుండా మేఘాలు కమ్ముకొన్న రోజులను "దుర్దినాలు" అంటారు. "మేఘఛన్నే2హ్ని దుర్దినం". అప్పుడు జనులకు దివారాత్రాలను గుర్తించడం కష్టమవుతుంది. అప్పుడు ప్రకృతే మానవులకు సూర్యోదయాస్తమయాలను గుర్తించడానికి తోడ్పడుతుందట.

**"నిలీయమానైః విహగైః నిమీలద్భిశ్చ పంకజైః**
**వికసంత్యా చ మాలత్యా గతో2స్తం జ్ఞాయతే రవిః"**

పక్షులు తమ గూళ్లకు తిరిగి వస్తాయి. కమల పుష్పాలు ముడచుకొంటాయి. మాలతీ కుసుమాలు వికసిస్తాయి. వీటి ద్వారా సూర్యుడు అస్తమిస్తున్నాడని తెలుసుకోవచ్చు.

చూచారా అందమైన" స్వభావోక్తి" అలంకారముతో చమత్కారంగా సూర్యాస్తమయాన్ని సూచిస్తున్నాడు వాల్మీకి సహజ కవీంద్రుడు.

వర్షకాలంలో జలప్రవాహాలు అధికమై, మిట్టపల్లాలు నశించి భూమి అంతా సమమవుతుంది. మార్గాలు జలమయాలు కావడం వలన ఈ నాలుగు నెలలు రాజుల మనస్సులు కూడ వైర భావాలను వీడి ఉంటాయట.

"వైరాణిచైవ మార్గాని సలిలేన సమీకృతాః" ఎంత చక్కని ఉపమ.

కవి అంటే వాల్మీకే. కావ్యమంటే శ్రీరామాయణమే. మిగిలిన కవులు, మిగిలిన కావ్యాలు తరువాత సంఖ్యను పూరించడానికే.

ఒక్క వర్షఋతువును ఎన్నెన్ని విధాలుగా ఎంతమనోజ్ఞంగా చిత్రీకరించాడు వాల్మీకి మహానుభావుడు! ఆయన కావ్య శిల్పము అసదృశము, ఆయన భావనా శక్తి అద్వితీయము. కాళిదాసాది తదనంతర కవి వరేణ్యులకు మార్గదర్శకమై, స్ఫూర్తినిచ్చింది వాల్మీకి కవీంద్రుని భావనాసౌందర్యమే,

అర్థసౌందర్యానికే కాదు శబ్ద చమత్కృతికి కూడ వాల్మీకి మునీంద్రుడు తదనంతర కవులకు ఆదర్శమే.

"నిద్రాశనైః కేశవ మభ్యుపైతి। ద్రుతం నదీసాగర మభ్యుపైతి

హృష్టా బలాకా ఘనమభ్యుపైతి। కాంతా సకామాప్రియమభ్యుపైతి"

"అభ్యుపైతి అంటే చేరుకొంటుంది" అని అర్థము.

ఒకే "అభ్యుపైతి" అనే శబ్దాన్ని వేర్వేరు సందర్భాలలో ఎంత సుందరంగా వాల్మీకి మహాకవి ప్రయోగించాడో చూడండి.

ఆషాఢమాసంలో తొలి ఏకాదశి వస్తుంది. దానినే "శయనైకాదశి" అంటారు. ఆనాడు శ్రీమహావిష్ణువు నిద్రకు ఉపక్రమిస్తాడు. వాల్మీకి మాటలలో "నిద్రాదేవి మెల్లగాకేశవుని చేరుకొంటుంది' అలాగే వేగంగా ప్రవహిస్తు నది సముద్రుని చేరుకొంటుంది. సంతోషంతో కొంగల బారు మేఘాన్ని చేరుకొంటుంది. కామం కలిగిన కాంత ప్రియుని చేరుకొంటుంది.

చేరుకోవడమనే ఒకే క్రియా పదాన్ని సందర్భమును బట్టి ఎంత అందంగా ప్రయోగించాడో చూచాము కదా.

ఇక అనేక క్రియా పదాలను ముందు రెండు చరణాలలో ప్రయోగించి, వాటికి తగిన కర్తృపదలను తరువాత రెండు చరణాలలో క్రమాలంకారంతో ఎంత అందంగా సమకూర్చాడో గమనిద్దాము.

**"వహంతి, వర్షంతి, నదంతి, భాంతి, ధ్యాయంతి, నృత్యంతి, సమాశ్వసంతి**
**నద్యో, ఘనాః, మత్త గజాః, వనాంతాః, ప్రియావిహీనాః, శిఖినః, ప్లవంగాః"**

మూడు, నాల్గు చరణాలలోని కర్తృ పదాలను, మొదటి రెండు చరణాలలోని క్రియా పదాలతో కలుపుతే –

1) నద్యః వహంతి = నదులు ప్రవహిస్తున్నాయి;

2) ఘనాః వర్షంతి = మేఘాలు వర్షిస్తున్నాయి;

3) మత్తగజాః నదంతి = మదగజాలు ఘీంకరిస్తున్నాయి;

4) వనాంతాః భాంతి = అడవి ప్రదేశాలు ప్రకాశిస్తున్నాయి.

5) ప్రియావిహీనాః ధ్యాయంతి = ప్రియురాళ్లకు దూరంగా ఉన్న వారు వారిని స్మరించుకొంటున్నారు.

6) శిఖినః నృత్యంతి = నెమిళ్లు నాట్యము చేస్తున్నాయి.

7) ప్లవంగాః సమాశ్వసంతి = భూమిపైననే పండ్లు కావలసినన్ని పడి ఉండుటచే కోతులు ఉన్నచోటనే ఉంటున్నాయి.

స్థాలీపులాక న్యాయంగా (అన్నము ఉడికందని ఒక మెతుకును పట్టి చూచినట్లు) వాల్మీకి కవీంద్రుని శబ్దార్థాలంకారాల ప్రయోగ సౌందర్యాలను సందర్శించాము కదా! ఇక ఆమహనీయుని కవితా సౌందర్యానికి అంజలి ఘటించి మళ్లీ రామకథా స్రవంతిలో అడుగిడుదామా!

ఆ సమయంలో శ్రీరాముని మదిలో అయోధ్యాపురము మెదిలింది. సరయూనదిలో జలాలు పొంగి పొరలి పోతుంటాయి. అలాగే వనవాసానంతరము తాను అయోధ్యా నగరానికి వెళ్లగానే తనను సేవించాలని అయోధ్యాపౌరులు ముందుగా నేనంటేనేనని "అహమహమికతో" పై బడుతారని రామభద్రుదు భావించాడు. సరయూ జలాలను పౌరులు కోరికలకు ప్రతీకలుగా స్వామి సంభావించాడు.

ఒకే వర్షకాలము సుగ్రీవుని జీవితంలో, తన జీవితంలో ఎంత మార్పును కలిగించింది? ఎంత అగాధాన్ని సృష్టించింది! సుగ్రీవునికి వాలి అనే ప్రబల శత్రువు హతమయ్యాడు. రాజ్యము స్వాధీనమైంది. తన భార్య రుమతో పాటు తార కూడ తనభార్య అయింది. సకల భోగ భాగ్యాలు లభించాయి. రాజ్యలాభంతో మత్తుపానీయాలతో, మదవతుల కౌగిళ్లలో సుగ్రీవుడు సంతోష సాగరంలో మునిగి తేలుతున్నాడు. తార సుగ్రీవుని చేపట్టడానికి కారణాలు మూడు.

1. సుగ్రీవుని బుద్ధిబలము 2. అంగదుని యువరాజ్యపట్టాభిషేకము 3. సుగ్రీవుని నీతిమంతమైన రాజ్యపాలన.

శ్రీరాముని జీవిత మార్గంలో కూడ కొంత వెలుగు కనబడింది. జటాయువు వలన తన భార్యాపహర్త రావణాసురుడని తెలిసింది. కబంధుని సూచన మేరకు తమకు సీతాన్వేషణలో తోడ్పడే సుగ్రీవుని స్నేహము లభించింది. ఆయన శత్రువును వధించి, భార్యా రాజ్య లాభాలను తాను కలిగించాడు.

సుగ్రీవుడు యావజ్జీవము తనకు కృతజ్ఞుడుగా తప్పక ఉండి సహాయము కావిస్తాడు. ఒకవేళ ఆయన దారి తప్పినా ఆయనను త్రోవలోకి తెచ్చుకోవడం తనకు కష్టము కాదు.

అయితే తక్షణమే సీతాన్వేషణకు పూనుకొమ్మని తాను సుగ్రీవుని తొందర పెట్టలేదు. దానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి నిరంతర వర్షధారలతో నేల అంతా జలమయమై ప్రయాణాలకు అవరోధంగా ఉంది.

రెండవది సుదీర్ఘ వియోగం తరువాత సుగ్రీవునికి భార్యా రాజ్యాలు తిరిగి లభించాయి. వాటి అనుభవానందంలో ఆయన మునిగి ఉన్నాడు. సుగ్రీవుని ఆనందం తనకు అసూయాదాయకం కాదు. ఆయనకు ఆ సౌఖ్యాన్ని తానే ప్రసాదించాడు. ఇప్పుడు మధ్యలో దానిని నిలుపుచేయడం న్యాయం కాదు. అందువలన వర్ష కాలము నాలుగు నెలలు సుగ్రీవునికి ఆనందాన్ని అనుభవించే అవకాశాన్ని ఇచ్చి, ఆ తరువాతే సీతాన్వేషణ ప్రయత్నం విషయంలో సుగ్రీవుని మందలించాలని శ్రీరామ చంద్రుడు నిర్ణయించు కొన్నాడు. లక్ష్మణుడు కూడ అన్నగారి అభిప్రాయాన్ని బలపరిచాడు.

--- ఇతిశం ----

# 23. హనుమ నివేదనము

వర్షకాలము గడచిపోయింది. ఆకాశమ్ము మేఘ వినిర్ముక్తమైంది. శరదృతువు రానే వచ్చింది. ఉదయము సూర్యప్రకాశంతో శోభాయమానంగా శరదృతువు ప్రారంభ మయింది.

సుగ్రీవుడు కిష్కింధా గుహా నగరంలో ఇంకా రుమా, తారాది మదవతుల కౌగిళ్లతో కామాసక్తుడై మునిగి తేలుతూనే ఉన్నాడు.

అయితే ఆయన ధర్మార్థ కామాల గూర్చి చక్కగా అవగాహన ఉన్నవాడు. ధర్మార్థాలను నిర్లక్ష్యం చేయడం ఆయన అభిమతం కాదు. ఏ సమయంలో ఏ పని చేయాలో ఆయనకు పూర్తిగా తెలుసు.

కాని చాలా కాలం నుండి ఆయన కామ భోగాలకు దూరంగా ఉన్నాడు. ఇప్పుడు వాలి అడ్డంతొలిగి, రామప్రసాదంగా అవి తనకు అనుకోకుండా లభించాయి. వాటిలో ఆయన తలమునకలై అనుభవిస్తున్నాడు.

సౌందర్యవతి, తన భార్య అయిన రుమతో పాటు, అప్సరసల అందాన్ని తలదన్నే తరుణీ మణి తార కూడ సుగ్రీవుని అభ్యర్థనను మన్నించి, ఆయన అర్ధాంగి అయింది. ఇక సుగ్రీవుని సుఖాభిలాషకు హద్దెక్కడిది? అందువలన ఆయన అహోరాత్రులు అంగనల ఆలింగనా ప్రపంచములోనే తన్మయుడయి ఉండి పోయాడు.

సుగ్రీవుని మనస్సు కూడ నాల్గు నెలల నుండి నిరంతరము కామానుభవముతో నిండిపోయినా దానితో తృప్తి చెందలేదు. ఇంకా ఇంకా ఆ అనుభవం కావాలని మనస్సు ఆరాటపడుతూనే ఉంది.

**"న జాతు కామః కామానాం ఉపభోగేన శామ్యతి"**

ప్రభువు కార్యా కార్య వివేక శూన్యుడై, భోగ ప్రవణుడైనప్పుడు ఆయనకు ప్రాప్త కాలజ్ఞతను కలిగించడం ఆయన అమాత్యుల కర్తవ్యము. అలాగే సుగ్రీవ ప్రభువును అనుక్షణం అనుసరిస్తున్న, ఆయన హితాన్నే అభిలషిస్తున్న హనుమ – తన ప్రభువైన సూర్యనందనుడు దారి మరచాడని భావించాడు. సంతతము కామాసక్తుడై సకాలంలో శ్రీరామచంద్ర ప్రభువునకు కావించిన వాగ్దానాన్ని సుగ్రీవుడు నిలబెట్టుకోకపోతే, ఆయనకు కలుగబోయే అత్యంత భయంకర ప్రమాదాన్ని సూచించాలని అంజనానందనుడు అనుకొన్నాడు. అందువలన హనుమ సుగ్రీవుని అంతఃపురంలోకి ధైర్యంగా అడుగిడాడు.

ఆ ఆనంద సమయంలో హనుమరాక పానకంలో పుడుకలా ఉందని సుగ్రీవుడు విసుగుకొన్నాడు. అయినా హనుమ తనకు అత్యంత ఆప్తుడు. ఆది నుండి తనను నీడలా అనుసరించిన అభిమత మిత్రుడు, తన మనస్సును చక్కగా అర్థం చేసికొన్న వయస్యుడు. అటువంటి హనుమ అకారణంగా తన అంతః పురంలోకి అడుగుపెట్టి తన ఆనందానుభవానికి అడ్డు తగులడు. అత్యవసర కార్యమేదో ఉండి ఆయన వచ్చి ఉంటాడు. అందువలన ఆయన అభిప్రాయాన్ని తప్పక ఆదరించాలని అనుకొన్నాడు. హనుమను ఆయన అనుమతించాడు.

హనుమ తన అభిప్రాయాన్ని నివేదించడం ఆరంభించాడు. "సుగ్రీవ మహాప్రభో! నీవు సర్వజ్ఞుడవు. నీకు చెప్పదగిన వాడను నేను కాదు. నీవు ధర్మార్థ కామాలగురించి, వాటి ఆచరణ ప్రాధాన్యాన్ని ఆద్యంతము అవగతం చేసికొన్నవాడివి. చాలా కాలం తరువాత లభించిన కామభోగాలను అనుభవిస్తున్నావు. అందులో ఎంత మాత్రం తప్పులేదు.

అయితే అదే సమయంలో ధర్మార్థముల గురించి పూర్తిగా మరిచిపోకూడదు కదా! ధర్మార్థ కామాలనే త్రివర్గాలలో ధర్మమే ప్రథమమైనది, ప్రధానమైనది కదా! ధర్మాలన్నిటిలో మిత్ర రక్షణము ప్రముఖమైనది.

శ్రీరామచంద్రుడు నీకు అత్యంత ఆప్త మిత్రుడు. నీతో స్నేహం చేయగానే, తక్షణమే నీవాయనకు ఏ మేలు చేయకున్నా, ఏమేలు చేయడానికి కూడ తగిన పరిస్థితిలో నీవు లేకున్నా, ఆయన అనంత శక్తి సామర్థ్యముల పట్ల నీకు విశ్వాసములేక ఆయన ముందే నీవు నీ అనుమానాన్ని బయటపెట్టినా, సహనంతో మిత్ర ధర్మాన్ని అవలంబించి, నిన్ను ఆదరించి నీ అత్యంత బలసంపన్నుడైన వైరిని వాలిని పరిమార్చి, నిష్కంటకంగా నీవు అనుభవించే ఆనందమంతా ఆయనే ప్రసాదించాడు కదా!

బదులుగా నీ మిత్ర ధర్మాన్ని ఇప్పుడైనా నీవు పాటించాలి కదా! నీ వాగ్దానాన్ని నిలబెట్టుకొనే సమయం ఆసన్నమైంది. ఏ కార్యమైనా సరైన సమయంలో కావిస్తేనే సార్థకమవుతుంది. సమయము అతిక్రమించాక, చేసిన ఏ ప్రబల కార్యమైనా, మిత్రులకు చేసిన ఎంతటి మహోపకారమైనా "గత జలసేతు బంధనము" వలె నిష్ఫలము అవుతుంది. అయినా నీవు సహాయము చేస్తే తప్ప, రాముడు స్వకార్యాన్ని సాధించకోజాలని అసమర్థుడు కాడు. ఆయన సర్వ సమర్థుడు. సురాసురాది సమస్త శత్రుకోటి ఎదురుగా నిలిచినా, ఆ శత్రుకోటినంతటిని క్షణంలో సంహరింపగల క్షాత్రశక్తి పరిపూర్ణుడు శ్రీరాముడు. నిజానికి నీ సహాయము అణువంతైనా అవసరంలేదు అ మహాత్మునికి.

అయితే మిత్రుడిగా నీ అంతట నీవే సీతాదేవి విషయంలో సహాయం చేస్తానని వాగ్దానం చేశావు కదా! తాను చేయవలసిన సహాయాన్ని తక్షణమే చేసి, నీ వాగ్దానాన్ని ఎలా నిలబెట్టుకొంటావో చూద్దామని ఆ మహానుభావుడు సహనంతో నిరీక్షిస్తున్నాడు.

రామభద్రుడు నీ కొసగిన వర్షకాల వ్యవధి పూర్తి అయింది. అందువలన సమస్త భూమండలంలోని సర్వవానరకోటిని తక్షణమే రప్పించి, సీతాన్వేషణ కార్యంలో వాళ్లను నియోగించు. స్వర్గ, మర్త్య పాతాళాది సకల లోకాలలో, సీతాదేవి ఎక్కడ దాచపెట్టబడి ఉన్నా వానర వీరులు ఆమెను తప్పక అన్వేషింపగల్గుతారు. ఈ విషయంలో కృతజ్ఞుడివై తక్షణమే రామభద్రునికి ప్రత్యుపకారం చేయడానికి సిద్ధము కావలసి ఉందని" నివేదించి హనుమ ఊరుకున్నాడు.

సుగ్రీవునికి హనుమ నివేదనము చక్కటి ప్రబోధంగా పనిచేసింది. ఆయన వెంటనే తన సేనాధిపతి అయిన నీలుని పిలిచాడు. పక్షం రోజులలోగా సమస్త వానర వీరులను రప్పించుమని, తన ఆదేశాన్ని అలక్ష్యంచేసిన వారికి మరణ శిక్ష తప్పదని ఆదేశించి, తన ఈ ఆజ్ఞను అంగద జాంబవదాది వానర ప్రముఖులకు తక్షణమే తెలియజేయుమని నియమించాడు.

మితిమీరిన కామము ఒక వ్యసనంగా మారుతుంది. ఆ కామానుభవం ఎంత జరిగినా అది ఇంకా ఇంకా కావాలనిపిస్తుంది. అంతేకాని ఇక చాలు అనిపించదు.

కామము అనేది అగ్నితో పోల్చబడుతుంది. దాని అనుభవాన్ని ఆజ్యంతో పోలుస్తారు. అగ్నికి ఆజ్యం కావాలని దానిని హవనంలో వేస్తారు. అయితే ఆజ్యం పోయగానే అగ్నిచల్లారదు. పై పెచ్చు ఎంత ఎక్కువగా ఆజ్యం పోస్తే అంత ఎక్కువగా అగ్నిహోత్రుడు పైకి పైకి నాలుకలు చాస్తు విజృంభిస్తాడు. ఈ విషయాన్ని స్మృతి ఇలా వివరిస్తుంది.

**"నజాతు కామః కామానాం। ఉపభోగేన శామ్యతి।**
**హవిషా కృష్ణవర్త్మేవ భూయోభూయో2భివర్ధతే॥**

"కృష్ణవర్మ (నల్లనిపొగ మార్గం గలవాడు) అంటే అగ్నిహోత్రుడు హవిస్సును ఎంతగా అర్పిస్తే అంత పెరిగిపోతాడు. అలాగే కామోపభోగం (కామానుభవం)తో కామము ఎప్పటికి చల్లారదు. పై పెచ్చు ఎక్కువ అవుతుంది" అని అంటుంది స్మృతి.

సుగ్రీవుడు విపరీత కామానుభవంలో మునిగిపోయాడు. ఎంతగా ఇంద్రియాలతో అనుభవిస్తుంటే ఆయన కామ దాహం అంతగా పెరిగిపోయింది ఇక అటువంటి

ఉన్మస్తకమైన ఇంద్రియానుభవమనే గాఢాంధకారములో మునిగిన వానికి వివేకోదయము ఎలా కలుగుతుంది?

అదిగో! అప్పుడు రంగప్రవేశం చేస్తాడు అచార్య హనుమ. తన ప్రబోధంతో సుగ్రీవుని మెదడులో వివేకాన్ని ఉదయింపజేస్తాడు. సుగ్రీవుని కర్తవ్యోన్ముఖుని కావిస్తాడు.

హనుమ ప్రభు భక్తి అనన్య సాధారణమైనది. ఇంతకుముందు ఆచార్య హనుమ తన వాగ్వైభవంతో రామపరమాత్మను మెప్పించి జీవుడైన సుగ్రీవునితో ఆశ్రయణాను బంధాన్ని కల్పించాడు. రామునితో స్నేహలాభ సంతోషమత్తుడైన సుగ్రీవుడు రామానుజుని అలక్ష్యం చేస్తే, ఆ భాగవతాపచారాన్ని లక్ష్మణునికి ఆసనోపచార సమర్పణ తో సవరించాడు.

సుగ్రీవ పరాభవం విషయంలో, వాలివధ విషయంలో హనుమ కేవల ప్రేక్షక పాత్రకే పరిమితమవుతాడు. కాని వాలి వధ, తరువాత తారా విలాప సమయంలో మళ్లీ రంగప్రవేశం చేసి ఆమె ముందు అనునయ వాక్యాలను పలికి, ఆమెకు దుఃఖోపశమనం కావించి సుగ్రీవ పట్టాభిషేకానికి మార్గాన్ని సుగమం కావిస్తాడు.

ఇక ఇప్పుడు సుగ్రీవుడు ప్రగాఢమైన కామానుభవంతో పరవశుడై ఇతర విషయ స్మృతి విహీనుడైనప్పుడు ఆయనలో వివేకాన్ని రేకెత్తింపజేసి, కర్తవ్యోన్ముఖుని కావించాడు.

--- ఇతిశం ---

**ఆచార్య హనుమ తన అపురూప వాగ్వైభవంతో రామ పరమాత్మను మెప్పించి జీవుడైన సుగ్రీవునితో ఆశ్రయణానుబంధాన్ని కల్పించాడు.**

**స్మృతి విహీనుడైన సుగ్రీవునిలో వివేకాన్ని రేకెత్తించి అతనిని కర్తవ్యోన్ముఖుని కావించాడు**

# రామభద్రుని వేదన

శ్రీరాముడు సీతా వియోగ దుర్భర బాధను వర్షాకాలము నాలుగు నెలలు ఎలాగో భరించాడు. అయితే ఆ నాలుగు నెలలలో కూడ అనుక్షణం ఆ మనస్విని రామచంద్రుని మదిలో మెదలుతూనే ఉంది. విరహ వేదనవలన ఆ స్వామికి క్షణమొక యుగంగా గడుస్తుంది. ఒకప్పుడా ప్రభువు మూర్ఛాక్రాంతుడవుతున్నాడు. మళ్లీ కొంత సేపటికి తెలివికి వస్తున్నాడు.

శ్రీరామచంద్రుని ఆలోచనా పథంలో సీతా వియోగ దుఃఖము అంతకంతకు పెరిగిపోతున్నది. "సీతాదేవికి చక్రవాక కూజితాలు అత్యంత ప్రియాలు. భర్తకు దూరమైన ఆమెకు ఆ కూజితాలు ఎంత బాధను కల్గిస్తున్నాయో? శరత్కాల రాత్రులు ఆమెలో కామ భావనను ఉద్దీపింపజేసి ఎంత బాధిస్తున్నాయో? వర్షకాలానికై ఎదురు చూచే చాతకపక్షివలె ఆమె తన రాకకు ఎంతగా నిరీక్షిస్తూ తల్లడిల్లిపోతుందో?" అని ఆ స్వామి అనుజుని ముందు కుమిలి పోసాగాడు.

అన్నగారి అవసాదాన్ని గమనించిన రామానుజుడు అగ్రజుని అనునయింప ప్రయత్నించాడు. "అన్నా! పురుషోత్తమా। ధైర్యంతో మనము వదినను వెదికే ప్రయత్నం చేయాలి. కాని అసమాన పరాక్రమ శాలివైన నీవు ఒక సామాన్యుని వలె విషాదం చెందవచ్చా? ప్రజ్వలిస్తుండే అగ్నిహోత్రుని ఎవరైనా హస్తంతో అదిమి పట్టగలరా? నీ అప్రమేయమైన తేజోరాశిని సీతాదేవిని అన్యులెంతవారైనా ఆక్రమింపగల్గుతారా? నీవు నిశ్చితంగా ఉండు. అనతికాలంతో వదిన నీ స్వాధీనమవుతుంది" అని ఓదార్చాడు.

శ్రీరాముడు కొంతవరకు దుఃఖాన్ని లక్ష్మణుని సాంత్వనంతో ఉపశమింపజేసికొన్నాడు. అయినా ఆయనకు సీతాదేవి తిరిగి లభించడం అంత సులభ సాధ్యం కాదనిపించింది. అందుకే అనుజునితో ఆయన ఈవిధంగా అన్నాడు.

"లక్ష్మణా! నీవు చెప్పిన మాట సత్యము. సాధ్వీమణి, నా అర్ధాంగి అయిన సీతాదేవి ఎన్నటికి పరవశురాలు కాదు. కాని నాకు అత్యంత దూరంలో ఎక్కడో మహా సముద్రానికి అవల లంకాద్వీపంలో నిర్బంధితురాలయిన సీతాదేవిని వెదుకడం అంత సులభమా? అన్వేషణ ప్రయత్నానికి ఉత్సాహం, పౌరుషం రెండు ముఖ్యావసరాలు. ఆ రెండు ప్రస్తుతం మన దగ్గర లేవు కదా! మనంతట మనము సీతాన్వేషణ కావించడం అసాధ్యముకదా!

వర్షకాలము పూర్తి అయింది. నదులలోని నిండు ప్రవాహాలు తగ్గి ఇసుక తిన్నెలు బయట పడుతున్నాయి. మానస సరోవరం నుండి క్రిందికి దిగి వచ్చి స్వచ్ఛమయిన

నదీ జలాల్లో చక్రవాకాలు క్రీడిస్తున్నాయి. నల్లని మేఘాలు కానరానందున నెమిళ్ళు పురివిప్పి ఆడడంలేదు.

సరస్సులలో సరోజాలు సూర్యకిరణాల చక్కిలి గింతలకు పరవశం చెంది సంపూర్ణంగా విచ్చుకొంటున్నాయి. ఆబోతులు ఇసుకను కొమ్ములతో ఎగజిమ్ముతూ ఆలమందలలో రంకెలు వేస్తున్నాయి. కరీంద్రాలు కామపారవశ్యంతో సరస్సులలో కరిణులతో క్రీడలు జరుపుతున్నాయి.

రాజులు దారి తెన్నులు చక్కగా కనిపింపక వర్షకాలము నాలుగు నెలలు దండయాత్రలు మానుకొని తమ రాజధానీ నగరాల్లోనే సుఖాసక్తులై ఉండిపోయారు. ఇప్పుడు శరదాగమనంతో సమరాభిలాషతో సైన్యాలను వ్యూహాత్మకంగా సమాయత్తం చేసికొని సన్నాహాలను జరుపుతున్నారు.

వర్షకాల సమాప్తి కాగానే సీతాన్వేషణను తప్పక జరుపుతానని మాట ఇచ్చిన సుగ్రీవుడు భోగ పరాయణుడై ఆ విషయాన్ని పూర్తిగా విస్మరించాడు.

లక్ష్మణా! ఇంద్రియ గ్రామము చాల బలవంతమైనది. ఎంతటి విద్వాంసునైనా ఆకర్షించి, అరికట్ట గల్గుంది. ఎంతటి ప్రతిభావంతునైనా ప్రకృతి సుఖాలు పరవశం కావిస్తాయి.

"బలవాన్ ఇంద్రియగ్రామో విద్వాంసమపికర్షతి"

ఇక సుగ్రీవడొకలెక్కా! మొదలే వానరుడు. వానరులలో చాపల్యమధికము. పై పెచ్చు కర్తవ్యాన్ని పూర్తిగా మరచిన మూర్ఖుడు కూడ .....

సౌమిత్రీ! ఆర్తితో తనను శరణుజొచ్చినవానికి, తనకు ఇంతకు ముందు ఉపకరించినవానికి సహాయము కావిస్తానని వాగ్దానం చేసి, దానిని తప్పిన పురుషుడు అధముడు.

మంచిగాని, చెడుగాని, ఒకసారి మాట ఇచ్చాక, దానిని నిలుపుకొన్న వాడే పురుషోత్తముడు.

ఇదివరకే ఒకనివలన ఉపకారం పొంది, వృద్ధి చెంది అయనకు ప్రత్యుపకారం తప్పక తగిన విధంగా నెరవేర్చుతానని మాట ఇచ్చి, తన ప్రతిజ్ఞను నెరవేర్చని వాడు కృతఘ్నుడు. వాడు చనిపోయాక వాడి మాంసాన్ని కాకులు, గద్దలు కూడ ముట్టవు" అని కొంత వరకు తన ప్రసంగాన్ని విరమించి, రామభద్రుడు తిరిగి కొనసాగిస్తున్నాడు.

"సుమిత్రాత్మజా! సుగ్రీవుడు తాను రాజ్య సంపన్నుడనని, మహాబలవంతుడనని అనుకొంటున్నాడేమో? నన్ను రాజ్య బలహీనుడని, సీతావిహీనుడని అలక్ష్యం చేయాలను కొంటున్నాడేమో?

నా రోషాన్ని సుగ్రీవుడు ఇంతవరకు స్వయంగా రుచి చూడలేదు. అయితే సప్త సాలభంజన సమయంలో, వాలివధ వేళ నా అసామాన్య పరాక్రమాన్ని కనులార చూచి కూడ సుఖాల మత్తులో బొత్తిగా మరచిపోయాడేమో?

రామచంద్రునిలో శోకకోపాలు అంతకంతకు అధికం కాసాగాయి. అత్యంతావేశంతో ఆయన కొన్ని మాటలను ఉన్నదున్నట్లుగా సుగ్రీవునికి తెలుపుమని అనుజుని అదేశించాడు.

**"నచ సంకుచితః పంథా। యేన వాలీ రణే హతః।**
**సుగ్రీవ సమయే తిష్ఠ। మా వాలి పథ మన్వగాః"**

సుగ్రీవా! రణంలో వాలి వధింపబడిన దారి ఇంకా మూసుక పోలేదు. నీవు సమయం అతిక్రమింపక ముందే మేల్కో! అనవసరంగా వాలి మార్గంలో వెళ్ళి మరణాన్ని కొనితెచ్చు కోకు.

**"ఏక ఏవ రణే వాలీ। శరేణ నిహతో మయా।**
**త్వాంతు సత్యాదతిక్రాంతం హనిష్యామి సబాంధవం।"**

అధర్మ మార్గాన్ని అనుసరించాడనే కోపంతో నా క్రూర నారాచంతో వాలి నొక్కనినే వధించాను.

నీవో మిత్రుని వలన ఉపకారం పొంది, ఆయనకు ప్రత్యుపకారం చేస్తానని మాట ఇచ్చి, ఆ మాటను నిలపుకోక, సత్యాన్ని అతిక్రమించిన కృతఘ్నుడవు. నీవు వాలికంటే కూడ మహాపాపివి. నీ పాపానికి ప్రాయశ్చిత్తంగా పుత్ర, మిత్ర, బంధు, జన సమేతంగా నిన్ను సంహరిస్తాను.

ధర్మాన్ని మీరాడని వాలి నొక్కడినే వధించాను. శాశ్వత ధర్మమైన సత్యాన్ని మీరిన నిన్ను వదలను సుమా!" అని భీషణమైన సందేశాన్ని అందించాడు.

ఆశ్చర్యమేమిటంటే! అంతటి శోకావేశంలో కూడ రామచంద్రుడు నీచమైన వాక్కులతో నిందించలేదు. అది శ్రీరాముని సంస్కారము! ధర్మభంగం కావించిన వాలి వెళ్ళిన చెడు మార్గంలో వెళ్లవద్దని సగ్రీవునికి హితవు పల్కాడు. తన హిత వాక్కులను విస్మరించి,

సత్యభంగం కావిస్తే ఆయనకు కలుగబోయే సమస్త బంధు సమేత మరణ రూపమైన మహాప్రమాదం గురించి హెచ్చరించాడు. "హితాన్ని ఉపదేశించడం, ప్రమాదం గురించి హెచ్చరించడం" రెండు కూడ మిత్ర కార్యాలేకదా!

ధర్మ సంస్థాపనాదీక్షితుడైన రామభద్రునికి వాలి, సుగ్రీవులపై వ్యక్తి గత కోపము లేదు. ఆయన సర్వభూతసముడు, సర్వ సుహృత్తు కదా!

అనుజుని అన్యాయంగా రాజ్యం నుండి తరిమివేసి, ఆయన భార్యను అపహరించిన అధర్మాత్ముడని వాలిని వధించాడు.

ఆపదలో ఒక మిత్రుని ఆశ్రయించి, ఆయన వలన ప్రబలుడైన శత్రువును సంహరింపజేసికొని, రాజ్యలాభాన్ని, సమస్తభోగ సంప్రాప్తిని కలిగి, ఆమిత్రునికి ప్రత్యుపకారం చేస్తానని మాట ఇచ్చి, సుఖాల మత్తులలో ఇచ్చిన మాటను మరచిన సత్యభంగం కావించిన దురాత్ముడని సుగ్రీవుని సబాంధవంగా సంహరిస్తానని హెచ్చరించాడు. 'రాముడంటే సాక్షాత్తుగా ధర్మస్వరూపమే కదా!

--- ఇతిశం ---

"ఇంద్రియ గ్రామము బలవంతమైనది.
అది విద్వాంసునైనా పరవశింప జేస్తుంది"

ధర్మాన్ని మీరాడని వాలినొక్కనే వధించాను.
సత్య ధర్మాన్ని మీరిన నిన్ను
సపుత్ర బాంధవంగా హతమారుస్తాను

# శేషాంశుని ఆవేశము

లక్ష్మణుడికి శ్రీరాముడే సర్వస్వము. సుమిత్రా సుతుడు అగ్రజుని కొరకు అర్ధాంగిని, తల్లిదండ్రులను, రాజ్యసుఖాలను సైతము త్యాగము చేసిన భ్రాతృప్రియుడు. శ్రీరాముని సంతోషమే తన సంతోషంగా భావించిన రామభక్తుడు.

సీతాసమేతుడై శ్రీరాముడు ఉన్నంతకాలము అడవి అయినా అయోధ్యకంటే ఎక్కువగా నిత్య సంతోష నిలయమైంది ఆ సౌమిత్రికి! కాని సీతా వియోగము వలన శ్రీరాముడు క్లేశావిష్టుడయ్యాడు. శ్రీరాముని క్లేశము లక్ష్మణునికి అత్యంత దుఃఖాన్ని కల్గించింది.

ఇప్పుడు తమవలన మహోపకారాన్ని పొంది, రాజ్యసంపదలను అనుభవిస్తూ, తమకు చేస్తానన్న ప్రత్యుపకారము మాటను మరచిన సుగ్రీవుడు అంటే రామునికంటే లక్ష్మణునికే అధికాగ్రహము ఆవేశించింది. అటువంటి కృతఘ్నుని హతమార్చుటకే లక్ష్మణుడు నిశ్చయించుకొన్నాడు.

లక్ష్మణుని యొక్క బుసలు కొట్టే ఆవేశము శ్రీరామునికి అవగతమైంది. ఆయన అనుజుని ఆగ్రహావేశాలను తగ్గించాలనుకొన్నాడు. "లక్ష్మణా! నీకింత ఆవేశము పనికి రాదు. నీవు వెళ్లేది శత్రువు దగ్గరికి కాదు. ఆయనను పరిమార్చడానికి కాదు. నీవు వెళ్లేది మిత్రుని దగ్గరికి. ఆయన కర్తవ్యాన్ని గుర్తుచేయడానికి. ఆయనకు బాధ కలుగకుండా లలితంగా మాట్లాడు"మని రామచంద్రుడు అనుజుని అనునయించాడు.

అన్నగారి మాటలను అక్షరాల పాటిస్తానని మాట ఇచ్చి లక్ష్మణుడు కిష్కింధకు బయలుదేరాడు. ఆయన అయిదు తలల నాగేంద్రునివలె అతి భయంకరంగా అగుపడుతున్నాడు. ఆయన చేతిలోని ధనువు పాము తలవలె ఉంది. బాణాలు పాముల నాల్కలవలె ఉన్నాయి.

ఆయన వడివడిగా అడుగులు వేస్తూ కిష్కింధ వైపు బయలు దేరాడు. ఆయన ఆగ్రహాన్ని గమనించిన వానరులందరు తలోదిక్కుకు పారిపోయారు. కొందరు పరుగు పరుగున సుగ్రీవుని చేరుకొని లక్ష్మణునిరాక గురించి భయంతో నివేదించారు.

మరికొందరు కాపలాదారులుగా ఉన్న భయంకరాకారులైన వానరులు లక్ష్మణునివైపు తరలి రాసాగారు. లక్ష్మణుడు వారిని చూచి మరింత ఆగ్రహ పరవశుడయ్యాడు. ఆయన ఆగ్రహాన్ని గమనించిన అంగదాదులు భయకంపితులయ్యారు. లక్ష్మణుడు అంగదుని పిలిచి, నా రాకను గూర్చి సుగ్రీవునికి తెలుపు, అన్నగారి ఆగ్రహావేశమును చూచి ఓర్వలేక వచ్చానని చెప్పు. ఆయనకు నా మాటలు మెదడుకు ఎక్కాయో? లేదో చూచి తిరిగి వచ్చి నాకు తెలియజేయుమని" ఆదేశించాడు.

పిడుగువంటి లక్ష్మణుని మాటలు విని అంగదుడు భయకంపితుడై పరుగు పరుగున అంతఃపురాన్ని చేరి సుగ్రీవునికి, తారా, రుమలకు ప్రణమిల్లి లక్ష్మణుని సందేశాన్ని తెలియజేశాడు. ఒడలు తెలియని మత్తులో మునిగి ఉన్న సుగ్రీవుడు అంగదుని మాటలను అంతగా పట్టించుకోలేదు. కాని క్రమంగా లక్ష్మణుని భయంకరాకారాన్ని గమనించి వానర వీరులు పెడ బొబ్బలు పెట్టసాగారు. వారి కేకలు సుగ్రీవుని మత్తును క్రమంగా దించివేశాయి.

ఇంతలో అంగదుడు పిలువగా సుగ్రీవునికి సన్నిహితులైన లక్షుడు, ప్రభావుడు అను ఇద్దరు వానర వీరులు కూడ సుగ్రీవుని సన్నిధి చేరి అతనిని ప్రసన్నం చేసికొన్నారు. సుగ్రీవుడు వారి మాటలను విని ఒక ఆసనంపై కూచున్నాక "మహారాజా! మీరు సత్యసంధులు. మీరు రామలక్ష్మణులతో సంధి చేసికొని తత్ఫలితంగా రాజ్యాన్ని నిష్కంటకంగా పొందారు కదా! ఇప్పుడు వారిలో లక్ష్మణుడు పట్టుదల అనే రథ వాహనముపై రామాజ్ఞ అనే సారధి నడుపుతుండగా వచ్చి తన కోపపు చూపులతో వానర వీరులందరిని కాల్చి వేసేటట్లుగా అంతఃపురద్వారం వద్ద భీకరుడై నిలిచి ఉన్నాడు. మీరు బంధు, మిత్రామాత్య సమేతంగా వచ్చి తలవంచి, అంజలి ఘటించి రామానుజుని ప్రసన్నం చేసికొని, రామాజ్ఞను నెరవేర్చి, మీ ప్రతిజ్ఞను సార్థకం చేసికొండ"ని వారు నివేదించారు.

లక్ష్మణుని వంటి భాగవతోత్తములకు వ్యక్తిగత సౌఖ్యాలు, సమస్యలు తృణ ప్రాయాలు. వారికి పరమాత్మే సర్వస్వము. ఆయన కొరకు వారు సర్వ త్యాగం చేసి, ఆయనను ఆశ్రయిస్తారు.

అప్పుడు వారికి భగవదానందమే వారి ఆనందము. భగవదానందానికి కలిగే ప్రతిబంధకాలే వారి విచారానికి కారణాలవుతాయి. భగవదానందానికి ప్రతిబంధకాలను కలిగించే సుగ్రీవాదులే వారి ఆగ్రహానికి పాత్రులవుతారు. వారి ఆగ్రహానికి సకల జనులు భయ భీతులవుతారు.

భాగవతోత్తములు మనకు భగవత్సందేశాన్ని అందిస్తారు. దానిని పాటించకపోతే కలిగే విపత్తులను గురించి హెచ్చరిస్తారు. భగవదాజ్ఞను పాటించుమని, ఆయనకు అంజలి ఘటించడం ద్వారా ఆయనను ప్రసన్నుడిని కావించుకొమ్మని, సుగ్రీవుని వలె భోగలాలసతో మాట మరచిన మనకు హితాన్ని ఉపదేశిస్తారు.

--- ఇతిశం ---

# సుగ్రీవభీతి

లక్ష్మణుని భయంకరమైన రాకను గూర్చి అంగదాదుల ద్వారా విన్న సుగ్రీవునికి సుఖాల మత్తు పూర్తిగా దిగిపోయింది. ఆయన తత్తరపాటు చెందాడు. భయంతో ఆయనకు ముచ్చెమటలు పోశాయి. ఏమి చేయాలో తెలియక చేతులు పిసుక్కోసాగాడు. ఎంతసేపయినా ఆయనకు ధైర్యం కలుగడంలేదు.

ఎవ్వరికైనా పరిహరించరాని భయం ఆవేశించినప్పుడు అనుచరుల అండ అవసరము అవుతుంది. అలాగే ఆయన కూడ అమాత్యులందరిని పిలిపించాడు. వారికి ఈ విధంగా తన పరితాపాన్ని తెలిపాడు. "అమాత్యులారా! ఈ సమయంలో మీరే నాకు బాసటగా నిలువాలి. మీరు యుక్తాయుక్త విచక్షణ కలవారు.

నిజానికి నేను నామిత్రులయిన రామలక్ష్మణుల విషయంలో ఎన్నడు ఏవిధమైన అపచారము కావించలేదు. నాసంతోషానికి కన్ను కుట్టి ఎవ్వరో నాకు తెలియకుండ వారికి నా విషయంలో లేనిపోని చాడీలు చెప్పి ఉంటారు. అందుకే లక్ష్మణుడు ఇప్పుడు ఇంత హఠాత్తుగా ఆగ్రహావేశుడై వచ్చి ద్వారము ముందు యమునివలె నిలుచొని ఉన్నాడు.

లోకంలో వ్యక్తులతో మైత్రి చేసికోవడం సులభము. కాని దాన్ని నిలుపుకోవడం దుర్లభము. ఎందుకంటే మనస్సు చంచలమైనది. దానివలన తెలిసో, తెలియకో చేసిన ఏ చిన్న తప్పయినా ఆ మైత్రిని చెడగొట్టుతుంది.

**"సర్వథా సుకరం మిత్రం। దుష్కరం పరపాలనం**
**అనిత్యత్వాచ్చ చిత్తానాం। ప్రీతి రల్పేపి భిద్యతే"**

శ్రీరాముడు నా జీవితంలో అత్యంత మహోపకారం కావించిన పరమ మిత్రుడు. ఆయన చేసిన అంతటి మహోపకారానికి నా ప్రాణాలను అర్పించినా అది తగిన ప్రత్యుపకారం కాదు. ఆయనకు ఇప్పుడు నాపై నమ్మకం పోయి ఉంటుంది. మామధ్య ఏర్పడ్డ సుదృఢమైన మైత్రీ బంధము ఒక్కసారి తెగిపోతుందేమో అని భయం కలుగు తున్నది".

అప్పుడు అమాత్యులందరిలో అధిక వివేకి అయిన హనుమ సుగ్రీవుని భయాన్ని తొలగిస్తూ ఈ విధంగా పలికాడు:–

"మహారాజా! మీరు రాముడు చేసిన మహోపకారాన్ని మరువకుండడం మీకు శ్రేయస్కరమైనది. మీ కృతజ్ఞతాభావ స్మరణము సర్వదా ప్రశంసనీయమైనది.

శ్రీరామభద్రుడు వాలిపై వ్యక్తి గత ద్వేషం ఏది లేకున్నా, నీపై ప్రేమ కారణంగా మహాబలి అయిన అతనిని హతమార్చాడు. నీవు భోగలాలసుడవై నీవు చేసిన ప్రతిజ్ఞను మరచి పోయావు. మహాత్ముడయిన రాముడు నీ ప్రతిజ్ఞను నీకు గుర్తు చేయడానికే తన అనుజుని నీ దగ్గరికి పంపాడు.

శ్రీరాముడు ఇప్పుడు భార్యా విరహ దుఃఖములోమునిగి ఉన్నాడు. నీ వాగ్దానాన్ని నిలుపుకోవడంలో నీవు చేసిన ఆలస్యం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అందువలన ఆయన తన సందేశాన్ని పరుషంగా తన అనుజుని ద్వారా పంపి ఉంటాడు.

నీవు చేసిన ఈ భగవదపచారము భాగవతోత్తముడయిన రామానుజునికి అత్యధికంగా ఆగ్రహాన్ని కల్గించి ఉంటుంది. అందుకే లక్ష్మణుడు అంతటి ఆగ్రహంతో భయంకరంగా కనబడి ఉంటాడు.

నీవిప్పుడు నీవు చేసిన అపచారానికి వెంటనే భగవంతుడైన రాముని దగ్గరకు వెళ్లి ఆయన అడుగులకు అంజలి ఘటింపవలసినంత అవసరం లేదు.

ముందు నీ వాకిట్లోనే వచ్చి నిలిచిన భాగవతోత్తముడైన రామానుజుని ఆశ్రయించి, అంజలి ఘటించు. భాగవతోత్తములు ప్రసన్నమైతే, భగవదపచారము తక్షణమే ఉపశమిస్తుంది.

రాజులు అడిగినప్పుడు, వారు స్వయంగా చేసిన ఏ దోషాలనయినా వారికి నిస్సందేహంగా నిర్భయంగా నివేదించడం అమాత్యుల కర్తవ్యం. అందుకే నేనింత నిర్భయంగా సుస్పష్టంగా నా అభిప్రాయాన్ని తెలుపుతున్నాను.

రాముడు శరసంధానమే కావిస్తే తక్షణమే సకల చరాచర జగత్తు సంహరింపబడుతుంది. అందువలన ఆ పురుషోత్తముని మళ్లీ నీవు ప్రసన్నుడిని కావించుకో. రాముని బహిః ప్రాణమే లక్ష్మణుడు. అందువలన నీవు లక్ష్మణుని సన్నిధికి పుత్రమిత్రబంధు సమేతంగా వెళ్లి ముందు ఆ మహానుభావుని మనస్సును ప్రసన్నం కావించుకొమ్మని హనుమ నివేదించాడు.

ప్రభుభక్తి పరాయణుడయిన హనుమ హితోక్తి మరొకసారి సుగ్రీవుని కర్తవ్యోన్ముఖుని కావించింది. శ్రీరామ మైత్రిని సాధించినప్పటి నుండి ఎప్పుడెప్పుడు సుగ్రీవుడు తప్పటడుగు వేసినా హనుమ నిర్భయంగా తప్పక హితాన్ని ఉపదేశించి తన అంతరంగకత్వాన్ని సార్థకం చేస్తూనే ఉన్నాడు.

# తారాహితోక్తి

లక్ష్మణుడు సుగ్రీవుని కలువాలని కిష్కింధా, గుహా నగరంలోనికి వెళ్లాడు. ద్వారపాలకులు మహాబలశాలురు, దీర్ఘకాయులుగా ఉన్నారు. వారందరు లక్ష్మణుని ఆగ్రహాకారాన్ని చూచి దూరం నుండి చేతులు జోడిస్తూ నిలిచారు.

ఆ నగరమంతా రత్నమయమై, పుష్పమయమై ఉంది. పెద్ద పెద్ద భవనాలు ప్రాసాదాలు నిండుగా ఉన్నాయి. అక్కడి వృక్షాలు కోరిన ఫలాలనన్నింటిని ఇచ్చేవిగా ఉన్నాయి.

సురాంశలతో, గంధర్వాంశలతో జన్మించి, కామరూపధారణ కావింపగల వానరులు ఉన్నారు. వారు విలువైన వస్త్రాలను, దివ్యమాల్యాలను ధరించారు. అక్కడి నదులు పర్వతాల నుండి క్రిందికి జారివచ్చిన నిర్మలోదకాలతో ప్రవహిస్తున్నాయి.

లక్ష్మణుడు వానర ప్రముఖులయిన మైంద, ద్వివిద, హనుమ, జాంబవత్, నీలాదుల భవనాలను రాజమార్గంలో దర్శించాడు. అవి దృఢములై, ధవళ ప్రాకారమయములుగా ఉన్నాయి. ధన, ధాన్య సంపన్నములుగా ఉన్నాయి. వాటిలో మహేంద్ర ప్రదత్తములైన వృక్షాలు సకల కామప్రదాలై ఉన్నాయి.

సుదృఢమైన సుగ్రీవ భవనాన్ని లక్ష్మణుడు అవలోకించాడు. అవరోధములు లేని సూర్యకిరణాలవలె లక్ష్మణుడు ఆ భవనంలో ప్రవేశించాడు. ఆ భవనము బంగారు తోరణాలతో, దివ్య మాల్యాలతో ప్రకాశిస్తూ ఉంది. అందులో జనావాసాలయిన ఏడు కక్ష్యలను దాటి అంతఃపురాన్ని చూచాడు.

అంతఃపురంలో బంగారు, వెండి పర్యంకాలు ఉన్నాయి. శ్రేష్ఠాలయిన ఆసనాలు ఉన్నాయి. వాటిపై విలువైన ఆస్తరణాలు పరువబడి ఉన్నాయి. అంతః పురంలో నుండి వీణాది వాద్య విశేష ధ్వనులు, మధుర గానాలాపము వినపడ్డాయి. ఉత్తమ సంజాతలయిన వానర స్త్రీలు కనబడ్డారు. వారి కాలి అందెల ధ్వనులు, వడ్డాణాలు మొదలైన ఆభరణ ధ్వనులు వినవచ్చాయి.

లక్ష్మణుడు ఉత్తమ సంస్కార సంపన్నుడు. ఆవానర స్త్రీలను కూడ దాటి ఇంకా అంతఃపురంలోపలికి వెళ్లడానికి ఆయన మనస్సు అంగీకరింపలేదు. అందువలన అక్కడే ఉండి తన వింటినారిని ధ్వనింపజేశాడు. ఆ ధ్వని లక్ష్మణుని రాకను సుగ్రీవునికి తెలియజేస్తూ ఆయన మనస్సును కంపింపజేస్తూ వినబడింది. లక్ష్మణుని భయమువలన

సుగ్రీవుని నోరు ఎండిపోయింది. తత్తరపాటు ప్రారంభమయింది. ఆయన భయంతో తారను సమీపించాడు. ఆమెతో "తారా! లక్ష్మణుని వింటి ధ్వనిని విన్నావు కదా! అది లక్ష్మణుని ఆగ్రహాన్ని తెలియజేస్తుంది. నేను ఏమి తప్పు చేశానో తెలియడంలేదు. నేను లక్ష్మణుని ముందుకు ఇప్పుడు వెళ్ళజాలను. నీవు వెళ్లి ఆయన కోపం తగ్గేలా మాట్లాడు. ఆయన స్త్రీలముందు ఆగ్రహం ప్రదర్శించడని" ఆమెను పంపాడు - తార సుగ్రీవుని ఆదేశం మేరకు లక్ష్మణుని ముందుకు అడుగులు వేసింది.

**"సాప్రస్ఖలంతీ, మదవిహ్వలాంగీ, ప్రలంబకాంచీ గుణ హేమ సూత్రా,**
**సలక్షణా లక్ష్మణ సన్నిధానం, జగామ తారా నమితాంగ యష్టిః"**

అప్పటి తారా స్వరూపాన్ని వాల్మీకి మునీంద్రుడు మన కళ్లకు కట్టేట్లు ప్రదర్శిస్తున్నాడు.

ఆమె అంతవరకు సుగ్రీవునితో రమించి అలసిపోయి ఉంది. ఆమె అడుగులు తడబడుతున్నాయి. ప్రియుని కలయికతో, మదిరాపానంతో ఆమె శరీరము మత్తిల్లి ఉంది. ఆమె నడుముకు ధరించిన వడ్డాణమునకు సంబంధించిన బంగారు హారము జారిపోతున్నది. ఆమె ధరించిన వస్త్రము ఊడిపోతున్నది. ఆమె శరీరములోని పై భాగము కొంచెము వంగి ఉంది. అదిగో అటువంటి భర్తృ సమాగమ లక్షణాలతో శయ్య నుండి క్రిందికి దిగి, ఏ మాత్రము సర్దుకోక, ఉన్నది ఉన్నట్లుగా తార లక్ష్మణుని సమీపానికి వెళ్లింది.

ఆమె అలా ఉన్నదున్నట్లుగా లక్ష్మణుని దగ్గరకు వెళ్ళడానికి అనేక కారణాలు ఉన్నాయి. ఒకటి: సర్దుకోవడం మొదలుపెడితే అది పూర్తి అయ్యే వరకు ఆలస్యం కలిగి లక్ష్మణుని ఆగ్రహం పెరిగి పోవచ్చు.

రెండు: లక్ష్మణుడు సామాన్యంగానే ఆడవాళ్ల వైపు కన్నెత్తి చూడడు. ఇక పడుకొన్నది పడుకొన్న స్థితిలోనే పర్యంకం దిగి తన దగ్గరకు వచ్చిన తారను ఆయన తలెత్తి చూడలేదు. తన ఆగ్రహాన్ని ప్రదర్శించలేదు.

మూడు:- ఆమె అంగదుని చూచినట్లు లక్ష్మణుని కుమారభావంతో చూచివచ్చింది.

తన దగ్గరకు వచ్చే తారను లక్ష్మణుడు చూచాడు. అయితే ఆమె సహజ సౌందర్యము పట్ల, అప్పటి ఆమె శారీరక స్థితి పట్ల లక్ష్మణునికి ధ్యాస లేదు. ఆయన సహజంగానే అన్యస్త్రీలను తేరిపార చూచేవాడుకాదు. దానితోపాటు ఆయన మనస్సు సుగ్రీవుని పట్ల కోపంతో నిండి ఉంది.

ఆయన కోపాన్ని తగ్గించే విధంగా ఆమె మాట్లాడడం మొదలు పెట్టింది. "రాజపుత్రా! మీ నాన్న గారు దశరథ సార్వభౌములు కదా! ఆయన సువిశాల సామ్రాజ్యంలో తప్పు చేసిన ప్రజలే లేరా? తప్పు చేసిన ప్రతి వ్యక్తిని మీ నాన్నగారు శిరచ్ఛేదము చేయిస్తారా? లోకంలో ఏ తప్పు చేయని వ్యక్తి ఎవ్వరైనా ఉంటాడా? తప్పు చేసిన వారిని మందలించాలి, స్వల్ప శిక్షతో సంస్కరించాలి కదా! రాజులకు క్షమాగుణము కూడ ముఖ్యమే కదా!

సుగ్రీవుడు మీ ఆజ్ఞను జవదాటలేదు.

అయితే సుగ్రీవుడు వానరుడు. వానరులకు శాస్త్రానుసారము ప్రవర్తించడం తెలియదు కదా. అందులో సుగ్రీవునికి బహుకాలము భార్యా వియోగం తర్వాత అంగనా సంగమము లభించింది. దానికి మీ ఆమోదము కూడ లభించింది కదా! ఆ ఆనందానుభవంతో కలిగిన పరాకుతో ఆయన కొంత ఆలస్యం కావించి ఉండవచ్చు. అంతేకాని కారు చిచ్చువంటి మీ పరాక్రమానికి, సమిధ కావాలని ఆయన సాహసించడంలేదు. ఇంత చిన్న పరాకు దోషానికి తల నరకడం వంటి శిక్ష విధించడం మీ వంటి విజ్ఞులకు తగదు". ఈ విధంగా చనువుతో తార లక్ష్మణునితో సంభాషించింది.

తార సాంత్వనంతో లక్ష్మణుని ఆగ్రహ జ్వాలలు ఉపశమించాయి. అయితే ఆ అగ్ని ఇంకా పూర్తిగా చల్లారలేదు. ఆవేడితోనే ఆయన సుగ్రీవుని ప్రవర్తనను ఆక్షేపించసాగాడు.

"తారా! సుగ్రీవుడు కామానుభవంలో మగ్నుడై ధర్మార్థాలను పూర్తిగా మరిచాడు. తనకు శత్రు రహితంగా రాజ్యభార్యా లాభాలను కలిగించిన శ్రీరామచంద్రుడే భార్యా విరహంతో తపిస్తున్నాడని ఆయనకు తెలియదా? అనుమతించిన కాలానంతరము కూడ మిత్రుని దురవస్థను గమనించకుండా భోగమగ్నుడు కావడం ఆయనకు సరి అయినదేనా?

స్త్రీ వ్యసనమొక్కటే ప్రమాదకరమనుకొంటే, దానికి మితిమీరిన మద్య పానము కూడ తోడయితే ఇక వినాశానికి అదుపు ఉంటుందా? మిత్ర లాభము వలన కలిగిన సర్వసంపదలు, అది చేజారితే శాశ్వతంగా ఉంటాయా? తనకు కలలో కూడ ఊహించని విధంగా పరోపకారం చేసిన మిత్రునికి ప్రత్యుపకారం చేయని కృతఘ్నుడైన సుగ్రీవుని విషయంలో ఏమి చేయాలో తెలుపు"మని ప్రశ్నించాడు.

తారకు లక్ష్మణుని ఆగ్రహము కొంతవరకు తగ్గిందని తెలసి సంతోషమయింది. సుగ్రీవుని విషయంలో ఆయనకు మరింత నమ్మకం కలిగే విధంగా ఆమె మాట్లాడ సాగింది. "సుమిత్రానందనా! సుగ్రీవుడు మీ ముందు చాలా బలహీనమైనవాడు. మీరు

బలవంతులు. ఏ అపకారము చేయని బలహీనుడైన మిత్రునిపై మీకు ఆగ్రహము తగదు. మీకు ప్రత్యుపకారము సీతాన్వేషణ రూపంగా చేయాలి అని ఆయనకు తెలుసు.

సుగ్రీవునకు చాలా కాలము ద్వారా లభించిన స్త్రీ జనముపట్ల ఆయన ప్రమత్తుడై, కామపరవశుడై ఉన్నాడు. మితిమీరిన కామము యుక్తాయుక్తములను మరిపిస్తుంది. మరి నీ మాటేమిటి? నీవు క్రోధానికి పరవశుడవయ్యావు కదా! మితిమీరి ప్రవర్తించడం మంచిది కానప్పుడు అది కామమైతేమిటి? క్రోధమైతే ఏమిటి? కామక్రోధాలు రెండు రజోగుణ సంభవములే కదా!

అంతేకాదు మనిషికి క్రోధమధికముగా కలిగినప్పుడు దానిని శాంతంగా సహిచండమెలా వీలుకాదో – కామము ప్రకోపించినప్పుడు దానిని కూడ సహించడము సాధ్యము కాదు. తపోగరిష్ఠులైన మహర్షులు కూడ కామానికి లొంగినవారే. విశ్వామిత్రుడంతటి వాడు మేనకావ్యామోహం వలన పది సంవత్సరాలు తన తపస్సును వ్యర్థం చేసికోలేదా? ఇక చపలుడైన వానరుడైన సుగ్రీవుడు కామ పరవశుడై పరాకు చెందుట ఒక మహాపాపమా?

ఒకప్పుడు వాలి నాతో ముచ్చటిస్తూ "రావణుడెంతవాడైనా వానరసేనకు వశ్యుడే" అని తెలిపాడు. సుగ్రీవుడు రామకార్యము మరువలేదు. పక్షం రోజులక్రితమే "భూమండలములోని వానర వీర కోటినంతటిని తన సన్నిధికి పదిహేను రోజులలోపు రావాలని, రానివారికి శిరచ్ఛేదము విధించబడుతుంద"ని శాసనము చేశాడు. బహుశః వారంతా ఈ రోజు రావచ్చు.

నాయనా! తొందరపడి సుగ్రీవునితో స్నేహం చెడగొట్టుకోవద్దు. గోరుతో జరిగే పనిని గొడ్డలి దాకా తెచ్చుకోకు.

శ్రీరామచంద్రస్వామి చిరునవ్వు జగన్మోహనమైనది. నీవు ఆయన ప్రియసోదరుడివి కదా! ఏదీ ఒకసారి మనసారా నవ్వు. మరొకసారి స్నేహ పరిమళాన్ని వెదజల్లు. నిర్మల స్నేహచంద్రికలను వెలియింపు"

సౌమిత్రీ! నీవు నీ మిత్రుని ఇంటికే ధనుర్ధారివై వచ్చావు. అయినా లక్ష్మణా! నీవు పరుని వలె అంతఃపురం బయటే ఉండవలసిన అవసరంలేదు. సుగ్రీవుడు నీ మిత్రుడు. మిత్రుని దగ్గరకు వెళ్లినప్పుడు ఆయన స్త్రీ జనాన్ని చూడడంలో తప్పులేదు. అందువలన నావెంట అంతఃపురంలోకి వచ్చి నీ మిత్రునితో మాట్లాడు" మని తార అతనిని సగ్రీవుని అంతఃపురంలోకి ఆహ్వానించింది. సుగ్రీవుని స్వయంగా కలువనిదే ఆయనకు రామ సందేశము వినిపించడం సాధ్యంకాదని సుమిత్రాసుతడు ఆమెను అనుసరించి లోనికి వెళ్లాడు.

తార చాల చతురురాలు. మనసెరిగి మాట్లాడడంలో ఆమె నేర్పరి. లక్ష్మణుని క్రోధాన్ని ఉపశమింపచేయడానికి మొట్ట మొదట సుగ్రీవుని అంతఃపురంలో నుండి మత్తిల్లిన స్థితిలోనే సౌమిత్రి ఎదుటకు ఆమె వెళ్లింది. ఆమెకు లక్ష్మణుని మనస్సు అర్థమైంది. ఆయన ఆడవారిని చూడడానికే సిగ్గుపడతాడు. ఇక ఆమెను ఆ స్థితిలో చూచాక అగ్రహాన్ని ప్రదర్శించే అవకాశమేలేదు.

ఆమె అనుకొన్నట్లే ఆమెను చూడగానే లక్ష్మణుడు తలదించుకొన్నాడు. ఆమె తన కార్యము నెరవేరినట్లే అనుకొంది. ఇక తన మాటలతో ఆయన అగ్రహాన్ని మరింత శాంతింపజేయాలని ప్రయత్నించింది. ముందుగా దశరథ చక్రవర్తి ప్రజలను క్షమించినట్లు ఆయన సుగ్రీవుని క్షమించాలని కోరింది. శాస్త్రానుసారము నడచుకోవడానికి సుగ్రీవుడు ఇంద్రియ నిగ్రహంగల నరుడు కాడని, చాపల్యంగల వానరుడని తెలిపింది.

సుగ్రీవుడు బలహీనుడని, మిత్రుడని ఆయనపై అగ్రహించడం పాడికాదంది. కామమెట్లా దోషమో క్రోధము కూడా అంతే అంది. క్రోధమెట్లా ఆపడానికి వీలులేనిదో, కామం కూడ అలాగే నిగ్రహించుకోవడానికి వీలులేదంది. లక్ష్మణుడంతవాడే క్రోధానికి పరవశు డైనప్పుడు చపల వానరుడైన సుగ్రీవుడు కామానికి లొంగడంలో తప్పేమిటని ప్రశ్నించింది. సుగ్రీవమైత్రిని చెడగొట్టుకొని, కాగల రామకార్యాన్ని చెడగొట్టుకోవద్దంది.

ఎవరో పరునివలె బయటే ఉండిపోకూడదని, సుగ్రీవుడు మిత్రుడు కనుక ఆయన అంతఃపురంలోకి రావడంలో తప్పులేదని రమ్మని ఆహ్వానించింది.

తార ఒక్కొక్క చర్య, ఒక్కొక్కమాట లక్ష్మణుని మనస్సులో పొంగిపొరలే అగ్రహ ప్రవాహానికి కట్టలు వేసింది.

"తార కార్య నిర్వహణలో సమర్థురాలని, ఆమె అభిమతాన్ని అనుసరించి మెదలు కొంటే శ్రేయస్సు కలుగుతుందని" తన అంతిమ సమయంలో వాలి అనుజుడైన సుగ్రీవునికి హితబోధ చేశాడు.

సుగ్రీవుడు ఆమె సామర్థ్యము పూర్తిగా తెలిసినవాడే కనుక లక్ష్మణుని శాంతింపజేయడానికి అమాత్యులను, చివరకు ఆప్తుడైన హనుమను కూడ నియోగించక, ఆ అపాయాన్ని తొలిగించిరమ్మని తారను ఆయన ఆదేశించాడు. తార తన కార్యాన్ని సాధించి, సుగ్రీవునికి, వానర సామ్రాజ్యానికి మేలు చేకూర్చింది.

--- ఇతశం---

# లక్ష్మణుని హెచ్చరిక

లక్ష్మణుడు సుగ్రీవుని అంతఃపురంలో ప్రవేశించాడు. సుగ్రీవుడు దివ్య మాల్యాలను, దివ్యవస్త్రాలను ధరించి బంగారు ఆసనముపై కూచొని ఉన్నాడు. ఆయన మదవతుల మధ్య మదిరాపానము చేస్తూ, రుమను గట్టిగా కౌగిలించుకొని ఉన్నాడు. ఆ స్థితిలో సుగ్రీవుని చూడడానికి లక్ష్మణునికి అసహ్యంవేసింది.

ఒకవైపు తన అగ్రజుడు శ్రీరామ చంద్రస్వామి సీతావియోగ దుఃఖంతో బాధపడుతుంటే, సుగ్రీవుడిలా జుగుప్సాకరంగా అనేక స్త్రీల మధ్య భార్యాలింగనంతో పరవశుడౌతున్నాడు. ఛీ! ఛీ! అని అసహ్యించుకొన్నాడు. ఆగ్రహంతో దీర్ఘనిశ్వాసలను వదలుతున్నాడు.

సుగ్రీవుడు రక్తనేత్రుడైన లక్ష్మణుని చూచాడు. ఆయన మత్తు ఒక్కసారిగా వదిలింది. భయంతో వెన్నెముకలో వణుకు మొదలైంది. తక్షణమే రుమను వదిలి లేచి నిలబడ్డాడు. చేతులు జోడించాడు.

లక్ష్మణుడు సుగ్రీవుని వైపు ధిక్కారంతో చూచి, "సుగ్రీవా! మహారాజు ఎలా ఉండాలో తెలుసా! బాధితుల విషయంలో కృపను కల్గి ఉండాలి. ఇంద్రియ విజయుడై ఉండాలి. కృతజ్ఞుడు, సత్యవచనుడై ఉండాలి అట్టి మహారాజు ఈ లోకంలో దైవ ప్రసాదంవలన సకల వైభవాలతో విలసిల్లుతుంటాడు.

నీవు కూడా ఒక రాజువేనా? మహోపకారం చేసిన మిత్రునికి ప్రత్యుపకారం చేస్తానని మాటనిచ్చి మరచిపోయిన కృతఘ్నుడివి, క్రూరుడివి.

అసత్యవచనుడు మహాపాపాలను చేసిన వాడవుతాడు. ఒక గుఱ్ఱం కొరకు అసత్యం పలికితే నూరు గుఱ్ఱాలను చంపిన పాపఫలాన్ని పొందుతాడు. ఒక మనుష్యునికి మాట ఇచ్చి మరచినవాడు ఆత్మహత్యా పాపాన్ని, స్వజనులను సంహరించిన పాపఫలాన్ని మూటగట్టుకొంటాడు. ఇక మిత్రుని వలన ఉపకారాన్ని పొంది, ప్రత్యుపకారం చేస్తానని నీవలె మాట ఇచ్చి మర్చినవాడు సర్వభూతద్రోహి అవుతాడు. ఆయన తక్షణము వధ్యుడే.

బ్రహ్మహత్య చేసిన వానికి, సురాపానము చేసిన వానికి, చోరునికి, మధ్యలో ఒక వ్రతాన్ని భంగము చేసిన వానికి ప్రాయశ్చిత్తాలు ఉంటాయి. కాని కృతఘ్నునికి నిష్కృతే లేదని బ్రహ్మ దేవుని యొక్క నిర్ణయము.

**"బ్రహ్మఘ్నేచ, సురాపేచ, చోరే, భగ్నవ్రతే తథా**
**నిష్కృతిర్విహితా సద్భిః కృతఘ్నేనాస్తి నిష్కృతిః"**

నీవు శ్రీరాముని అమోఘమైన కృపవలన, వాలి అడ్డును తొలగించుకొని రాజ్యాన్ని, స్వజనాన్ని, తిరిగి పొందగలిగావు. నీ అంతట నీవే సీతాన్వేషణ కార్యాన్ని ప్రత్యుపకార రూపంగా నిర్వహిస్తానని మాట ఇచ్చి దానిని మరచి, మత్తు పానీయాలతో, మదవతులతో కాలం గడుపుతున్నావు. నీవు కృతఘ్నుడివి, మహాపాపివి.

నీకు మా రామభద్రుడు తీవ్ర శిక్షను విధిస్తూ చేసిన హెచ్చరిక ఏమిటో తెలుసుకో! ఆ ప్రభువు మాటలనే తెలుపుతున్నాను విను!

"సుగ్రీవా! అధర్మ వర్తనుడైన వాలి వెళ్లిన (మరణ) మార్గము ఇంకా మూతపడలేదు. అసత్య వచనుడైన నీవు ఇప్పటికి మేలుకోక పోతే నిన్ను సమస్త బంధుజన సమేతంగా సంహరిస్తాను".

మా స్వామి ప్రయోగించే భయంకర వజ్రకఠిన బాణము రుచిని చూడడానికి సాహసించకు. నీవిచ్చిన మాట నిలబెట్టుకొని నీ ప్రాణాలను కాపాడుకొ"మ్మని లక్ష్మణుడు కఠినంగా తెలిపాడు.

--- ఇతిశం---

అసత్యవచనుడు మహా పాపాల ఫలాన్ని అనుభవిస్తాడు. మిత్రుని వలన ఉపకారము పొంది ప్రత్యుపకారము చేస్తానని మాట ఇచ్చి మరచిన వాడు సర్వభూత ద్రోహి అవుతాడు"

"కృతఘ్నునికి నిష్కృతే లేదు" అని బ్రహ్మవచనము

# తార సమాధానము

లక్ష్మణుని రూపాన్ని చూడగానే భయకంపితుడైన సుగ్రీవునికి ఆయన కఠినోక్తులను విన్నాక పై ప్రాణాలు పైననే పోయాయి. భర్త దైన్యాన్ని గమనించిన తార మరొక్కసారి రంగప్రవేశం చేసింది.

"లక్ష్మణా! సుగ్రీవుడు వానరరాజే కావచ్చు. కాని ఆయన కూడ ఒక మహారాజు. ఒక మహా రాజుతో సంభాషించవలసిన పద్ధతిలో నీవు మాట్లాడలేదు.

"సుగ్రీవుడు మిత్రద్రోహి కనుక గౌరవనీయుడు కాదంటావా?" ఆయన ఏ ద్రోహము చేయలేదు. రామచంద్రస్వామి చేసిన మహోపకారాన్ని ఆయన ఏనాడు మరువలేదు. ప్రత్యుపకారం చేస్తానన్న తన మాటను కూడ ఆయన మరువలేదు. ఆయన కృతఘ్నుడు కానేకాదు.

ఇక ఇంత కాలము భోగాల మత్తులో ఎందుకు మునిగి పోయాడంటావా? ఆ మత్తు జితేంద్రియులైన మహర్షులను కూడ వదలలేదు. పూర్వము ఘృతాచి అనే అప్సరసతో పది సంవ్సతరాలు కామభోగాలను అనుభవించిన విశ్వామిత్ర మహాముని తాను ఆమెను అనుభవించింది ఒకే రోజు అనుకొన్నాడట. చూచావా కామ భోగ మహత్తు!

ఇక సుగ్రీవుడు ఒక వానరుడు. అనేక సంవత్సరాలు విరహవేదనను ఒంటరిగా అనుభవించాడు. రామచంద్రుని దయవలన అనుకోకుండా ఆయనకు భోగ భాగ్యాలు అబ్బాయి. వాటిని అనుభవించుమని శ్రీరామచంద్రుడే అనుమతించాడు. అయితే ఆ అనుభవంలో కొంత కాలయాపన జరిగింది. అంతమాత్రమే.

సుగ్రీవుడు తనకు మేలు చేసిన రామభద్రుని విషయములో నిశ్చలమైన భక్తి గలవాడు. సీతాదేవి విషయంలో శ్రీరామునికి సహకరించడానికి ఆయన రాజ్యాన్నే కాదు, రుమను, నన్ను కూడా వదలుకొంటాడు.

ఇంతకు అనుకొన్నదే తడవుగా లంకపై దాడికి వెళ్లడం అంత సులభం అనుకొంటున్నావా? రావణుని బలం తక్కువ కాదు. అంతఃపుర పరిరక్షణకు పదికోట్ల రాక్షసులున్నారు. మొత్తం ముప్పై ఆరుకోట్ల రాక్షస బలమున్నది. అందువలన తగినంత బలాన్ని, సమకూర్చుకోక లంకకు వెళ్లి రావణుని నిర్జించడం సాధ్యము కాదు.

ఇంతకు పదిహేను రోజుల ముందే సమస్త వానర వీరులను తరలిరావలసిందిగా సుగ్రీవుడు శాసనాన్ని అందరికి తెలిపాడు. వారందరు ఈ రోజే తప్పక వస్తారు.

లక్ష్మణా! నీ కోపాన్ని తగ్గించుకో. నీ రూపాన్ని చూచి మా వానర వనితలు భయపడుతున్నారు. నీవు శాంతించు, క్షమించు"మని తార ఆయనను శాంతింపజేసింది.

--- ఇతిశం ---

సుగ్రీవుని జెరుపబోకు - సుఖతరమార్గ వ్యగ్రమ్ము
రామకార్యమవగ్రీవము జేయబోకు కుమారా

ఆ ప్రభువైన రాఘవుని - కోసము జగద్విమోహనంబు
నీ వతనికైన ప్రియానుజుడవు
ఏది ఒకింత నవ్వు స్మితా చంద్రికల వెలయింపు

చాపంబును బూని వచ్చితివి అన్నా!
నీవు మా యింటికే

# సుగ్రీవుని క్షమాయాచనము

"తరతీతి తారా", "తారయతీతి తారా" అని "తార" అనే మాటకు రెండు వ్యుత్పత్తులు ఉన్నాయి. స్వయంగా ఎంతటి సమస్య నుండి అయినా సులభంగా బయటపడేది తార. తానే కాదు తనవారిని కూడ ఆ సమస్య నుండి దాటింపగలిగేది తార.

లక్ష్మణునికి లంకా బలాన్ని తెలిపి, అంతటి లంకపైకి వెళ్లాలంటే తగినంత బలాన్ని సమీకరించుకోక తప్పదని, దానికొరకు ఇదివరకే సుగ్రీవుడు శాసనాన్ని అందరికి అందించాడని తెలియజేసింది. వానరుడైనా సుగ్రీవుడు మహారాజని, మహారాజుతో అంతపరుషంగా మాట్లాడడం తగదని సూచించింది.

తార వాక్ చాతుర్యముతో, సమయస్ఫూర్తి సంభాషణతో లక్ష్మణుడు పూర్తిగా శాంతించాడు. ఆయన కళ్లలోని ఎరుపు జీరలు క్రమంగా మాయమయ్యాయి. అప్పుడు సుగ్రీవుడు తాను బ్రతికినట్లుగా భావించుకొన్నాడు. గట్టిగా పిండిన బట్ట నుండి నీరు కారి పోయినట్లు ఆయన భయం పూర్తిగా తగ్గిపోయింది. ఆయన, లక్ష్మణుని సమీపించి, ఆయనను ఆనందింపజేసే పలుకులను పలుకసాగాడు.

"సుమిత్రా నందనా! శ్రీరామచంద్రస్వామి అనుగ్రహ విశేషం వలన నాకు కీర్తి ప్రతిష్ఠలు, రాజ్యము, పరిజన లాభాలు కలిగాయి. ఆ స్వామి లోకోత్తర అరివీర భయకంరుడు. అంతటి మహాపురుషునికి ప్రత్యుపకారం చేయడానికి నేనెంతవాడిని? అత్యల్పుడను.

అయితే ఆ స్వామి వెనుక అడుగులు వేస్తూ వెళ్తాను. శ్రీరామచంద్రుని అప్రమేయతేజమే రావణాసురుని సంహరింపగలదు. సప్తమహా సాలవృక్షాలను ఏకైక శరముతో కూల్చగల్గిన మహావీరునికి అన్యుల సహాయము అవసరము అవుతుందా? ఆయన ధనుష్టాంకార ధ్వని సర్వలోకాలను కంపింపజేస్తుంది. ఆయన దాసుడను నేను. నన్ను ఆగ్రహింపడనే నమ్మకంతో కొంత ఆలస్యం చేసి తప్పు గావించాను. నన్ను మీరు క్షమించాలి" అని వేడుకొన్నాడు.

వానర మహారాజయిన సుగ్రీవుని క్షమాయాచన వాక్కులు లక్ష్మణుని మనస్సును రంజిపంచేశాయి. ఆయన సుగ్రీవుని చేతులు పట్టుకొని అభినందిస్తూ "సూర్యనందనా!

నీవు మహారాజువై, సమర్థుడవై ఉండి కూడ అత్యంత వినయ సంపన్నుడవు. నిన్ను ఆశ్రయించిన మా అన్న నేడు సనాథుడు. నీ ప్రభావము, పవిత్రత, నిజాయితీ చాల గొప్పవి. నీ సహాయముతో మా అన్న తన అరిని త్వరలో సంహరింపగలడనుటలో ఎలాంటి సందేహములేదు.

**"దోషజ్ఞే సతి సామర్థ్యే కోఽన్యో భాషితు మర్హతి**
**వర్జయిత్వా మమజ్యేష్ఠం త్వాంచ వానర సత్తమ"**

లోకంలో తప్పు చేసిన వారు సహజంగా తమ తప్పును అంగీకరింపరు. ఒకవేళ తమకు శక్తిలేక, తప్పును ఒప్పుకోవడం తప్పని సరి అయితే, అప్పుడు మాత్రము విధిలేక అంగీకరిస్తారు.

నీవు సమర్థుడివై కూడ నీ దోషాన్ని నిజాయితీతో నీ అంతట నీవే అంగీకరించావు. ఇంతటి ఆర్జవము గలవారు మా అన్న, నీవు ఇద్దరు మాత్రమే".

లక్ష్మణుడు ఔదార్యంతో సుగ్రీవుని ప్రశంసిస్తున్నాడు:– "సుగ్రీవా! నీవు పరాక్రమంలో మా అన్నతో సమానడవు. నీవు కృతజ్ఞుడవు. భగవత్కృప వలన ఈ నీ అమూల్యమైన తోడు మా అన్నకు లభించింది.

మా అన్న మాల్యవత్పర్వతముపై భార్యా విహీనుడై ఒంటరిగా దుఃఖిస్తూ కృశించిపోతున్నాడు. నీవు వెంటనే వచ్చి నీ మిత్రుడైన శ్రీరామచంద్రుని ఓదార్చు.

రాముడు సీతా విరహము బాధలో ఉండి, నీ గురించి పరుష వాక్యాలను మాట్లాడాడు. ఆయన బాధను చూడలేక నేను ఆయన పలికిన పరుష వాక్యాలను ఉన్నవి ఉన్నట్లు నీతో చెప్పాను. మిత్రమా! నీ మనస్సును ఒక వేళ నేను నొప్పించి ఉంటే నన్ను క్షమించు"మని సుగ్రీవుని లక్ష్మణుడు ప్రార్థించాడు.

సుగ్రీవుని వృత్తాంతమువలన మనము కొన్ని విషయాలను ముఖ్యంగా గమనించాలి.

1) సుగ్రీవుడు శ్రీరాముని విషయంలో కృతజ్ఞుడే. ఆయన పరాక్రమాన్ని ప్రత్యక్షంగా అవలోకించినవాడే. తన కర్తవ్యాన్ని మరచిన నాడు రాముని భయంకర బాణాగ్ని తనను భస్మం చేస్తుందని అయనకు తెలుసు. నాలుగు నెలలే రాముడిచ్చిన గడువని కూడ తెలుసు.

అయితే ఆయన అనుకోకుండా లభించిన అపరిమిత కామానుభవం ఆయనను దోషిగా రామలక్ష్మణుల దృష్టిలో నిలబెట్టింది.

కామము క్రోధంతో పాటు రజోగుణం వలన కలుగుతుంది. **"కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః"** అది మితిమీరినప్పుడు మననే నాశనం చేసే భయంకర శత్రువు అవుతుంది. దానిని మనమెంత అనుభవించినా, నాలుకలు చాస్తూ ఇంకా ఇంకా కావాలనే అగ్నివంటిది (దుష్పూరేణానలేనచ). అది ఆకలి చల్లారని పెనుభూతము (మహాశనో మహాపాప్మా). ఇంకా ఇంకా కావాలనే ("దుష్పూరేణ") ఆకలి చల్లారని పెనుభూతము (మహాశనః) దుష్టమైన కామానుభవం మహాపాపప్రదము. దాని అమితానుభవంతో మనము కూడ సుగ్రీవునివలె భగవత్ నిగ్రహానికి పాత్రులమవుతాము.

2) మనము భగవంతుని మరచి పాపపరవశులమైనప్పుడు లక్ష్మణుని జ్యా శబ్దం వలె మన ఆచార్యుడో, భాగవతోత్తముడో మనను భగవంతుడు విధించే క్రూర శిక్ష గురించి హెచ్చరిస్తారు.

3) ఆ సమయమంలో హనుమ వంటి మరికొంత మంది భాగవతోత్తములు మన దోషాన్ని మనకు తెలిపి "భగవత్సందేశాన్ని వినిపింపవచ్చిన భాగవతోత్తముని ప్రసన్నుడిని చేసికోవడమే భగవద్దోషానికి ప్రాయశ్చిత్తమని, భాగవత ప్రీతే భగవత్ప్రీతికి కారణమవుతుందని" ప్రబోధిస్తారు. "నసంశయో2స్తి తద్భక్త పరిచర్య రతాత్మనాం".

4) భగవంతుడు, భాగవతోత్తములు కూడ అత్యంత ఆగ్రహంతో కనబడినప్పుడు వారి ఆగ్రహాగ్నిని చల్లార్చి వారి మనస్సులను ప్రసన్నము కావించడానికి తార వంటి పురుషకార స్వరూపిణి (శ్రీదేవి) స్వయంగా పూనుకొని తన చల్లని చూపుతో మాటలతో శాంతింప జేస్తుంది.

5) "భాగవతోత్తములు నిండు మనంబు నవ్వ నవనీత సమానం"గా కల్గి ఉంటారని, మన దోషాన్ని వారి ముందు అంగీకరిస్తే లక్ష్మణునివలె వారు వెంటనే కరిగిపోయి మనను తాము పరుషంగా హెచ్చరించినందుకు తరువాత బాధపడుతారని తెలుస్తుంది.

--- ఇతిశం ---

# దిశానిర్దేశము

సుగ్రీవుడు భయవిముక్తుడై లక్ష్మణునితో కలసి రామసన్నిధానమునకు వెళ్ళాడు. అతని వెంట భీమకాయులు, అరి భయంకర విక్రములు అయిన అనేక కోట్ల వానరులు శ్రీరాముని సన్నిధికి చేరుకొన్నారు.

సుగ్రీవుడు శ్రీరామచంద్రుని చూచి "మహానుభావా! కొంత ఆలస్యం చేసినీ నిగ్రహానికి కారణమయ్యాను. నన్ను మన్నించు" మని ఆయన పాదములపై పరివార సమేతంగా వాలాడు.

శ్రీరాముడు ఆయనను లేవనెత్తి, "మిత్రమా! వరుసగా ఉదయ, మధ్యాహ్న, రాత్రులలో కాలాన్ని అనుసరించి, ధర్మార్థ, కామాచరణ చేసినవాడు నిజమైన మహారాజు. ఆయన సతతముశ్రేయస్సును పొందుతాడు. ధర్మార్థములను వదలి కేవల కామాసక్తుడైనవాడు వృక్షాగ్రముపై నిద్రించి ఒడలు మరచి క్రిందపడిన వానివలె నశిస్తాడు. శత్రువులను సకాలంలో సంహరించి, మిత్రులను రక్షించుకొన్నవాడు, ధర్మాన్ని పాలించి ధర్మార్థ కామాలనే త్రివర్గ ఫలాలను పొందుతాడు.

సుగ్రీవా! శత్రువుపై దండెత్తే సమయము ఆసన్నమైంది. నీ సచివులతో ఆ విషయంలో సమాలోచన కావించుము" అని తెలిపాడు.

సుగ్రీవుడు తన వెంట ఉన్న పరాక్రమ సంపన్నులు, మహాకాయులయిన వానర మహావీరులందరు శ్రీరాముని అనుసరించి, రావణుని చంపి, సీతను కొనితెస్తారని తెలిపాడు.

శ్రీరాముడు ఆ బలమైన వానరానీకాన్ని చూచి సంతుష్టుడై, సుగ్రీవుని కౌగలించుకొని, "వానర రాజా! మా సీత జీవించి ఉందో లేదో? ఒకవేళ జీవించి ఉంటే ఆమెను రావణుడు ఎక్కడ ఉంచాడో ముందుగా తెలుసుకోవాలి. ఆ తరువాత మనము సమరానికి సమాయత్తము కావచ్చు. ముందుగా ఆమె ఉన్న స్థలాన్ని గురించి సమాచారాన్ని సంపాదించాలి. ఆ విషయంలో మా అన్న తమ్ములిద్దరికి తగిన పరిజ్ఞానం లేదు. దానికొరకు నీ అనుచరగణాన్ని ఎలా నియోగించుకోవాలో తెలిసినవాడవు నీవు. నీవు నామిత్రుడవు, బుద్ధి మంతుడవు, పరాక్రమవంతుడవు. అందువలన నీవే నీ వారికి తగిన ఆదేశాలివ్వమని" కోరాడు.

శ్రీరాముని ఆదేశాన్ని పురస్కరించుకొని సుగ్రీవుడు ముఖ్యమైన వానర వీరులను నాలుగు దిక్కులలో పంపడానికి నిశ్చయించుకొన్నాడు.

ప్రాగ్దిశ:- ముందు "వినతుడ"నే సేనానాయకుని, అతని అనుచరగణంతో తూర్పు దిశకు పంపడానికి నియోగించాడు. "వినతా! నీవు సమయానుకూలంగా కార్యాకార్య వివేకం కలవాడవు. సూర్య, చంద్రాంశలతో జన్మించిన లక్షమంది వానరులను తీసికొని తూర్పు వైపు వెళ్లు. తూర్పు దిశలో భాగీరథి, సరయూ, సింధూనదులు, శోణానది, మహీ, కాలమహీ నదులు ప్రవహిస్తాయి.

బ్రహ్మావర్తము, మాల, మాళవ, విదేహ, కాశీ, కోసల, మాగధ, మహాగ్రామ పుండ్ర, వంగ దేశాలు ఉంటాయి. ముఖ్యంగా వింధ్య హిమాలయాలమధ్య తూర్పు దిశలో ఉన్న ప్రాంతమంతా నీ అన్వేషణకు తగిన స్థలము. కొన్ని నగరాలు, పర్వతాలు, సముద్రములోపల ఉంటాయి. వాటిలో కూడ సీతను అన్వేషించాలి. మంధర పర్వతము యొక్క అగ్రభాగంలో వెతుకాలి. అక్కడ చెవులు లేనివారు, పెదవులపై చెవులు కలవారు, అయోముఖులు, ఏకపాదులు, మనుష్యులను తినేవారు, బంగారు రంగుగల వారు, పచ్చి చేపలను తినే కిరాతులు, వ్యాఘ్రముఖులుంటారు.

ఈ ప్రాంతం దాటితే "యవద్వీపం" వస్తుంది. అది బంగారు రంగుతో ఉంటుంది. అందువలన దానిని "సువర్ణద్వీపం" అంటారు. అందులో రత్నాలు రాశులు రాశులుగా ఉంటాయి.

అది దాటితే "శిఖర" పర్వతము ఉంటుంది దాని శిఖరాలు ఆకాశాన్ని అంటుతాయి. ఆ పర్వతము దేవ దానవులకు విహారస్థలంగా ఉంటుంది. ఆ పర్వత గుహలలో సెలయేరుల ప్రక్క సీతను దాచి ఉంచవచ్చు.

ఆ పర్వతం దాటితే శోణానది వస్తుంది. ఆ నదీ జలము రక్తమువలె ఎఱ్ఱగా ఉంటుంది. అది దాటితే సిద్ధ చారణుల విహార స్థలము ఉంటుంది. అది దాటితే మహోత్తుంగ తరంగాలతో సముద్రము వస్తుంది. (బహుశః ఆ సముద్రము ఇప్పటి బంగాళా ఖాతము అయి ఉంటుంది).

ఆ సముద్రంలోపల అతికాయులైన రాక్షసులు ఉంటారు. వారు సముద్రముపై భాగంలో విహరించేవారిని వారి నీడను బట్టిలాగే ఛాయాగ్రాహులు. ఆ ప్రాంతం దాటాక సముద్రము అరుణ వర్ణంతో భయంకరంగా ఉంటుంది. అక్కడి ద్వీపాన్ని "శాల్మలీ" ద్వీపం అంటారు. శాల్మలీ వృక్షం ఉన్నందువలన ఆ ద్వీపానికి ఆ పేరు ఏర్పడింది. అక్కడే "గరుత్మంతుని నివాసము" ఉంది.

అక్కడి పర్వత శిఖరాలపై "మందేహులు" అనే రాక్షసులు ఉంటారు. వారు సూర్యోదయ, మధ్యాహ్న, సూర్యాస్తమయ సమయాలలో సూర్యుని ప్రయాణాన్ని అడ్డగిస్తారు. సంధ్యావందన తత్పరులైన భూసురులు మంత్రాలతో సూర్యునికి అర్ఘ్య జలాలను వదలుతారు. ఆ జలాలు వజ్ర బలాన్ని కలిగి మందేహ రాక్షసులను దూరం పడగొట్టుతాయి. "తా ఆపః వజ్రీ భూత్వా! తాన్ అసురాన్ అపసర్పయంతి".

ఈ ప్రాంతాన్ని "ఇక్షు" సముద్ర ప్రాంతమంటారు. ఇక్కడ సముద్ర జలాలు చెరుకు రసమువలె ఉంటాయి.

ఆ తరువాత నేయిరంగులో సముద్ర జలాలు (సర్పి సముద్రం), పెరుగువలె సముద్ర జలాలు (దధి, సముద్రము) ఉంటాయి. ఇవి దాటిన తరువాత కుశ, క్రౌంచ ద్వీపాలు ఉంటాయి.

ఆ తరువాత "పాలసముద్రము" వస్తుంది. సముద్ర జలాలు అందులో పాలవలె, ముత్యాల హారాలవలె ఉంటాయి. దాని మధ్యలో "ఋషభము" అనే పర్వతము ఉంటుంది. అందులో "శ్వేతవృక్షాలు", "రజత పద్మాలు" ఉంటాయి. వాటి మధ్య భాగము బంగారు రంగుతో ఉంటుంది. ఈ ప్రాంతంలో రాజ హంసలు విహరిస్తుంటాయి. ఈ ప్రాంతములో దేవతలు, యక్ష, కిన్నరులు అప్సరసలతో విహరిస్తు ఉంటారు.

ఆ తరువాత "మంచి నీటి సముద్రము" వస్తుంది. అది "ఔర్వము" అనే అగ్నితో నిండి ఉంటుంది. అది "బడబ" అనే అడగుఱ్ఱము ముఖం నుండి వెలువడుతుంది. దానితో సమీప చరాచరాలు నశించిపోతాయి.

ఈ సముద్రానికి ఉత్తర దిశలో పదమూడు యోజనాల దూరంలో "జాతరూప శైలము" అనే బంగారు కొండ ఉంటుంది. ఆ పర్వతాగ్రంపై సహస్ర శిరములుగల అనంతుడు అనే సర్పరాజు చంద్రకాంతితో, నల్లని వస్త్రంతో, సర్వభూత నమస్కృతుడై కూచొని ఉంటాడు. ఆమహాత్ముని ధ్వజము మూడు ముఖములు గల తాలవృక్షము. ఆ తరువాత ఉదయాచలము మహోన్నతమై సువర్ణ వర్ణమై వంద యోజనాల విస్తీర్ణంతో దర్శనమిస్తుంది. దానిపై యోజన వైశాల్యంతో దశ యోజన ఔన్నత్యము కలిగిన "సౌమనసము" అనే పర్వత శిఖరము ఉంటుంది. త్రివిక్రముడు మేరు శిఖరముపై ఒక పాదాన్ని, ఈ "సౌమనస" పర్వత శిఖరముపై మరొక పాదాన్ని ఉంచి నిలిచాడట.

ఈ పర్వతము ప్రక్కలో "సుదర్శన ద్వీపము" ఉంటుంది. ఇక్కడ ఉదయ పర్వత కాంతులతో అన్ని వస్తువులు చక్కగా ప్రకాశిస్తాయి. ఈ "ద్వీపము సూర్యోదయ ద్వారం"గా ఉంటుంది. ఇదే తూర్పు దిశ చివర. దీనిని దాటి ఎవ్వరు వెళ్లలేరు.

**దక్షిణదిశ:-** ఈ దిశకు సుప్రసిద్ధ వీర వానరులను అంగదుని నాయకత్వంలో పంపాడు. ఆయనకు సహాయంగా అగ్నిపుత్రుడైన నీలుడు, వాయుసుతుడైన హనుమ బ్రహ్మనందనుడైన జాంబవంతుడు వెళ్లారు. సుహోత్ర, శరారి, శరగుల్మ, గజ, గవాక్ష, గవయ, సుషేణ, వృషభ, మైంద, ద్వివిధ, విజయ, గంధ మాదనులు కూడ అంగదుని అనుసరించారు. అంగదునికి సుగ్రీవుడు దక్షిణ దిశను వివరిస్తున్నాడు.

"అంగద కుమారా! వింధ్యా చల దక్షిణ ప్రాంతమే దక్షిణ దేశము. వింధ్యాచలము సహస్ర శిఖర సమేతము, దాని క్రింద నర్మదానది పాములతో నిండి ప్రవహిస్తుంది. అది దాటాక కృష్ణ, గోదావరి అనే పెద్ద నదులు మేఖల, ఉత్కల అనే నదులు ప్రవహిస్తాయి. ఇవి వింధ్యకు నైరుతి దిశలో వస్తాయి.

వింధ్యకు వాయువ్యంలో విదర్భ, ఋషిక మహిష, కళింగ, కౌశిక దేశాలు ఉంటాయి.

ఇక్కడి నుండి దండకారణ్యము ప్రారంభమవుతుంది. గోదావరి ప్రవాహ ప్రాంతమిది. అదే విధముగా కావేరీ, తామ్ర పర్ణీనదులు ప్రవహిస్తాయి. ఇవన్నీ "అయోముఖము" అనే పేరుగల సహ్యా పర్వతము నుండి బయలు దేరుతాయి.

ఈ ప్రాంతంలో చందనవనము విశేషంగా ఉంటుంది. ఇక్కడనే మలయాచలము ఉంటుంది. అక్కడ సూర్య ప్రభా భాసురుడు అయిన అగస్త్య మహర్షి ఉంటాడు. ఆయన ఆజ్ఞతో తామ్ర పర్ణీనదిని తరించాలి. తామ్ర పర్ణీ నదీ ప్రాంతంలో అనేక ద్వీపాలు ఉంటాయి.

ఆ తర్వాత పాండ్య రాజుల రాజధానీ నగరము (చెన్న పట్టణము) ఉంటుంది. దాని ద్వారాలు బంగారు, ముత్యాలతో అలంకరింపబడి ఉంటాయి. దీని తరువాత సముద్రము వస్తుంది. (హిందూ మహాసముద్రము) ఆ సముద్రము మధ్యలో అగస్త్య మహర్షి మహేంద్రునికి విడిదిగా మహేంద్ర పర్వతాన్ని నిలిపాడు. సుర, ముని, యక్ష, సిద్ధ, చారణులకు, అప్సరలకు అది విహార భూమి.

ఆ మహా సముద్రము శతయోజన విస్తీర్ణమైనది. ఆ సముద్రము మధ్యలో ఛాయా గ్రాహకమైన అంగారక రాక్షసి ఉంటుంది.

ఆ సముద్ర తీరంలోనే శత్రు విరావణుడైన రావణుని రాజధాని అయిన లంకానగర ద్వీపము శతయోజన విస్తీర్ణంగా ఉంటుంది. అక్కడికి సామాన్య నర, వానరులు వెళ్లలేరు. అనేక కోట్ల రాక్షస పరివేష్టితమై ఉంటుంది. ఆ నగరము సువర్ణమయ ద్వారాలతో, గోపురాలతో విరాజిల్లుతూ ఉంటుంది.

ఆ సముద్రము దాటిన తరువాత "పుష్పితక" పర్వతము సువర్ణ, రజిత శిఖరాలతో సూర్యేంద్రులకు నెలవై ఉంటుంది. అయితే దానిని క్రూర, నాస్తిక కృతఘ్నులు చూడజాలరు.

ఆ పర్వతము తర్వాత "వైద్యుతము" అనే పర్వతము మెరుపువంటి రంగుతో ప్రకాశిస్తూ మధువుకు, మధుర ఫలాలకు నిలయమై ఉంటుంది.

ఆ పర్వతము దాటిన తరువాత "కుంజర" పర్వతము "అగస్త్య" భవనముతో అలరారుతూ ఉంటుంది. దాని తరువాత "భోగవతీ నగరము" ఉంటుంది. అది "వాసుకి" సమేత అసంఖ్యాక సర్పరాజులకు నిలయము. మహావిషసర్ప సంరక్షితమై ఉంటుంది.

దాని తరువాత "వృషభాచలము" ఉంటుంది. దానిపై ఎఱ్ఱ చందనము విశేషంగా ఉండి, భయంకర రోహితాకార గంధర్వ సురక్షితమై ఉంటుంది. పంచగంధర్వులు పాలకులుగా ఉంటారు. వారే శైలూష, గ్రామణి, శిశువు, శుభ్రుడు, బభ్రుడు అనేవారు. తమ పుణ్యకర్మలచే సూర్య, చంద్రాగ్ని శరీరకులైన దేవతలు అక్కడ స్వర్గవాసము చేస్తుంటారు.

వృషభగిరియే పృథివి యొక్క దక్షిణాంతిమ భాగము ఇంతవరకే మీరు వెళ్లగల్గుతారు.

దాని తరువాత గాడాంధకార పరీవృతమైన పితృలోక, యమలోక ప్రాంతము ఉంటుంది.

ఈ దక్షిణ దిశను నెల రోజులలోపు పర్యటించి సీతను గాఢంగా అన్వేషించి రావాలి. సీత జాడ తెలిపిన వారు నాకు ప్రాణప్రియులై, నాతో సమానంగా భోగభాగ్యములు అనుభవిస్తారు. వారు ఎన్ని తప్పులు చేసినా నాకు ఆమోదయోగ్యులే.

మీరందరు ఉన్నత కుల సంజాతులు, బలపరాక్రమ సంపన్నులు" అని సుగ్రీవుడు వారికి దక్షిణ దిశా నిర్దేశం చేశాడు.

**పశ్చిమదిశ:–** సుగ్రీవ మహారాజు తన మామగారైన "సుషేణుడు" అను వానర మహావీరుని నాయకునిగా జేసి, అతనికి తోడుగా మారీచుని, అతని సోదరులను, అర్చిష్మంతుని, అతని అనుయాయులను, రెండు లక్షల మంది వానర వీరులను పశ్చిమ దిశకు పంపాడు. ఆయన తన మామగారితో:–

"మీ నాయకత్వంలో సౌరాష్ట్ర (గుజరాత్) బాహ్లీక, శూరదేశాలను (బహుశః పంజాబు, సింధు దేశాలను) జన, పదాలను, పట్టణాలను, మహారణ్యాలను పర్వతాలను వెతకాలి. అవి దాటిన తరువాత మెట్ట ప్రదేశాలతో కూడిన (రాజస్థాన్‌లోని "థార్") ఎడారి

ప్రాంతము వస్తుంది. అక్కడ అంతా బాగా అన్వేషించి క్రింది (అరేబియా) సముద్రంలో ప్రవేశించాలి. దానిలో "తిమి", తిమింగిలాది పెద్ద పెద్ద చేపలు, మొసళ్లు అధికంగా ఉంటాయి.

(సింధూ) నదీ సాగర సంగమ ప్రదేశంలో "హేమగిరి" అనే మహా పర్వతము శత శిఖర పరివేష్టితమై ఉంటుంది. దానిలోయలలో "రెక్కలుగల ఎగిరే సింహాలు" ఉంటాయి. అవి మదగజాలను, మహామీనాలను పట్టుకొని తమ గుహలలోకి తీసికవెళ్లి తింటాయి. దాని శిఖరాలలో ఒకటి బంగారు రంగుతో ప్రకాశిస్తుంటుంది. మీరు కామరూపధారులై అక్కడ అంతా జాగ్రత్తగా అన్వేషించాలి.

ఆ (అరేబియా) మహా సముద్రములో శతయోజన విస్తీర్ణమైన "పారియాత్ర" మహా పర్వతము శిఖర సమేతమై ఉంటుంది. ఆ పర్వతంపై కామరూప శక్తి గలిగిన అగ్ని వర్ణులైన ఇరువై నాలుగు కోట్ల మహాబలసంపన్నులైన గంధర్వులు ఉంటారు. ఆ పర్వతము ఫల, మూలాలను వారు రక్షిస్తుంటారు. అయినప్పటికి వానర రూపులైన మీకు వారి వలన భయము ఉండదు.

ఆ పర్వతము తర్వాత వైడూర్య వర్ణమయమైన "వజ్ర పర్వతము" శత యోజన సమున్నతమై ఉంటుంది. ఆ పర్వత గుహలన్నిటిలో సీతను జాగ్రత్తగా అన్వేషించాలి.

దాని తరువాత "చక్రవంత" పర్వతము విశ్వకర్మ స్థాపిత సహస్రార చక్రముతో ప్రకాశిస్తుంది. పంచజనుడనేరాక్షసుని సంహరించి, శ్రీమహావిష్ణువు ఈ చక్రాన్ని కైవసం చేసికొన్నాడు. ఈ పర్వత ప్రాంతాలన్నిటలో సీతాదేవిని అన్వేషించాలి.

దానిని తరించిన తరువాత అరువై యోజనాల విస్తీర్ణముతో "వరాహ పర్వతము" కనిపిస్తుంది. అది సువర్ణ శిఖరవంతమైనది. అది సముద్రాంతర్భాగములో ఉంటుంది. దానికి సమీపంలో "సువర్ణ నిర్మితమైన "ప్రాగ్జ్యోతిష" మహానగరము ఉంటుంది. ఆ నగరమే నరకుని రాజధాని (ఈ నరకదు భూ, వరాహనందనుడైన నరకాసురుడికి చాల పూర్వుడు).

పర్వత ప్రాంతమంతా జలధారలతో, అడవి జంతువులతో భయంకరంగా ఉంటుంది.

ఆ తరువాత "మేఘవంత" పర్వతము ఉంటుంది. ఆ పర్వతంపైననే పాకశాసనుడగు మహేంద్రుడు పట్టాభిషిక్తుడయ్యాడు. అక్కడ మహేంద్ర పాలితములైన అరువై వేల శిఖరాలు ఉంటాయి. అవన్ని స్వర్ణమయాలే. అక్కడి వృక్షాలు స్వర్ణమయాలే. వాటి మధ్యలోనే ఉత్తర దిశలోని "మేరు" పర్వతము ఉంటుంది. సూర్యుని వరప్రసాదము

వలన అది "కనకాచలమై"ంది. ఆ పర్వతము దేవ, దానవ, గంధర్వులకు విహార భూమిగా ఉంటుంది.

సూర్యాస్తమయ సమయంలో ఆ పర్వతంపైకి మరుత్తులు, వసువులు విశ్వదేవుడు వచ్చి సంధ్యావందన మాచరిస్తారు. అక్కడి నుండి ఆదిత్యుడు అస్తమయాద్రిని దశ సహస్ర యోజన దూరాన్ని అర్థముహూర్త సమయంలో ప్రయాణిస్తాడు.

మేరు పర్వతము మధ్య ప్రదేశమే వరుణుని నివాస స్థానము. అక్కడే మేరు సావర్ణ మహాముని తపోనిష్ఠా గరిష్ఠుడై ఉంటాడు. ఆ మహామునికి ప్రణమిల్లి సీతమ్మను అన్వేషించండి.

అస్తమయాచలము తరువాత గాఢాంధకారము నిండి ఉంటుంది. మీరందరు మా మామగారి నాయకత్వంలో వెళ్లి అంతట సీతాదేవిని అన్వేషించి నెలరోజులలోపు తిరిగి రావాలి" అని సుగ్రీవుడు నిర్దేశించాడు.

ఉత్తర దిశానిర్దేశము:- సుగ్రీవుడు 'శతబలి' అనే వానర వీరుని, లక్షమంది అనుచరులను, మంత్రులను తోడుగా ఇచ్చి ఉత్తర దిశకు వెళ్లుమని నిర్దేశించాడు. సర్వప్రాణి పూజ్యుడైన రామునికొరకు సీతను అన్వేషించుమని తెలిపాడు. ఆ మహానుభావునికి ప్రత్యుపకారం చేయగలిగితే జన్మ సార్థకమవుతుంది.

ముందుగా మ్లేచ్ఛ, పుళింద, శూరసేన, ప్రస్థ, భరత, కురుదేశాలు, మద్ర, కాంభోజ, యవన, శక, బాహ్లీక, ఋషిక, పౌరవ, కొంకణ దేశాలు, చీనా పరమచీనా, దుర్దరదేశాలు ఆ తరువాత హిమగిరులు వస్తాయి. పర్వత ప్రాంతాలలో సీతాదేవిని అత్యంత జాగరూకతతో వెతుకాలి.

ఆ తరువాత దేవగంధర్వ సేవితమైన సోమాశ్రమము, కాళపర్వతాలు వస్తాయి. వాటిని దాటితే హేమ గర్భ, సుదర్శన పర్వతాలు కనబడుతాయి. వాటి తరువాత "దేవ సఖ" పర్వతము వస్తుంది. దాని తరువాత నూరు యోజనాలు దూరం వరకు గిరులు, తరులు, నదులు, జంతువులు ఏమి ఉండవు. ఆ తరువాత కైలాస పర్వతము వస్తుంది.

కైలాస పర్వతముపై యక్షాధిపతి అయిన కుబేరుని భవనము ఉంటుంది. అక్కడే హంసకారండవాది జలపక్షి సమేతమై శతపత్ర, సహస్ర పత్రకమల పూర్ణమైన సరస్సు ఉంటుంది. అక్కడ అన్ని గుహలలో, లోయలలో సీతాదేవిని శ్రద్ధగా వెదుకాలి.

కైలాసచలము తరువాత క్రౌంచగిరి పెద్దబిలముతో దర్శనమిస్తుంది. దానిలో జాగ్రత్తగా ప్రవేశించాలి. దానిపై సూర్యతేజస్కులైన మహర్షులు ఉంటారు.

ఆ తరువాత చెట్లు బొత్తిగా లేని "అవృక్షగిరి" వస్తుంది. దాని తరువాత కామశైల, మానస గిరులు ఉంటాయి. ఆ తరువాత మైనాక పర్వతము ఉంటుంది. అక్కడే "మయభవనము" ఉంటుంది. ఆ పర్వతముపై "హయముఖులైన" కింపురుష స్త్రీలు ఉంటారు.

అది దాటాక వైఖానస, వాలఖిల్యాది మహర్షులు, సిద్ధులు, తాపసులు వసించే ప్రదేశాలు వస్తాయి. ఆ మహానుభావులకు అంజలి ఘటించి సీతాదేవి వృత్తాంతాన్ని తెలిసికొండి. అక్కడే "వైఖానస సరోవరము" ఉంటుంది. దానిలో సువర్ణ కమలాలు ఉంటాయి. హంసలు అందులో సంచరిస్తుంటాయి.

దానిని దాటాక సూర్య చంద్ర తారకా ప్రకాశ రహితమై, మేఘావృతమైన ప్రదేశము ఉంటుంది. అయితే అక్కడ వెలుగుకు కారణము దేవ సమానులు, తపస్సిద్ధులు, స్వయం ప్రకాశమానులైన మహానుభావుల శరీరకాంతే.

ఆ తరువాత "శైలోద" నది దాటడానికి వీలు లేకుండా ఉంటుంది. దానిని దాటడానికి "కీచకము"లనే వెదుళ్ళు తోడ్పడుతాయి. ఆ తరువాత 'ఉత్తరకురు' భూములు పుణ్యాత్ములకు నిలయాలుగా ఉంటాయి. నీలవైదూర్య వర్ణ జలాలను కల్గిన అనేక నదులు అక్కడ ప్రవహిస్తుంటాయి. అందులో కనక కమలాలు, రక్త పద్మాలు నిండుగా పూస్తాయి. ఆ నదుల ఇసుక తిన్నెలల్లో బంగారము, ముత్యాలు, మణులు విరివిగా ఉంటాయి. అక్కడి చెట్లు నిరంతరము ఫల మూలాలను ఇస్తాయి. కొన్ని చెట్లు వస్త్రాలనిస్తాయి. కొన్ని తరువులు బంగారు శయనాలను పరుపులను ఇస్తాయి. కొన్ని భూజాలు మనోహర మాల్యాలను, భక్ష్య, పానీయాలనిస్తాయి. గంధర్వ విద్యాధరులు తమ స్త్రీలతో విహరిస్తుంటారు. సంగీత, వాద్య ధ్వనులు నిరంతరము వినిపిస్తుంటాయి. అక్కడి వారందరు అనవరతం హర్ష పరవశులై ఉంటారు.

శైలోద నదీ ప్రాంతాన్ని దాటాక ఉత్తర సముద్రము వస్తుంది. ఆ సముద్రము మధ్యలో "సోమగిరి" అనే బంగారు కొండ ఉంటుంది. ఇంద్రలోక, బ్రహ్మలోక వాసులైన దేవతలు అంతరిక్షం నుండి ఈ పర్వతాన్ని అవలోకిస్తుంటారు. అది సూర్య మండలానికంటే ఉన్నతంగా ఉంటుంది. అందువలన సూర్య ప్రకాశము అక్కడ ఉండదు. కాని "సోమగిరి" కాంతే అక్కడ వెల్గునిస్తుంది. అక్కడే షాడ్గుణ్య పరిపూర్ణుడైన వాసుదేవ భగవానుడు ఉంటాడు. ఆ తరువాత ఏకాదశ రుద్ర భూములు, బ్రహ్మలోకము ఉంటాయి. బ్రహ్మలోకము సంతతము పరమర్షి సంసేవితమై ఉంటుంది.

శైలోద నదీ ప్రాంతమువరకే మీరు వెళ్ళ గల్గుతారు. ఉత్తరకురు భూములు మీరు వెళ్లరానివి. సోమగిరి ప్రాంతము దేవతలకు కూడ దుర్గమము.

అంతవరకు మీరు వెళ్లి సీతాదేవిని అన్వేషించి రావాలి. మాసము మీ కొసగే గడువు. సీతా వృత్తాంతము తెలిపినవారు నాకు, శ్రీరామ ప్రభువుకు కూడ అత్యంత ప్రీతిపాత్రులవుతారు.

ఈ విధంగా నాలుగు దిశలలో వెళ్లే వానరులకు దిశా నిర్దేశం చేశాక సుగ్రీవుడు హనుమను మళ్లీ దగ్గరికి పిలిచి అంటున్నాడు, "మారుతాత్మజా! నీవు వానర శ్రేష్ఠుడవు. మహావీరుడవు. నీకు తెలియని ప్రదేశం కాని, వెళ్ల రాని స్థలం కాని అవనీ మండలంలో, అంతరిక్షంలో కూడ లేదు.

నీవు భూమిపై, నీటిపై, ఆకాశంలో కూడ సంచరింపగల వాడవు. నీవు వాయువేగంతో ప్రయాణం చేయగల్గిన వాడవు.

నీ సమయస్ఫూర్తి, నీతిమత్ ప్రవర్తనము, శాస్త్ర విజ్ఞానము అమోఘము. నీవు కార్య సిద్ధికై బాగా ఆలోచించు".

సుగ్రీవుడు వాయుపుత్రుని పిలిచి ప్రత్యేకంగా సూచనలను చేసినందువలన హనుమ ప్రాధాన్యమును శ్రీరాముడు గ్రహించి ఆయనను దగ్గరకు పిలిచి రామనామాంకితమైన ఉంగరాన్ని సీతాదేవి గుర్తించడానికి వీలుగా ఇచ్చాడు. "హనుమా! ఈ ఉంగరాన్ని చూచి మా సీత నిన్ను నా రాయబారిగా గుర్తించి నీతో మాట్లాడుతుంది. నీవు కార్యదీక్ష గలవాడవు, సమర్థుడవు. నీవే కార్యభారాన్ని నిర్వహించాలి" అని తెలిపాడు. శ్రీరామ విశ్వాసాన్ని చూరగొన్నందుకు హనుమ అమితంగా ఆనందించాడు.

వానరులందరు మహోత్సాహంతో తమ తమ దిశలలో ప్రయాణాలను ప్రారంభించారు.

--- ఇతిశం ---

"అర్థోహి నష్ట కార్యార్థైః । నాయత్నేనాధిగమ్యతే"

ప్రయత్నము చేయకుండా

పోయిన దానిని తిరిగి పొందలేరు

# భూగోళ విజ్ఞానము

సుగ్రీవుడు సీతాన్వేషణ కొరకు వెళ్లే వానర వీరులకు నాలుగు వైపుల దిశానిర్దేశం చేశాడు. అయితే శ్రీ రామాయణ కాలం నుండి ఇప్పటి వరకు అనేక భౌగోళిక పరివర్తనలు జరిగాయి.

నిన్నటి వరకు "మద్రాస్"గా దేశవిదేశాలలో విఖ్యాతమైన దక్షిణ భారత నగరము నేడు "చెన్నై" గా మారి పోయింది. రామాయణ కాలంలో అయోధ్యా పట్టణానికి ప్రక్కలోని అయోధ్యా ప్రాంతము "ఫైసలాబాద్" అయింది. అలాగే గంగా, యమునా (సరస్వతి) (త్రివేణీ) సంగమ స్థలంగా ప్రఖ్యాతిని సంపాదించుకొన్న పవిత్ర "ప్రయాగ" ఇప్పుడు "అలహాబాదు"గా పేరు మార్చుకొంది. ఈ తరంలో ఉన్న మనకు ఇప్పటికి పాత పేర్లతో కూడ పరిచయము ఉండవచ్చు. కాని తరువాత తరాల వారికి పాత పేర్లతో పరిచయము ఉండకపోవచ్చు కూడ.

అలాగే కొన్ని నగరాలు సముద్రములో కలసిపోవచ్చు. శ్రీకృష్ణ భగవానుడు నిర్మించిన 'ద్వారకా' నగరము ఈ మధ్యనే అరేబియా సముద్ర గర్భంనుండి బయట పడింది. అంటే ఈ మధ్య కాలంలో ద్వారకా నగరము దేశ భౌగోళిక చిత్ర పటంలో లేనట్లే కదా!

అదే విధంగా కొన్ని పర్వతాలు పైకి లేచి ఉండవచ్చు. కొన్ని సముద్రాల గర్భాలలో కలసిపోయి ఉండవచ్చు.

ఉత్తర కురు భూములకు ఉత్తరంగా ఉత్తర సముద్రము ఉన్నట్లు దాని మధ్యలో సోమగిరి అనే కనగిరి ఉన్నట్లు అది సూర్యమండలానికంటే ఎత్తులో ఉన్నట్లు సుగ్రీవుడు శతబలికి చెప్పాడు. ఈ ఉత్తర సముద్రమంటే ఇప్పటి ఉత్తర ధృవ ప్రాంత సముద్రమో కాదో తెలియదు. ఒకవేళ అదే అయితే అక్కడ పర్వతాలు ఉన్నట్లు తెలియదు.

అదే విధంగా దక్షిణ (హిందూ) మహాసముద్రంలో, తూర్పు (బంగాళాఖాతం) సముద్రంలో, పశ్చిమ (అరేబియా) సముద్రములో అనేక పర్వతాలు, ప్రాంతాలు ఉన్నట్లు వాటి పేర్లతో, తరు, ఫల, జంతు జాలంతో సహా పితృలోకం యమలోకం వరకు సుగ్రీవుడు పేర్కొన్నాడు. అవి ఇప్పటి భౌగోళిక విజ్ఞాన వాస్తవతకు అందేవి కావు.

అదే విధంగా మహా గ్రామము, పుండ్రము అనే తూర్పు దేశాల పేర్లు పశ్చిమంలోని బాహ్లీక, శూర దేశాలు, దక్షిణంలోని ఋషిక, మహిష దేశాలు. ఉత్తర దిశలోని మ్లేచ్ఛ, పుళింద, కాంభోజ, యవన, శక బాహ్లీకాది దేశాల నామాలు మనకు తెలియవు. ఇప్పుడు వాటి పేర్లు మారి ఉంటాయి.

ఈ విధంగా ఆనాటి దేశ, నదీ, గిరి నామాలలో మనకు కొన్ని తెలిసినవి, మరికొన్ని తెలియనివి ఉన్నాయి. పేర్లు ఏవైనా, అప్పటి గిరులు, సాగరాలు ఇప్పుడు ఉన్నా, కాలగర్భంలో కలిసిపోయినా, ఆనాటి భూగోళ పరిస్థితి గురించి సుగ్రీవునికి ఉన్న జ్ఞానము అపారము. అందులో ఒక వానర వీరునికి అంత భౌగోళిక జ్ఞానము ఉండడము ఆశ్చర్యకరము కదా!

ఆ ఆశ్చర్యము శ్రీరామునికి కూడ కలిగింది. అదే విషయాన్ని దశరథ నందనుడు సూర్యనందనుని అడిగాడు. "సుగ్రీవా! నీకీ సమగ్ర భూగోళ జ్ఞానమెలా కలిగింది?" అని ప్రశ్నించాడు.

అప్పుడు సుగ్రీవుడు మాయావి వృత్తాంతాన్ని వివరించాడు. "రామభద్రా! మహిషాకారుడైన మాయావి మా అన్న భయంతో మలయపర్వత గుహలో చొచ్చాడు. వాలి కూడ వాడిని విడువక ఆ బిలంలో దూరాడు. ఒక సంవత్సరం పాటు ఘోరయుద్ధం జరిగి, రక్త ప్రవాహము, గిరి గుహ నుండి బయటకు రాసాగింది. అది గుహ ప్రాంతమంతా విస్తరించింది. లోపల ఏమి జరుగుతుందో తెలియదు.

అందువలన మాయావి చేతులలో మా అన్న చనిపోయి ఉండవచ్చుననుకొన్నాను. గుహ లోపలి నుండి బయటికి వచ్చి వాడు కిష్కింధపై పడకుండా ఉండడానికి ఆ గుహ ద్వారాన్ని ఒక మహా శిలతో మూసి వేశాను. ఒకవేళ మా అన్నే మాయావిని సంహరించి ఉంటే ఆయన సులభంగా ఆ శిలాద్వారాన్ని భేదించుకొని వస్తాడనుకొని నేను కిష్కింధకు చేరుకొని అన్న చనిపోయి ఉంటాడనే దుఃఖాన్ని నాలోనే దిగమ్రింగుకొని రోజులను విషాదంతో ఒంటరిగా గడుపుతూ వచ్చాను.

అయితే నా అనుచరులు, మంత్రులు మొదలైన వానర వీరులు నా మౌనాన్ని ఛేదించి నా ద్వారా విషయాన్ని రాబట్టుకొన్నారు. నేను నిరాకరించినా, రాజులేని రాజ్యము అరాజకమవుతుందని నన్ను నిర్బంధించి నాకు రాజ్యాభిషేకం చేశారు. రుమ, తార కూడా వానర మర్యాదను అనుసరించి మహారాణులయ్యారు. అలా రోజులు కొన్ని ప్రశాంతంగా గడచిపోయాయి.

అయితే నా ఊహ తప్పయి కొన్ని రోజుల తర్వాత మా అన్న వాలి ఆ మహిషాకార మాయావిని వధించి కిష్కింధకు తిరిగి వచ్చాడు. మహాపద నుండి బయట పడి తిరిగి వచ్చిన మా అన్నను చూచి నాలో సోదర ప్రేమ పొంగులెత్తింది. సంతోషాశ్చర్యాలు పెనవేసుకోగా సింహాసనం నుండి దిగి వచ్చి మా అన్నకు వినయ విధేయతలతో పాదాభివందనం చేసి వానర రాజ్యాన్ని ఆయనకు తిరిగి అర్పించాను. వాలి నన్ను అపార్థం

చేసికొన్నాడు. తాను తిరిగి రాకూడదనే ఉద్దేశ్యంతోనే నేను గుహా ద్వారాన్ని శిలతో మూసి వేశాననుకొని అగ్రహ మనస్కుడై కిష్కింధకు తిరిగి వచ్చాడు. ఆయన వచ్చే వరకు నేను తారా రుమలతోపాటు పట్టాభిషిక్తుడనై ఉండడము కూడ ఆయన ఆగ్రహాన్ని మరింత అధికం చేసింది.

"క్రోధాద్భవతి సమ్మోహః" అన్న న్యాయము వాలిలో నిజమైంది. ఆయనలో యుక్తా యుక్త జ్ఞానము నశించింది. క్షణికమైన ఆ ఆవేశము వలన ఆయన నాలోని సోదర భక్తిని మరచిపోయాడు. మంత్రి సామంతుల అనునయము కూడ ఆయన ఆగ్రహాగ్నిని చల్లార్చలేదు.

తక్షణమే నన్ను క్రూరంగా హింసిస్తూ నా భార్య అయిన రుమను కూడ స్వాధీనం చేసికొన్నాడు. అంతటితో ఆగకుండా నన్ను వధించి తీరాలనే కసితో నన్ను తరుమ సాగాడు. అప్పుడు నేను నాలుగు దిశలలో సొంతము పరుగెత్తి వెళ్లాను. ఆ సమయంలో అన్ని దిశలలోని వనాలు, సాగరాలు, భూభాగాలు భూ ధరాలు తిరగాను. చివరకు హనుమ సలహాతో ఋష్యమూకాన్ని చేరుకొన్నాను. అంతవరకు నన్ను వెంటాడిన వాలి మహర్షి శాప భయంతో ఆ పర్వతమును అధిరోహింపజాలక, కిష్కింధకు తిరిగి వెళ్ళాడు.

అదుగో ఆ విధంగా అన్ని ప్రాంతాలను సొంతము సంచరించినందువలన సమస్త భూగోళ జ్ఞానము నాకు కలిగిందని" శ్రీ రామభద్రునికి సుగ్రీవుడు నివేదించుకొన్నాడు.

చూచారా! ప్రాణభయంతో పారిపోతూ కూడ ఆ ప్రాంతాలను ఎలా గుర్తుంచు కొన్నాడో? ఆశ్చర్యకరమైనది కదా! ఆయన జ్ఞాపకశక్తి.

--- ఇతిశం ---

సూచన:- ఈ అధ్యాయంలో "దుందుభి" అని ఉంది. కాని ఈ కథ మాయావితో పోరు సందర్భంగా జరిగింది. కనుక "దుందుభి" అంటే దుందుభి వంటి స్వరం గల మాయావి అని మహేశ్వర తీర్థులు వ్యాఖ్యానించారు.

గోవిందరాజుల వారు, "మాయావి దుందుభులు మహిషాకారులై వచ్చినందువలన ఇద్దరు వేరుకాదని - మాయావి గుహలో వాలి చేత పూర్తిగా చావక తిరిగి బ్రతికి వచ్చి ధుందుభి పేరుతో మరొకసారి వాలితో పోరాడి చనిపోయారంటాడని వ్రాశారు.

# అవధి సమాప్తి

సుగ్రీవుడు విధించిన మాసావధి పూర్తి అయింది. ప్రాక్పశ్చిమోత్తర దిశలకు వెళ్లిన వానర వీరులకు సీతజాడ లభించలేదు. అందువలన వారు గడువు లోపే తిరిగి వచ్చారు. ఎంత వెదికినా తమకు సీత విషయము తెలియలేదని సుగ్రీవునికి మనవి చేసికొన్నారు.

అప్పుడు రామ లక్ష్మణులతో పాటు సుగ్రీవుడు, వానర వీరులందరు దక్షిణ దిశకు వెళ్లిన హనుమ అంగదాదులపైననే ఆశలు పెట్టుకొన్నారు.

దక్షిణ దిశకు వెళ్లిన హనుమదాదులు వింధ్యా గిరి గుహలను, దుర్గాలను, గిరి శిఖరాలను సీతకొరకు అన్వేషించారు. కొన్ని ప్రాంతాలలో నీరు బొత్తిగా లేదు. మనుష్య సంచారమే లేదు.

కొన్ని ప్రదేశాలలో చెట్లకు పూలు లేవు. ఆకులు లేవు. ఫలాలు లేవు. తేనె ఉంది కాని అందులో ద్రవము లేదు. మృగ సంచారము కూడా లేదు. కొన్ని చోట్ల తామర కొలనులు ఉన్నాయి. వాటిలోని తామర పూలు పరిమళాన్ని కల్గి ఉన్నాయి. కాని వాటి పై తుమ్మెదలు వ్రాలడం లేదు.

ఆ వన ప్రాంతంలో ప్రాణి కోటి సంచారమే లేదు. ఆ విధంగా ఆ ప్రాంతమంతా ప్రాణి సంచారం లేకపోవడానికి "కొడుకును పోగొట్టుకొన్న కందు మహర్షి శాపమే" కారణము.

ఆ వానర వీరులు ఆ ప్రాంతాలను దాటి ముందడుగు వేశారు. అక్కడ ఒక భయంకర రాక్షసుడు వారి ముందు ప్రత్యక్షమయ్యాడు. వారు వాడిని రావణుడను కొన్నారు. వాడిని చూడగానే ఆగ్రహావేశంతో అంగదుడు బలంగా పిడికిలితో కొట్టాడు. ఆ దెబ్బతో ఆ అసురుని అసువులు అనంతాకాశంలో కలసిపోయాయి.

ఆ ఆపద నుండి గట్టెక్కగానే వారిలో ఒక్కసారిగా ఉత్సాహం పొంగిపొరలింది. దానితో వారు మరింత శ్రద్ధతో సీతాన్వేషణ కావిస్తూ దుర్గమమైన ఒక గుహకు చేరుకొన్నారు. అప్పటికే సుగ్రీవుడు విధించిన నెల రోజుల కాల వ్యవధి అయిపోయింది.

--- ఇతిశం ---

# స్వయం ప్రభా బిలము

హనుమదాదులు ఆకలి దప్పులకు, అత్యధికశ్రమకు ఓర్చి సీతాన్వేషణ కావిస్తునే ఉన్నారు. ఇంతలో వారికి ఒక బిలము అగుపడింది. అది అంతా చీకటితో నిండి ఉంది. అయితే దానిలో నుండి హంసలు, కొంగలు మొదలైన జలపక్షులు బయటికి వస్తున్నాయి. వాటిని చూడగానే వారు అక్కడ జలము ఉన్నట్లు గమనించారు.

ఆ బిలము చీకటితో ఇరుకుగా ఉంది. దానిలోనికి వారు ఒకరికొకరు చేయూతగా అతి కష్టంతో హనుమ సూచన ప్రకారము చేరుకొన్నారు. కొంత దూరము లోపలికి వెళ్లాక దాహాన్ని భరింపలేక స్పృహ దప్పారు. కొంతసేపటికి వారికి మరింత దూరం నుండి వెలుగు కనబడింది. అనేక రకాల వృక్షాలు బంగారు రంగుతో కనబడ్డాయి. కొంత దూరం వెళ్లాక వైడూర్య మయాలయిన తామర కొలనులు, వాటిలో బంగారు తామర పూలు, వాటిపై వాలుతున్న బంగారు తుమ్మెదలు అగుపించాయి. ఆ పుష్పాలు తేనెతో నిండి ఉన్నాయి.

ఆ బిలంలో అనేక బంగారు భవనాలు ఉన్నాయి. వాటి ద్వారాలు, కిటికీలు అన్ని బంగారుతో నిండినవే. వాటిలో ఆసనాలు, శయనాలు అన్ని స్వర్ణమయాలే. వాటిలో కంచు, వెండి, బంగారు పాత్రలు ఉన్నాయి. చందనము, అగరు వంటి పరిమళ ద్రవ్యాల గుబాళింపులు నాసికా పుటాలకు హాయినిస్తున్నాయి. వాటికి చుట్టు ప్రక్కల కాంతి మంతముగా దీపాలు వెలుగుతున్నాయి. ఆ వెలుగులో వారికి నార చీరలు కట్టుకొని, జింక చర్మాన్ని ధరించి ఉన్న ఒక తాపస స్త్రీ దర్శనమిచ్చింది.

ఆశ్చర్యంతో ఆమెను సమీపించి, అమ్మా! "నీవెవ్వరు? ఈ బిలము ఎవ్వరిది? ఈ భవనము, ఈ రత్న రాశులు ఎవ్వరివి?" అని హనుమ అడిగాడు. అంతేకాక "మేము పూర్తిగా ఆకలి దప్పులతో అలసి ఉన్నాము. జలపక్షులు బయటకు వచ్చినందువలన ఇందులో నీరున్నదనే ఆశతో లోపలికి వచ్చాము. ఇక్కడ సమస్తము స్వర్ణమయంగా ఉంది? దీనికి ఎవ్వరి మహిమ కారణము?" అని హనుమ ప్రశ్నించాడు.

హితకామిని అయిన ఆ తాపసి ఆ బిలరహస్య విశేషాన్ని వివరింపసాగింది. "త్రిపురాధిపతి అయిన మయుడు, పరమ శివునిచేత త్రిపురములు దహింపబడిన తర్వాత ఈ బిలాన్ని, ఈ సువర్ణమయ భవనాన్ని నిర్మించుకొన్నాడు. దానవ శిల్పి అయిన మయుడు విశ్వకర్మ భవన నిర్మాణాన్ని అత్యంత విచిత్రంగా కావించాడు. ఈ మయుడే రావణుని పట్టమహిషి అయిన మండోదరి తండ్రి.

మయుడు అత్యంత సౌందర్య విలసితమైన ఈ భవనంలో "హేమ" అనే అప్సరసతో కలసి జీవింపసాగాడు. ఈ విషయాన్ని తెలిసికొన్న మహేంద్రుడు తన వజ్రాయుధంతో మయుని సంహరించాడు.

అత్యంత విషాద భరిత అయిన హేమకు బ్రహ్మ దివ్య శరీరాన్ని, శాశ్వత భోగాలను, ఈ హిరణ్మయ భవనాన్ని ప్రసాదించాడు. సంగీత, నాట్య విశారద అయిన హేమ తరచుగా అనేక స్థలాలకు వెళ్లుతు ఉంటుంది.

ఆమె మిత్రురాలనైన నేను మేరు సావర్ణిక మహర్షి తనూజను, నా పేరు స్వయంప్రభ. నేను నా తపశ్శక్తిచే ఈ భవనాన్ని రక్షిస్తుంటాను.

మీరు అధిక శ్రమతో ఆకలి దప్పులతో అలసి ఉన్నారు. ఈ బిలంలోనే మధుర ఫలాలను భుజించి, మధువును, మధుర జలాలను త్రాగి మీ ఆకలి దప్పులను తీర్చుకొని విశ్రాంతితో మీ విషయాన్ని వివరించండి" అని స్వయంప్రభ విరమించింది.

అంగదాది వానర వీరులకు ఆమె మాటలతో పోయే ప్రాణాలు లేచి వచ్చాయి. వారు తృప్తిగా మధుర ఫలాలతో, స్వచ్ఛ జలాలతో తమ ఆకలి దప్పులను తీర్చుకొని మళ్లీ ఉత్సాహవంతులయ్యారు. స్వయంప్రభ సాంత్వనముతో సుఫల, జలాలతో ఆ వానర వీరులు అత్యంత సంతృప్తులయ్యారు".

ఆ తపస్వినికి హనుమ తమ వృత్తాంతాన్ని వివరించాడు.

"మహేంద్ర సమాన మహిమోపేతుడైన దశరథ సార్వభౌమనందనుడైన శ్రీరామ చంద్రుడు పితృవాక్య పాలనార్థము అర్థాంగి అయిన జానకితో, అనుజుడైన లక్ష్మణునితో కలసి అడవులకు వచ్చాడు. సీతమ్మ తల్లిని రావణాసురుడు అపహరించాడు. శ్రీరామ భద్రుడు మా మహారాజైన సుగ్రీవునితో సఖ్యము చేసి ఆయనకు వానర రాజ్యాన్ని ప్రసాదించాడు. సీతాన్వేషణ నిమిత్తమై నలుదిక్కులకు సుగ్రీవ భూపతి వానర శ్రేష్ఠులను పంపాడు. మేము దక్షిణ దిశకు బయలు దేరి వచ్చాము.

ఇంతవరకు మాకు అత్యధిక శ్రమ, ఆకలి దప్పులు మాత్రమే మిగిలాయి. నీ దయవలన ఇప్పుడు మా ప్రాణాలు దక్కాయి. కృతజ్ఞతకై మీకు ఏమి ప్రత్యుపకారం చేయాలో ఆదేశించు"మని హనుమ అడిగాడు.

వారి స్వామి కార్య నిరతికి సంతసించిన స్వయంప్రభ తనకు ప్రత్యుపకారమేది అవసరము లేదని తెలిపింది.

ఆమె ధర్మదీక్షకు హర్షించిన హనుమ మళ్లీ స్వయంప్రభతో సంభాషింపసాగాడు.

"ధర్మచారిణీ! నీవే మాకు రక్షణనీయాలి. నీ దయతో మాకు ఆకలి దప్పుల బాధ అంతరించింది. అయితే అంతకంటే ప్రమాదకరమైన బాధ మరొకటి మాకు మిగిలింది.

సీతాన్వేషణలో ఇప్పటికే సుగ్రీవుడు మాకొసగిన మాసవ్యవధి ఎప్పుడో మీరి పోయింది. ఈ బిలం నుండి ఎలా బయట పడాలో, తర్వాత శేష కార్యాన్ని ఎలా నిర్వర్తించాలో తెలియడం లేదు" అని ఆయన ఆమెకు నివేదించాడు.

అప్పుడు ఆ తాపసి, "వానర వీరులారా! సహజంగా ఈ బిలంలో ప్రవేశించిన ఏ ప్రాణి అయినా బ్రతికి బయట పడజాలదు. అయితే నా తపశ్శక్తిచేత మిమ్మల్ని ఈ బిలం నుండి బయటకు చేరుస్తాను. మీరు అందరు గట్టిగా కనులు మూసుకొండి. కనులు తెరచి ఎవ్వరు బయటకు చేరజాలరు" అని తెలిపింది. వారందరు గట్టిగా తమ వ్రేళ్లతో కనుల మూసుకొన్నారు. వారినందరిని బయటకు చేర్చి "వానరవీరులారా! ఇప్పుడు కనులు తెరవండి. ఇదిగో వింధ్యాచలసీమా భూమి. ఇదిగో ప్రస్రవణ పర్వతము. ఇదిగో సముద్రము. మీకు శుభమగుగాక. ఇక నేను వెళ్లి వస్తాన"ని తెలిపి ఆమె బిలములోకి తిరిగి ప్రవేశించింది.

స్వయంప్రభా బిలము ఆశ్చర్యకరమైనది. వింధ్యాచల దక్షిణ ప్రాంతమంతా చెట్లు, నీరు లేక మరుభూమిగా ఉంది. హనుమదాదుల కధికశ్రమ, ఆకలి, దప్పులు కలిగాయి. అటువంటిది రామకార్యనిరతులైన హనుమదాదులకు ఆ బిలము కనుపడింది. మయుని తపః ప్రభావము వలన ఆ బిలాంతర్భాగమంతా బంగారుమయమే. సుఫలాలు, సుజలాలు, మధువు వారికి కావలసినంత దొరికాయి.

దొరికాయి కదా అని వెంటనే వాటిని వారు దొంగతనంతో అనుభవించ లేదు. స్వయంప్రభ హనుమదాదుల నిజాయితీని గమనించి వాటిని హాయిగా అనుభవించడానికి అనుమతించింది.

రామకార్య తత్పరులైన హనుమదాదులను చూచి సంతసించి ఆ స్వామికి తాను కూడ కైంకర్యము చేయాలనుకొని వారి నుండి ప్రత్యుపకారము ఆశించక, వారిని బయటకు చేర్చింది. భగవదాజ్ఞను నిర్వహించేవారికి, ప్రకృతి, సకల ప్రాణులు సహకరిస్తాయి.

--- ఇతిశం ---

# వానర సమాలోచనము

వానర వీరులు తాలోత్తాల తరంగ భరితమైన భయంకర సముద్రాన్ని వీక్షించారు. వెనుక వైపు వింధ్య పర్వతమంతా వసంత భరితమై వారికి దర్శన మిచ్చింది. మార్గశిర మాసంలో బయలు దేరిన హనుమదాదులకు పాల్గుణము వచ్చింది. పుష్యమాఘ మాసాలు రెండు గడచిపోయాయి. ఇప్పటికీ సీత లభించే జాడే తెలియదు. అందువలన వారందరు భయంకర సుగ్రీవ శాసనమునకు భయ భీతులయ్యారు.

వారందరిలో ముందుగా అంగదుడు తన అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు. "సుగ్రీవుడు తీక్ష్ణ స్వభావుడైన ప్రభువు. ఆయన కాలవ్యవధిని మీరి మనము తిరిగి వెళ్లామనే ఆగ్రహంతో మనను తప్పక వధించి తీరుతాడు.

ముఖ్యంగా నాపైన ఆయన కెలాంటి ప్రేమ లేదు. పై పెచ్చు మాతండ్రి మీది పగను నాపై తప్పక చూపగలడు. నేను శ్రీరామ చంద్రుని ఆజ్ఞను బట్టి యువరాజునైనానే తప్ప సుగ్రీవుని అభిమతాన్ని అనుసరించి కాదు. అందువలన నేనిక్కడనే సముద్ర తీరములో ప్రాయోపవేశం చేస్తాను".

అంగదుడు స్వయంగా యువరాజు. తమ దళ నాయకుడు. ఆయనే సుగ్రీవుని పట్ల భయాన్ని ప్రకటించినప్పుడు మిగిలిన వానరులందరు సుగ్రీవ శాసన భీతులై అంగదుని అభిప్రాయాన్ని బలపరిచారు. "సీతాదేవి జాడ తెలిశాక వెనుకకు వెళ్లాలి, లేదా ఇక్కడే మరణించాలి" అనుకొన్నారు.

తారుడనే వానర వీరుడు మరొక మాట అన్నాడు. అందరు దుర్భేద్య మయనిర్మిత బిలంలోకి తిరిగి వెళ్లి అక్కడే శాశ్వతంగా ఉంటే ఏ భయము ఉండదని, ఆహార, పానీయాల సమస్య కూడ ఉండదని అన్నాడు. ఆ అభిప్రాయంతో అంగదుడు ఏకీభవించాడు.

సమస్త వానర శ్రేష్ఠుడు బుద్ధిలో బృహస్పతి సముడైన హనుమకు అంగదుని అభిప్రాయం రుచించలేదు. "అంగదుడు సమర్థుడైన యువనాయకుడు. "గ్రహణ, ధారణ, స్మరణ, ప్రదిపాదన, ఊహ, అపోహ, అర్థజ్ఞాన, తత్వజ్ఞానములు" అనెడు అష్టాంగములతో కూడిన సంపూర్ణ బుద్ధి కోవిదుడు. "బాహు బల, మనోబల, ఉపాయబల, బంధు బలములు అనెడి చతుర్విధ బలసంపన్నుడు. "సామదాన, భేద దండములనే చతుర్విధోపాయజ్ఞుడు "దేశజ్ఞాన, శరీర దార్ఢ్య, క్షమ, విషయ విజ్ఞాన, సామర్థ్య, మనోబల, రహస్య రక్షణ, శౌర్య, అనుచర సామర్థ్య జ్ఞాన, కృతజ్ఞత, వాత్సల్య, ఇంద్రియనిగ్రహం,

సద్వాదనా శక్తులనే" పదమూడు రాజగుణాలు ఆయనలో సంపూర్ణంగా ఉన్నాయి. అంతటి యువనాయకుడు భవిష్యద్వానర మహా సామ్రాజ్యానికి తప్పక అవసరము. అటువంటి సమర్థుడైన అంగదుడు అనాలోచిత నిర్ణయంవలన దిక్కులేని వాడై పోవడం" ఆంజనేయునికి నచ్చలేదు.

అందువలన ఆయన తారుడు మొదలైన వానరుల అభిప్రాయాలలోని దోషాలను తెలిపి అంగదుని అభిప్రాయాన్ని మార్చుటకు పూనుకొన్నాడు.

"అంగదకుమారా! మనము స్వయంప్రభా బిలంలో దూరి రక్షణ పొందుతామనుకోవడం కలలో మాట. మామూలు వజ్రంతోనే మహేంద్రుడు ఈ బిలద్వారాన్ని పగులగొట్టాడంటే, పిడుగుతో సమానములైన లక్ష్మణుని మహోగ్ర బాణ ప్రతాపము ముందు ఈ బిలము ధూళిలో కలువక నిలుస్తుందా? అంతే కాక స్వయంప్రభ మననెందుకు పోషిస్తుంది – ఈ బిలం స్వయంప్రభకు స్వంతము కూడ కాదు.

సుగ్రీవుడు మహా బలసంపన్నుడు. నీవు ఒంటరివాడవైనందు వలన దుర్బలుడవు. ఇక నిన్ను సమర్థిస్తున్న ఈ వానరులు అంటావా? భార్యా పుత్రులను, రాజ్య సౌఖ్యాలను వీడి కలకాలము నీతో కలిసి ఉండడము కలలోమాట.

సుగ్రీవుని నీడలా ఎల్లవేళలలో అనుసరించి ఉన్న నీలుడు, సుహోత్రుడు, జాంబవంతుడు, నేను మేము నల్గురము ఏ పరిస్థితిలో కూడ సుగ్రీవునికి దూరము కాము.

అంతేకాదు మొదటి నుండి కూడ నీవంటే సుగ్రీవునికి అత్యంత అభిమానమే. దానికి తోడు నీ శ్రేయస్సును నిరంతరము కాంక్షించే మీ తల్లి తార సుగ్రీవునికి అత్యంత అభిమతురాలు. ఆమె నీ పైననే ప్రాణాలను పెట్టుకొంది. ఆమె ఉండగా నీపై ఈగ వాలదు. అంతే కాదు నీవు తప్ప సుగ్రీవునికి వేరే సంతానమే లేదు. ఇటువంటి పరిస్థితులలో సుగ్రీవుడు నిన్ను ఎంతమాత్రము దండించడు. అందువలన నీవు మా అందరితో కలిసి సుగ్రీవుని సేవించుటే మేలు కాని ఒంటరిగా అందరికి దూరంగా ప్రాయోపవేశం చేయడం ఎంత మాత్రము శ్రేయస్కరము కాదు" అని హనుమ తన నిశ్చితాభిప్రాయాన్ని తెలిపాడు.

అయితే అంగదునికి సుగ్రీవుని ఆదరము పట్ల విశ్వాసములేదు. అందువలన హనుమ మాటలు ఆయనకు రుచించలేదు. అందువలన ఆయన మరొక మారు తన నిశ్చయాన్ని వారి ముందు ప్రకటించాడు.

"హనుమా! నీవు సుగ్రీవుని సహృదయాన్ని గురించి మాట్లాడిన మాటలు నాకు నచ్చవు. సుగ్రీవుడు చపలుడు. దుర్మార్గుడు. ఆయనకు అన్యులను హింసించడమే అత్యంత అభిమతము.

మా నాన్న మాయావితో తలపడుతూ ఉండగానే, ఆయన చనిపోయాడనే నిశ్చయానికి తానే వచ్చి, తక్షణమే మంత్రి, సామంతుల సహాయముతో రాజ్యాధిపత్యాన్ని స్వీకరించిడమే కాక, తనకు తన భార్య రుమ ఉన్నా, సోదర ధర్మపత్ని అని కూడ చూడక మా అమ్మను కూడ స్వాధీనం చేసికొన్న కామాంధుడు సుగ్రీవుడు. తప్పు తన దగ్గర పెట్టుకొని తనను రాజ్యాన్నుండి తరిమివేశాడనే నెపంతో స్వంతసోదరుని సైతము వధింపజేసిన స్వార్థపరుడు.

అటువంటి క్రూరుడు నన్ను మన్నిస్తాడనడంలో అణుమాత్రమైనా నాకు నమ్మకం లేదు. అందరి ముందు నన్ను ఆదరించినా, రహస్యంగానైనా నన్ను చంపించుటకు వెనుదీయడు. అంతేకాదు మయుని బిలములో దాగి ఉండడము మంచిదనే నా మాట ఆయనకెలాగు తెలుస్తుంది. అది విన్నాక నన్ను తప్పక వధించి తీరుతాడు.

ఇక నేనొక్కడినే రాజ్యార్హుడనే మాట ఇప్పటివరకే నిజము. ఇంతవరకు ఆయన భార్యా విదూరుడు కనుక ఆయనకు సంతానము కలుగలేదు. కాని భవిష్యత్తులో ఆయనకు సంతానము కలుగదా? అప్పుడు సమర్థుడైనా, అసమర్థుడైనా తన సంతానానికే రాజ్యాన్ని కట్టబెట్టవచ్చుకదా!

మా తల్లి నా పక్షము నిలిచే అవకాశము ఉందనే మాట యదార్థమే. కాని చండశాసనుడైన ఆయనను ఒక ఆడది ఎదిరించి నిలువగల్గుతుందా? మా తల్లికి కూడ ఆయన వలన సంతానం కలుగవచ్చు కదా? అప్పుడు ఆమె కూడ ఇప్పటివలె నా పక్షాననే గట్టిగా నిలుస్తుందనే నమ్మకమేమిటి?

సీతను తిరిగి పొందడంలో సుగ్రీవుడెంతవరకు తనకు సహాయం చేస్తాడో నిర్ణయం కాకముందే రామచంద్రుడు మైత్రీబంధాన్ని పురస్కరించుకొని సుగ్రీవుడు కోల్పోయిన భార్యను, రాజ్యాన్ని, సర్వస్వాన్ని, తిరిగి తక్షణమే ఇప్పించాడే. అటువంటి మహోదారునికి ఇచ్చిన మాటను నిలబెట్టు కోవాలన్న కృతజ్ఞతా భావం కూడలేక, అంగనా సంగంలో అహర్నిశలు మునిగి పోయిన వ్యసన పరుడు, పచ్చి అవకాశవాది సుగ్రీవ మహారాజు.

అటువంటి స్వార్థపరుడు తన సంతానానికి నా యౌవరాజ్యాధికారము అడ్డమవు తుందనుకొంటే నన్ను అడ్డు తొలగించుకోవడానికి కూడ ఎంతమాత్రము వెనుదీయడు.

అందువలన నేనెంత మాత్రము తిరిగి రాను. మీరందరు తిరిగి వెళ్లి మీ భార్యాపుత్రులతో కలిసి హాయిగా జీవించండి. నేను రామలక్ష్మణుల కుశలాన్ని, మా పినతల్లి రుమ, పినతండ్రి సుగ్రీవుని క్షేమాన్ని, మా తల్లి తార శుభాన్ని మరీ మరీ అడిగానని చెప్పండి. నేను ప్రాయోపవేశం చేశానని తెలిసికొన్న హితైషిణి అయిన మా తల్లి ఎంతో కాలము బ్రతుకజాలదు' అని అత్యంత నిర్వేదాన్ని అంగదుడు వెలిబుచ్చాడు.

అంగదుని దీనస్థితిని చూచిన వానర వీరులందరు కన్నీరు మున్నీరుగా విలపిస్తూ, ఆయనను ఆ స్థితిలో వదలి వెళ్లడానికి మనస్సు అంగీకరింపక, ఆయనతోపాటే తాము కూడా ప్రాయోపవేశం చేసి మరణించడానికి నిర్ణయించుకొన్నారు.

అంగదుడు వాలి తనయుడు. తండ్రి దగ్గర అత్యంత ప్రేమతో పెరిగిన పుత్రుడు. ఒక్కరోజయినా ఒకరినొకరు వదలి ఉండలేని గాఢానురాగము వారిద్దరి మధ్య పెనవేసుకొంది. అందువలన తండ్రి ఆలోచనలనే తాను నమ్మాడు. సుగ్రీవుని భ్రాతృ ప్రేమను విశ్వసింప లేదు. అందువలననే వాలిని నమ్మి ఒంటరిగా మాయావితో యుద్ధానికి వెళ్లనివ్వక తాను కూడ అనుసరించడం, వాలి పట్ల అత్యంత ప్రేమవలన ఆయనకేదో ప్రమాదం కలిగిందని శంకించడం మొదలైన సుగ్రీవుని చర్యలను అంగదుడు అపార్థం చేసికొన్నాడు.

అంతేకాదు తండ్రి పట్ల ఆయనకున్న అత్యంతానురాగము వలన వాలి సుగ్రీవుని తరిమివేసినా, చివరకు రుమను చెరబట్టినా అంగదునికి అంత తప్పుగా తోచలేదు.

కాని రామ సహాయంతో సుగ్రీవుడు వాలిని చంపించడం అంగదుడు జీర్ణించుకోలేక పోయాడు. అది ఆయన జీవితంలో పూరించరాని అగాధాన్ని సృష్టించింది.

తరువాత తన తల్లి తార "దేవర" న్యాయాన్ని బట్టి సుగ్రీవుని స్వీకరించడం అంగదునికి నచ్చలేదు. నిజానికి ఆమె ఆ పనిని చేయడంలో తన (కొడుకు) క్షేమమే ప్రధాన కారణమని ఆయన అర్థం చేసికోలేదు.

వాలి నిరంకుశత్వానికి రుమ బలి అయినట్లే తన తల్లి తార కూడ సుగ్రీవుని బలానికి బలి అయిపోతుందనుకొన్నాడే కాని తార మాట సుగ్రీవునికే కాదు సమస్త వానర సామ్రాజ్యానికి వేదవాక్కు అని గుర్తించలేదు.

--- ఇతిశం ---

# సంపాతి

ప్రాయోపవేశం చేసిన అంగదాది వానర వీరులందరు తమ అప్పటి దైన్యాన్ని గురించి చెప్పుకోసాగారు. "రామలక్ష్మణులు పితృవాక్య పాలన కొరకు అడవులకు రావడం. ఆయన భార్య సీతాదేవిని రావణుడు అపహరించడం, రామలక్ష్మణుల సుగ్రీవమైత్రి, వాలివధ, సుగ్రీవ పట్టాభిషేకం, సీతాన్వేషణ కొరకు వానర ప్రేషణము - సీతాదేవి జాడ లభించక, కాలవ్యవధి ముగిసినందువలన తమ దుస్స్థితి" మొదలైన విషయాలను బిగ్గరగా మాట్లాడుకో సాగారు.

ఆగుట్టపైకి ఆసమయంలో గృధ్ర రాజయిన సంపాతి వచ్చాడు. ఆయనకు అనుకోకుండా ఇంత మంది వానరులు ఆహారంగా లభించడంతో ఆయన ఆ ఆనందాన్ని దాచుకోలేక "మీరందరు నాకు చాల రోజులవరకు శ్రమలేకుండా ఆహారంగా లభించారు. మిమ్మల్ని ఒక్కొక్కరిని తిని నా ఆకలిని తీర్చుకొంటాను" అని వికటాట్టహాసం చేశాడు.

దానితో ఆ వానర వీరులు ఎప్పుడో వస్తుందనుకొన్న మృత్యువు సంపాతి రూపంలో అప్పుడే వచ్చి ముందు నిలిచినట్లుగా నిర్ణయించుకొన్నారు. అప్పుడు రామకార్యమును నెరవేర్చడంలో ఒక పక్షిమాత్రుడైన జటాయువు బలవంతుడైన రావణాసురుని ఎదిర్చి ప్రాణాలను కోల్పోయి కృతకృత్యుడయ్యాడు. అలాగే ఇప్పుడు ఈ సంపాతి వలన తమ ప్రాణాలను కూడ రామకార్యంలో కోల్పోయి ధన్యుల మవుతామని మాట్లాడుకొంటున్నారు.

వారి మాటలలో జటాయువు మృతి గురించిన విషయము సంపాతి శ్రవణేంద్రియాలకు వినవచ్చింది. ఆమాట ఆయన మనస్సుకు శూలము కుచ్చుకొన్నట్లు అనిపించింది. ఆయన వారిని బిగ్గరగా పిలుస్తూ" నాకు ప్రాణప్రియుడైన నా తమ్ముడు జటాయువు గురించి మాట్లాడిన వారెవరు? ఆయన జన స్థానంలో ఉన్నాడు కదా! ఆయనకు రావణునితో సంగ్రామము ఎందుకు సంభవించింది? ఆయన ఎలా మరణించాడు? ఎన్నడో నాకు దూరమైన నా సోదరుని గురించి తెలిసి కోవాలని ఉంది. నేను రెక్కలు లేని వాడిని కనుక గుట్టకిందికి రాలేదు. నన్ను క్రిందికి దింపండి" అని కోరాడు.

వానర వీరులు సంపాతి స్వరంలో దైన్యాన్ని గమనించారు. అయినా ఆయన రాక్షసునివలె భయంకరాకారుడై ఉన్నాడు. ఆయనను క్రిందికి దింపాలా వద్దా అనే విషయంలో కొంత తర్జన భర్జన చేసి, మరణానికి సిద్ధమైన వారికి భయమెందుకు?

అనే నిర్ణయానికి వచ్చి, ఆ పక్షిరాజును క్రిందకు దింపారు. అప్పుడు దళనాయకుడైన అంగదుడు తమ వృత్తాంతాన్ని ఆయనకు వివరింపసాగాడు.

"ఋక్ష రజుడనే వానర రాజుకు ఇద్దరు కుమారులు. వారే వాలి సుగ్రీవులు. పెద్దవాడైన వాలి నా తండ్రి. ఆయన తన తండ్రి తర్వాత వానర రాజయ్యాడు.

అయోధ్యాధిపతి అయిన దశరథ మహారాజు జ్యేష్ఠ పుత్రుడైన శ్రీరామచంద్రుడు తండ్రి మాటను నెరవేర్చడానికి ధర్మపత్ని అయిన సీతాదేవితో, సోదరుడైన లక్ష్మణునితో కలసి దండకారణ్యానికి వచ్చాడు. దశరథునికి పక్షిమిత్రుడైన జటాయువు సీతాదేవిని రక్షించుటకొరకు బలవంతుడైన రావణుని ఎదిరించి ప్రాణములను కోల్పోయాడు.

సర్వప్రాణి సముడైన శ్రీరామచంద్రస్వామి ఆయనకు కృతజ్ఞతా భావంతో అంత్యక్రియలను ఆచరించి, జటాయువుకు పరమ పదాన్ని ప్రసాదించాడు.

ఆ తరువాత సీతాన్వేషణ కొనసాగిస్తూ, మా పినతండ్రి అయిన సుగ్రీవునితో రామభద్రుడు స్నేహం కావించి, సుగ్రీవ విరోధి అయిన మా తండ్రి వాలిని వధించాడు. సుగ్రీవుడు వానరరాజై సీతాన్వేషణకై నాలుగు దిక్కులలో మా వానర వీరులను పంపాడు.

సీతాన్వేషణలో దక్షిణ దిశకు బయలుదేరివచ్చిన మాకు ఇప్పటికి సీతాదేవి జాడ తెలియలేదు. స్వయంప్రభా బిలములో చిక్కుపడ్డ మాకు సుగ్రీవుడు విధించిన కాలనియతి దాటి పోయింది. సుగ్రీవాజ్ఞను ధిక్కరించినందువలన కలిగే ప్రాణభయంతో ఇక్కడ ప్రాయోపవేశానికి పూనుకొన్నాము".

అంగదుని మాటలను విన్న సంపాతి బాష్ప సంపూరితనేత్రుడై "వానర వీరులారా! మా తమ్ముడైన జటాయువు మరణవార్త నన్ను క్రుంగదీస్తున్నది. వృద్ధుడను, శక్తి హీనుడనైనందువలన రావణునిపై ప్రతీకారము తీర్చుకోలేకున్నాను.

పూర్వము మహేంద్రుడు వృత్రాసురుని సంహరించిన రోజులలో మేము అన్నదమ్ము లిద్దరము పోటిపడి మధ్యాహ్న మార్తాండుని అందుకోవలెనని ఆకాశ మార్గంలో పైపైకి ఎగుర సాగాము. అయితే ప్రచండ భానుని కిరణజ్వాలలకు మాతమ్ముడు తపించి పోసాగాడు. నేను నా రెక్కలను విప్పి మా తమ్ముడిని కాపాడే ప్రయత్నం చేశాను. చివరకు నా రెక్కలు మండుతుండే సూర్యకిరణాలకు మసి అయ్యాయి. మా తమ్ముడు నాకంటే ముందే జనస్థానంలో పడిపోయాడు. నేను వింధ్యాచలముపై పతనమయ్యాను. అప్పటి నుండి నా సోదరుడి జాడ తెలియనేలేదు. అయినా ఎక్కడో సుఖంగా జీవించి ఉంటాడని విశ్వసించాను. ఇప్పుడాయన మరణవార్త నాకు పిడుగుపాటయి నా విశ్వాసాన్ని తునాతునకలుగావించింది" అని ఆక్రందించాడు.

అప్పుడు అంగదుడు సంపాతితో, "పక్షిరాజా! నీ సోదరుని మరణానికి కారణమైన రావణాసురుని వృత్తాంతము, సీతాదేవి జాడ నీకు తెలిసినచో మాకు వివరింపు"మని అడిగాడు.

అప్పుడు ఆ పక్షీంద్రుడు, "వానర వీరులారా! నాకు త్రివిక్రముడు కొలచిన మూడు లోకాలు తెలుసు. అమృత మధన వృత్తాంతము, దేవాసుర సంగ్రామ వృత్తాంతము నాకు తెలుసు. ఇప్పుడు నేను వృద్ధుడను కనుక అశక్తుడను.

నేను సర్వాభరణ భూషితురాలై, మెరుపు తీగవలె సౌందర్య విభాసిత అయిన సీతాదేవిని, వర్షాకాల మేఘమువలె నల్లని రంగుగల రావణుడు అపహరిస్తు తీసికవెళ్తుండగా చూచాను. "హారామా! హాలక్ష్మణా!" అని ఆక్రందిస్తున్న ఆమె అరుపులను బట్టి ఆమె సీతాదేవే అయి ఉంటుందని భావిస్తున్నాను.

రావణుడు విశ్రవసబ్రహ్మ కుమారుడు. కుబేరుని సోదరుడు. మహోగ్రతపస్సంపన్నుడు. అమిత పరాక్రమశాలి. విశ్వ కర్మ ఇక్కడికి (సముద్రానికి) నూరు యోజనాల దూరంలో నిర్మించిన సువర్ణమయ లంకానగరాన్ని అన్న అయిన కుబేరుని ఆహావంలో జయించి అందులో ఉంటున్నాడు రావణాసురుడు. ఆయన అధీనంలో సీతాదేవి రాక్షస స్త్రీ పరిరక్షిత అయి ఉంది.

మీరు శతయోజన విస్తీర్ణమైన ఈ సాగరాన్ని తరించివెళ్లితే ఆమె మీకు అగుపడుతుంది. ఆమెను అక్కడ దర్శించి తిరిగిరండి.

ఇక నాకు అంత దూరంలో ఉన్న సీతాదేవి ఎలా అంత స్పష్టంగా అగుపడిందంటారా? మాకు దూర దర్శన శక్తి, దూరగమన శక్తి అద్భుతము. ఆకాశంలోని ఆరవ అంతస్తువరకు రాజహంసలు వెళ్లగలిగితే, వైనతేయులమైన మేము విహాయసంలో చివరిదైన ఏడవ అంతస్తు దాకా వెళ్లగల్గుతాము. అలాగే అంత దూరంలోని వస్తువులను కూడ చూడ గల్గుతాము.

నాలో మా సోదర హంతకుడైన రావణునిపై ప్రతీకారజ్వాల రగిలి పోతున్నది. కాని నేను వృద్ధుడను, అశక్తుడను. నన్ను సముద్రము వరకు మీరు తీసికవెళ్లితే నేను మా సోదరునికి తర్పణాలు వదులుతాను".

సంపాతి ద్వారా సీతాదేవి సంగతి తెలిసి వానర వీరులు చాల సంతసించారు. ఆయనను సాగర తీరానికి తీసికెళ్ళి ఆయన తర్పణాలు వదలిన తరువాత మళ్లీ ఆయన స్థలంలో చేర్చారు.

వారికి సీతావృత్తాంతము అతని ద్వారా మరింత వినాలని అనిపించి "సంపాతీ! సీత ఉన్న స్థలాన్ని గురించి, ఆమెను అపహరించిన రావణుని గురించి వివరించుమ"ని కోరారు. రామలక్ష్మణుల పదునైన బాణాలు రావణుని వధించి తీరుతాయని తెలిపారు.

సంపాతి – తనకు సీతాపహరణ వృత్తాంతమెలా తెలిసిందో వివరింపసాగాడు, "వానర వీరులారా! నేను సూర్యరశ్మి వలన రెక్కలు కాలి అత్యంత విస్తీర్ణమైన ఈ పర్వతముపై పడిపోయాక నా పరాక్రమము పూర్తిగా క్షీణించింది. నాకు వృద్ధాప్యము వచ్చింది. ఆహార, పానీయాల కొరకు కూడ పరాధీనుడనయ్యాను. సుపార్శ్వుడనే నా కుమారుడు నాకు ఆహారము తెచ్చి పెట్టాడు. సహజంగా పక్షులకు ఆకలి అధికంగా ఉంటుంది. అందులో వృద్ధ పక్షిని నేను. ఒక రోజు ఉదయము వెళ్లిన నాకొడుకు ఆహారమేది తేకుండానే సూర్యాస్తమయ సమయంలో తిరిగి వచ్చాడు. నాకు ఆకలితోపాటు ఆగ్రహము కూడ అధికమై అతనిని తీవ్రంగా నిందించాను.

అయితే నా కుమారుడిచ్చిన సమాధానము నన్ను ఆశ్చర్యచకితుని కావించింది. "నాన్నా! నేను మనకు ఆహారము కొరకు చూస్తున్నాను. ఇంతలో నల్లని రంగుగల ఒక రాక్షసుడు బాల సూర్యునివలె బంగారు కాంతితో ఉన్న ఒక భామినిని తీసికొనివెళ్తూ కనుపించాడు. ఆయనను మనకు ఆహారంగా పట్టుకొని రావాలని అనుకొన్నాను. కాని దయతో తనకు దారి ఇమ్మని ఆయన నన్ను యాచించాడు. శరణాగత రక్షణము అందరికి ధర్మమే కదా! అందువలన నేను దారిలో అడ్డుతొలిగాను. ఆయన ఆకాశంలో సముద్రముపై నుండి వెళ్లి పోయాడు.

అయితే ఆకాశంలో సంచరించే ప్రాణులు, పరమర్షులు నా దగ్గరికి వచ్చి ఆ భయంకర రాక్షసుని నుండి బ్రతికి బయట పడ్డందుకు నన్ను అభినందించి ఆశీర్వదించి వెళ్లారు. వాడు శత్రుభయంకరుడైన రావణాసురుడని, ఆయన అపహరించి తీసికొని వెళ్లేది సాక్షాత్తు శ్రీరాముని ధర్మపత్ని అయిన సీతాదేవినని తెలిపారు. ఆమె దుఃఖాక్రాంత అయి "రామ, లక్ష్మణుల" పేర్లను పలవరిస్తుంద"ని అందువలననే తాను ఆహార పదార్థమేది లభింపక, రావడంలో కూడ అంత ఆలస్యమైందని వివరించాడు.

వృద్ధుడను, రెక్కలులేని పక్షిని నేనేమి చేయలేకపోయాను. మీరు మహావీరులు, ప్రశస్తమనస్కులు. రావణుడు తేజోబలములు కలవాడే. కాని మీరు ఆయనను జయించడం అసాధ్యం కాదు. మీరు వెంటనే కార్యాచరణకు పూనుకొండి" అని సంపాతి వివరించాడు.

సంపాతి తన వృత్తాంతాన్ని మరింత వివరంగా తెలుపసాగాడు. "నేను సూర్యుని ప్రచండ తాపానికి రెక్కలు భస్మమై, ఈ వింధ్యాచలముపై పడిపోయాక నేనెక్కడ ఉన్నానో, ఏమయిపోయానో తెలియక అయోమయంలో పడిపోయాను. కొంత సమయం తరువాత

నేను ఉన్నది దక్షిణ సముద్ర తటంలో ఉన్న వింధ్యాచల ప్రాంత్రమని గుర్తించాను. అక్కడకు దగ్గరలో "నిశాకర" మహర్షి ఆశ్రమము ఉంది. ఆ ఆశ్రమానికి అంతకు ముందు కూడ అనేక పర్యాయాలు నా సోదరుడైన జటాయువుతో కలిసి వెళ్ళే వాడిని. అందువలన గిరి శిఖరం నుండి జారి ఎలాగో మహర్షి ఆశ్రమానికి చేరగల్గాను.

అప్పుడే స్నానం చేసి ఆశ్రమంలోకి వచ్చిన ఆ మహర్షిని అన్ని రకాలైన మృగాలు వచ్చి దర్శించాయి. మంత్రి, సామంతపరివేష్టితుడైన మహా ప్రభువువలె, సమస్త ప్రాణి సంవేష్టిత బ్రహ్మవలె ఆ మహర్షి ప్రకాశిస్తున్నాడు. వాటికి దూరంలో ఒక మూల అశక్తుడనై పడిఉన్న నాపై దయా సముద్రుడైన ఆ మహర్షి కృప ప్రసరించింది. ఆయన నన్ను ఇది వరకు అనేక పర్యాయాలు చూచి ఉన్నందుచే గుర్తించి నా దుఃస్థితికి కారణాన్ని నావలన తెలిసికొన్నాడు.

ఆయన తన ధ్యానములో నా భవిష్యత్తునంతా దర్శించి "సంపాతీ! నీకు నా తపశ్శక్తి వలన పక్షాలను ప్రసాదించగలను. కాని భవిష్యత్తులో నీవొక అమోఘమైన రామకార్యాన్ని చేయవలసి ఉంది. "లోక విద్రావణుడైన రావణుడు సీతాదేవిని శ్రీరాముని నుండి అపహరించి లంకకు తీసికవెళ్తాడు. ఆ తల్లి శ్రీరామస్మరణతో ఆహార పానీయాలను కూడ తీసికోదు. అప్పుడు అమరేంద్రుడు ఆమె కొరకు పరమాద్భుతమైన పరమాన్నాన్ని పంపుతాడు. ఆమె దానిలో కొద్ది భాగాన్ని భూమిపై క్రింద పడవైచి రామలక్ష్మణులు సజీవులై ఉంటే వారికి ఇది ఈ లోకంలో ఆహారము అవుతుందని, పరలోకగతులైతే పరలోకంలో ఆహారమవుతుందని సమర్పిస్తుంది.

రామదూతలైన వానరులు సీతాన్వేషణ ప్రయత్నంలో బయలు దేరుతారు. వారికి సీతావృత్తాంతము వినిపించు. అప్పుడు నీకు రెక్కలు మళ్లీ మొలచి, నీవు మళ్లీ జవసత్వ సంపన్నుడవవుతావు. అంతవరకు నీవిక్కడే ఉండి నిరీక్షించు. ఇక నాకాలము సమీపించింది. నా శరీరాన్ని వదలుతున్నా"ను అని నిశాకర మహర్షి తన ప్రాణాలను పరిత్యజించాడు.

అప్పటి నుండి నాదుర్భర పరిస్థితికి ప్రాణ త్యాగము చేసికొందామని పలు మారులు అనుకొన్నా, నాకు నిశాకర మహర్షి ఆదేశమే నన్ను ప్రాణాలతో నిలిపింది. నా కుమారుడు చూస్తూ చూస్తూ సీతాదేవిని సంరక్షింపలేదే అని ఆయనను అధికంగా నిందించాను". ఈ మాటలు మాట్లాడుతు ఉండగానే ఆయనకు ఆయన పక్షాలు తిరిగి ప్రాదుర్భ వించాయి. "ఇదిగో చూచారా! ఇలాగా నాకు మళ్లీ రెక్కలు మొలవడం మీ కార్య సిద్ధికి నిదర్శనమ"ని తెలుపుతూనే ఆయన పరాక్రమ సంపన్నుడై స్వేచ్ఛగా ఎగిరి పోయాడు.

"సమ్యక్ పాతి" అని సంపాతి శబ్దానికి వ్యుత్పత్తి. "సం" అంటే "ధర్మము" అని అర్థమైతే, ఆయన ధర్మపక్షపాతి.

సూర్యమండలం వైపు పైపైకి ఎగురుతూ - తమ్ముని దైన్యాన్ని గమనించి, భ్రాతృ ధర్మంతో జటాయువును రక్షించి, తాను పక్షముల కోల్పోయాడు.

తన కొడుకు అని కూడ చూడకుండా, ఆయన సీతాదేవిని ఎందుకు కాపాడలేదని అధికంగా దూషించాడు. చివర వరకు ప్రాణాలను నిలుపుకొని నిశాకర మహర్షి ఆజ్ఞ ప్రకారము వానర వీరులకు సీతావృత్తాంతాన్ని తెలిపి రామసేవాధర్మాన్ని నిలబెట్టుకొన్నాడు.

--- ఇతిశం ---

మంత్రి, సామంత పరివేష్టితుడైన మహాప్రభువు వలె, సమస్త ప్రాణి సంవేష్టితుడైన బ్రహ్మదేవుని వలె ఆ మహర్షి తన తపః ప్రభావంతో సమస్త మృగ సంసేవ్యుడై ప్రకాశించాడు.

"ఇదిగో చూచారా! నాకు మళ్లీ రెక్కలు రావడం మీ రామకార్యసిద్ధికి నిదర్శనము"

**- సంపాతి**

# సముద్ర తరణ సంరంభము

సంపాతి యొక్క మాటలు వానర వీరులందరిలో మహోత్సాహాన్ని నింపాయి. వారందరు సముద్ర తరణ కాంక్షతో దానిని సమీపించారు. అయితే దానిని చూడగానే వారి ఉత్సాహమంతా నీరు కారి పోయింది. వారి ప్రాణాలు పైపైననే పోయాయి.

సముద్రము ప్రకృతిలో అసాధారణమైంది. దానికి అదే సాటి. అది పరిపూర్ణమైంది. గంభీరమైంది కూడ. ఒకవైపు ఆకాశాన్ని అంటే పెద్ద పెద్ద అలలు. మరొకవైపు ఎగిరి పడుతుండే తిమి, తిమింగిలాలు. మరొకవైపు నీటిలో ఉన్నంతవరకు ఎంతటి బలవత్తర ప్రాణినైనా నిర్వీర్యము చేయగల మొసళ్ళు. నీటి అడుగులో అనేకానేక రత్న రాశులు. మనము ఉన్న వైపు తప్ప, మూడు ఇతర దిశలలో అనంతమైన జలరాశి. అందువలననే సముద్రమొక పరిపూర్ణ జలతత్వము.

అంగదుడు వానర గణనేత. ఆయన వానరుల యొక్క సముద్ర దర్శన నిరుత్సాహాన్ని గమనించి, దానిని పారద్రోలడానికి ప్రయత్నించాడు.

"నిరుత్సాహము తప్పుతో కూడుకొన్నది. మనస్సులో ఎప్పుడు దానికి చోటు ఇవ్వకూడదు. నిరుత్సాహము మనిషిని క్రుంగదీస్తుంది. దాని వలన విషాదము కలుగుతుంది. భయంకర సర్పము ఒక బాలుని కాటువేసినట్లు విషాదము మనిషిని మానసిక హత్య కావిస్తుంది. నిరుత్సాహవంతుడు లోకంలో ఏ పనిని సాధించలేడు".

అంగదుని మాటలు విని వానరులు ఆయన చుట్టు నిలిచారు. ఆయన ఆ వానర వీరులందరిని సమావేశపరచి నిర్భయంగా సాగర తరణంలో వారి వారి శక్తి సామర్థ్యాలను ప్రకటించుమని కోరాడు.

వారిలో గజుడు దశయోజనాలను, గవాక్షుడు ఇరువై, గవయుడు ముప్పై, ద్వివిదుడు డెబ్బై, సుషేణుడు ఎనభై, జాంబవంతుడు ప్రస్తుతము తన వృద్ధాప్యమును బట్టి తొంబై యోజనాల దూరము సముద్రమును దాటగలమని పలికిరి.

అయితే వారెవ్వరు వందయోజనాల పూర్తి సముద్రాన్ని దాటలేమని పలికిరి. అప్పుడు అంగదుడు" తాను వందయోజనాలను దాటి వెళ్లగలనని, కాని తిరిగి రాగలనో, లేనో" అనే సందేహాన్ని వెలిబుచ్చాడు. ఆ సమయంలో జాంబవంతుడు కల్పించుకొని, అంగదుడు తమ ప్రభువని, స్వామి అయిన ఆయన అనుచరుల ద్వారా పనిని సాధించుకోవాలి తప్ప, స్వయంగా సాహసింపరాదని, తామందరు అంగదుని కాపాడుకోవాలని తెలిపాడు. చెట్లు పుష్పించి, ఫలించడానికి వాటి మూలములు ఎంత అవసరమో, అలాగే తాము

పని చేయడానికి అంగదుని నాయకత్వం అంత అవసరమని తెలిపాడు. అప్పుడు బంతి కొంత దూరము వెళ్లి తిరిగి మొదటి చోటుకే వచ్చినట్లయింది. అప్పుడు మళ్లీ సముద్ర తరణ ప్రయత్నంలో అయోమయం చోటు చేసికొంది.

ఆ సమయంలో వారందరిలో సనాతనుడు, సర్వవిషయ కోవిదుడైన జాంబవంతుడు సర్వసమర్థుడై, ఒక మూల నిర్వికారంగా కూచొన్న హనుమను ఉద్దేశించి ప్రశంసించడం ప్రారంభించాడు:-

"సర్వశాస్త్ర విశారదా! హనుమా! నీవు బలంలో సుగ్రీవ సముడవు. రామలక్ష్మణులతో సమానమైన తేజోబలుడవు. గరుడ సమాన జవుడవు. బుద్ధి, బల, తేజో, సత్వ సమావిష్టుడవు.

నీవు కుంజర కుమారి అయిన అంజనాదేవికి, వాయుదేవునివలన కలిగినవాడవు. అంజనాదేవి "పుంజికస్థల" అనే అప్సర స్త్రీ అవతారము. సమస్త సౌందర్యం ఆమెలో మూర్తీ భవించింది. యౌవన మధ్య, కేసరిపత్ని అయిన ఆమెను వాయుదేవుడు మోహించి స్పర్శ మాత్రాననే నిన్ను ఆమెకు పుత్రునిగా ప్రసాదించాడు.

నీవు నీ తండ్రి అయిన వాయుదేవునితో సమానంగా బల వేగముమలు కలవాడవు.

నీవు పుట్టగానే ఆకలితో ఉదయభానుని అరుణ ఫలంగా భావించి, ఆయనను గ్రహించడానికి పైకి ఎగిరావు. నీ ప్రయత్నానికి ఆగ్రహించిన అమరేంద్రుడు తన వజ్రాయుధంతో నిన్ను కొట్టగా నీ దౌడకు దెబ్బతగిలి పర్వతముపై పడిపోయావు. నీ బాధను చూచి భరించ లేక మీ తండ్రి తన స్వరూపాన్ని సకల ప్రాణులనుండి ఉపసంహరించుకొన్నాడు. అప్పుడు సకల ప్రాణులు ప్రాణ వాయు సంచారము లేక మృతకల్పులయ్యాయి.

సమస్త దేవతలు వాయుదేవుని ప్రసన్నుని కావించుకొనదానికి "సమస్త శస్త్రాస్త్రాలతో నీకు చావులేకుండే వరాన్ని" ప్రసాదించారు. నీవు స్వచ్ఛంద మరణము కలవాడవు.

ఒకప్పుడు నేను కూడ అమిత పరాక్రమ సంపన్నుడనే. వామనుడు త్రివిక్రముడై మూడు లోకాలను కొలిచినప్పుడు నేను భూమిని ఇరువై ఒక్క మారులు ప్రదక్షణం చేశాను. కాని వృద్ధాప్యంవలన నేనిప్పుడు శక్తి హీనుడను.

ఇప్పుడు మాకందరికి నీవే దిక్కు. వాయు, గరుడ సమవేగంతో నీవే ఈ విస్తార సముద్రాన్ని తరించి లంకలో ప్రవేశించి సీతాదేవి జాడను తెలిసికొని రావాలి" అని జాంబవంతుడు, అంజనీ పుత్రుని ప్రోత్సహించాడు. జాంబవంతుని స్తోత్రంతో తన బలవేగాలను పునస్స్మరించుకొన్న హనుమ మహోత్సాహ భరితుడయ్యాడు.

-- ఇతిశం --

# హనుమ విజృంభణము

జాంబవంతుని మాటలతో నిజబలాన్ని గుర్తించిన హనుమ తన రూపాన్ని అంతకంతకు అధికం చేసికోసాగాడు. మూడు అడుగులతో మూడు లోకాలను కొలిచిన త్రివిక్రముని ఆనాడు సురులు, భూసురులు ప్రస్తుతించినట్లు సముద్రాన్ని లంఘించడానికి పెరిగి పోతున్న హనుమ మహారూపాన్ని చూచి వానరులు సంభ్రమాశ్చర్యాలతో స్తుతింపసాగారు.

గిరి గుహలో కేసరి తన శరీరాన్ని విస్తరింపజేసినట్లు హనుమ విజృంభింపసాగాడు. ఆయన ముఖము కాలిన పెనమువలె ఎఱ్ఱ బడింది. ఉత్సాహంతో ఆయన దేహంలోని వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి.

హనుమ ఒక్కసారి లేచి వానర వీరులకు నమస్కరించి నిలుచున్నాడు. ఆయన తన శక్తి సామర్థ్యాల గురించి వారికి వివరింపసాగాడు.

అప్రమేయ బలసంపన్నుడు, అగ్నిహోత్ర మిత్రుడైన మా తండ్రి వాయుదేవుడు తన వేగంతో మహా పర్వత శిఖరాలను బంతులవలె ఎగర గొట్టగల్గుతాడు. గమనంలో ఆయనకు సాటిలేడు.

నేను వాయుదేవుని జౌరసపుత్రుడను. ఆయన ప్రసాదమువలన నేను కూడ మహావిస్తీర్ణమైన ఆకాశము యొక్క ఆద్యంతాలను స్పృశింపగలను. మేరు పర్వతాన్ని ఆగకుండా మూడు మారులు పరిక్రమించగలను. నా బాహుబలానికి సముద్రము అల్లకల్లోలమై సమస్త పృథివీతలాన్ని జలమయం చేస్తుంది. జలచరాలన్ని నా తొడల, పిక్కల రాపిడికి ఉవ్వెత్తుగా ఎగిరి పడుతాయి.

మహానుభావుడు, అమిత సత్వ సంపన్నుడైన గరుత్మంతునికి నేను వేలసార్లు ప్రదక్షిణం చేయగలను. సూర్య భగవానుడు ఉదయాద్రి నుండి బయలుదేరి అస్తమయాద్రికి పయనించేలోపు నేను ఆయనకంటే ముందుగా పయనించి తిరిగి వచ్చి ఉదయాచలాన్ని చేరగలను.

నా పరాక్రమంతో సముద్ర జలాన్ని ఎండింపగలను. భూమిని బ్రద్దలు చేస్తాను. మేఘాలను చిందరవందర చేస్తాను. నేను ఆకాశంలో ఎగిరేవేళ పర్వతాలపై ఉన్న వృక్షాలు లతలు, పుష్పాలు తమ నాయకుని అనుసరించే అనుచరులలాగా నన్ను అనుసరిస్తాయి. ఆకాశాన్ని మ్రింగేలా వెళ్లుతున్న నన్ను చూచి సకల భూతాలు సంభ్రమాశ్చార్యాలలో మునిగి పోతాయి.

ప్రశస్తమైన నా బుద్ధిబలంతో లంకలో ప్రవేశించి సీతాదేవిని తప్పక చూచి రాగలను. వజ్రాయుధుడైన మహేంద్రుని ఎదిరించి అమృతాన్ని లాగుకొని రాగలను. లంకను పెకిలించి తీసికవచ్చి రాముని పాదాలముందు ఉంచగలను". ఈ విధంగా వానర వీరుల భయాందోళనలు తొలిగి పోయేలా పరాక్రమ సంపన్నుడై గర్జిస్తున్న హనుమను చూచి వానర వీరులు హర్షపరవశులయ్యారు.

వృద్ధుడు, బుద్ధిమదగ్రేసరుడైన జాంబవంతుడు హనుమ ఉత్సాహపరాక్రమాలకు సంతోష భరితుడయ్యాడు. ఆయన హనుమకు కార్య సిద్ధి కలిగేలా శుభాశీర్వచనాలను పలికాడు. తదితర వానర వీరులకు ప్రణమిల్లి వారి మంగళాశాసనాలతో ముందడుగు వేయుమని ఉపదేశించాడు.

హనుమ తన సముద్రలంఘన వేగాన్ని భూమి భరింపజాలక బ్రద్దలవుతుందని అందువలన సుస్థిరములైన మహేంద్ర పర్వత శిఖరాలనుండి సముద్ర లంఘనం చేస్తానని తెలిపి, ఆగిరి శిఖరాన్ని అధిరోహించాడు. ఆ పర్వత శిఖరాన్ని తన పాద బలంతో అదిమి పట్టాడు. అప్పుడు ఆ పీడనానికి మృగాలు, మాతంగాలు భయపడ సాగాయి. కన్నముల నుండి సగము పైకి వచ్చిన భుజంగాలు విజయ పతకాలవలె శోభిల్లాయి.

మనస్సులో మహోత్సాహాన్ని, శరీరంలో మహావేగాన్ని నింపుకొన్న శత్రుహంత అయిన హనుమ సముద్రాన్ని దాటి లంకలో చేరడానికి సన్నద్ధుడయ్యాడు. ఆయన కంటే ముందే ఆయన మనస్సు లంకవైపు పరుగులు తీసింది.

హనుమ అంజనావాయుదేవుల ఔరసపుత్రుడు. "అం" జనయతీతి అంజనా" అంజనాదేవి భగవంతుని మెప్పించగల పరిపూర్ణ భక్తి స్వరూపిణి. తల్లి భక్తి శక్తిని సంపూర్ణంగా వారసత్వంగా గ్రహించినవాడు హనుమ. అందువలననే ప్రథమ వీక్షణంతోనే రామప్రసాదాన్ని పొందగలిగిన ఘనుడాయన, అలాగే తండ్రి అయిన వాయుదేవుని జవసత్వాలను సహజంగా గ్రహించాడు.

సంపూర్ణ జ్ఞానస్వరూపుడైన సుగ్రీవుని సంపూర్ణ అభిమానానికి పాత్రుడాయన. సమస్త దేవతా వరప్రసాద లబ్ధ మహామహుడాయన. చిల్లర వానరులందరు తమ తమ శక్తులను వివరిస్తుంటే, సర్వశక్తి సంపన్నుడై ఉండి కూడ మౌనంగా ఒక మూల కూర్చున్న వినయశీలి.

సముద్ర విస్తీర్ణాన్ని చూచి భయ భ్రాంత స్వాంతులయిన వానరుల దైన్యాన్ని తొలగించడానికి స్వయంగా సముద్ర తరణానికి సంరంభించిన సహచర రక్షా దీక్షుడాయన.

తమలో వృద్ధుడు, ధర్మవిదుడు, మహాత్ముడయిన జాంబవంతుని ప్రోత్సాహంతో రెక్కలు విప్పిన గరుడ జవుడు హనుమ.

తన జవసత్వాలకు తండ్రి అయిన వాయుదేవుని ప్రసాదము, సకల దేవతా మంగళాశాసనబలము, శ్రీరామభద్రుని అపార కరుణా విశేషము, సమస్త వానరవీర ప్రోత్సాహములే కారణమని నమ్మిన వినయమూర్తి.

సమస్త వానర వీరులు అసహాయ వదనాలతో తన వైపు చూచినప్పుడు తనలోని శక్తిని వారికి తెలిపి, వారిలో ధైర్యోత్సాహాలను నింపిన ఆత్మ విశ్వాసశాలి.

**మనోజవం - మారుత తుల్యవేగం।**
**జితేంద్రియం - బుద్ధిమతాం వరిష్ఠం**
**వాతాత్మజం - వానర యూథ ముఖ్యం**
**శ్రీరామదూతం - శిరసానమామి**

--- ఇతిశం ---

రచయిత పరిచయం

## పేరు: ఆచి శ్రీనివాసాచార్య



**జననము:** శ్రీశాల (కరీంనగర్ జిల్లా)
విక్రమసం. మాఘశు. భీష్మాష్టమి

**తల్లి దండ్రులు:**
శ్రీమతి ఆచి వేంకట నరసమాంబ.
శ్రీ. ఉ.వే.ప్ర.ఆచి, వేంకట నృసింహాచార్య
(ఆవునూరు) స్వామివారు.

**విద్యార్హతలు:** ఎం ఏ బి.ఎడ్.

**వృత్తి:**
విశ్రాంత ప్రభుత్వ పాలనాశాస్త్రోపన్యాసకులు

**ప్రవృత్తి:** రచనలు, కాలక్షేప ప్రవచనాలు

**సంప్రదాయ విద్యార్హతలు:** శ్రీమద్రామాయణ, ఉపనిషత్,
గీతాభాష్య, శ్రీ భాష్యాది సంస్కృత గ్రంథాలలో
భగవద్విషయాది దివ్య ప్రబంధాలలో ప్రవేశము

**శాశ్వత సభ్యతము:** ఉభయవేదాంతాచార్య పీఠము- సీతానగర్

**ఉపన్యాసాలు:** సంస్కృత, ద్రావిడవేదాంత విషయాలు

**ఉపన్యసించిన స్థలాలు:** ఆంధ్రప్రదేశ్ లోని అనేక ప్రముఖ స్థలాలు
యాదగిరి, శ్రీరంగాది దివ్య క్షేత్రాలు

**ముద్రితరచనలు:** శ్రీరామాయణానుభవము: 1. బాల 2. అయోధ్యా 3. అరణ్య
4. కిష్కింధాకాండలు 5. ముముక్షుప్పడి 6. తిరుప్పావై
7. ఉత్తర దివ్య దేశాలు 8. దక్షిణ దేశ్య దివ్య దేశాలు
9. అనేక సంప్రదాయ సంచికలలో వ్యాసాలు